# శ్రీమదాంధ్ర భగవద్గీత

## (సమూల, ఆంధ్ర పద్య, తాత్పర్య సహితము)

**మొదటి భాగము 1 - 9 అధ్యాయములు**



RG65,1
35 N99
4772

# శ్రీమదాంధ్ర భగవద్గీత

(సమూల, ఆంధ్ర పద్య, తాత్పర్య సహితము)

మొదటి భాగము 1 - 9 అధ్యాయములు


కృతికర్త

విద్వాన్ ఈ. వి. సుబ్రహ్మణ్యం

చెన్నై - 600 039



ప్రకాశకులు

ఓం శ్రీ ప్రేమసాయి పబ్లికేషన్స్

12, కైలాయ శెట్టి వీధి

ప్రాత చాకలిపేట, చెన్నై - 600 021

✆ 596 41 20

ప్రథమ ముద్రణ : మే 1999

1000 ప్రతులు

మూల్యము రూ : 75-00

సర్వస్వామ్యములు రచయితవి.



## కృతజ్ఞత

తిరుమల-తిరుపతి దేవస్థానమువారు హిందూ ధర్మ ప్రచార పోషకంగా చేస్తున్న ఆర్థిక సహాయ పథకముక్రింద ఒసంగిన భూరి విరాళము ఈ గ్రంథ ముద్రణకు తోడ్పడినది.

దేవస్థాన పాలక వర్గమునకును, కార్య నిర్వహణాధికారి
డాక్టర్ I. V. సుబ్బారావు, I.A.S., గారికిని
నా కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు,
గ్రంథకర్త

ముద్రణ :
శ్రీ లతా కంప్యూటర్స్, 12, కైలాయ శెట్టి వీధి, ప్రాత చాకలిపేట,
చెన్నై-600 021. ✆ 5964120

గ్రంథంలో ముద్రించుకోవాలని మేము ఈ దాతృత్వము చేయలేదు. ఒక దైవ సత్కార్యానికే చేసినాము గాని, మా పేర్లు, చిత్రాలు ప్రకటించుకోవడానికి కాదు. కాబట్టి అది కోరవద్దు అని నన్నాజ్ఞాపించినారు. నాకు ఏమి చెప్పదానికీ నోరు రాలేదు. దాతలలో కలియుగంలో ఇంతటి ఉత్కృష్ట దాతలు గూడా ఉన్నారా ! అని నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయినది. అయినా నా మనస్సునకు సంతృప్తి కలుగలేదు. వారి మాతృమూర్తి కీ॥శే॥ బుద్ధి గౌరీదేవి జ్ఞాపకార్థముగా ఈ గ్రంథాన్ని ప్రకటించినాను.

ఆ మహోదాతకు సర్వేశ్వరుదు శ్రీకృష్ణ భగవానుదు సకలైశ్వర్యాలు నిరంతరంగా అందించాలని మనసారా ప్రార్థిస్తున్నాను.

వాత్సల్యముతో ఆశీస్సులందించిన కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతీ స్వాముల వారికిని భక్తి ప్రపత్తులతో సాష్టాంగ దండప్రణామము లందించు చున్నాను.

ఈ పద్యానువాదములో కీ॥శే॥ ఆదిపూడి సోమనాథరావుగారి పద్యానువాదము గూడా నాకు మిక్కిలిగా సాయపడినది. కాని వారివలెగాక నేను గ్రంథం నిర్వచనంగా సాగించాలని గ్రంథాదినుండి పూనికతో రచన సాగించి కృతకృత్యుడనైనాను.

తరువాత పద్యాలకు తాత్పర్య విశేషార్థాలు గూడా అత్యంతావశ్యకమని భావించి వయోభారముచేత తగినంత ఓపికలేని కారణమున పుంగనూరు జూనియర్ కాలేజిలో నా సహోపాధ్యాయులైన శ్రీయుతులు విద్వాన్ పణతుల రామేశ్వరశర్మ గారి సహాయము కోరినాను. వారును అభ్యంతరము చెప్పకుండా సంతోషముగా ఆవని పూర్తిచేసి యిచ్చినారు. వారికి నే నెంతయు కృతజ్ఞుడను. వారికి సకల శుభములు నందించాలని పరాత్పరుని ప్రార్థించుచున్నాను.

గ్రంథానికి గుండెవంటిది పీఠిక కదా ! అడిగినదే తడవుగా ఆనందముతో అంగీకరించి విపులమైన పీఠిక వ్రాసియిచ్చి సహకరించిన మదరాసు భారతీ మహిళా కళాశాల ఆంధ్ర శాఖాధ్యక్షులు శ్రీమతి నిర్మలా పళనివేలు, M.A.,Ph.D., గారికి నే నాజన్మాంతము కృతజ్ఞుడను.

అడిగిన వెంటనే అత్యంత వాత్సల్యముతో, ఆదరాభిమానములతో నా కృషికి ప్రప్రథమమున అమూల్యమైన అభిప్రాయము వ్రాసియిచ్చి నన్ను ప్రోత్సహించిన సంగీత సాహిత్య చక్రవర్తి, కలైమామణి ఇత్యాది బిరుదాంకితులైన నా శ్రేయోభిలాషి, నా సన్మిత్రుడు, సినీ నేపథ్యగాయకుదు, బహుభాషా ప్రముఖ కవి పండితుదు శ్రీ శ్రీ P. B. శ్రీనివాస్ గారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ సర్వేశ్వరుని మనసారా ప్రార్థించుచున్నాను.

అదేవిధముగా నాయందు అనన్యమైన అభిమానముతో శ్రమ యనుకోకుండా సంతోషముతో సదభిప్రాయము వ్రాసియిచ్చి నాకు అమూల్యమైన ప్రోత్సాహబల మందించిన గౌరవనీయులు, సరస్వతీ సత్పుత్ర, కవితా గంగోత్రి, సహస్రావధాన సంస్థాపనాచార్య ఇత్యాది అమూల్య బిరుదాంకితులును, తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరు పదవీ విరాజితులును నగు శ్రీ శ్రీ మేడసాని మోహన్ గారికిని సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ సర్వేశ్వరుని మనసారా ప్రార్థించుచున్నాను.

వాత్సల్యము నిండిన హృదయముతో ఆశీర్వాదపూర్వకముగా అభిమానముతో అభిప్రాయము నందించిన తిరుపతి వాస్తవ్యులు మా గురువర్యులు పూజ్యశ్రీ సింగరాజు సచ్చిదానందం గారికిని; మైత్రీభావంతో ఆహ్లాదపూర్వకముగా అభిప్రాయము లందించిన శ్రీయుతులు సముద్రాల లక్ష్మయ్య గారికిని; మద్రాసు వాస్తవ్యులు శ్రీయుతులు ఆచార్య దేవళ్ల చిన్నికృష్ణయ్య గారికిని; శ్రీయుతులు V. రామచంద్రచౌదరి గారికిని; శ్రీయుతులు ఉమ్మిటి. వీరభద్రంగారికిని; శ్రీయుతులు కాట్న. చంద్రశేఖరం, B.Sc., B.L., గారికిని; శ్రమకోర్చి అభిమానముతో కంప్యూటర్ ప్రూఫులు సక్రమముగా సరిదిద్ది యిచ్చిన మిత్రవర్యులు శ్రీయుత తూమాటి సంజీవరావు గారికిని నా హృదయపూర్వక నమస్కారములు సమర్పించుకొనుచున్నాను.

ఈ పరమ పవిత్రమైన గ్రంథాన్ని నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పితౄణము( దీర్చుకొనుటకై పరమ భక్తితో అంకితము చేయుచున్నాను.

ఈ గ్రంథానికి ముఖచిత్రం వ్రాసియిచ్చిన శ్రీ పట్టాభిరామన్ Dip in F.A., Chetpet, Chennai-31 గారికిని

ఒక్కొక్క అధ్యాయానికి సందర్భభావోచితముగా ఒక్కొక్క చిత్రమును తయారు చేసి యిచ్చిన శ్రీ S. ప్రభురామ్, India Today, Layout Artist, Chennai. గారికిని నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను.

ఈ గ్రంథ ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానము ఆర్థిక సహాయము చేసి సహాయపడినందుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ I. V. సుబ్బారావు, I.A.S., గారికిని నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను.

గ్రంథములో నా దోషములుండినను, ముద్రణా దోషములుండినను ద్వితీయ ముద్రణమునందు సవరించుకొందునని వినయ విధేయతలతో మనవిచేసికొనుచున్నాను.

## ❀ కృతజ్ఞతలు ❀

సన్నుతుండు భవ్య సాహిత్య సత్ప్రీతి
వినుతయశుఁడు సుగుణ ధనుఁడు ఘనుఁడు
దివ్యకీర్తియుతుఁడు దేవళ్ల శ్రీ చిన్ని
కృష్ణయార్యుఁ గొలుతు తృష్ణదీర.

మేలుగోరి నన్ను మిగుల దీవెందు
నాదు గురుఁడు పుడమి నాణ్యగుణుఁడు
జగతి సింగరాజు సచ్చిదానందుండు
వారిఁ గొలుతును మనసార నెపుడు.

విపులమౌ నభిప్రాయమ్ము పేర్మి నొసఁగి
వేడ్కతోడను నన్ను దీవించినట్టి
సరస **'సంగీత సాహిత్య చక్రవర్తి'**
ఘన గుణుఁడు సినీ నేపథ్యగాయకుండు
వర **'కలైమామణి'** బిరుదభాసితుండు
నాదు ప్రియమిత్రుడైన సన్మాన్యయశుఁడు
శ్రీయుత కవివర్యుఁడు పి. బి. శ్రీనివాసుఁ
గూర్మి రక్షించు నెపుడు ముకుందుఁ డెలమి.

కోరినంతనె కాదనకుండ ప్రేమ
తో నభిప్రాయ మెంతొ సంతోషముగను
వ్రాసియిచ్చిన సుగుణుండు రమ్యయశుఁడు
వర 'సరస్వతీ సత్పుత్ర' బిరుద శోభి
త సు'సహస్రావధాన సంస్థాపకుండు'
అన్నమాచార్య ప్రాజెక్టునందు పేర్మి
వరలు డైరెక్టరు పదవి భాసిలు నుత
మేడసాని మోహన నామ మేల్మిధనుఁడు
ఏడుకొండల శ్రీ వేంకటేశు కృపను
సాటిలేనట్టి సత్కీర్తి జగతివరలు.

పక్షపాతమైన భావంబు లేకుండ
సద్విమర్శజేయు సద్గుణుండు
అగణిత గుణుడైన యాదర్శు శ్రీ రామ
చంద్ర చౌదరి నిల సన్నుతింతు.

అనుపమానమైన యాముష్మిక ధనుండు
వర శిరోమణి భువి భవ్యగుణుడు
పూజనీయుడగు సముద్రాల లక్ష్మయ్య
వారి నెపుడు మిగుల ప్రస్తుతింతు.

విపులమైన యట్టి పీఠిక వ్రాసి నా
కమిత ముదము నొసగినట్టి సాధ్వి
నివురు గప్పు నిప్పు నిర్మలా పళనివే
లమ్మ గారి కెపుడు నంజలింతు.

వయసుమీరుటచేత నే వ్రాయజాల
నట్టి భావములును విశేషార్థములును
సంతసముతోడ వ్రాసి యొసంగినట్టి
పుంగనూరు నివాసియౌ పూజనీయ
సఖు పణతుల రామేశ్వర శర్మ సాయ
మేను వరువను ప్రాణ మీ మేన నున్న
వఱకు త్రికరణ శుద్ధిగా బలికితి నిది.

వినుత గుణగణ సోదర ప్రీతితోడ
కూర్మినిండిన సన్మిత్ర గుణముతోడ
నన్నెపుడు నాదరించుచు నున్నవాడు
వినుత కవితాభిలాషి శ్రీ వీరభద్రుడు
జగతి రక్షించు నెపుడు శ్రీ చౌడమాంబ.

న్యాయవాదవృత్తియందు జీవించుచు
సాహితిప్రియుండు సన్నుతుండు
నగుచు కావ్య రచనలందు పాల్గొను కొట్న
చంద్రశేఖరుండు సన్నుతుండు.

ప్రూఫులు సరిదిద్ది పుష్కల ముదముతో
చక్కని సలహాల చాల నొసగి
సాయపడినయట్టి సంజీవరావు స-
న్మాన్యు నెపుడు నేను మరువలేను.

భక్తి శ్రద్ధలతోడ సంబరముతోడ
ధనమె లక్ష్యమనక పుణ్యధనమె చాలు
నను తలంపున శ్రమకోర్చి యనుదినమ్ము
ప్రీతి శ్రీ మదాంధ్ర భగవద్గీత నచ్చు
వేసి కొట్న ఢిల్లీరాజు వినుతుఁడయ్యె
మరువ జాల నా సన్మిత్రు మాన్యగుణము.

శ్రీరస్తు

# జన్మనిచ్చిన తల్లిదండ్రులకు
# శ్రీమదాంధ్ర భగవద్గీతా గ్రంథము

## •◆ అంకితము •◆



శ్రీమదాంధ్ర భగవద్గీతా గ్రంథమును అంకితము గొను కృతికర్త తల్లిదండ్రులు
కీ॥శే॥ అమ్మణియమ్మ - కీ॥శే॥ యారాశి-వేంకటస్వామి శ్రేష్ఠి

చం॥ అనుపమ సాధుశీల సుగుణాన్విత **అమ్మణియమ్మ** తల్లి నా
కనఘుఁడు పూనినట్టి పనులన్నియు పట్టుదలన్ వెలార్చు స
ద్వినుత యశఃప్రియుండు ధర **వేంకటసామి** పవిత్రజీవి నా
జనకుఁడు వారి కిర్వురకు సాగిలి మ్రొక్కుదు నెల్లకాలమున్.

ఆ.వె॥ సిరులు గోరలేదు చెలఁగ సుబ్రహ్మణ్య
స్వామి భక్తి మదిని వదలకుండ
ఉర్వి నేతవృత్తి నున్నంతలోఁ దృప్తి
జెంది మనిన కష్టజీవు లీరు.

తే.గీ॥ అవనిమీదికి శ్రీగంగ నవతరింపఁ
జేసి పితరులకుఁ గలుగఁజేసె పుణ్య
గతి భగీరథుండు వరల, కాని నేను
అంతశక్తి లేకుండుట నాంధ్రభాష
యందు వ్రాసిన సద్గ్రంథమైన యీ ప్ర
దీప్త శ్రీ మదాంధ్ర భగవద్గీత యనెడు
పుణ్యగంగను దెచ్చితి పుణ్యగతులు
మీరు పొందంగఁ గోరి సత్పూజ్యులార !

తే.గీ॥ భువిని మీ కీర్తి స్థిరముగాఁ బొలిచె మిగుల
దివిని సహితము మీ కీర్తి తేజరిలఁగ
పరమ వైకుంఠప్రాప్తి శాశ్వతము గాగ
దీప్తి శ్రీ మదాంధ్ర భగవద్గీత నంకి
తం బొనర్చితి నతిభక్తి దనర మీకు.

ఆ.వె॥ జన్మనిచ్చి నాకు చదువు సంధ్యలు నేర్పి
జగతి బ్రతుకుతెరువు సాగఁజేసి-
నట్టి పూజనీయు లమ్మ నాన్నలు మీకు
గ్రంథము **అంకితంబు** గాగఁ జేసి
ధన్యుడైతి ననుచుఁ దలపోసి సంతృప్తి
జెందినాఁడ పుణ్యజీవులార !

ఇట్లు,
మీ పుత్రుడు
విద్వాన్ ఈ. వి. సుబ్రహ్మణ్యం



# పీఠిక

**Dr. (Smt.) NIRMALA PALANIVELU,** M.A., Ph.D.,
Reader in Telugu,
Bharathi Women's College,
Chennai - 600 108

శ్రీమన్నారాయణుని దివ్యావతారమైన శ్రీకృష్ణ భగవానుని దివ్యోపదేశానికి స్థిరరూపమై వెలసిన మహోద్గ్రంథమే శ్రీమద్భగవద్గీత. గీతా గ్రంథానికి వ్యాఖ్యానాలు, గద్య పద్యానువాదాలు విరివిగా వెలువడుచున్నప్పటికిని, గీతాసుధారసాస్వాదన మెన్నటికిని వెగటు కలిగించనేరదు, మేల్మేలు కావలయుననియే యనిపించును. ఇందులకు ప్రత్యక్ష నిదర్శనమే సమూల, ఆంధ్ర పద్య తాత్పర్య సహితముగా వెలువడిన శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారి యీ "శ్రీమదాంధ్ర భగవద్గీతా" గ్రంథము. ఏనాడో ద్వాపరయుగాంతంలో అర్జునుడికి శ్రీకృష్ణ పరమాత్మ గావించిన గీతోపదేశమే నాటికి, నేటికి, ఏనాటికీ సమస్త మానవాళికి సర్వకాల సర్వావస్థలయందును అనుసరణీయమైనది, ఆచరణయోగ్యమైనది.

'గీత' అను రెండక్షరములలో వేదార్థసారమంతయు గర్భితమైయున్నది. 'గీ' అను అక్షరమునకు సంస్కృతములో 'త్యాగము' అనియర్థము, 'త' అనగా తత్త్వము. మానవుడు త్యాగ గుణము నలవరచుకొని, తత్త్వజ్ఞుడు కావలెనని దీని పరమార్థము. భగవంతునిచే జెప్పబడినది కనుక, దీనికి 'భగవద్గీత' అను పేరు సార్థకమైనది. అనంతము, అత్యద్భుత కార్యనిర్వహణ, అధికారము, అఖండశక్తి, విభూతి, సర్వజ్ఞత-ఈ షడ్గుణముల సమ్మేళనమునకు 'భగము' అని పేరు. ఈ యారు గుణములు గలవారిని 'భగవంతుడు' లేక 'భగవతి' అని స్తుతింతురు. శ్రీకృష్ణుడు యోగేశ్వరేశ్వరుడుగా, సాక్షాత్తు భగవంతుడుగా, పరమాత్మ స్వరూపుడుగా ఆరాధించబడుచున్నాడు. అర్జున విషాదమను మిషతో శ్రీకృష్ణుడు స్వయముగా సకల ఉపనిషత్తులలోని సారమును, తత్త్వజ్ఞానమును సమస్త ప్రజానీకమునకు ఉపదేశపూర్వకముగా చెప్పినదే భగవద్గీత. భగవద్వాణి కనుక భగవతిగా-అద్వైతమను అమృతధారను ప్రసాదించు దైవముగా, పవిత్రముగా కీర్తించబడిన గ్రంథము కనుక భగవద్గీతను పూజించడమనగా భగవంతుని ఆరాధించినట్లుగా నెంచబడినది.

జనన జరామరణ భూయిష్ఠమైనదీ సృష్టిసమస్తము. అత్యంత కష్ట నిష్ఠురములతో దుర్భరమైనట్టిదీ సంసారయాత్ర. ఈ సంసారమనెడి సాగరమును దాటవలెనన్న

గీతాభ్యాసమనునది నావ వలె సహాయపడి దరిచేర్చును, అనగా మోక్షము నిచ్చునని చాటుచున్న క్రింది శ్లోకము "వైష్ణవీయ తంత్రసారము"లోనిది:

సంసారసాగరం ఘోరం తర్తుమిచ్ఛతి యోనరః ।
గీతాభ్యాసం సమాసాద్యపారంయాతి సుఖేన సః ॥

గీతా పారాయణము పావన గంగాస్నాన ఫలదాయకము, భగవత్సాక్షాత్కార భాగ్యప్రదాయకము, భగవద్గీత యుండునట్టి స్థలము ప్రయాగాది పుణ్య క్షేత్రములతో సమానమని "వరాహపురాణము"లో కీర్తింపబడిన గీతామాహాత్మ్యమును స్మరింపజేయు చున్నది శ్రీ సుబ్రహ్మణ్యంగారి క్రింది తేటగీతి పద్యము:

"ఒనరగ భగవద్గీత యుండు నెచట
ఎచట నియమ నిష్ఠలఁ బఠియింపబడునో
వెలయు నచట ప్రయాగాది విమలతీర్థ
చయము లన్నియు వసుధ ! నిశ్చయముగాగ."

శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారి యీ గ్రంథమాద్యంతము-ఇటువంటి తేట తేట తేటగీతులతో సరళగతినిసాగి, భగవద్గీతార్థ సారాన్ని సులభశైలిలో నందరికి నందించగలదనుట నిస్సంశయము.

ఈ గ్రంథములో ప్రథమాధ్యాయము – 'అర్జున విషాదయోగము' – ప్రారంభమునందు శ్రీ సుబ్రహ్మణ్యంగారు రచించిన యీ గీత పద్యము పరిశీలనార్హము:

"కౌరవాన్వయ గంభీరకాననమున
నతి భయావహ మారుతమైనవాఁడు
నృపుఁడు ధృతరాష్ట్రుఁ డతి భీతి నిందుకొనగ
సంజయునిఁ జూచి యదుగంగ సాగెనిట్లు."

ఈ పద్యము మూలగ్రంథమునందు లేకున్నను, రచయిత యిందు కౌరవ కులమనెడి భీకరారణ్యానికి సుడిగాలివంటివాడుగా ధృతరాష్ట్రుని స్వభావమును చిత్రీకరించుట యెంతేని సమంజసముగా నున్నది. చర్మచక్షువులు లేని పుట్టు గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడు మితిమీరిన పుత్రవాత్సల్యమునకు లోనై జ్ఞానచక్షువులను సైతము కోల్పోయినవాడైనాడు. దుర్యోధనుడిమీద నతడికి గల యలవిమీరిన వ్యామోహమే యతడిని అజ్ఞానాంధకారములోబడి కొట్టుమిట్టాడునట్లు చేసినది. అతడి మూర్ఖత్వమే చివరికి ఘోర కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసినది. అదియే అతడి పుత్రశతము పాలిటి అశనిపాతమైనది. చెట్టు మొదలు చెదలు పుట్టి, ఆ చెట్టునే నేలగూల్చినట్లు, కులమునం దిటువంటి కుటిలాత్ముడొక్కడున్న చాలును, ఆ కులమంతయు సమూల నిర్మూలనమగు ననుటకు ప్రత్యక్షసాక్ష్యమై నిలిచినది ధృతరాష్ట్రుని పాత్ర. అతడి

అంతరాంతరాలలో దాగియున్న క్రౌర్యాన్ని వెల్లడి చేయుటయే పై పద్య రచనమందలి ప్రధాన లక్ష్యము.

భగవద్గీత "ధృతరాష్ట్ర ఉవాచ" - ధృతరాష్ట్రుడిట్లనియె- అను వాక్యముతో ప్రారంభమగుట గమనించదగినది. అంధుడైన ధృతరాష్ట్రుని పాత్రను మొట్టమొదట ప్రవేశపెట్టుటలోని యంతరార్థమునిట్లు గ్రహించవలయును. మానవమాత్రులమైన మనము కామ క్రోధాది రజోగుణాధిక్యమునకు వశులమై, అజ్ఞానాంధకారములో మునిగి, దిక్కుతోచని స్థితిలో నుందుము. మనలోని యీ యజ్ఞానమును దూరముగా పారద్రోలి, జ్ఞానజ్యోతిని వెలిగించుకొని, జీవన యాత్రను సుగమము గావించుకొనుమని శ్రీభగవానుని దివ్యప్రబోధ సారాంశము.

సర్వాంతర్యామియైన భగవంతుని స్వరూపము నెరిగి, ఆ పరమాత్మయొక్క యనంత తేజస్సులో ఐక్యమగుటయే మోక్షము. భగవత్సాక్షాత్కారమునకు మార్గములు మూడు - అవి: జ్ఞానమార్గము, కర్మమార్గము, భక్తిమార్గము. ఈ మూడింటిలో జ్ఞాన-కర్మ-మార్గములు అత్యంత కష్టసాధ్యములు. జపతపాదుల నాచరించుట సామాన్య మానవులకు సాధ్యముకాదు. సమస్త మానవజాతికి సాధకమైనటువంటిది భక్తిమార్గ మొక్కటియే. సృష్టినంతటిని నడుపుచున్నదొక మహత్తరమైన శక్తి. అదియే దైవము. మనిషి 'నేను, నేన'ను అహంకారము విడిచి, తన సర్వస్వము దైవమే అని నమ్మి అతనిని కొలుచుట శరణాగతి తత్త్వము. దీనిని చాటుచున్నది భగవద్గీతలోని

"అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥" అను శ్లోకము.

తే.గీ. "అన్య చింతలు మాని న న్నచలభక్తి
దమినుపాసించువారి యోగమును క్షేమ
మేనె వహియింతు నెల్లప్పుడిది నిజమ్ము" (9-22)

మనసునందు ఇతరములైన ఆలోచనలు లేకుండ తననే నమ్మినచో, వారియొక్క యోగక్షేమాలను చూచి, వారిని రక్షింతునని అభయమిచ్చుచున్నాడు పరమాత్మ. విశిష్టాద్వైత మత గ్రంథములన్నియు నీ శరణాగతి తత్త్వమునే ప్రతిపాదించుచున్నవి. ఆళ్వారులు దీనిని విశ్వసించియే పరమపదప్రాప్తి నొందగలిగిరి. 'నమ్మాళ్వార్' రచించిన 'తిరువాయ్ మొళి'కి 'దీర్ఘ శరణాగతి'యని మరియొక పేరుగలదు. తాళ్లపాక అన్నమాచార్యులు పరమాత్మ దివ్యపద పద్మములనే శరణని నమ్మి విష్ణుసాయుజ్యము నందిన మహనీయుడు.

సకల ప్రాణులయంతరాంతరాలలో నిండినవాడు, సమస్త లోకములను వ్యాపింపజేసి, నడిపించు ఉత్తమ పురుషుడు భగవంతుడు. అతడు నిశ్చలభక్తివలననే లభ్యుడు. ఇతరములగు వేటివలనను అతడిని పొందజాలము. దీనిని వెల్లడించుచున్నది

"పురుషః సపరః పార్థ ! భక్త్యాలభ్యస్త్వనన్యయం" అను గీతా శ్లోకము.

"ప్రాణులన్నియు నెవని లోపలను నుండు
ఎవనిచేతను వ్యాపించి యెసగు జగము
అట్టి యుత్కృష్ట పురుషుం డనన్యభక్తి
వలననే లభ్యుఁడిక దేనివలనఁగాదు" (8-22)

ఈ భావమును వెల్లడించుచున్న పోతన భాగవతము - గజేంద్ర మోక్షమునందలి "ఎవ్వనిచేఁ జనించు జగమెవ్వని లోపలనుండు" అను పద్యము సుప్రసిద్ధము.

భక్తికి ప్రధానముగా కావలసినది నిర్మలమైన మనస్సు. స్వచ్ఛమైన, నిష్కల్మషమైన భావముతో సమర్పించిన చిన్న ఆకునైనను, పువ్వునైనను, పండునైనను, మంచినీటినైనను తాను సంతృప్తితో స్వీకరింతునని "పత్రం పుష్పం ఫలంతోయమ్" అను శ్లోకరూపమున శ్రీకృష్ణుడు తెలిపియున్నాడు.

"పత్రమైననుగాని పుష్పంబుఁగాని
ఫలముఁగాని యొకింత సజ్జలముఁగాని
భక్తి నెవడిచ్చు నాకు నవ్వాని విమల
చిత్తమున్ జూచి దానినే స్వీకరింతు"

భగవంతుని గొల్చువారు పుణ్యాత్ములు. అట్టివారు నాలుగు విధములని గీతలో పేర్కొనబడినది. వారు - బాధలలోనివారు, బ్రహ్మ తత్త్వమును తెలుసుకొనగోరువారు, ధనము, భార్య, బిడ్డలు - వీటిని కోరువారు, మరియు జ్ఞానులు. నిరంతరము భక్తిభావము గలిగి ధ్యానము, జపతపాదులు గావించునట్టి జ్ఞాని భగవంతునికి మిక్కిలి ప్రియమైనవాడు. అనిత్యమై, అశాశ్వతమైన వాటియందు రాగమును వీడి, వైరాగ్యభావముతో నిత్యసత్యమై వెలయునట్టి పరమాత్మను తెలుసుకొనగలిగినవాడు జ్ఞాని. మానవునిలో భక్తిని, జ్ఞానమును, వైరాగ్యమును - ఈ మూడింటిని కలిగించుచున్నది గీతా ప్రబోధము.

"ఈశ్వరస్సర్వభూతానామ్ హృద్దేశేఽర్జునతిష్ఠతి" అని గీతాప్రవచనము (మోక్ష సన్న్యాసయోగము-61వ పద్యము)

తే.గీ. సకల భూతనియామక శక్తియుతుఁడు
అయిన యీశుఁడు దేహములనెడి యంత్ర
ముల నధిష్ఠించియున్న ప్రాణులను మాయ
చేతఁ ద్రిప్పుచు హృదయాలఁ జెలగుచుండు.

సర్వభూతములను నియమించు శక్తిగలవాడు ఈశ్వరుడు, అనగా భగవంతుడు. మన భౌతిక నేత్రముల కాతడు గానరాడు. సమస్త ప్రాణుల హృదయములనెడి ప్రదేశములలో నివసించుచు, తన మాయాశక్తిచేత నీ ప్రాణకోటిని యంత్రములను త్రిప్పినట్లుగా త్రిప్పుచుండును.

పంచభూతములు, మనసు, బుద్ధి, అహంకారము-సృష్టిలోని యీ అష్టవిధ ప్రకృతియందును భగవంతుడు ప్రకటితమగుచున్నాడు. సకల జీవరాశి స్వరూపము అతడి లీలావినోదమే. జగమంతటికి ఆత్మయు నతడే.

''జ్ఞానమ్ జ్ఞానవతామహమ్''

''జ్ఞానవంతుల యాత్మ సుజ్ఞానమేను''

జ్ఞానమే తన స్వరూపమని సాక్షాత్ భగవానుడే విభూతి యోగమునందు (38వ పద్యము) చెప్పియున్నాడు. మరియు,

''కామ మనురాగమును లేని ఘన బలాఢ్యు
లందు నున్నట్టి బలము నేనౌదు, మఱియు
ధర్మమున కెన్నడున్ విరోధమ్ము గాక
వరలు ప్రాణుల( గల కామమరయ నేనె''

ధర్మమునకు విరుద్ధముగాని కామము, శ్రేష్ఠులలోని బలమును పరమాత్మయే యని చాటుచున్నది విజ్ఞాన యోగము (11వ పద్యము)

''నియతి దండించు ప్రజదండనీతి నేను'' (10-38)

ప్రజలు ధర్మమార్గమునందు నడచుటకు ఇచ్చునట్టి శిక్షను నేను,

''ఆయుధంబుల నేను వజ్రాయుధమును'' (10-28)

''శస్త్రధారుల శ్రీరామచంద్రుడేను'' (10-31)

''ఈ జగత్సృష్టికెల్ల ఆదిమధ్యాంతములు నేనెయగుదు సుమ్ము
విద్యలందున సద్బ్రహ్మవిద్య నేను'' (10-32)

అని సృష్టిలోని శ్రేష్ఠమైన సమస్తమందును తాను నిండియున్నానని శ్రీ కృష్ణపరమాత్మ పేర్కొనియున్నాడు.

''యదుకులాంబుధి శ్రీకృష్ణుడౌదు నేను
పాండు నందనులం దర్జునుండ నేను'' (10-37)

అను మాటలలో గల విశేషార్థమును మనము తెలుసుకొనవలెను. ''అహం బ్రహ్మాస్మి''-నేను పరబ్రహ్మ స్వరూపమునగుచున్నాను-అని ఉపనిషద్వాక్యము. నేనే నువ్వు, నువ్వే నేను - నేను (శ్రీకృష్ణపరమాత్మ-భగవంతుడు), నువ్వు (అర్జునుడు). ''తత్త్వమసి'' - ఈ తత్త్వమును గ్రహించవలసినది. నీవు నాయంశమునందు జన్మించినవాడవే. అయిప్పటికి అజ్ఞానమునకు వశుడవై నీవు నన్నెరుగజాలకున్నావు. దానిలోనుండి బయటపడుమని అర్జునునికి హితబోధ గావించుచున్నాడు శ్రీకృష్ణుడు.

ఇది అర్జునుడికి మాత్రమేగాదు, మాయామోహాంధకారమునందు జిక్కుకొని, తేజోవిరాజితుడైన పరమాత్మను చూడజాలని మనకందరికి ఇదొక ప్రబోధముగానున్నది.

సంగ్రామరంగంలో అర్జునుడి యెదుట, శత్రుపక్షమున నిలిచిన వీరులెవ్వరో పరాయివారుకారు. అందరును అతడి స్వజనులే. గురుబాంధవాదులైన వారితోనే తాను పోరు సలుపవలసినది ? వారి నందరిని సర్వనాశనము గావించి, రాజ్యమును గెలిచి, కడపటికి తాను తినబోవునది వారి నెత్తుటికూటినా ? ఈ భావమతని హృదయమున సంచలనమును గలిగించి, అతడిని తీవ్ర మనస్తాపానికి గురిచేసినది. అతడి మనశ్శరీరములు రెండు నతని వశముదప్పిపోయినవి. శోకవిషాదభారముతో నతడు తత్సమయమున నిర్వర్తించవలసిన కర్తవ్యమును విస్మరించినాడు. తనకు గలిగిన భావవైకల్యమును, దురవస్థను నతడే స్వయముగా నారాయణున కిట్లని విన్నవించుకొనినాడు :

"ఏమి చెప్పుదునో కృష్ణ ! యిందఱిచట
సమర కాంక్షింతు లయ్యును స్వజనులగుట
జలదరించెడి - నవయవ సముదయమ్ము
శిథిలమయ్యెడి, నాలుక చెమ్మలారె"

"కరము జారెడి నాచేతి గాండీవమ్ము
మంటలెత్తెడి నామేన, మనస్సులోన
భ్రాంతి నటియించుచున్నది రథముపైన
నిలువలేకుంటి, మెయిస్వేద జలమునిండె"

(అర్జున విషాదయోగము - 9,10 పద్యములు)

ఈ రెండు తేటగీతి పద్యములలో శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారు అర్జునుడి దీనావస్థను మన కన్నులకు గట్టినట్లుగా వర్ణించి, ఆతడిని మన యెట్ట యెదుట నిలబెట్టినారు.

ఇటువంటి దయనీయ పరిస్థితిలో బ్రతుకుమీద విరక్తిని పెంచుకొనుట మానవ నైజము. అర్జునుడిలో మనోబలము పూర్తిగా నశించిపోయినది.

"న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖానిచ ।
కిన్నో రాజ్యేన గోవింద కింభోగైర్జీవితేనవా ॥"

"సమర విజయమ్ము సామ్రాజ్య సౌఖ్యచయము
భోగ భాగ్యాలు నేగోరబోవనింక
గెలుపులవి యేల ? రాజ్యమ్ము గీజ్యమేల ?
జీవితము నేల? నను పాపిఁ జేయనేల ?

(అర్జున విషాదయోగము - 32వ పద్యము)

యుద్ధమునందు విజయము, రాజ్యభోగాలు వ్యర్థమనుకొనినాడు విజయుడు. చిట్టచివరికి తనకీ జీవితమే అక్కరలేదని చెప్పే స్థాయికి దిగజారిపోయినాడతడు.

"శోకో నాశయతే ధైర్యమ్ శోకో నాశయతేశ్రుతమ్ ।
శోకో నాశయతే సర్వమ్ నాస్తి శోక సమోరిపుః॥"

అని వాల్మీకి రామాయణము. శోకమనునది మనలోని ధైర్యాన్ని, జ్ఞానాన్ని సమస్తమును నశింపజేయును. లోక వినాశ హేతువయిన శోకముకంటెను భయంకరమైన శత్రువు వేరొకటిలేదు. శత్రువులవలన కలిగిన యెంతటి కష్టనష్టములనైనను భరించగల శక్తి మనస్సునకు గలదు. కాని, శోకమును భరించుట యెంతటివానికైనను చాల కష్టమను విషయమును చాటుచున్నదీ వాల్మీకి సూక్తి.

ఇట్లు శోక వ్యాకులచిత్తుడై మనోవైకల్యానికి లోనైన అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామ రంగమందు కింకర్తవ్యతా విమూఢుడై నిలబడినాడు. ఆ క్షణములో ఏది ధర్మమో, ఏది అధర్మమో అను దానిని నిర్ణయము చేయుటకైనను అతడి మనస్సునకు శక్తి చాలలేదు. అట్టి దుర్భర పరిస్థితిలో తనకు కర్తవ్యబోధ గావించుమని శ్రీకృష్ణు నిట్లు వేడుకొనినాడు పాండుపుత్రుడైన అర్జునుడు :

"కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామిత్వాం ధర్మసమ్మూఢచేతాః" (2-7)

తే.గీ. "అరయ కార్పణ్య దోషోప హతుఁడ నగుట
స్వస్వభావమ్ము చెడె; ధర్మసద్విచార
ఫణితి చేతమ్ము మూఢ భావమ్ము చెందె
శిష్యుడను నీకు శరణంచుఁ జేరినాడ
శ్రేయమగునది దెల్పి శాసించు నన్ను"

దైన్యమువలన నా మనస్థైర్యము నశించిపోయినది. మంచి చెడ్డలను తెలుసుకొనలేని స్థితిలో నున్నాను. నీ శిష్యుడనైన నాకు దయతో నేనేది చేయదగిన కార్యమో తెలియజేయుము. అప్పుడు నారాయణుడు :

"క్షుద్రం హృదయ దౌర్బల్యమ్ త్యక్త్వోత్తిష్ఠ పరంతప"
(సాంఖ్యయోగము - 3వ పద్యము)

"పరమ క్షుద్రమౌ హృదయ దౌర్బల్యమేల
లెమ్ము, నిలుమ"న్న మాటలతో అర్జునుడిలో ధైర్య స్థైర్యములను గలిగించుటకు సంసిద్ధుడైనాడు.

మానసిక బలహీనత యనునది నీచాతి నీచమైనది. అది ఎటువంటి దృఢమైన మనిషినైనా నిలువునా క్రుంగదీసి, కర్తవ్యతా విముఖుని గావించి తీరుననుట అనుభవైక

వేద్యము. యుద్ధము చేయుటకు సిద్ధపడి వచ్చినవాడై, యుద్ధరంగమున నిలబడిన అర్జును డాసమయమున చేయవలసినది యుద్ధము; శత్రువుల నెదిరించి పోరాడి గెలుచుట, జయింప వీలుగాని పక్షమున యుద్ధరంగమున శత్రువీరులచే మరణమొంది, వీరస్వర్గము నలంకరించుట. అంతియేకాని అసలు యుద్ధమే చేయనని భీష్మించుకొని, తన చేతిలోని ఆయుధములను క్రింద పడవేసి, సమర క్షేత్రమునుండి పారిపోవలెనని చూచుట వీర లక్షణము గాదు. ఇట్లు చేయుట పిరికితనమునకును, విధి విస్మరణమునకును పరమ చిహ్నము. నేటి మనస్తత్వ శాస్త్రవేత్తల దృష్టిలో నిది Escapism అనగా అవశ్యము నెరవేర్చవలసిన కర్తవ్యమునుండి తప్పించుకొన జూచుట. ఇట్టి హీనమైన బలహీనతకు వశముగాక, ధైర్యమును వహించి కార్యోన్ముఖుడవు గమ్మని అర్జునుడిని చైతన్యవంతుడిని గావించుచున్నవీ శ్రీకృష్ణుని పలుకులు :

"ఋణానుబంధ రూపేణ పశుపత్ని సుతాలయా:
ఋణక్షయే క్షయం యాంతి కాతత్ర పరివేదనా"

అని నీతి శ్లోకము. పశువులు, సతీసుతులు - ఇవన్నియు ఋణానుబంధమువలన నేర్పడునట్టివి. అది తీరిపోగానే అన్నియు నశించిపోవును. కనుక వీటి విషయమున బాధపడుట వ్యర్థము. మాతౄణము-తల్లి ఋణము, పితౄణము - తండ్రి ఋణము, మిత్రఋణము - స్నేహితుల ఋణము, దేవఋణము - దేవతల ఋణము - ఈ ఋణములన్నిటిని మానవుడు తీర్చుకొనవలసియున్నది. కుటుంబములో తల్లిదండ్రుల యెడగాని, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళయెడగాని, ఉద్యోగ ధర్మమును నిర్వర్తించు కార్యాలయములందుగాని, వారి వారియెడ నెరవేర్చవలసిన కర్తవ్యమును అవశ్యము నెరవేర్చవలెను. ఇదియే మానవుడనుసరించవలసిన ధర్మము ఇది - సుధర్మము. అట్టి విధులనుండి తప్పించుకొన నెంచుట అధర్మము. విధి విస్మరణమనున దెన్నటికి కూడనిది. కర్తవ్యపాలన మెంతటి కఠినాతికఠినమైనను, దానిని నిర్వర్తించుట మానవుని విశిష్టధర్మము. విధి నిర్వహణమునందు శ్రద్ధానురక్తులను గలిగించుచున్నదీ గీతాప్రబోధము.

మహావీరుడైన అర్జునుడికి యుద్ధరంగమనిన ఆటలాడుకొనునటువంటి క్రీడాస్థలము వంటిది. యుద్ధమనగా నతడికొక ఆట. వీరాధివీరుడు, యోధాగ్రేసరుడునైన అర్జునుడి మనస్సునందే యిటువంటి దౌర్బల్యమేర్పడినదని వర్ణించుటలో నొక నిగూఢార్థమున్నది: మహామహులైన యిటువంటివారే క్షుద్రమైన మానసిక దౌర్బల్యానికి లోనైనారనగా లోకమునందుగల సామాన్య మానవుల దుస్థితి వర్ణింప వీలుగాదు. గీతాప్రబోధ సారమంతయు నీ క్రింది శ్లోకములో నిమిడియున్నది:

"కర్మణ్యేవాధి కారస్తే మాఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూ ర్మాతేసఙ్గోఽస్త్వ కర్మణి"

(సాంఖ్యయోగము-47వ శ్లోకము)

తే.గీ. కర్మమును జేయుటకె యధికారివీవు
కర్మఫలముల కధికారిగాకు మెపుడు
కర్మఫల కారణుండును గాక నీవు
కర్మములు జేయ నాసక్తి గలిగియుండు.''

ఓ పార్థా ! నీవాచరింపవలసిన కర్మములను చేయుటయందు మాత్రమే నీకు అధికారమున్నది. వాటి ఫలముమీద నీకెట్టి అధికారమునూ లేదు. కనుక నీవు ఫలము నాశించి ఏ కార్యమును చేయకుము. అట్లని చేయవలసిన కర్మను వదలిపెట్టకుము.

''నియతం కురుకర్మత్వం'' (కర్మయోగము-8వ శ్లోకము)

''నియతమైనట్టి కర్మల నిష్ఠతోడ
నాచరింపుము, నీవట్టి వాచరింప
కునికి జీవితయాత్ర సాగుట భరమ్మ''

జీవితము సక్రమముగా సాగుటకు నీవు నిత్య నైమిత్తిక కర్మములను తప్పక నాచరింపవలసియున్నది. కర్మానుష్ఠానమే ఉత్తమ మార్గమని కర్మయోగ రహస్యమును సవ్యసాచికి విన్నవించినాడా సర్వాంతర్యామి.

జ్ఞానమునకు ప్రధానసాధనము కర్మానుష్ఠానమని పరమాత్మ యిట పేర్కొనుట గమనింపదగినది. నియతకర్మల నాచరించుటవలన మనస్సు ఇహమునుండి పరమునకు మరలుటకు దారి యేర్పడును. దీనివలన చిత్తశుద్ధి కలుగును. తద్వారా జ్ఞానము నెడ మనస్సు నిలుచును. కర్మాచరణమునందు ముఖ్య పాత్ర వహించునవి ఇంద్రియములు. ఇంద్రియములకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి, బుద్ధికంటెను ఆత్మ శ్రేష్ఠమైనవి. వీటన్నిటికంటెను శ్రేష్ఠమైనది పరమాత్మ.

''దేహమునకంటె శ్రేష్ఠమింద్రియము లౌను
ఇంద్రియములకంటెను శ్రేష్ఠమెపుడు మనసు
మనసుకంటెను శ్రేష్ఠమై తనరు బుద్ధి
బుద్ధి కంటెను శ్రేష్ఠమై పొలుచునాత్మ''
(కర్మయోగము - 42వ పద్యము)

పరమాత్మ నెరుగుటకు ఆత్మజ్ఞానము పొందవలసియున్నదని చాటుచున్నది సాంఖ్యయోగము. ఇట్టి జ్ఞానమును శ్రద్ధవలనే పొందగలము. ''శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్'' అని జ్ఞానయోగము (4-39). వేయిమందిలో ఏ యొక్కరికో జ్ఞానమును పొందవలెనను శ్రద్ధ, ఆసక్తి కలుగునని, అట్టివాడు ప్రయత్నము మీద ప్రయత్నము గావించి తనను తెలిసికొనుననియు విజ్ఞానయోగమునందు తెలిపియున్నాడు భగవంతుడు:

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే"
(విజ్ఞాన యోగము - 3వ శ్లోకము)

"జ్ఞాన సంసిద్ధి కొఱకు యత్నంబొనర్చు
మానవుడు వేయికొక్కఁడే మనుజవర్య !
అందునను నన్ను నిజముగానరసి తెలిసి
కొనెడు వాఁడొక్కఁడుండు నిక్కువముగాగ."

అర్జునుడట్టి జ్ఞానము నలవరచుకొనవలెనని పరమాత్మ సంకల్పము.

సంయమనము, ఇంద్రియ నిగ్రహము గలిగి జ్ఞానమును పొందినవానికి మానసిక ప్రశాంతి యేర్పడునని తెలియజేయుచున్నది భగవద్గీతయందలి జ్ఞానయోగమను అధ్యాయము.

తే.గీ. జ్ఞాన సంపాదనమునందు శ్రద్ధ మఱియు
నియమ నిష్ఠలు నింద్రియ నిగ్రహంబు
జగతినొప్పిన బ్రహ్మానుజ్ఞానమబ్బు
సద్యశోత్కృష్ట దివ్యప్రశాంతి గల్గు."

మానవుడు త్రికరణశుద్ధిగా-మనసా, వాచా, కర్మణా - శ్రద్ధానురక్తులు గలిగి ధర్మమార్గము ననుసరించి నడచుకొనగలిగినప్పుడే జన్మకు సార్థకత గలుగును. ఉత్తములైనవారు నడచినట్టి మార్గమే ధర్మమార్గము. అదియే విశిష్ట మార్గము, లోకులందరికి ఆదర్శమైన మార్గము, జనకుడు మొదలుగాగల ఉత్తము లాచరించిన కర్మమార్గమే అందరికి ఆచరణయోగ్యమైన మార్గమని గీతాకారుడిట్లు స్వయముగా ప్రశంసించియున్నాడు:

తే.గీ. జనకుఁడాదిగాఁగల యట్టి చక్రవర్తు
లవని నిష్కామ కర్మల నాచరించి
మోక్షఫలమంది - రీవును మోదమలర
జనులు సన్మార్గులగుటకు సలుపుకర్మ
(కర్మయోగము - 20వ పద్యము)

ఈ సకల చరాచర సృష్టికి పరిపాలకుడు పరమాత్మ. ముల్లోకములలో నతడు చేయదగినట్టిదియు, పొందగలిగినట్టిదియు ఏదియును లేదు. అయినప్పటికిని తాను కర్మములను చేయుట మానివేసిన యెడల, అందరు తననే ఉదాహరణముగా గ్రహించి కర్మాచరణమును పూర్తిగా మానివేయుదురు. తన్మూలమున వర్ణసంకరమువంటి అనర్థములు సంభవించును. కనుక, సర్వకాలములలోను జాగరూకతతో తాను నియత కర్మల నాచరింతునని భగవంతుడే స్వయముగా నిట్లు వాక్రుచ్చియున్నాడు :

''సర్వకాలంబులందును జాగ్రతఁగొని
స్వల్పమైనను పొరబాటు సలుపకుండ
కర్మసేయంగవలె నేను - కాదయేని
నను నుదాహరణంబుగా నరులుగొంద్రు''

''కర్మ చేయక కాలమేన్ గడిపితేని
చెడుదురెంతయు లోకులు కడకు వర్ణ
సంకరంబుననగు పార్థ ! జనులు చెడఁగఁ
గారణంబును నేనౌదు ఖండితముగ''

(కర్మయోగము-23, 24 పద్యములు)

మానవుడు తాను చేయవలసిన కర్తవ్యమును నిర్వర్తించుట కర్మ; ఏ ప్రతిఫలము నాశింపక చేయుకర్మ 'అకర్మ' యనబడును. అట్టి అకర్మల నాచరించినవాడే నిజమైన జ్ఞాని. 'అకర్మ' యనగా కర్మ చేయకుండుటగాదు. సమస్త ధర్మములను నిష్ఠతో నాచరించి, కర్మఫలమును తనకు వదలిపెట్టి తనను శరణుకోరిన వారికి ఎట్టి కర్మ దోషముల నంటనీక పరమాత్మ రక్షించి మోక్షము నిచ్చును. ఈ భావమును దెలుపుచున్నది. భగవద్గీత కంతటికి భీజప్రాయమైన శ్లోకములలో నొకటి యగు

''సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః ॥''

(మోక్ష సన్న్యాస యోగము-18-66)

అను శ్లోకము. దీనికి శ్రీ సుబ్రహ్మహ్మణ్యంగారి ఆంధ్రానువాద పద్యమిది :

''సర్వ ధర్మంబులను వీడి సవ్యసాచి !
నన్నె శరణుఁ గోరుము నేను నిన్ను నెపుడు
సర్వ పాపంబులందుండి సత్వరముగ
ముక్తు జేసెద దుఃఖింపబోకు విజయ''

ఇచట 'సర్వ ధర్మంబులను వీడి' - అను మాటకు అన్ని కర్మముల ఫలమును తనకు (పరమాత్మకు) వదలిపెట్టి అను అర్థము చెప్పుకొనవలయునే తప్ప-అన్ని కార్యములను, ధర్మములను చేయకుండుట అని అర్థము కాదు. మన చేతులలో నేమియు లేదుకదా, అంతయు దేవుడే చూచుకొనునులే, ''నారు పోసినవాడు నీరు పోయక మానునా'' అని సోమరితనముతో చేతులు ముడుచుకొని కూర్చుండుట కాదు, ప్రతి పనిలోను ప్రయత్నము అవసరము. కర్మానుష్ఠానములో ఫలితము విషయమున మాత్రము తామరాకుపై నీటిబొట్టువలె - అంటియు నంటనట్లుగా నుండవలెను. అప్పుడే కర్మబంధాలు మనలను పట్టి బంధింపలేవని పరమాత్మ హితబోధ.

జ్ఞాన నిష్ఠతో భగవంతుడి నాశ్రయించినవానికి సర్వ దుఃఖములు తొలగి బ్రహ్మభావము కలుగును. జనన మరణములు రెండింటియందును సమభావమును ప్రదర్శించుట జ్ఞానుల స్వభావము. ఇట్టి సమ దర్శనస్థితి నందగలిగినవాడే మోక్షమున కర్హుడగును. ఆత్మస్థిరమైనది. జనన మరణ దోషములు దాని కంటవు; గాలి దానిని శుష్కింపజేయజాలదు; నీరు తడుపజాలదు; నిప్పు కాల్చజాలదు; ఏ ఆయుధములును దానిని ఖండింపజాలవు. నాశనము లేనిది, అచంచలమైనది; అనాదియైనది, అనవరతము ఒకేవిధముగా నుండునట్టిది ఆత్మ. నరుడు చిరిగిన వస్త్రాలను వదలి క్రొత్త వస్త్రాలను ధరించినట్లు, శిథిలమైన ఈ భౌతిక శరీరమును వీడి ఆత్మ వేరొక దేహము ప్రవేశించునని ఆత్మ తత్త్వమును ప్రబోధించుచున్నది క్రింది గీతా శ్లోకము :

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవానిదేహీ ॥

''జీర్ణ వస్త్రాల విడనాడఁజేసి నరుఁడు
నూతనంబగు వస్త్రాల చేత దనరు
నట్లుగా దేహి జీర్ణదేహమ్ము విడిచి
క్రొత్త దేహాలబొందునో కుంతి తనయ'' (2-22)

విజ్ఞులైనవారు మృతినొందినవారికొరకుగాని, బ్రతికియున్నవారినిగూర్చిగాని విచారించరు.

''అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే'' అని సాంఖ్యయోగము. (2-11)

''ధరణి దుఃఖింపగాఁ బడఁదగని వారి
కొఱకు దుఃఖించి యారీతి ప్రాజ్ఞునట్లు
పలుకుచున్నావు – చచ్చినవారి గూర్చి
గాని బ్రతికియున్నట్టి యెవ్వానిఁ గూర్చి
గాని పండితవరులు దుఃఖమును గొనరు''

కనుక భీష్మ ద్రోణాది గురువర్యులను గూర్చి యీ క్షణమందు విచారించుట తగదని, వారితో యుద్ధము చేయుటయే అవశ్య కర్తవ్యమని హెచ్చరిక చేయుచున్నాడు నారాయణుడు.

ఈ దేహము అనిత్యమైనది. మృతి నొందిన వెంటనే ఈ భౌతిక శరీరము నశించి పోవుచున్నది. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అని గీతా ప్రవచనము. 'పుట్టినయతండు మరణంబుఁ బొందితీరు' (2-27). కనుకనే 'పుట్టుట గిట్టుట కొరకే' అన్నారు పెద్దలు. ఈ సృష్టిలో పుట్టిన ప్రతి ప్రాణికి మృత్యువు తప్పదు. సామ్రాజ్యాలేలే మహారాజులైనా, కూటికి లేని నిరుపేదలైనా, ఎంత వద్దనుకొన్నా,

ఈనాడో, మరునాడో, ఏనాడో, ఒకనాడు పైలోకానికి ప్రయాణము కట్టక తప్పదు. ఇది సృష్టిధర్మము. ఈ జీవిత సత్యము. 'నిజం నిష్ఠురమ'నిపించే విధముగా నున్నప్పటికి, ఈ చేదు నిజాన్ని ఎటువంటివారైనా మ్రింగక తప్పదు. "కారే రాజులు రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతిన్ బొందిరే, వారేరీ సిరిమూటఁ గట్టుకొని పోవంజాలిరే" అని వాపోయాడు మహాకవి పోతన. ఎంతటివారలకైనను చివరికి చేరవలసిన గమ్యము శ్మశానవాటికయే. మనిషికి మిగిలేది చివరికి ఆరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు గల కాటినేల మాత్రమే.

ప్రాణమున్నంతవరకే ఈ శరీరానికి అన్ని అచ్చట్లూ, ముచ్చట్లూ, అన్ని విలువలూ, గౌరవమూను. ప్రాణంపోయిన పిమ్మట, ఈ శరీరమొక కట్టెతో సమానము. మామూలు కట్టెను వంట చెఱకుగా ఉపయోగించుకొందుము కాని, నిర్జీవమైన ఈ కట్టెను మాత్రం ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా పాడెకట్టి, ఇంటినుండి కాటికి పంపించడానికి వేగిరపడటం సహజం. ఈ దేహమునకు బాల్యము, యౌవనము, వార్ధక్యము కలిగినట్లే మరణావస్థయు సంభవమని యెరిగిన ధీరుడు మృత్యువునకు భయపడడు. శరీరసంబంధమైన యవస్థ లెవ్వియును అతడిని క్రుంగదీయలేవు. అట్టి ధీర పురుషునికి కైవల్య సుఖము ప్రాప్తించగలదనెడి సాంఖ్యయోగమునందలి తత్త్వ రహస్యమును శ్రీ సుబ్రహ్మణ్యంగారిట్లు వివరించిరి :

"దేహికీ దేహమందు నేతీరుగాగ
బాల్యదశయును యౌవన వార్ధకములు
నరయగలుగునొ యటులె దేహాంతరమును
గలుగునని యెంచి ధీరుడు కలత వడడు." (2-13)

"భువిని సుఖ దుఃఖముల సమంబులుగనెంచు
ధీరపురుషుని దరికి నే తేరబోవు
బాధలెవియును, వాడె కైవల్యసుఖము
పొందనర్హుండగున్ పార్థ ! పుణ్యపురుష" (2-15)

"ఈశ్వరుడి యాజ్ఞ లేనిదే చీమైనా కదలద"ని లోకోక్తి. లోకేశుడైన యీ పరమాత్మ సృష్టిలో దేని ప్రయోజనము దానికుండితీరును. పిపీలికాదిపర్యంతం–అనగా, చీమ మొదలుకొని ప్రతిప్రాణి యేదేనొక ప్రయోజనముతోడనే సృష్టించబడినది. దైవసంకల్పము నెరుగుట మానవమాత్రులకు సాధ్యముకాని విషయము.

"అమంత్రమ్ అక్షరమ్ నాస్తి
నాస్తి మూలమనౌషధమ్ ।
అయోగ్యః పురుషః నాస్తి
యోజకః తత్ర దుర్లభః ॥"

అని ఒక నీతి శ్లోకము. మంత్రానికి పనికిరాని అక్షరము, మందుకు పనికిరాని మూలిక, ప్రయోజనము లేని మనిషి-ఈ లోకములో ఉండనే ఉండవు. కాని, దేనిని ఏ విధముగా ఉపయోగించిన అది ప్రయోజనము కలిగించగలదో దానిని చక్కగా యోచించి, ఆచరణలో పెట్టగలిగినవాడే ఈ లోకమున అరుదు. "శరీర మాద్యమ్ఖలు ధర్మసాధనమ్" అని ఆర్యోక్తి. ఈ శరీరమను దానిని ధర్మ కార్యాలను నెరవేర్చుటకు ఒక సాధనముగా మానవుడు ఉపయోగించుకొనగలిగినప్పుడే మానవజన్మకు సార్థకత కలుగును. "దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోమన్నారు" విజ్ఞులు. ఈ భౌతిక దేహములో ప్రాణమనెడి దీపమున్నప్పుడే సకల ధర్మములను నిర్వర్తించవలెను. ప్రాణమున్నంతవరకేగదా ఏపనైనను చేయగలము. "త్రైలోక్య దీపకో ధర్మః"-మూడు లోకములను ప్రకాశింపజేయునట్టిది ధర్మము.

నిత్యము అనేక యాతనలతో సతమతమగుచుండు నీ మానవ జన్మము. ప్రారబ్ధకర్మలు మనలను వెన్నంటుచునే యుండును. నిశ్చలమైన మనస్సుతో పరమాత్మను ధ్యానించుటకైనను మనకు సమయము చాలదు. ఈ కలియుగమునందు భగవంతుని మీద భక్తియందును వేగిరపాటే. మనస్సుకు గల శక్తి మహత్తరమైనది. ఈ సృష్టిలో మహా వేగవంతమైన వస్తువేది ? అని యక్షుడడిగిన ప్రశ్నకు మహాభారతంలో ధర్మరాజు ఒసగిన సమాధానము – మనస్సు.

"మనశ్చంచల మస్థిరమ్" (6-26)

"అస్థిరము చంచలంబైన యట్టి మనసు"

"చంచలమ్హిమనః" (6-34)

ఈ మనస్సు మిక్కిలి చంచలమైనట్టిది. స్థిరత్వమనునది లేనట్టిది – అని ఆత్మసంయమ యోగములో పేర్కొనబడినది. ఈ శరీరమును ఇంద్రియవికారములకు లోనుగావించి, తన్మూలమున గలుగు సమస్తమైన అనర్థములకు దారి యేర్పరచునట్టిది మనస్సు. గాలిని బంధించియుండగలుగుట మనిషికెంత కష్టమో, మనస్సును ఏకాగ్రతతో ఒక వస్తువుమీద – ముఖ్యముగా భగవంతుని స్మరణము మీద – నిలుపుట అనునది కూడ మిక్కిలి కష్టము.

"దినయామిన్యౌ సాయంప్రాత
శ్శి శిరవసన్తౌ పునరాయాతః ।
కాలక్రీడతి గచ్ఛత్యాయు
స్తదపినముఞ్చత్యాశావాయుః ॥

–అని భజగోవింద స్తోత్రము. రాత్రి, పగలు, శిశిరము, వసంతము ఒకదాని వెంట ఒకటి వచ్చి పోవుచుండును. కాలమనెడి చక్రమిట్లు తిరుగుచునే యుండును.

ఆయువు తగ్గిపోవుచుండును. కాని పెనుగాలివంటి ఆశమాత్రము విడువదు. బాల్యమునందు ఆటలయందు ఆశ, యౌవనమునందు వలపుటాశ, వృద్ధాప్యమునందు సంసార తాపత్రయము. "పరమే బ్రహ్మణి కోపినసక్తః" ఆ పరబ్రహ్మనుగూర్చి ఆలోచన చేయు బుద్ధి ఎవ్వరికిని కలుగదుగదా !

మానవుడు చంద్రమండలముమీద కాలు పెట్టగలిగినాడు; శుక్ర గ్రహాన్ని చుట్టి రాగలిగినాడు; కృత్రిమమైన ఉపగ్రహాలను అంతరిక్షములోనికి పంపించి గ్రహముల స్థితిగతులను తెలుసుకొనగలుగుచున్నాడు; దూరమును, కాలమును, చివరికీ విశ్వమంతటిని జయించి, శాసించగల విజేత కాగలిగినాడు. ఇంతటి వీరాధి వీరుడు, శూరాధి శూరుడు కాగలిగినను, తన మనస్సును తాను జయించగల సాధనమును మాత్రము ఇంతవరకు కనిపెట్టలేక పోయినాడను నిజమును మాత్రము అందరము ఒప్పుకొని తీరవలసినదే. "మనను ప్రశాంతి( బొంది వరలు వైరాగ్యమునను నభ్యాసమునను" అని గీతాకారుని ప్రవచనము. వైరాగ్యభావము, నిరంతర ప్రయత్నమువలన మనస్సు నిలుకడ గలుగునని దీని యర్థము. "సాధనమున పనులు సమకూరుధరలోన" అన్నాడు మన వేమనయోగి. సాధన, ప్రయత్నమనునవి అన్ని కార్యములందును అత్యంతావశ్యకము.

"ఉద్యమేన హి సిద్ధ్యన్తి కార్యాణి న మనోరథైః ।
నహిసుప్తస్య సింహస్యముఖే ప్రవిశన్తి మృగాః ॥

అని నీతి శ్లోకము. సకల మృగములకు రాజు సింహము. అది సోమరితనముతో నిద్రించుచుండినయెడల, అడవిలో ఏ జంతువైనను తనంతట తానుగా తమరాజు ఆకలితో బాధపడుచున్నాడని తలచి దాని నోటిలోబడి, దాని ఆకలిని తీర్చవు. మృగరాజైనప్పటికి, సింహము తనంతట తానుగా లేచి, పరుగెత్తి, వేటాడి, తన ఆహారమును తానే సంపాదించుకొని ఆకలిని తీర్చుకొనవలెను. అట్లే ఉద్యమము– అనగా ప్రయత్నమువలన మానవుడు ఎటువంటి అసాధ్యమైన కార్యమునైనను సాధించగలడు. కార్యసిద్ధికి ప్రయత్నము అత్యంతావశ్యకమని చాటుచున్నదీ శ్లోకమందలి భావము. మనస్సును నిశ్చలముగా పరమాత్మమీద లగ్నము చేయుటకైనను సాధన అవసరము.

ప్రతిమనిషి మంచి భావములతో తన మనస్సును తానే సంస్కరించుకొనవలసినదే తప్ప, ఇతరుల ప్రోద్బలము నిమిత్తమాత్రమే యని గీతా ప్రబోధము :

"ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బన్ధు రాత్మైవ రిపురాత్మనః ॥"
(ఆత్మ సంనమయోగము - 5వ పద్యము)

''తన్ను తానుద్ధరించుకోదగును గాని
తన్ను తానెప్డు చెఱుపుకోదగదు వినుము
బంధువగునాత్మ సద్బుద్ధివరలు గుణికి
బుద్ధిహీనున కాత్మయే బద్ధవైరి''

మన మనస్సు బాగుపడటానికిగాని, చెడిపోవడానికిగాని పగవారో, హితులో కారణము కాజాలరు. వారి మనస్సే వారికి బంధువు, శత్రువుకూడా. ఇంద్రియములను జయించి, మంచి గుణముల నలవరచుకొనుటకు సహకరించునట్టి ఆత్మయే మనకు ఆప్తబంధువు. అట్లుగాక, ఇంద్రియ నిగ్రహమునకు తోడ్పడక చెడు గుణములకు వశులైనవారికి ఆత్మయే బద్ధశత్రువు. ప్రతివారు తమను తాము ఉన్నతులుగా తీర్చిదిద్దుకొనుటకు ప్రయత్నించవలెనే కాని, తమను తాము కించపరచుకొనరాదు. మంచి చెడ్డలు, స్వర్గ నరకములనునవి మనస్సులో మనము సృష్టించుకొన్నవే. John Milton అను ఆంగ్లకవి "Paradise Lost" అను గ్రంథములోని "The mind is in its own place, and in itself can make a heaven of hell and a hell of heaven" అను మాటలు పై విషయమునే చాటుచున్నవి. ఆత్మను జయించిన జ్ఞానికి సుఖదుఃఖములు, స్వర్గనరకములు రెండును సమానమే.

''జీవు లెనుబదినాల్గులక్షల చావు పుట్టుకలిక్కడా
ఎవరుచేసిన కర్మము వారనుభవించేదక్కడా''

అని ఒక పారమార్థిక గేయము. సృష్టిలోగల ఎనుబదినాలుగు లక్షల జీవరాశులలో ఉత్తమోత్తమమైన ప్రాణి మానవుడు. మానవజన్మ ఎంతేని విశిష్టమైనది. ఇతర ప్రాణికోటికంటె మానవుడిని వేరుచేయునట్టిది జ్ఞానమనే ఇంద్రియము. జ్ఞానమనగా మంచి చెడ్డల విచక్షణ. చెడును వీడి, మంచిని మాత్రమే గ్రహించి తదనుగుణముగా నడచుకొనుట జ్ఞానజీవి అయిన మానవుడి ధర్మము. ధర్మమనగా సక్రమమైన మార్గము- The right path, the virtuous path. ''ధర్మం శరణం గచ్ఛామి'' - ధర్మ మార్గమే శరణ్యమని బౌద్ధమతానుయాయుల నినాదము.

ఏది సక్రమమైన మార్గము ? అను ప్రశ్నకు సమాధానము మహాభారత గ్రంథములో లభ్యమగుచున్నది :

''ఒరులే యవి యొనరించిన
నరవర ! యప్రియము తన మనంబునకగు తా
నొరులకునవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథములకెల్లన్''

ఇతరులు మనయెడ నెట్లు ప్రవర్తించిన మన మనస్సుకు బాధకలుగునో, వారియెడ మనమట్లు చేయకుండుట, అన్ని ధర్మములకంటెను శ్రేష్ఠమైన ధర్మము. క్రైస్తవ వేదమైన

బైబిలులో "All the things whartever ye (you) would that men should do to you, ye (you) do so even to them" అను Mathew సువార్తయొకటి పై విషయమునే వెల్లడి చేయుచున్నది. ''పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్'' అని నీతి శ్లోకము. ఇతరులకు మేలు చేయుట పుణ్యము, కీడు కలిగించుట పాపము.

భగవద్గీతాకారుడు శారీరకతపస్సు, వాచికతపస్సు,మానసికతపస్సు - అను మూడు విధములైన తపస్సులను గురించి శ్రద్ధాత్రయ విభాగ యోగమునందు వివరించియున్నాడు.

ప్రాజ్ఞులయెడ గౌరవభావము, అహింసావ్రత పరిపాలనము, త్రికరణంబుల శుచిత్వము, బ్రహ్మచర్యపాలనము శరీర సంబంధమైన తపస్సు. ఇక కఠినమైన మాటలతో ఎదుటివారి మనస్సు నొచ్చుకొనునట్లుగా మాట్లాడకుండుట, సత్యవాక్పరిపాలనము, ఇతరులకు సంతోషమును, హితమును కలిగించునట్టి మాటలను మాట్లాడుట వేదములలోని అంతరార్థమును గ్రహించి దాని ననుసరించి నడచుకొనుట వాచికతపస్సు. మనస్సును ప్రసన్నముగా నుంచుకొనుట, ఆత్మనిగ్రహము నలవరచుకొనుట, చెడు తలంపులు రానీయకుండుట మానసిక తపస్సు.

వాచికతపస్సును శ్రీ సుబ్రహ్మణ్యంగారిట్లు వివరించిరి.
''పరులనొప్పించు మాటలు పలుకకుండ
సత్యమున్ ప్రియ హిత సుభాషణము విడక
వేదమంత్రము ప్రణవము విడువకుంట
భవ్యమగు వాక్తపంబని పలుకవలయు''
(శ్రద్ధాత్రయ విభాగ యోగము 17-15)

''అను ద్వేగకరంవాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥''

అను శ్లోకానికియ్యది ఆంధ్రానువాదము.

''సత్యంబ్రూయాత్ప్రియంబ్రూయా న్నబ్రూయాత్సత్య మప్రియం'' అని వేదవాక్యము. సత్యమైనదైనను అప్రియమును పలుకరాదని, ప్రియమైనదైనను అసత్యమాడరాదని దీని యర్థము. అనగా ఇతరుల మనస్సును బాధగలిగించునట్టి మాట సత్యమైనను దానిని పలుకరాదు. మాటలకు అనంతమైనశక్తి యున్నది. హిమాలయముల లోని మంచుకంటె చల్లదనము కలిగించి, ఇతరుల హృదయాలను సేదతీర్చి, తృప్తి సంతోషము, ధైర్యము కలిగించుశక్తి దానికున్నది. అదే సమయములో దావాగ్నివలె మండి, మనస్సును మండింపజేసి, జీవితముమీదనే విరక్తిని కలిగింపజేయు శక్తి మాటలకున్నవి. ఒక మనిషిని నిలుచున్న స్థితిలోనే నఱికి, చంపివేయగలదు, కాల్చివేయగలదు, మాటలతో మనస్సును విరుగగొట్టవచ్చును.

"ఇనుము విరిగినేని యిమ్మారు మువ్మారు
కాచి అతుకనేర్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మఱి యతుకలేమయా" అని వేమన సూక్తి.
"వాగ్భూషణం భూషణం" అని భర్తృహరి సుభాషితము.

-మనిషికి అందం విలువైన ముత్యాల రత్నాల హారాలు, ధనధాన్యాదులు కావు, మంచి మాట. దీనినే భగవద్గీతలో వక్కాణించినాదు కృష్ణపరమాత్మ.

"అహింసా సత్యమక్రోధస్త్యాగశ్శాన్తిర పైశునమ్
దయాభూతేష్వలోలత్వం మార్దవంహ్రీరచాపలమ్" (16-2)

అని "దైవాసుర సంపద్విభాగ యోగము"లో కృష్ణపరమాత్మ హితోపదేశము. ఏ ప్రాణికిని బాధ కలుగజేయకుండుట, నిజము పలుకుట, కోపము లేకుండుట, త్యాగబుద్ధి కలిగియుండుట, శాంతస్వభావము కలిగియుండుట, కొండెములు చెప్పకుండుట, ప్రాణులయందు దయ కలిగియుండుట, భోగములందు ఆశ లేకుండుట, క్రౌర్యమును వీడుట, ధర్మవిరుద్ధమైన కార్యములందు సిగ్గు, చంచలస్వభావము లేకుండుట - ఇత్యాది గుణములు దైవసంపత్తియందు పుట్టినవానికి కలుగుచున్నవని ఈ శ్లోక తాత్పర్యము. వీటితోపాటు అంతఃకరణ శుద్ధి, తపస్సు, భూతదయ మున్నగు గుణములు దైవిక గుణములుగా సాక్షాత్ శ్రీ భగవానుడే ప్రస్తుతించియున్నాడు. ఇట్టి మానవతా గుణముల వలన మానవుడే దైవము కాగలడని చాటినాడు. బుద్ధిజీవియైన మానవుడు ఇట్టి సద్గుణ సంపత్తి నలవరచుకొని, తదనుగుణముగా నడచుకొనినయెడల ఇహలోక యాత్ర సుగమము, సామరస్యము కాగలదని శ్రీకృష్ణుని ఉద్బోధ.

"దంభమభి మానమున్ క్రోధదర్పములును
జగతి నజ్ఞాన వాక్పరుషత్వములును
అరయ నసురాంశ సంభూతులైన యట్టి
వారి కిలగల్గు నసుర సంపద లనంగ" (16-4)

-ప్రగల్భములు పలుకుట, ధనాదులవలన మదగర్వము, దురభిమానము, దురాగ్రహము, వాక్పారుష్యము, యుక్తాయుక్తముల నెంచకుండుట - ఈ యాఱును అసురగుణములుగా నెంచబడినవి. మనలను పాపకార్యములను చేయుటకు ప్రేరేపించునట్టివీ గుణములే.

"క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధి నాశో బుద్ధి నాశాత్ప్రణశ్యతి ॥ (2-63)

అని సాంఖ్యయోగము.

"క్రోధము వివేకమున్ చెడగొట్టు; దాన
గలుగును మతిభ్రమము; దానివలన బుద్ధి
నాశమైపోవునో యర్జునా ! గ్రహించు
బుద్ధి నశియింప నశియించు పురుషుడవని"

-కోపము మానవునిలోని వివేకమును నశింపజేయును. మతిని భ్రమింపజేయును. బుద్ధిని చెడగొట్టును. బుద్ధి నశించిన మానవుడు మానవుడుగా మసలజాలడు.

"తగ రజోగుణ బల సముద్భవమునైన
కామ మది కారణము పాపకారణమ్ము
భువి మహాశనమును క్రోధమూలమద్ది
మోక్షకామికి వైరియౌ భూవరేణ్య !"

కామమను దుర్గుణము పాపమునకు మూలకారణము, మోక్షమున కిది బద్ధశత్రువు.

"కామఏష క్రోధఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహవైరిణమ్ ॥ (3-37)

అను శ్లోకమును శ్రీ సుబ్రహ్మణ్యంగా రనువదించిన పద్ధతి సులభముగా నర్థము చేసుకొను రీతిగా నున్నది.

నిప్పును పొగ, అద్దమును దుమ్ము, గర్భస్థ శిశువును మావి కప్పియుంచునట్లు, క్రోధాది గుణములు మనలోని జ్ఞానమును కప్పివేయుచున్నవి. యత్నము, ప్రయత్నము, దైవ సహాయముతో నీ మూడింటిని తొలగించుకొనినట్లు మానవుడు దుర్గుణములను దూరముగా పారద్రోలి సద్గుణముల నలవరచుకొని, సత్కార్మల నాచరించినయెడల దైవమునకు దగ్గర కాగలడని గీతాకారుని ప్రబోధము:

చిత్రపటము చూ. 60 పుట.

"వీతరాగ భయ క్రోధామన్మయా మాముపాశ్రితాః ।
బహవో జ్ఞాన తపసాపూతా మద్భావమాగతాః ॥

అని జ్ఞానయోగము (10వ పద్యము)

"జ్ఞానమనియెడు వరతపశ్శక్తిచేత
ఆత్మపరిశుద్ధిజెంది నన్నాశ్రయించి
రాగభయక్రోధములను దూరముగద్రోచి
పలువురొందరి నా స్వరూపమును విజయ !"

జ్ఞానమనెడి పవిత్రాగ్ని మనస్సులోని మాలిన్యమును అనగా అజ్ఞానమును పోగొట్టును. జల స్నానమనునది దేహమందలి మాలిన్యమును దూరము చేయునట్లు,

గీతాపారాయణము మన మనస్సులోని మాలిన్యమును తొలగించి పరిశుద్ధము చేయగలదని వ్యాస మహాముని వాక్యము :

శ్లో॥ మలనిర్మోచనమ్ పుంసాం జలస్నానం దినే దినే ।
స కృద్గీతాంభసి స్నానం సంసారమలనాశనం ॥ (మహాభారతము)

"బుద్ధిః కర్మానుసారిణీ" అని గీతా వాక్యము. మన మనస్సులోని ఆలోచనారీతి ననుసరించియే మనము నడచుకొందుము. దీనిమీద నేర్పడినదే 'మతెంతో గతంత' అను మాట. మన మనస్సు మంచిదైనచో, అనగా చింతన బాగుండినయెడల, ఆచరణము కూడ మంచిదగును. మన అంతఃకరణమునందు ముమ్ముందుగా మనమేమే భావములను నిలుపుకొనియుందుమో, ఆయా భావములే అంత్యకాలమువరకును నెలకొనియుండు ననుట యందరికి అనుభవమే. కనుకనే, "పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకలతో కాని పోద"ని పెద్దలందురు. మనసులో దైవచింతన నలవరచుకొనినయెడల, ఇతరములగు పాపభావములకు తావుండదు. తన నెవ్వరేవిధముగా సేవింతురో, వారిని తగిన విధముగా ననుగ్రహింతునని అర్జునుడికి చెప్పుటద్వారా మనకందరికి హితము చెప్పుచున్నాడు పరమాత్మ :

"ఎవ్వ రేరీతిగాగ నన్నెంచి కొలుతు
రరయగా వారినట్లె నే నాదరింతు
నా యనుగ్రహ మొందిన నరులు సతము
ననుసరింతురు నామార్గమునె కిరీటి"

(జ్ఞానయోగము - 11వ పద్యము)

కనుక మనస్సునందు తననే స్మరించుకొనుచు యుద్ధము చేయుమని అర్జునుడిని సమరసన్నద్ధుని గావించుటకు ప్రయత్నించుచున్నాడు నారాయణుడు.

"జపతో నాస్తి పాతకమ్" అని నీతిశాస్త్ర ప్రవచనము. జపతపాదులవంటి పుణ్యకార్యముల నాచరించుటవలన మనలోని పాపచింతనలు తొలగి మనను నిర్మలమగును. ఇంద్రియ నిగ్రహమేర్పడును. భగవత్స్మరణమున్నచోట మనలను పిశాచములవలె పట్టి పీడించు దుష్టగుణములకు తావుండదు. మహమ్మదీయులు కూడ అల్లాను ప్రార్థించు సమయములో "ఔజుబిల్లాహిమినష్షైతాన్ ఇర్రహ్మాన్ ఇర్రహీమ్" అని మొఱయిడుదురు. "ఓ అల్లా! దుష్టగుణములనియెడి సైతాన్ బారినుండి మమ్ము కాపాడుదువుగాక" దైవప్రార్థనవలన మనస్సు నిర్మలమగును. నిశ్చలమైన మనస్సుతో గావించిన కార్యములు సత్ఫలితముల నివ్వగలవు. మనము కలలో సైతము ఊహింపజాలనటువంటి మహత్తరమైన, మానవాతీతమైన కార్యములను ప్రార్థన మూలమున మానవుడు సాధించగలడని చాటుచున్న దొక ఆంగ్లవాక్యము:

"More things are wrought by prayer than the world dreams of"

ఈ సృష్టిలో అప్పుడప్పుడు రాజస తామసగుణములు ప్రకోపించుచుండును. అట్టి సమయములలో మానవులు బుద్ధిమాంద్యము చెందినవారై అధర్మమును ధర్మముగా, ధర్మమును అధర్మముగా తారుమారుగానెంచుచుందురని భగవంతుడే పేర్కొనుచున్నాడు:

''ధర్మమునుగాంచి యిద్ది యధర్మమనియు
తగ నధర్మమున్ పొడగాంచి ధర్మమనియు
తారుమారుగా నెంచుచు దనరునట్టి
బుద్ధి యదిగాంచ తామసబుద్ధి యగును.''
(మోక్షసన్న్యాసయోగము 32వ పద్యము)

అంతియేగాక ధర్మమార్గము ననుసరించు సజ్జనులకు అధర్మవర్తనులవలన విపత్తులు గలుగుచుండును. రాక్షసగుణము లీవిధముగా రాజ్యమేలునట్టి సమయములందు స్వయంభువు అయిన సర్వేశ్వరుడు తన్ను తానే సృష్టించుకొని అవతరించును. అధర్మమును తొలగించి, ధర్మమును నిలబెట్టును. భగవానుడిట్లు అభయమిచ్చుట జ్ఞానయోగమునందు రెండు శ్లోకముల రూపములో నున్నది.

''యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ (4-7)

''తే.గీ. ఎప్పు డెప్పు డధర్మంబు ఉప్పతిలుచు
ఇలను ధర్మంబునకు హానిగలుగఁజేయు
అప్పుడప్పుడు నను నేను తప్పకుండ
పరగ సృష్టించు కొందునో పాండుపుత్ర.''

''పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే'' (4-8)

''తే.గీ. సాధుజన రక్షణము మేల్మి సలుపుటకును
ఎలమి దుష్టులనెల్ల మర్దించుటకును
ధర్మ సంస్థాప నార్థమై తప్పకుండ
యుగ యుగమునందు జన్మింతు నుర్వియందు.''

దుర్జనులను శిక్షించి, సుజనులను రక్షించి ధర్మమును నిలబెట్టుటకొరకై ప్రతియుగమునందు తానవతరింతునని లోకులకు రక్షణ హస్తమును చూపి ధర్మపరిరక్షణమే తన యవతారముల పరమ రహస్యమని వక్కాణించియున్నాడు పరమాత్మ. భగవద్గీతయందు మొట్టమొదటి శ్లోకము ''ధర్మక్షేత్రే కురుక్షేత్రే'' అని మొదలవుచున్నది. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమని పేర్కొనుటలోని గర్భితార్థము –

ధర్మా ధర్మములకు మధ్య జరిగిన పోరాటములో అంతిమ విజయము ధర్మమునకే అని ప్రతిపాదించుటకొఱకే. కౌరవులు అధర్మవర్తనులు. పాండవులు ధర్మవర్తనులు. అధర్మము తాత్కాలికముగా జయించినట్లు కన్పడినను, చివరికి గెలుపు ధర్మానికే. శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామానికి సూత్రధారుడై, ధర్మమునకు జయము గలుగునట్లుగాజేసి, లోకమునందు ధర్మ మార్గానుసరణమే విశిష్టమైనదని, అదియే మోక్షదాయకమని చాటినాడు.

"యత్ర యోగీశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయోభూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ" (18-78)

అని మోక్ష సన్న్యాసయోగము. గీతోపదేశమును వినగలిగిన పుణ్యాత్ముడు సంజయుడు ధృతరాష్ట్రునితో పలికిన పలుకులివి:

"తే.గీ. ఎలమి యోగీశ్వరుఁడు కృష్ణుడెచటనుండు
విల్లుదాలిచి యెచ్చట విజయుఁడుండు
అచట శ్రీవిజయ విభూతులలరుచుండు
ధృఢతరమ్మైన నీతియుఁ దేజరిల్లు
ననిదలంతును నేను రాజాధిరాజ !"

యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడెచటనుండునో, గాండీవమును దాల్చిన విజయు డచట నుండును. వీరిరువురుండు పక్షమునకు విజయము తథ్యము. అచ్చట లక్ష్మి, నీతి, ఐశ్వర్యము నెలకొనియుండును.

కృష్ణార్జునులుండినచోట సకల ధర్మములుండును. అనగా ధర్మము నాచరించుట వలన సకల సౌభాగ్యములు సంప్రాప్తించునని గీతోపదేశ సారము.

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాంగతిమ్" (8-13)

అని అక్షరపరబ్రహ్మయోగము.

"తే.గీ. ప్రథిత 'ఓం'కార మేకాక్షరమ్ము బ్రహ్మ
పదము సత ముచ్చరించుచు పరలనన్ను
మది స్మరించుచు దేహమున్ వదలువాఁడు
పొందు నుత్కృష్టమగు మోక్షమును ధ్రువమ్ము."

'ఓమ్' అను అక్షరమును ఉచ్చరించుచు శరీరమును విడుచునట్టివాడు మోక్షమును పొందగలడని దీని భావము. భగవంతుడు 'ఓం'కార స్వరూపుడు.'ఓ' అనునక్షరము సృష్టికర్మ ప్రారంభమును, 'మ్' అనునది 'లయకర్మ'ను సూచించుచున్నది. 'అ'కార, 'ఉ'కార, 'మ'కారములను మూడు అక్షరముల సమ్మేళనమైన 'ఓం'కారము

పరమేశ్వరుని నామములన్నిటికంటెను విశిష్టమైనది. అవినాశనమైనది. ఏకాక్షరమై, లింగ విభక్తి వచన రహితమై, అతి గంభీరమై, సర్వగర్భమైన 'ఓం'కారమునందు బ్రహ్మాండమంతయు నిమిడియున్నది. 'అ'కారము - విరాట్టు, అగ్ని, విశ్వమును, 'ఉ'కారము - వాయువు, తేజస్సు, హిరణ్యగర్భుడు. 'మ' కారము - ఈశ్వరుడు, ఆదిత్యుడు, ప్రాజ్ఞుడు-అను వీటి ప్రతీకలుగా నున్నవి. పవిత్రమైన 'ఓం'కారము ప్రణవ స్వరూపము. 'ప్ర+నవః' - ప్రణవః - పుష్కలమైనట్టి స్తోత్రము ప్రణవము - పంచభూతములు-ఐదు, సత్త్వరజస్తమోగుణములు-మూడు, ఆద్యమయిన ప్రకృతి-ఒకటి, ఈ తొమ్మిదింటికి ప్రతీక ప్రణవము. ప్రణవమే పరమాత్మ స్వరూపము. పరమాత్మ శబ్దవాఖ్యుడు. శబ్ద స్వరూపమైన పరమాత్మయే అక్షరబ్రహ్మము. 'ఓం'యే ప్రణవము. అనగా పైని పేర్కొనబడిన తొమ్మిది యొక్క సమిష్టిరూపము 'ఓం'. ఇట్టి పరబ్రహ్మ స్వరూపముచేత కలిగిన ప్రపంచమంతయు పరమాత్మస్వరూపము.

ప్రణవ స్వరూపుడైన పరమేశ్వరుని ధ్యానించుట ప్రణవధ్యానము. ఇదియే అక్షర పరబ్రహ్మయోగము, మరియు బ్రహ్మయోగము. ప్రణవమంత్రము, అనగా 'ఓం'కారము సమస్త దుఃఖములనుండి, భయములనుండి మనలను తరింపజేయును, కనుక తారణమనబడును, తారణము చేయుటవలన తారకమనబడును. తారకమంత్ర మనగా ఓంకారము, ప్రణవము.

''ప్రణవస్సర్వవేదేషు''- సమస్త వేదములలోను ఓంకారము నేను, గణ్యము పవిత్రమైన ఓంకారమేను.

''వేద్యం పవిత్రమోఙ్కారః''-తెలిసికొనదగినదియు, పవిత్రమైనదియునైన ఓంకారమును నేను. (9-17)

అని భగవద్గీతలో కృష్ణపరమాత్మ సర్వత్ర వ్యాపకమైన 'ఓం'కారమనెడి పరబ్రహ్మ స్వరూపమును గురించి తెలిపియున్నాడు.

ప్రణవము అక్షర పరబ్రహ్మ తత్త్వమును ప్రతిపాదించుచున్నది.

''గిరామస్మ్యేకమక్షరం'' - పలుకులలో ఏకాక్షరమైన ప్రణవమును నేను.

''అక్షరాణామకారోస్మి'' - ''కనుగ నక్షరములలో ఆకార మేను'' (10-33) అక్షరములలో ఆదియగు అకారమును నేను'' అని విభూతియోగములో చెప్పియున్నాడు. మనస్సును స్థిరముగా నిలుపుకొని ప్రణవమంత్రమును పఠించినవాడు పవిత్రుడగునని, దైవసన్నిధి చేరుకొనగలడని గీతాప్రవచనము.

గీతాపారాయణము చివరగాని, ప్రార్థన పూర్తియైన పిమ్మటగాని ''ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః'' అని ముమ్మారు ఉచ్చరించుట ''ఓమనసా ! శాంతిని బొందుము. ప్రశాంతముగా ఉందుము'' అని మన మనస్సుకు మనము చేసుకొను ప్రబోధము.

మొదటిసారి కొంచెము శబ్దముతో నుచ్చరించి, రెండవసారి తక్కువ శబ్దముతో, మూడవసారి మెల్లగా 'శాంతి' అను పదము నుచ్చరించుటవలన మన ఉచ్ఛ్వాస నిశ్వాసములలో నొక క్రమబద్ధత యేర్పడుచున్నది. స్వరపేటికలోనుండి గాలి ఊపిరితిత్తులలోనికి ప్రవేశించి, మరల వెలుపలికి వచ్చుట-రక్తశుద్ధి కలుగుట-వైద్య శాస్త్రములో ఆరోగ్యరీత్యా కూడా ఇది మంచిదిగా నెంచబడినది. అక్షరములకంతటి మహిమగలదని చాటినాడు పరమాత్మ.

''అహమేవాక్షయః కాలోధాతాఽహం విశ్వముతోముఖః'' అని విభూతి యోగము.

''గణ్యమయి నాశమెఱుఁగని కాలమేను
సర్వతోముఖ బ్రహ్మనేన్ సవ్యసాచి'' (10-33)

-నేనే అనంతకాల స్వరూపుడను, మోక్షము నిచ్చు బ్రహ్మను-అని శ్రీ భగవాన్ ఉవాచ. భగవంతుడు అనంతమైన, అక్షయమైన కాల స్వరూపుడు. కాలము పరిణామ శీలమైనది. కాలచక్రము నిరంతరము పరిభ్రమించుచుండును. తదనుగుణముగా, సృష్టికూడ పరిణామము చెందుచుండును. మనమున్నను లేకపోయినను కాలగమనము మాత్రము నిరంతరమైనది. ఈ అనంతమైన కాలములో మనిషియొక్క ఆయుర్దాయం అత్యంత అల్పమైనది. జ్ఞానజీవి యనబడు మానవుడు అనంతమైన కాలమహిమను గుర్తించి, సదా దైవచింతనమునందు కాలమును సద్వినియోగము చేసుకొనుమనియే పరమాత్మ హితబోధ.

''రాత్రితెగుదలన్ దినమేల రాకయుండు
దినము తెగుదల రాత్రియే తేరకున్నె
పరగ సుఖదుఃఖములు కాలపర్యయమున
నెందు మనుజుల పొందక యేలయుండు''

అని ఒక ప్రసిద్ధ సుభాషితము. రాత్రి తరువాత పగలు, పగటికి పిమ్మట రాత్రి మరల మరల వచ్చుచుండును. ఇది కాలధర్మం. అట్లే సుఖము, దుఃఖము మారిమారి వచ్చుట సృష్టి ధర్మము. ''కష్ట సుఖములు కావడికుండలు'' అను పెద్దల మాటను స్మరించుకొనుచు, సుఖము కలిగినప్పుడు ఎక్కువ పొంగిపోక, కష్టములు వచ్చినపుడు పూర్తిగా క్రుంగిపోక కాలము గడుపవలెను. ఎంతటి సుఖ సంతోషములనైనను భరించగల శక్తి మనస్సునకున్నది. కాని కొద్దిపాటి కష్టమునైనను, శోకమునైనను సహించుటకు మనస్సునకు బలము చాలదు. వేదనలో మనము చేయవలసిన పనులనుగూర్చి ఆలోచించుటకైనను ధైర్యము చాలదు. ఇటువంటి సమయములలో దుఃఖము నెదుర్కొనుటకు కావలసిన ధైర్యమును, మనోబలమును ఇచ్చు శక్తి భగవద్గీతకు గలదనుట నిజము.

మన మనస్సునకు మనము చేసుకొనునట్టి ప్రబోధము-అనగా ఆత్మ ప్రబోధము- Self suggestion - Self instruction - Auto Suggestion వంటిది గీతాప్రబోధము. మానవుడు ఏయే సమయములలో, ఏయే విధములుగా ప్రవర్తించవలెనో, ఏవేవి చేయదగినవి, ఏవేవి చేయకూడనివి - అనెడి విధి నిషేధములను గురించి తాత్త్విక దృష్టితో బోధించుచున్నది గీతాశాస్త్రము. ఇందు పరమాత్మ స్పృశించని విషయము లేదనవచ్చును. ఇది ఏ కాలమునకైనను, ఎవరికైనను, ఏ సందర్భమునందైనను అన్వయించుకొనదగినది. జీవితాన్ని సక్రమముగా గడపుటకు ప్రయోజనకారిగానున్న గీతాశాస్త్రమును - తత్త్వశాస్త్రము - జీవితశాస్త్రము అని పేర్కొనినను అతిశయోక్తికానేరదు. ఇది ఒక్క హిందూ మతమునకు మాత్రమే చెందిన శాస్త్రము అనుటకంటె, Behavioural Science అని నేడు పిలువబడుచున్న Psychology - 'మనస్తత్వశాస్త్రము'. మఱియు తత్త్వశాస్త్రము Philosophy ఈరెండు శాస్త్రముల సమ్మేళనము; సకల మత ప్రబోధముల సారమే భగవద్గీత యని చెప్పదగియున్నది.

గీతోపదేశ స్మరణఫలము పరమానందము. పరమానందమే పరబ్రహ్మ స్వరూపము. పరమాత్మ సన్నిధిని చేర్చి మోక్షమునిచ్చు మహిమగలది గీత. గీతాసారమును గ్రహించి మానవుడు భగవచ్చింతనవంటి సద్గుణముల నలవరచుకొని కాలమును సద్వినియోగము చేసుకొనవలెను.

''కావ్యశాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్ ।
వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేనచ ॥

అను నీతి శ్లోకమునందు బుద్ధిమంతులు, మూర్ఖులు ఎట్లు తమ కాలమును గడుపుకొందురో అను వ్యత్యాసము తెలుపబడినది. - అనగా బుద్ధిమంతులు. ఎల్లప్పుడు కావ్యములు, శాస్త్రములలోని విషయములను గూర్చి చర్చించుకొనుచు సత్కాలక్షేపము చేయుచుందురు. మూర్ఖులు ఎల్లప్పుడు అలసతతో సమయా సమయములెంచక నిద్రలో కాలము గడవుచుందురు. తాము చెప్పినది, చేయునది మాత్రమే సరియైనదనుచు, ''తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లని'' వాదించుచుందురు. తమ వితండ వాదములతో ఇతరులను కలహములకు ప్రేరేపించుచుందురు. ఇటువంటి మూర్ఖులకు సైతము హితమును బోధించునట్లుగానున్నవి గీతాంతర్గత శ్లోకములు కొన్ని. వాటిలో శ్రీ సుబ్రహ్మణ్యంగారు తెనిగించినవి అతి సులభమైన మాటలలో నందరికి అర్థమగు రీతిలో నున్నవి:

''అమిత భోజనునకు నిరాహారునకు
అధిక నిద్రాభిలాషున కరయనిద్ర
బొత్తిగా లేనివానికిఁ బొలుపుమీర
కలుగ దిల యోగ సంసిద్ధి ఖండితముగ'' (6-16)

-అని ఆత్మసంయమయోగము. తిండిపోతునకు, పస్తులుండువానికి, ఎల్లప్పుడు నిద్రించునట్టి సోమరికి, ఎప్పుడునూ నిద్రలేమితో బాధపడువానికి యోగము లభ్యముకాదు. అట్లుగాక ఆహారవిహారములు, నిద్ర, జాగరణ విషయములలో నియమమునననుసరించి నడచుకొనువానికి మాత్రమే యోగసిద్ధి లభించగలదని ఆరోగ్యసూత్రములను కూడా గీతలో ప్రతిపాదించి చెప్పియున్నాడు పరమాత్మ.

''సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చల తత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః ॥''

-అని భగవత్ శ్రీ శంకరాచార్యుల ఉపదేశము. జ్ఞానులైన సజ్జనులతోడి వాసము వలన ఈ లోకపువాంఛలమీద ఆశ తగ్గిపోవును. దానివలన అజ్ఞాన మూలకమైన మోహము నశించును. తరువాత నిశ్చలమైన పరిశుద్ధతత్త్వము తెలుసుకొనగలము. అది మోక్షమును కలిగించును, సాధుసాంగత్యమువంటి మంచి గుణముల నలవరచుకొనుమని సకల శాస్త్రములు, మతములు ఉద్బోధించుచున్నవి.

భగవద్గీతలో పరమాత్మగావించిన ప్రబోధము ఒక్క అర్జునుడికి మాత్రమే అని మన మనుకొనరాదు. ఈ ప్రబోధము మనకందరికిని హితబోధ. భగవద్గీతకంతటికి బీజప్రాయమైన శ్లోకములలో ముఖ్యమైన 'పరిత్రాణాయ సాధూనాం' (4-8), 'యదాయదాహి ధర్మస్యగ్లానిర్భవతి' (4-7), 'అనన్యాశ్చింతయంతోమాం' (9-22), 'సర్వధర్మాన్ పరిత్యజ్య' (18-66) 'కర్మణ్యేవాధికారస్తే' (2-47) మున్నగు శ్లోకములకు శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారు ఆంధ్రానువాదమును గావించినవిధము సరళముగాను, సుబోధకముగాను ఉన్నది.

''శ్రవణమ్ కీర్తనమ్ విష్ణోఃస్మరణమ్ పాదసేవనమ్ ।
అర్చనమ్ వన్దనమ్ దాస్యమ్ సఖ్యమాత్మ నివేదనమ్ ॥''

-అని భాగవత గ్రంథము నవవిధ భక్తి మార్గములను పేర్కొనచున్నది.

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమ''ని చాటుచున్నది పోతన ''శ్రీమదాంధ్ర భాగవతము'' (సప్తమస్కంధము 167వ పద్యము.) భగవంతుని మహిమలనుగూర్చి వినుట, స్తుతించి కీర్తించుట, స్మరించుట, పాదసేవ, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము మరియు ఆత్మనివేదనము-అను తొమ్మిది భక్తిమార్గములు. ఈశ్వరునియందు సర్వకర్మలను అర్పణము గావించి, ఆ పరమాత్మ స్మరణమునందును, భజనకీర్తనలందును తన్మయతనుజెందుట భక్తియని నారదమహాముని వాక్యము. పరీక్షిత్తు మహారాజు మహాభారత భాగవత పుణ్య కథలను విని తరించినాడు. భగవత్సంకీర్తనలతో పరవశించి

పరమగతి నందినవాడు నారద మహాముని. సదా వందనములతో పరమాత్మ నర్చించి ముక్తినొందినవాడు అక్రూరుడు. హనుమంతునిది దాసభక్తి. లక్ష్మణుడు శ్రీరామచంద్రుని నిరంతర పాదసేవలో ముక్తినొందినాడు. బలిచక్రవర్తి వామనావతారుడైన సర్వేశ్వరునికి ఆత్మనివేదము గావించుకొని పరమపదమునొందినాడు. అర్జుననిది సఖ్యభక్తి. 'నర నారాయణు'లనుమాట నేటికిని లోకప్రసిద్ధిగదా ! అర్జునుడు తనకెంతేని యిష్టుడైన సఖుడను విషయమును సాక్షాత్ పరమాత్మయే యిట్లు పేర్కొనినాడు:

"నీవు నాకెంతొ యిష్టుడైనావు గాన
అతి రహస్యమై శ్రేష్ఠమైనట్టినాదు
పరమహిత వాక్యమును నేను మరల మరల
ప్రేమతోఁ బల్కెదను శ్రద్ధవినుము పార్థ !"

అత్యంత రహస్యమైన తత్త్వమును మరల నతనికి బోధింతునని యిట్లు చెప్పినాడు:

"చిత్తమెప్పుడు నాయందె చేర్చి భక్తి
నన్నె ధ్యానించుచును మేల్మి నన్నె మ్రొక్కు
మర్జునా ! నన్నె పొందంగ నౌను నీకు
ఇది యదార్థము సత్యమో యిష్టసఖుడ" (18-65)

పరమేశ్వరునే శరణుపొంది కర్మము నాచరించుటవలన పురుషార్థము లభించగలదు. గీతాశాస్త్రమును వినుటకు అర్హత కలిగినవాడు అర్జునుడని యెంచినవాడు కనుక అతనికే దానిని తెలిపినాడు పరమాత్మ.

"భక్తిశద్ధలు లేనట్టి వారలకును
గురుల శుశ్రూష సలుపని కూళలకును
తపము విడి నన్ను నిందించు కృపణులకును
చెప్పఁబడలేదు నీకె నేఁ జెప్పితినిది." (18-67)

ఇట్లు చెప్పుటలో శాస్త్రోపదేశ సంప్రదాయము-ఉపదేశార్హత రెండును సూచింపబడుట తెలుసుకొనదగిన విషయము.

నవవిధ భక్తిమార్గాలలో శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారు అనుసరించిన మార్గము స్మరణము-విష్ణోః స్మరణమ్-గీతోపదేశ స్మరణము - శ్రీకృష్ణపరమాత్మ దివ్యసందేశ సంస్మరణము. శ్రీభగవానుని దివ్యవాణిని స్మరించి, స్మరించి, తేట తేట తెలుగు మాటలనెడి మంచి మల్లెలను సమకూర్చి, తేటగీతి పద్యాల సుమమాలలను కూర్చి, పరమాత్మను అర్చించి, తన జన్మను సార్థకము గావించుకొనగలిగిన ధన్యజీవి శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారు.

**Dr. D. CHINNI KRISHNAIAH,** M.A., M.Litt., Ph.D.
(Formerly Prof. & Head, of Dept. of Telugu,
Presidency College)

*Residence :*
7, Thanikachalam Pillai Street,
Triplicane, Chennai-600 006.
✆ 854 9406

# చలి చెలమ

**"ఏకం శాస్త్రం, దేవకీపుత్ర గీతం; ఏకో దేవః, దేవకీపుత్ర ఏవ;**
**ఏకో మంత్రః, తస్య నామాని యాని; కర్మా ప్యేకం, తస్య దేవస్య సేవా."**

-ఇది వల్లభాచార్యుల వినుతి. 'దేవకీపుత్రుని ఆ ఒక గీతయే శాస్త్రం; ఆ దేవకీ పుత్రుడు ఒక్కడే దైవం; ఆ కృష్ణ నామోచ్చారణం ఒక్కటే మహామంత్రం; ఆ మహాదేవుని సేవ ఒక్కటే మహిత కర్మానుష్ఠానం'- అని ఈ శ్లోకానికి తాత్పర్యం. *'ఏకం సత్'* అన్నదానికి ఆ ఆచార్యుల వివృతి ఇది.

**"వివిక్తో యేన తత్త్వేన, మిశ్రో ప్రకృతి పూరుషౌ,**
**తం వందే పరమానందం, నంద నందన మీశ్వరమ్."**

'ప్రకృతినీ పురుషునీ విభజించినదీ, ఆ తత్త్వద్వయాన్ని కలిపి తానై నిలిచినదీ (వివిక్తంగా, సంయుక్తంగా) పరమానంద కారణుడై, ఈశ్వరుడైన ఆ నందనందనుడే'- ఇత్యాదిగా, 5 శ్లోకాల్లో, గీతాకృష్ణుల మహిమను జేగీయమానం చేసినవారు శ్రీధరస్వామిగారు.

*'కృష్ణా త్పరం కి మపి తత్త్వ మహం న జానే'* అనే ప్రమాణ వాక్యం అతి ప్రచురం. గీతానుగ్రహం కృష్ణావతార పరమ ప్రయోజనం.

*'వైష్ణవీయ తంత్రసారం'*లో (సూత శౌనక సంవాదం), స్కాందంలో (కృష్ణార్జున సంవాదం), వరాహపురాణంలో (శ్రీభూ విష్ణుసంవాదం) గీతామాహాత్మ్యం–చిర విశ్రుతం, సుప్రతిష్ఠితం. అలాగే శ్రీ మహాభారత గీతా మాహాత్మ్య ప్రవచనంలోని మరో సుశ్లోకం :

**"గీతా, గంగాచ, గాయత్రీ, గోవిం దేతి హృది స్థితే,**
**చతు ర్గకార సంయుక్తే, పున ర్జన్మ న విద్యతే."**

గంగ, గాయత్రి, గీత, గోవింద- అనే నాలుగూ 'గ'కారాది శబ్దాలు. ఇవి ఎదలో మెదిలేవారికి పునర్జన్మ లేదని భావం. జన్మ రాహిత్యాన్ని ఆశించడమే భారతీయ తాత్త్విక సంస్కృతికి పరమావధి. గీతా కృష్ణుల అవినాభావ సంబంధమే మహాభారత తాత్పర్య పరమార్థం.

మనకు, రామాయణం ధర్మాలయం; భారతం కర్మాలయం; భాగవతం రసాలయం. ఈ మూడూ హృదయ త్రికోణ బిందువులు. ఇందులో, మొదటిది కావ్యం; రెండవది ఇతిహాసం; మూడవది పరమ భాగవతుల పురాణం. వేద సముపబృంహణం వీటిలో నిర్దిష్ట లక్ష్యం కాబట్టి ఒక్కొక్కటీ పంచమ వేదమే. పురాణేతిహాసాల్లో హృదయ స్థాన సదృశ సన్నివేశా లుంటాయి. **మహాభారతానికి హృదయం భగవద్గీత.**

'గీత' అన్న ఉత్తరపదంతో, ప్రాచీనకాలంలో ఏది సంగ్రథితమైనా-అది ఆధ్యాత్మిక తత్త్వవిషయకం; ప్రశ్నోత్తర రూపకం.

భగవద్గీత ఆరంభంలో తొలి సమాసం **'ధర్మక్షేత్రే'** అన్నది; అంతంలో మలి పదాలు **'మతిః మమ'** అన్నవి. **'మమ-ధర్మ'** అన్నది సారాంశం. ఇక, గీత ధృతరాష్ట్రునితో మొదలు; సంజయునితో ముక్తాయింపు. ఒకడు జనుషాంధుడు (పుట్టుగ్రుడ్డి); మరొకడు దివ్యదర్శనలోలుడు. చీకటిని సంజయించుటే చిన్మాత్రం-అనడం పిండితార్థం.

'నరుని' తమో గుణం, నారాయణుని సత్త్వగుణంతో క్షాళితం. (*తామ్యత అనేన ఇతి తమః, తత్ మోహ బీజం; సతో భావః సత్త్వం, తత్ జ్ఞాన హేతు.*) మోహ హేతువుకు జ్ఞానహేతువే నిర్వాపణ మార్గం. జీవితం కురుక్షేత్రం; అందులో అర్జునుని వంటివాడే విషాదాత్ముడు కాక తప్పలేదు; ఈ విషాద యోగంనుండి, మోక్ష సన్న్యాస యోగం దాకా, అష్టాదశ సోపానా లున్నాయి-గీతలో. ఏ సోపానం వద్ద జీవుడు ఆగిపోతాడో చెప్పలేము.

జీవునికి **'షడూర్మి'** (*షట్ ఉర్మయః అస్య*) అని ఒక పేరు. క్షుత్ పిపాసలు, జరా మరణములు, శోక మోహములు-అన్నవి జతలు జతలుగా ఆరు ఊర్ములు. ఒకటి మరొకదానికి దారితీసేది. ఆకలి దప్పులవల్ల దేహం పెరిగి ముసలితనం, మరణం అన్న రెంటికి కారణం అవుతుంది; ఈ రెంటి కారణంగా నిరంతర శోకమూ, మోహమూ ప్రబల మౌతూ ఉంటుంది. ఈ ఆరింటిని జయించడమే జీవికి ముక్తియోగం. వీటి పరిణామదశలే గీతలో అధ్యాయాలు. 'నరుని' విషాదంతో ఆరంభమైన అధ్యాయం, 'నారాయణుని' మోక్షదర్శన ప్రయోగంతో అంత మౌతుంది. **"మోక్షయిష్యామి, మా శుచః"** (18-66) అని స్వామి ప్రతిజ్ఞ.

అసలు, అష్టాదశ పర్వ భారతమే ఈ ఉర్మి షట్కానికి ప్రతీక. ఆదిపంచకంలో క్షుత్ పిపాసలు; యుద్ధషట్కంలో జరా మరణాలు; శాంతిసప్తకంలో శోకమోహాలు. వీటి విస్తరం, భారత కథలో క్రమ పరిణామ దశలు-స్థూలంగా. గీతలో ఇవి విభిన్న యోగాలు. గీతాహృదయం భారత శరీరానికి చైతన్య స్థానకం. 'నర' జీవాత్ముని శోక మోహ జ్వాలలకు, అమృత వర్షోపశమన స్థిరోపదేశం నారాయణ పరమాత్ముని గీతోపదేశం.

గీతను చదివి, పిదప, భారతకథను మళ్లీ పఠిస్తే మన అవగాహన, నవోన్మేషణం కాగలదు. భారతంలో ఎక్కడిది ఈ గీత అనే వెఱ్ఱివాదం తొలగిపోతుంది. భారతసారం గీత; గీతావిస్తరణం భార తేతివృత్తం.

మన మతాచార్యులు గీతాహృదయాన్ని విశ్లేషించారు. దశోపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు-ప్రస్థాన త్రయంగా ప్రకీర్తితాలు. ఇందులో మొదటిది ఆర్షం, అపౌరుషేయం. తక్కిన రెంటినీ మనకు అందజేసినవారు వ్యాసులవారు. భగవద్గీతలో ధర్మజిజ్ఞాస; బ్రహ్మసూత్రాల్లో బ్రహ్మజిజ్ఞాస; ఒకటి పూర్వ మీమాంస; రెండవది ఉత్తర మీమాంస. ఈ రహస్యం నిర్దేశించడానికే మన ఆదికవి నన్నయ, భారతప్రశంస చేసిన తొలి సీసంలో-

'*ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, అధ్యాత్మవిదులు వేదాంత మనియు*' అని క్రమపరచినారు. తిక్కనగారు ధర్మబ్రహ్మముల సారిష్ఠమును '**ధర్మాద్వైతస్థితి**'గా వాచ్యం చేశారు-తమ భారత ప్రసక్తిలో.

తెలుగులో వందలకొలదిగా, భారతీయ భాషల్లో వేలకొలదిగా గీతకు అనువాదాలు, వ్యాఖ్యలూ వెలువడడంలో ఆశ్చర్యపడనక్కరలేదు. నీరుకొలది తామరగా, పుటస్థలీ పీయూషంగా భాషాంతరీకరణాలు జరిగాయి. వస్తుగౌరవం ఒక కృతి విస్తృతికి కారణం. రామాయణ మహిమను ప్రసన్నరాఘవ కర్త ఇలా కీర్తించారు:

**"స్వ సూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం,**
**కవీనాం కో దోషః ? నతు గుణగణానాం అవగుణః."**

ఇలాగే, అనర్ఘరాఘవ కర్తకూడా అభిభాషించారు :

**"స్ఫురత్ వాగ్బ్రహ్మాణం కథ ముపకరిష్యంతి కవయః?"**

రామాయణ రస రామణీయకాలు, గీతాపారమ్యం విశ్వసాహిత్యంలో విశిష్ట రచనలుగా విఖ్యాతాలు.

**'భగవద్గీతా కించిత్ అధీతా, గంగా జల లవ కణికా పీతా'** అన్నారు శంకర భగవత్పాదులు.

ఈ గంగాజలకణ పవిత్రపానం చేసిన ధన్యుల్లో విద్వాన్ శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యం గారు అదృష్టవంతులు. మన తత్త్వ దాహాన్ని చల్లార్చగలిగే రీతిగా, ఈ శతాబ్దం చివరి నెలల్లో వారి అనువాదం ప్రకటిస్తున్నారు. ఇది ఎన్నాళ్ల పరిశ్రమమో చెప్పలేను. మూలగీత అధృష్యమూ, అభిగమ్యమూను. అది మహాసాగర సదృశం; ప్రస్తుత అనువాదం **చలిచెలమ.** చిత్తమునకు చల్లదన మిచ్చే తీయ నీరిది; అఱచేతి కనుగుణంగా ఆస్వాదింపదగిన తీర్థ మిది. భావక్లేశం కానీ, గహన వాదాలు కానీ కానరావు ఇందులో. '*విబుధవరులవలన విన్నంత, కన్నంత, తెలియవచ్చినంత*' తేటపఱచుట కవి తలపు. **'తేటగీతి'** అన్న

తప్పింపరాని విషయమని తెలిసికూడ వానికై ఇంతగా విచారించుట తగదు సుమా !

**శ్లో. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ! ।**
**అవ్యక్తనిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28**

*తే.గీ. ఆది నవ్యక్తమైనట్టి దౌచునుండి*
*వ్యక్తమైనట్టి మధ్యమం బౌచు వెలిగి*
*అరయ నవ్యక్త నిధనమైనట్టి దైన*
*ఈ శరీరముంగూర్చి నీ కేల చింత ?*

**తాత్పర్యము :-** అర్జునా ! ఈ ప్రాణులు మధ్యలో మాత్రమే అగపడును. వీనికి 'ఆది' యేమో, 'అంత్య' మేమో తెలియదు. ఈ ప్రాణులస్థితి ఇటువంటిదని తెలిసికూడ దీనికై ఇంతగా విచారించుట తగదు.

**శ్లో. ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి శ్రుత్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**

*తే.గీ. అద్భుతం బని యొకఁ డాత్మ నరసి వినును*
*అద్భుతం బంచు నొక్క డీయాత్మఁ బల్కు*
*అద్భుతం బంచు మరియొక్కఁ డాత్మఁ జూచు*
*ఆత్మతత్త్వమ్ము నొక్కండు నరయ లేడు.*

**తాత్పర్యము :-** ఈ ఆత్మనుగూర్చి పలువురు పలు విధములుగా చెప్పుచున్నారు. కొందఱు దీనిని ఆశ్చర్యకరముగా చూచుదురు, మఱికొందఱు అబ్బురపడి విందురు. మరి కొందఱు వింతగా చెప్పుచుందురు. కాని, వాస్తవముగా ఎవ్వరు ఆత్మ స్వరూపమును గూర్చి ఎఱిగినవారు లేరు.

**శ్లో. దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ! ।**
**తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30**

*తే.గీ. జగతి వెలుగొందు నీ దేహ సముదయమున*
*వరలుచుండెడి యాత్మ యవధ్య మగును*
*నిత్యమును నౌను; -కాన యనిత్యమైన*
*ప్రాణులను గూర్చి వగవంగ వలదు విజయ !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! దేహము లన్నియు నశించినను ఆత్మ మాత్రము నాశనము లేనిదై శాశ్వతముగా నుండును. అస్థిరములైన ఈ దేహములను గుఱించి నీవు విచారించుట తగదు.

**శ్లో. స్వధర్మ మపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31**

*తే.గీ. అవనిలోన స్వధర్మమ్ము నరసిచూడ*
*తల్లడిల్లంగ మది నీకు తగదు పార్థ !*
*క్షత్రియున కెన్న ధర్మ సంగరము కంటె*
*ధరణిలోపల శ్రేయఃపథమ్ము గలదె ?*

**తాత్పర్యము :-** అర్జునా ! మరియొక కారణముచేత కూడ నీవు విచారించుట తగదు. నీవు క్షత్రియోచితమైన స్వధర్మమును కొంచెము ఆలోచించవలెను. స్వధర్మమైన ధర్మయుద్ధము చేయుటకంటె మరియొక శ్రేయోమార్గము క్షత్రియునికి లేదు సుమా !

**శ్లో. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ ! లభన్తే యుద్ధ మీదృశమ్ ॥ 32**

*తే.గీ. తెఱచిన ద్వారముల నొప్పు దివ్యలోక*
*మప్రయత్నముగా లభ్యమైన యుద్ధ*
*మది లభించిన రాజులే యధిక ధన్యు*
*లర్జునా ! ధర్మ సూక్ష్మమ్ము నరయు మెలమి.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ఈ లోకములో ఏ మహారాజులకు తలచని విధముగా అయాచితముగా యుద్ధము చేయు అవకాశము కలుగునో, అట్టివారి భాగ్యమే భాగ్యము. అప్రయత్నముగా లభించిన యుద్ధము తెఱచి యుంచినట్టి స్వర్గద్వారము సుమా !

**శ్లో. అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తత స్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33**



# అమూల్య వరప్రసాదం

## డా॥ పి.బి. శ్రీనివాస్

"సినీ ప్లేబాక్ సింగర్,

పొయెట్ & మ్యూజిక్ డైరెక్టర్"

ఈ సద్గ్రంథం, దివ్య శ్రీ మద్భగవద్గీతకి బహు సరళానువాదం. కష్టప్రద క్లిష్టానువాదాలకి, అపవాదం. ప్రఖ్యాత సుకవీంద్రులు శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారి శేముషీ ప్రతిభకి గల ఈవి వలన భక్తిరసజ్ఞ లోకానికి అందిన అనర్ఘరత్నం. పాఠక లోకానికి, అమూల్య వరప్రసాదం. శ్రీ ఈ.వి.ఎస్. ఇదివఱలో కొన్ని గ్రంథాలను ప్రచురించినా అన్నిటిలో ప్రస్తుత రచన మకుటాయమానం. ప్రత్యేక దైవానుగ్రహ సంపన్నం.

ఈ గ్రంథ రచనకై, కవిగారు ఎన్నుకొన్న ఛందస్సుని బట్టియే వారి అనమానప్రజ్ఞ విదితమౌతున్నది. తేట తెనుగు భాషకి తేటగీతి ఒక సముజ్జ్వలాభరణం. సారళ్యం దాని ప్రథమ సంకేతం. పద్యపు నడకలోనే లభిస్తుంది లయబద్ధమైన సంగీతం. సామాన్య మానవులకైనా అందుబాటులో వుండి, సులభంగా అన్వయింపబడ గలిగే శ్రవణ సుభగశైలి శ్రీ సుబ్రహ్మణ్య కవి కంఠీరవులది. తన అనువాదానికి, ఆయన తేటగీతి నెన్నుకొన్న రీతిగానే, ఏతత్కావ్య రచనకై శ్రీ కృష్ణభగవానుడు ఈ.వి.ఎస్. గారి నెన్నుకొన్నాడు. ఈ రచనలో పాండితీ ప్రకర్షకై ఎంత మాత్రమూ ప్రయత్నం జరగలేదు. మూలభావ విపుల విమల విశదీకరణకై మాత్రమే, కవి ఆమూలాగ్రం శ్రద్ధవహించి, తమ ధ్యేయాన్ని సాధించి, ప్రశంసార్హులై, కృతకృత్యులైనారు. కవితాభిలాషులందరికీ, ఈ శ్లోక పద్యానువాదం నిస్సందేహంగా నిరుపమానమైన ఉత్తమ బహుమానం. సంగీత ప్రియులందరికీ ఇది పురాతన శైలిలోనే నవ విధాన **"గీతాగానం"**.

శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారి రసవత్తర శైలికి కొన్ని ఉదాహరణలు :

మట్టికాశించి వీరల మట్టిగలుప
నిచ్ఛగింపను త్రిభువనాలే వచ్చుగాక ॥ 1-35

రక్తసిక్తాన్న భోగ సంప్రాప్తిపడయు
కంటె భిక్షాన్నమైన మేల్గాదె చెపుమ ॥ 2-5

నింగియును నేల గాలియు నిప్పు నీరు
బుద్ధి మనసు నహంకారమును ననంగ
అష్ట విధముల నామాయ యలరుచుండు 7-4

సంస్మరణలచేఁ గల్గు సంస్కారబలిమి 8-6

దేనిఁజేసిన దేనిని దినినఁగాని
దేని వ్రేల్చిన మఱి దేని దానమిడిన
దేనికిఁ దపంబొనర్చిన దానినెల్ల
నాకె యర్పింపు మోయర్జునా ! సతమ్ము 9-27

అలర నవిభక్తమయ్యు భూతాళియందు
తగ విభక్తమట్లొప్పి, భూతములనెల్ల
పుట్టఁగా జేసి పోషించి గిట్టఁజేసి
పరగఁ బుట్టించు సత్పర బ్రహ్మమిద్ది ॥ 13-17

కనఁగ, నేననుభావ మెవ్వనికి లేదొ
కర్మఫలముల నాసక్తి గాంచఁడెవఁడొ
జగతి నాతడీ జనులను జంపిగూడ
బద్ధుడునుగాడు చంపినవాడుఁ గాడు ॥ 18-17

బుద్ధిహీనున కాత్మయే బద్ధవైరి 6-5
మాన మవమానములును సమానమౌను ॥ 6-7

ఈ.వి.ఎస్.గారి ఈ భగవద్గీతానువాదంలో, విశిష్ట వైశిష్ట్యం ఇది నిర్వచన పద్యగ్రంథమై విలసిల్లడం. మూలంలోని వచన భాగాలను గూడా వీరు పద్యరూపంలో ప్రసాదించారు.

గ్రంథమంతటా, తేటగీతి పద్యం విశ్వరూపమెత్తడం, విశిష్టతర వైశిష్ట్యం. తేటగీతిని, నేను 'తేటిగీతి' అని మార్చి సంబోధిస్తూ కొన్ని రచనలను కావించాను.

'తేటి' అంటే 'భ్రమరం' అనగా 'తుమ్మెద' అని అర్థం. కనుక, తేటిగీతినే సంస్కృతపరంగా 'భ్రమరగీతం'గా మనం భావించుకొనవచ్చును.

భక్తిరసం "తేట" తేనెవంటిది. ఆ "తేటతేనె"యైన భక్తిని, భక్తుల హృదయ పద్మాలనుండి గ్రహించి, ఆస్వాదించి, ఆనందించి, ప్రసన్నుడై వరప్రదుడగు భగవంతుడు. "తేటి" అనగా 'భ్రమరుడే'. కావున భక్తిరస ప్రధానమైన 'భగవద్గీత'ని అనువదించిన మన కవి "తేటగీతి"తో యావద్గ్రంథాన్నీ నడిపించడం ఎంతైనా సముచితం, సమంజసం అని నా వినీతాభిప్రాయం. ఒక్క ముక్కలో వక్కాణించాలంటే, సుకవి శ్రీ సుబ్రహ్మణ్యం ఎంతటి మంచి మనిషి అనిపించుకుంటున్నారో, అంతటికెన్నో యింతలుగా మహామనీషి, పండితకవి. వీరినుండి యిటువంటి ఉత్తమ రచనలు మున్ముందు తామరతంపరలుగా రూపొంది, కవితాప్రియుల డెందాలని అలరింపజేస్తూ వుండాలని మనఃపూర్వకంగా, ఆకాంక్షిస్తున్నాను.

విషయ వాసనామగ్న మానసమైన నేటి కాలంలో, ఇటువంటి భక్తిరసమయ రచన కావించాలనే సత్సంకల్పం కలగడం, అనేక పూర్వజన్మ సంచిత పుణ్యఫలం. తత్సత్సంకల్పాన్ని, కార్యరూపంలోని కనువదించి, నిజ పునీత లక్ష్యసిద్ధిని సాధించిన శ్రీ ఈ.వి.ఎస్. ఎంతైనా అభినందనీయులు, సన్మానార్హులు, కృతజ్ఞతాభివందన సహస్ర యోగ్యులు, గృహస్థాశ్రమస్థ వైరాగ్యధనాఢ్యులు. విద్వజ్జనమాన్య వైదుష్య నిధులు.

శ్రీ ఈ.వి.ఎస్. నాకు చిరకాలంగా ఆప్తమిత్రులు. సంతత హితైషులు. వారు తమ వ్రాతప్రతులను తెచ్చి యిచ్చి, చదివి, ముందుమాట వ్రాయగోరినప్పుడు, నేను పొందిన ఆనందాశ్చర్యాలు వర్ణనాతీతాలు. అందుకు నే నసర్హుడననే ఆలోచన సైతం రాకపోలేదు. కాని నన్నెంతైనా, అభిమానించి విశ్వసించిన వారి ప్రేమాదేశాన్ని కాదనలేకపోయాను. కొన్ని నెలల వఱకు, ఈ ప్రాచీనాధునాతన గీతను పఠించేందుకు తగినంత సమయం చిక్కలేదు. తుదకొకనాడు సంపూర్ణంగా చదివి తీరాలనే దీక్షబూని, పట్టుబట్టి, కొన్ని గంటల లోపుననే, ఆద్యంతం అధ్యయనం చేసి తరించాను. ఇట్టి అపూర్వావకాశాన్ని నాకు సమకూఱజేసిన స్నేహశిరోమణి, మిత్రనిభమిత్రులు శ్రీ సుబ్రహ్మణ్యం గారికి, నా అగణిత నమ స్సుమస్సులు. ఎట్టి అనువాదకులకైనా, మూలగ్రంథంలోని కొన్ని పదజాలాలని యథాతథంగా స్వీకరించడం అనివార్య విషయం. అయినా ఆవశ్యకమైనప్పుడు అలాచేసినా, శ్రీ ఈ.వి.ఎస్. తమ అనువాద నిర్వహణలో సాధ్యమైనంతవఱకు నిజసులభగ్రాహ్య సరళశైలినే ప్రయోగించి, సర్వజనాధ్యయనస్ఫూర్తి ప్రద సుగమ మార్గాన్ని మలచుకొని అనుసరించారు. లక్ష్యశుద్ధినీ, నిరూపించుకున్నారు.

చదువుతున్నంతసేపూ, చదువరుల ఆసక్తి, ఆగని ప్రవాహంలాగ, సాగ గలిగే రీతిగా, భావ కథనా విధానం అవలంభించబడింది. సుబ్రహ్మణ్యంగారి కలం హలమై, అతి పురాతన భక్తి కావ్యక్షేత్రంలో నూతనానందోత్సాహప్రదమైన నిరవద్య హృద్యపద్యాల పంటపండించి, భక్తజనాళి కందించింది. అక్షరాక్షర కనక కలశాలలో సుధారసం నింపి, ఎల్లెడలా చిందించింది. ఆ భక్తి సుధారసాన్ని ఆస్వాదిస్తూ, నిత్యాధ్యయనం సాగిస్తూ, జనులెల్ల సజ్జనులై, తగు సమయాన, పరిణత వైరాగ్య సంపన్నులై, సార్థకజన్ములై, భవసాగరంలో, భగవానుడే నావికుడై నడిపే జీవన నౌకపై, నిర్భయంగా పయనించి, సుడిగుండాలన్నింటినీ అవలీలగా దాటి, దరిజేరి, శ్రీకృష్ణ పరమాత్మానుగ్రహసిద్ధిబొంది, మోక్షధామాన్ని చేరగలరని ఆశిస్తున్నాను. పూనికతో ఇట్టి భవ్య దివ్య కావ్య రచన కావించి, ధన్యజీవనులైన మిత్రవరేణ్యులు, శ్రీ సుబ్రహ్మణ్యంగారిని అభినందిస్తున్నాను. భక్తజనవత్సలుడైన తారక కృష్ణుడు కరుణాభిరాముడై శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారికీ, వారి కుటుంబ సభ్యులందరికీ, బంధుమిత్ర పరివారాలకీ, సర్వదా, సర్వథా, శుభప్రదుడై, ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిగా ఆశీర్వదిస్తూ యశస్సామ్రాజ్యాన్ని విస్తరింపజేస్తూ, పరిరక్షిస్తూ వుండాలని ప్రార్థిస్తున్నాను. తథాస్తు !

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !!

సర్వసన్మంగళానిసన్తు !



సరస్వతీ సత్పుత్ర, కవితా గంగోత్రి
సహస్రావధాన సంస్థాపనాచార్య
ఆచార్య డాక్టర్ మేడసాని మోహన్
డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్టు
తిరుమల-తిరుపతి దేవస్థానాలు, తిరుపతి.

బ్రహ్మవిద్యను నేర్చుకోవడం అంత సులభం కాదు. మనవారు ఏదైనా ఒక విషయాన్ని నేర్చుకునేటప్పుడు అదేమైనా బ్రహ్మవిద్యా ? అని అంటూ ఉంటారు. ఈ వాక్యాన్నిబట్టి తెలిసేదేమనగా బ్రహ్మవిద్య చాలా కష్టమైందని. బ్రహ్మవిద్యనుగూర్చి తెలుసుకోవాలనుకుంటే వేదాలను, ఉపనిషత్తులను, బ్రహ్మ సూత్రాలను చదువవలసి ఉంటుంది. ఇవి కఠినాతి కఠినాలు. వాటిని చదువాలంటే ఏండ్లు బూండ్లు పట్టుతాయి. పైగా ఈ రోజుల్లో వాటిని చదువాలన్నా కష్టమే. సంప్రదాయపద్ధతి ప్రకారం వాటిని చెప్పేవారు కూడా అరుదే. పైగా వీటిని చదువాలంటే తప్పక చదువాలి. సంస్కృతాన్ని చదువడానికి అవసరమైన పాఠశాలలు అంతటా లేవు. సంస్కృత పాఠశాలలు అక్కడక్కడా ఉన్నా అవి అందరికీ అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితులలో బ్రహ్మవిద్యను నేర్చుకోవడం ఎలా? అనే ప్రశ్నకు సమాధానంగా శ్రీమద్భగవద్గీత మన ముందుకు నిలబడుతూ ఉంది.''సూక్ష్మంలో మోక్షం'' అనే సూత్రాన్ని బలపరుస్తూ ఉంది ఈ గ్రంథం.

బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, శ్రీమద్భగవద్గీత ఈ మూడింటికీ ప్రస్థానత్రయం అని పేరు. మొదటి రెండింటిని చదివి అర్థం చేసుకోవడానికి ఎంతో సమయం పడుతుంది. ఇప్పటికిప్పుడు వేదాంతాన్ని చదివి అర్థం చేసుకోవాలంటే శ్రీమద్భగవద్గీత తప్ప మరో సులభమైన గ్రంథం లేదు మానవులకు. ప్రస్థానత్రయంలో ఇది చివరి గ్రంథమేయైనా ఎంతో ప్రభావోత్పాదకమైంది. "Last But not Least" అనే ఆంగ్ల సామెతను అక్షరాలా నిజం చేస్తుంది గ్రంథం. వేదాలసారం ఉపనిషత్తులు, ఉపనిషత్తుల సారం శ్రీమద్భగవద్గీత.

గీత మోక్షదాయిని. గీత మన గీతను మారుస్తుంది. గీతను పూర్తిగా చదివినట్లయితే జనన మరణాలు లేవు. గీతాఫలం బ్రహ్మసాక్షాత్కారం. గీతయొక్క మహిమను వరాహపురాణం ఇలా తెలియజేస్తూ ఉంది.

గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ ॥
ద్వ్యౌత్రీనేకం తదర్థవా శ్లోకానాం యః పఠేన్నరః ॥
చంద్రలోకమవాప్నోతి వర్షాణామయుతః శతమ్ ॥

వ.పు.గీ.మ. 15, 16

శ్రీ మద్భగవద్గీతలో 10, 7, 5, 4, 3, 2, 1, ½ శ్లోకం చదివినా వాడు చంద్రలోకం చేరి 10 వేల సం॥లు నిశ్చింతగా ఉండగలడు. పారాయణ సమయంలో చచ్చిపోయినట్లయితే తిరిగి వాడు మానవునిగానే జన్మిస్తాడు. గీతాధ్యయనం చేసినవానికి పునర్జన్మ లేదని, పరమపదాన్ని పొందవచ్చునని వరాహపురాణం తెలియజేస్తూ ఉంది.

శ్రీ మద్భగవద్గీతలో ఇంత మహత్వం ఉంది గాబట్టే మహర్షి శ్రీ శ్రీ శ్రీ మలయాళ యతీంద్రులు గీతకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చినారు. ముక్కుపచ్చలారని ముద్దు బాలురు మొదలుకొని నేడో రేపో కాటికి పోయే ముదుసళ్ళవరకు భగవద్గీతను నేర్పినారు. వేదాంతాన్ని ప్రచారం చేయడానికి గీతను వారు ఒక ఆయుధంగా చేసుకున్నారు. శ్రీ శ్రీ శ్రీ స్వాములవారు ఆంధ్రదేశపు నాలుగు చెఱగులా గీతాయజ్ఞాలను చేయించినారు. అందరినోళ్ళల్లో గీతా శ్లోకాలు నానునట్లు చేసినారు. శ్రీ వ్యాసాశ్రమంలో, ఆశ్రమానుబంధ ఆశ్రమాలలో, ఆశ్రమ భక్తుల ఇళ్ళలో నిత్యం గీతా పఠనం జరుగునట్లు కట్టుదిట్టం చేసినారు. వారు వేలకొలది గీతా సప్తాహాలను ఏర్పాటుచేసినారు. ఒక్క మాటలో చెప్పాలంటే గీతామాతను ఆంధ్ర ప్రదేశంలోని ఇంటి ఇంటికీ తీసికొనిపోయి వారిని పునీతులను చేసినారు.

ఇలాంటి పరమ పవిత్రమైన గ్రంథానికి తెలుగులో అనేక వ్యాఖ్యానాలు అనువాదాలు ఉన్నాయి. కొందరు కొన్ని భాగాలను కొన్ని అధ్యాయాలను మాత్రమే అనువదించినారు. అయితే ఆ అనువాదాలంతా ఒక ఎత్తు. ఈ గ్రంథానువాదకర్త శ్రీ E.V. సుబ్రహ్మణ్యంగారి అనువాదం మరొక ఎత్తు. వీరు మొత్తం భగవద్గీతనంతా తేటగీత, తేటగీతిక పద్యాలలో అనువదించి ఆంధ్రులకు ఎంతో మేలు చేకూర్చినారు. తెలుగు తేటగీతాలలో శ్రీ మద్భగవద్గీతలోని 18 అధ్యాయాలను అనువాదం చేయడం ఈ కవియొక్క ప్రత్యేకత. శ్లోకాలకు అనువాదమే కాకుండా వాటికి భావాలను వ్రాసి విశేషాంశాలను పొందుపరచడం కూడా జరిగింది. ఈ ప్రకారంగా సామాన్యంగా చదువరులకు సామాన్య పౌరులకు కూడా అర్థమౌనట్లు అనువాదం చేయడం రచయిత నైపుణ్యం. ఎంతో ప్రయత్నంతో వ్రాసిన వీరి అనువాద పద్యాలను, అందలి గొప్పదనాన్ని, వాటిలోని మాధుర్యాన్ని, సారళ్యాన్ని కొంత తెలుసుకుందాం

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ! ॥ భ.గీ. 1-1

పై శ్లోకం శ్రీ మద్భగవద్గీతలోని మొదటి శ్లోకం. దీనికి తేటగీతికలో ఇలా అనువాదం కొనసాగింది.

పరమ పావనమైన యీ భరతభూమి
ధర్మ సుక్షేత్రమై కీర్తిదనరునట్టి
క్షాత్రవోత్తేజ సత్కురుక్షేత్రమందు
వీరపూజార్థులౌ నాకుమారవరులు
పాండవులు జేసిరేమి నిష్పక్షపాత !

నిష్పక్షపాత, పరమపావనమైన, క్షాత్రవోత్తేజ, సత్కురుక్షేత్ర అనే పదాలను వేసి అనువాదానికి వన్నె చేకూర్చినారు. ఇకపోతే ఇదే అధ్యాయంలో కౌరవులపై యుద్ధం చేయవలసి వచ్చిందే అని ఆ దృశ్యాన్ని ఊహించుకొన్నప్పుడు అర్జునునిలో గలిగిన శారీరక వికారం ఎలా ఉందో దానికి కవిగారి తెలుగు అనువాదం ఎలా ఉందో తెలుసుకుందాం.

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ భ.గీ. 1-30

కరముజారెడి నాచేతి గాండివమ్ము
మంటలెత్తెడి నామేన, మనసులోన
భ్రాంతి నటియించుచున్నది రథముపైన
నిలువలేకుంటి, మెయిస్వేద జలమునిండె.

ఈ అనువాదంలో ఎలాంటి కృత్రిమత్వం లేక సహజత కొట్టవచ్చినట్లు కనబడుతూ ఉంది.

ఆత్మకు నాశము లేదు అని సాంఖ్యయోగంలో చెప్పబడిన శ్లోకాలకు అనువాద గీతాలు ఇలా ఉన్నాయి.

ఆయుధాళికి ఖండింప నలవిగాదు
అనలునకు గూడ గాల్పంగ నలవిగాదు
నీరములుగూడ తడుపంగ నేరబోవు
ఆత్మనెండింప మారుతుడైన తగదు.

నిత్యమును సర్వగతమును నిశ్చలమును
అచలము సనాతనంబును నైనయాత్మ
నరుకబడ దెండ దరయంగ నానబోదు
అగ్ని దహియింపగా బడదయ్య పార్థ !

చక్షురాదులకైన గోచరముగాక
తనర కర్మేంద్రియముల కర్థమ్ముగాక

మనసునకు(గూడ కానుపించనిదియైన
ఆత్మ తత్వమ్ము నెఱిగి దుఃఖాళి విడుము.

ఈ పద్యాలు అనువాదకర్త అనువాదనైపుణ్యాన్ని లెస్సగా స్పష్టీకరిస్తూ ఉన్నాయి.

ఈ సాంఖ్యయోగంలోనే (శ్రీ మద్భగవద్గీతలో) స్థితప్రజ్ఞలక్షణాలు 20 శ్లోకాలలో చెప్పబడ్డాయి. అందులో రెండు శ్లోకాల అనువాదాలను పరిశీలిస్తాం.

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థమనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ భ.గీ. 2.55

అనిన నరుజూచి మాధవుడనియె పార్థ !
మనసునందలి సకల కామముల నరు(డు
విడువగలిగిన యప్పుడే వెలయు నాత్మ
యందె యాత్మచే మోదంబు నందుచుండు
సుస్థితప్రజ్ఞు డన(బడు చూవె భువిని.

దుఃఖేష్వనుద్విగ్నమనా స్సు ఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ భ.గీ. 2.56

దుఃఖముల చింత సుఖములందునను వాంఛ
క్రోధభయరాగములకు లోకువయ్యునైన
గుణములేనట్టి మౌని నిక్కువముగాగ
సుస్థిత ప్రజ్ఞు(డన(బడు చూవె భువిని.

అష్టమాధ్యాయంలోని ఉత్తరాయణ దక్షిణాయనాలను గూర్చి వర్ణించిన శ్లోకాలకు కవిచేసిన అనువాదం చాలా సహజంగా ఉంది. ఆ అనువాదం కొనసాగిన విధానం ఇలా ఉంది.

అగ్నిర్జ్యోతిరహశ్శుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బహ్మ విదోజనాః భ.గీ. 8-24

అగ్నియును జ్యోతి ఉత్తరాయణము(బగలు
శుక్లపక్షము నే పరిశుద్ధమార్గ
మందు(గలదొ యా మార్గమ్మునందు( జనిన
బ్రహ్మవిదులు పొంద(గలరు బ్రహ్మపదము.

ధూమో రాత్రిస్తథా కృష్ణ షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ భ.గీ. 8.25

కనగ రాత్రియు కృష్ణపక్షమును దక్షి
ణాయనంబును ధూమంబు నరయనెందు
గలవొ యా మార్గమున మృతిఁగనిన యోగి
చంద్రసంబంధ తేజంబుఁ జాలబొంది
మరల జనియించు పార్థ ! యుర్వరను నిజము.

ఇకపోతే ద్వాదశాధ్యాయంలో ఎలాంటి భక్తుడు భగవంతునికి ఇష్టమైనవాడు అను శ్లోకాలకు చెందిన అనువాద పద్యాలను గమనిస్తే కవిగారి గొప్పదనం మనకు తేటతెల్లమవుతుంది. ఆ అనువాద పద్యాలెలా ఉన్నాయో పరిశీలిస్తాం.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ ॥ భ.గీ. 12.13

సకల భూతంబులందు ద్వేషంబు విడిచి
కరుణయును మిత్రభావంబుఁ గలిగియుండి
అహము విడిచియు నోరుపు నరసిపూని
సుఖము దుఃఖము సమములంచును దలంచి

సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్తస్సమే ప్రియః ॥భ.గీ.12-14

నిత్య సంతోషమున్ మనో నిగ్రహమును
దృఢతరమ్మైన జ్ఞానమెంతే ఘటించి
బుద్ధియున్ మది నాయందె పొందుపరచి
వెలయు యోగి యెవండొ నా ప్రియుఁడతండె.

ఈ ప్రకారం శ్రీ E.V. సుబ్రహ్మణ్యంగారు చదువరులను దృష్టిలో ఉంచుకొని శ్రీమద్భగవద్గీతను అనువదించి తెలుగు ప్రజలకు ఎనలేని సేవచేసి ఉన్నారు. వీరుచేసిన కృషి ప్రశంసనీయం. వీరికృషికి తగిన ప్రోత్సాహాన్ని అందజేయడం అశేషాంధ్ర ప్రజల కర్తవ్యం. శ్రీ సుబ్రహ్మణ్యంగారు మున్ముందు కూడా ఇంకా ఎన్నో సంస్కృత ఆధ్యాత్మిక గ్రంథాలకు అనువాదాలు వ్రాసి తెలుగు ప్రజలకు ఎంతో తోడ్పడాలని ఆశిస్తున్నాను.

# అభినందనం



**వి. రామచంద్ర చౌదరి,** M.A., Ph.D.,
Ret. Professor and Head
Department of Telugu
University of Madras.

"ధర్మ సంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే"

అన్నది భగవద్వాక్యం. సమగ్రమైన ఐశ్వర్యం, జ్ఞానం, వైరాగ్యం, కీర్తి, మహత్త్వం, వీర్యం అనే ఆఱు గుణాలకు 'భగము'-అని పేరు. ఈ ఆఱుగుణాలు సమగ్రంగా ఉన్నవాడు కాబట్టే శ్రీకృష్ణుడు భగవంతుడయ్యాడు. యుగ యుగాల్లో అవతరించి అధర్మాన్ని రూపుమాపగలనని తనకు తానై చాటుకొన్నాడు. తన జీవితకాలంలోనే అద్భుత శక్తులను సాధించి, పురుషోత్తముడుగా, మానవాతీత వ్యక్తిగా, జగచ్చానక శక్తిగా రూపొంది, భగవత్తత్త్వానికి ప్రతీకగా వెలుగొందాడు. అటువంటి మహనీయునికి ఆ కాలంలో అందఱికంటె సన్నిహితుడు అర్జునుడు. కృష్ణుడికీ అర్జునుడికీ మధ్య అనేకవిధాలైన బంధాలున్నా, వారిరువుర మధ్యగల గురుశిష్యానుబంధమే వారి వ్యక్తిత్వాలను పరకోటి ముట్టించి భగవంతుడుగా శ్రీకృష్ణుణ్ణి, పరమ వీరుడుగా అర్జునుణ్ణి రూపొందించింది. వారిరువుర అనుబంధానికి కురుక్షేత్రం ఫలక్షేత్రం. భగవద్గీత పరమోద్గాత.

అర్జునుడి శిష్యత్వంవల్ల శ్రీకృష్ణుని గురుత్వం, శ్రీకృష్ణుని గురుత్వంవల్ల అర్జునుడి శిష్యత్వం పరమ విశుద్ధమై భాసించాయి.

"కర్మణ్యేవాధికారస్తే
మా ఫలేషు కదాచన"

– అని బోధించినవాడు గురువైతే, ఆ బోధన ననుసరించి తన ధర్మాన్ని తాను నెఱవేర్చిన శిష్యుడై అర్జునుడు కర్మవీరుడుగా రూపొందాడు. ఈ కర్మాచరణమే విశిష్టమైన మానవధర్మం. ఆయా మానవులు మానవతాదృష్టిప్రధానసూత్రంగా తమ తమ నేర్మిని పురస్కరించుకొని కర్మాచరణశీలురు కావడమే ధర్మనిర్వహణం. అది మానవజాతి పారమార్థిక చింతనకు, సిద్ధికి రాచబాట. అందుకే ఈ ధర్మాచరణం హృదయస్థానంగా భగవద్గీత సర్వోపనిషత్సారంగా రూపొంది ప్రస్థానత్రయంలో ఒకటిగా విలసిల్లుతున్నది.

కర్మాచరణ రూపమైన ఈ ధర్మోపదేశాన్ని భగవంతుడు చేసింది కేవలం అర్జునునికి ఒక్కనికే కాదు; ప్రజలందరికీ. అందుకే సూత్రప్రాయంగా ఆనాడు యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు అర్జునునికి చేసిన కర్మరూప ధర్మోపదేశం వ్యాఖ్యానప్రాయమైన పదునెనిమిది అధ్యాయాల భగవద్గీతగా పెరిగింది. ఈ పెంపంతా ప్రజలకొఱకే. ఈ పద్దెనిమిది అధ్యాయాలూ ఆనాడు శ్రీకృష్ణుడు అర్జునునికి యుద్ధ భూమిలో బోధించినవే అనడం అనుచితం, అసంబద్ధం అవుతుంది. పద్దెనిమిది అధ్యాయాలలోని విషయాన్ని పొందుపరుస్తూ సారభూతమైన కొన్ని వాక్యాలతో అర్జునుణ్ణి పురికొల్పుకొని యుద్ధభూమికి కొనితెచ్చాడనడమే సమంజసం. ఆ విధంగా విస్తృతికి పాల్పడిన భగవద్గీతలో కొన్ని ప్రక్షిప్తాలుండటానికి అవకాశముంది. ఉన్నవికూడా.

ఉదాహరణకు – ''చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః'' – అన్న మాటలు శ్రీకృష్ణుడు అనదగినవి కావు. ఎందుకంటే దేశానికి ఒక భగవంతుడు, జాతికి ఒక భగవంతుడూ ఉండడు గనుక! అన్ని దేశాల్లోను చాతుర్వర్ణ్యం లేదు గనుక! భగవంతుడే అయిన శ్రీకృష్ణుడు యాదవకులంలో పుట్టనవసరంలేదు గనుక ! ఒకవేళ కర్మానుబద్ధుడై అతడు యాదవకులంలో పుట్టాడనుకొంటే, అప్పట్ల తన్ను తాను యాదవకులంలో పుట్టించుకొన్న భగవంతుడు అతడు కాలేదు గనుక! ఇటువంటి కొన్ని నెఱసులవల్ల భగవద్గీత కూడా విద్యాధికుల ఆక్షేపణలకు గుఱికావడం జరిగింది. ఈ నెఱసులటుండగా, ధర్మాచరణానికి, సబంధించినంతవఱకూ గీతోపదేశం అంగీకార్యమే అవుతుంది. ధర్మోపదేష్టగా శ్రీకృష్ణుడు, తదాచరణ దక్షుడుగా అర్జునుడు లోకానికి ఆదర్శప్రాయులై భాసిస్తారు.

ఇటువంటి భగవద్గీతను తెలుగులోనికి తెచ్చినవారు అనేకులున్నారు. వారిలో కవితారచన చేసినవారూ కొందఱున్నారు. ఆ కొందఱిలో విద్వాన్ శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారు ముఖ్యులనే చెప్పాలి. భగవద్గీతలో అందంగా, సూత్రప్రాయంగా, సరళంగా చెప్పబడిన అనేక గొప్ప విషయాలను అంతే సూత్రప్రాయంగా, సరళంగా, అందంగా తెలుగులో తేటగీతల్లో చెప్పారు సుబ్రహ్మణ్యంగారు. ఇంత సరళమైన శైలిలో క్లిష్టమైన తాత్త్విక విషయాలను చెప్పడం కష్టం. పెద్ద పద్యాల్లో కఠిన పదాలతో చెప్పడం సులభం. ఎన్నడో శ్రీ బచ్చు. పాపయ్యశ్రేష్ఠిగారు తేటగీతల్లో రూపొందించిన భగవద్గీత ఆంధ్రీకరణం తరువాత సుబ్రహ్మణ్యంగారి ఈ ఆంధ్రీకరణమే శ్రేష్ఠమైనది. ముప్పది సంవత్సరాలు తపించి ఆయన చేసినదీ ఆంధ్రీకరణం. ఈ కార్యాన్ని కవి భుక్తికోసం కాక ముక్తికోసం చేయడంలో ఆయన మనఃపరిణతి మనకు గోచరిస్తుంది. శైలిలో ఆయన సాధించిన సౌలభ్యం ఆయన గీతా వాక్యాలను జీర్ణం చేసికొన్న విధానాన్ని ప్రదర్శిస్తుంది. కవితా రచనలో కవి సాధించిన అందచందాలు ఆయనకున్న భాషాధికారాన్నీ, కవితా తత్త్వ వేత్తృతనూ చాటుతున్నవి. సంస్కృత శ్లోకమూ, తెలుగు పద్యమూ ప్రక్క ప్రక్కనే ఉండడంవల్ల, తెలుగులో తాత్పర్యంకూడా వ్రాయడంవల్ల

సహృదయులు మఱింత సులభంగా, సమగ్రంగా, అర్థగ్రహణం చేయగల అవకాశాన్ని శ్రీ సుబ్రహ్మణ్యంగారు తమ రచనలో కల్పించారు. స్థాలీపులాకంగానైనా సుబ్రహ్మణ్యంగారి పద్యాలు రెండు, మూడు ఉదాహరించడం అవసరమనుకొంటాను:

1. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥

భీష్మ రక్షితమౌ మన వీరబల మ –
పారమైనది గాన నీ పరిమితమగు
వాయుపుత్రాభిరక్షిత బలము లేమి
లెక్క మనకింక? ముక్కలు ముక్కలె గద !

2. కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥

కశ్మలమ్మైన యపకీర్తికరము నైన
భవ్యమౌనట్టి స్వర్గ సంప్రాప్తి జెఱచు
పామర జనార్హమౌ నిట్టి పాడుగుణము
ఏల గలిగెను నీ కిప్పు డిచట విజయ !

3. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతు ర్భూ ర్మాతే సఙ్గోఽస్త్వ కర్మణి ॥

కర్మమును జేయుటకె యధికారి వీవు
కర్మఫలముల కధికారిగావు సుమ్ము,
కర్మఫల కారణుండును గాక నీవు
కర్మములు జేయ నాసక్తి గలిగియుండు.

ఈ గ్రంథంలోని అన్ని పద్యాలూ పాకానపడ్డవే. అభిరుచి ఉన్నవారికీ, రుచి తెలిసినవారికీ స్థాలీపులాకాలు రెండూ వశంలోనే ఉన్నవి కద ! సుదీర్ఘకాలం తాను చేసిన సాహితీ తపఃఫలితంగా శ్రీ సుబ్రహ్మణ్యంగారు తెలుగుచేసిన భగవద్గీత ఆంధ్రావళికి మోదకారణమౌతుందనీ, తెలుగుజాతి తాత్త్వికదృష్టికి మఱింత దోహదకారి అవుతుందనీ ఆశిస్తున్నాను. భగవద్గీతను ఇంత విశిష్టంగా ఆంధ్రీకరించి, ఆంధ్ర సోదరుల కందించిన శ్రీ సుబ్రహ్మణ్యంగారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఆయన చేసిన సాహితీ తపస్సు జనన మరణాదులైన సంసార దురితాలను అధిగమించగల భాగ్యాన్ని ఆయనకు ప్రసాదించగలదని ఆశిస్తున్నాను.

చెన్నపురి

**–వి. రామచంద్ర చౌదరి**

# నివేదన

**శిరోమణి సముద్రాల లక్ష్మణయ్య**
కార్యదర్శి, ధర్మప్రచార పరిషత్
తి.తి. దేవస్థానములు
తిరుపతి.

సమస్త వేదార్థసారంగా భగవద్గీత పేరెన్నికగన్నది. ఇందులో పదునెనిమిది యోగాలు వివరించబడ్డాయి. అందులో ప్రధానమైనవి – కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగాలు.

నిష్కామ కర్మవలన చిత్తశుద్ధి, భక్తివలన ఏకాగ్రత, బ్రహ్మవిజ్ఞానంవలన మోక్షము సిద్ధిస్తాయి. ఆత్యంతిక దుఃఖనివృత్తిని, పరమానంద ప్రాప్తినీ కలిగించే స్థితినే మోక్షమంటారు.

వేదాల అంతిమ భాగాలయిన ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలనూ అధ్యయనం చేయడం క్లేశావహం. ఆ గ్రంథాలలోని విషయాలనే సంగ్రహంగా ప్రతిపాదిస్తున్న భగవద్గీతను పఠించడం చాలా సులభమైన పని. అందుకే 'గీతా సుగీతా కర్తవ్యాకిమన్యైః శాస్త్రవిస్తరైః' అని చెప్పారు.

అట్టి భగవద్గీతకు ఎన్నో భాష్యాలు, వివరణలు వెలువడినాయి. అనేక భాషలలో గీతకు పద్య, గద్యరూపాలైన అనువాదాలు వచ్చినాయి.

విద్వాన్ శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యంగారు గీతకు తేటగీతలలో అనువాదం రచించారు. మూలశ్లోకం, అనువాద పద్యం, తాత్పర్యం, అవసరమైనచోట విశేషార్థమన్న నాలుగు అంశాలు ఈ గ్రంథంలో పొందుపరచబడ్డాయి. అనువాదరచన సరళంగా, సుందరంగా సాగిపోయింది. అనుష్టుప్ శ్లోకాలను తేటగీతలలో అనువదించడంవల్ల అనువాదం ముక్తసరిగా అవసరమైనంత విషయంతో మాత్రమే సాగింది. అందువల్ల ఈ గ్రంథం పాఠకులకు మిక్కిలి ఉపయోగపడగలదనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఈ గ్రంథ గౌరవాన్ని గుర్తించి తిరుమల–తిరుపతి దేవస్థానంవారు కూడ దీని ప్రచురణకు ఆర్థిక సహాయం అందజేశారు. ఇది బహుళవ్యాప్తిని పొందగలదని ఆశిస్తున్నాను.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః



## పణతుల రామేశ్వర శర్మ

పుంగనూరు,
చిత్తూరు జిల్లా.

పూజ్యులు, పెద్దలు, కవిపండితులు, పండితకవులు, సహృదయులు, సౌమ్యగుణోపేతులైన శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్య మహోదయులు సర్వోపనిషత్సార బృంహితమైన గీతా శాస్త్రమును తేనె సోనలవంటి 'తేటగీతల'లో అనువదించి, ఆంధ్రభారతిని కవితా కుసుమాలతో అలంకరించారు.

నాపై వీరికి పుత్రవాత్సల్యముండుటతో ఈ పద్యములకు భావములు వ్రాయు గురుతరబాధ్యతను నా కప్పగించినారు. నిజముగ నాకంత అర్హత లేకున్నను వారిమాట శిరోధార్యముగా భావించి ఇది శ్రీకృష్ణపరమాత్మ ప్రసాదముగా యథాశక్తి వ్రాసి, వారికి సమర్పించినాను. భక్తజనులు సహకరింపగా ఆ శ్రీనివాసుని కృపాకటాక్షములతో ఈ పరమ పవిత్ర గ్రంథము వెలుగునకు వచ్చి వారి చిరకాల వాంఛ, జీవిత లక్ష్యము నెఱవేరుగాతమని నా హృదయపూర్వకమైన ఆకాంక్ష.

శ్రీ ఈ.వి.యస్. గారు నిరంతరం సరస్వతీ సమారాధన తత్పరులు. కవిత్వమే ఊపిరిగా జీవిక సాగించుచున్న మహితమూర్తులు. వీరు జగద్గురువులైన శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతుల అనుగ్రహమునకు నోచుకొన్న అదృష్టవంతులు. ప్రస్తుతము జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మ యొక్క-

పరిపూర్ణానుగ్రహ భాగ్యవిశేషమునందుటకై, తన్మూలముగా జీవితమును చరితార్థమొనర్చుకొనుటకై ఈ పావన రచనము గావించినారు. ఇందలి కవిత పవిత్ర గంగా ప్రవాహమువలె తేటయైనది.

'గీతా గంగా చ గాయత్రీ గోవింద ఇతి హృదిస్థితే' అన్నట్లు ఈ నాల్గు గకారములును మోక్షప్రదములు. అట్టివానిలో మొట్టమొదటనున్న గీతామాతృ పాద పద్మములు శరణు వేడిన వీరి జన్మ నిజముగా ధన్యతమము అనుటలో అతిశయోక్తి లేదు.

వీరు మదరాసు తెలుగు అభ్యుదయ సమాజమునకు మూలస్తంభముగా లెక్కలేనన్ని సంగీత, సాహిత్య సభలు నిర్వహించుటేకాక, 'అవధాని పితామహ' డా॥ సి.వి. సుబ్బన్న శతావధానిగారు;

'అవధాని చక్రవర్తి', 'సరస్వతీ సత్పుత్ర' 'సహస్రావధాన సంస్థాపనాచార్య' డా॥ మేడసాని మోహన్‌గారు వంటి ఉద్దండ సాహితీ మూర్తులచే దిగ్విజయముగా అవధాన సభలు నిర్వహించి, సమ్మానించుటయే కాక,

ఆధ్యాత్మిక విద్యాజగత్ గురువులు శ్రీ శ్రీ శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతులను స్వయముగా రప్పించి, వారి అమూల్యాశీస్సులను పొందగల్గిన ఈ 'వృద్ధకవి' దంపతులకు, వారి చిరంజీవులు రామకృష్ణ (అమెరికా), చి॥ గిరి (సౌదీ అరేబియా) వారి వారి చిరంజీవులకు ఆ శ్రీకృష్ణ పరమాత్మ కృపాకటాక్ష భాగ్యము నిరంతరము లభించుగాత ! మనిహోర్ణమైన ఆకాంక్ష.

# ప్రశంసా రత్నహారము



ఉమ్మిటి వీరభద్రం
31, బసవయ్య వీధి,
ప్రాత చాకలిపేట,
చెన్నై-600 021.

మిత్రుఁడు శ్రీ ఈ.వి. సుబ్రహ్మణ్యము వ్రాయఁదలపెట్టి వ్రాసి ముగించిన మహత్కావ్యము భగవానుడైన శ్రీ కృష్ణ పరమాత్మ నోటినుండి వెలువడినట్టి శ్రీ. మద్భగవద్గీతకు ఆంధ్రపద్యానువాదము.

తేట తెలుగున తీయ్యనైన తేటగీతి పద్యములతో అనువాదము సాగినది. సామాన్య జనులకు గూడా సుబోధకమై ఇది విలసిల్లగల దనుటలో అతిశయోక్తి లేదు. పుణ్యమూర్తియైన రచయిత పూర్వజన్మ సుకృత ఫలితమే ఈ సద్గ్రంథము. ఈ.వి. సుబ్రహ్మణ్యముగారి శ్రీ మదాంధ్ర భగవద్గీత పదునెనిమిది అధ్యాయములను చదివి సంపూర్ణముగ ఆనందించితిని. ఇందలి కవితా లాలస్యము మొక్కవోని అనువాదము. చదువ-చదువ మనోజ్ఞమై విలసిల్లుచున్నది. ఇందు అనేక పద్యములు నా కమితానందమును గూర్చినవి. మచ్చునకు కొన్నింటిని ఉదహరించుచున్నాను.

అధ్యాయము : (6-41) అరయఁగా యోగభ్రష్టుఁడైనట్టి వాఁడు
పుణ్యలోకమ్ముఁ బొంది సమ్మోదముగను
చాలకాలమ్ము నివసించి జగతిలోన
వర సదాచార సంపన్నవరుల యింట
జన్మముంగాచి సుఖియించు సవ్యసాచి !

అధ్యాయము : (6-42) అటులఁగాకున్న ధీమంతులైన యట్టి
యోగుల కులంబునందుఁ దా నుద్భవించు
ఇట్టి జన్మంబు లోకమందెంచి చూడ
దుర్లభంబగు నర్జునా ! దుర్లభంబు.

అధ్యాయము : (6-45) పట్టుదలతో ప్రయత్నతాపరుడు నగుచు
పాపరహితుండునై జన్మ పావనుఁడయి
జన్మ జన్మాంతరాభ్యాస శక్తి యోగ
సిద్ధిఁగొని దివ్యమౌ మోక్ష సిద్ధిఁగాంచు.

అధ్యాయము : (8-5) మరణకాలంబునను నన్నె స్మరణజేసి
తన శరీరంబు విడుచు నాతండు నాదు
భావమునె పొందు సందేహ పడగవలదు
దివ్య శస్త్రాస్త్ర తేజ ! కుంతీ సుపుత్ర !

అధ్యాయము : (8-19) భూత సముదాయ మది భువిన్ పుట్టి పుట్టి
లీనమగుచుండు రాత్రి రాగానె, మఱల
ప్రభవమొందుచునుండును పగలురాగ
ప్రాణులవి యెల్ల నస్వతంత్రమ్ములగుట.

అధ్యాయము : (11-29) మిడుత లన్నియుఁ గదువడి మృతినిజెంద
ప్రజ్వలించెడి వహ్నిలోఁ బడెడు రీతి
సకల జనులును తమదు నాశంబుఁగోరి
వ్రాలుచున్నారు వడి నీదు వదనములను.

సన్మిత్రుడైన శ్రీ ఈ. వి. సుబ్రహ్మణ్యముగారికి ప్రశంసాపద్యములను కంఠాలంకృత రత్నహారముగా సమర్పించుకొనుచున్నాను.

తే.గీ. శ్రీలువిలసిల్లు శృంగార సీమయైన
'ఆరణి'ని నొప్పు యారాశివారి యింట
జనన మొందిన మిత్రమా ! ఘన యశస్వి !
పండితార్యుల మెప్పులు వడసి వరలు
నిన్ను నేమని కొనియాడుదన్న ! యన్న !

ఉ. తెల్లముగాదదెల్లరకు తేటగ సంస్కృత "గీత" భావముల్
అల్లన తెల్గుజేసి ప్రతి ఆంధ్రుని నోటను బల్కురీతిగన్
ఉల్లములుల్లసిల్ల బుధు లొప్పెడు రీతిని ముద్దు ముద్దుగన్
సల్లలితంబుగా రచన సల్పితి విమ్మగ సత్కవీశ ! శ్రీ
వల్లభు డేలుగాక నిను వత్సలతన్ భువినెల్ల కాలమున్

తే.గీ. నీదు గ్రంథంబు చదివితి మోదమలర
పద్య పద్యంబునను చవుల్ పల్లవింప
పండితార్యుల మెప్పులు పరిమళింప
నొప్పియున్నది మిత్రమా యున్నతముగఁ

తే.గీ. నీవెలార్చిన "గీత"కు నిక్కముగను
యశము గలుగును సర్వదా యవనియందు
గ్రంధకర్తగ నీకును కవులలోను
స్థానమమరును మిత్రమా ! సముచితముగ.

కం. భగవద్గీతను తెనుగున
అగణితముగ ననువదించి హరికథప్రియుడై
సుగతికి నోచిన సత్కవి !
ద్విగుణిత సత్కీర్తి నీకు విలసిల్లు భువిన్

తే.గీ. పెక్కు రచనలు జేసిన విబుధవర్య
కృతుల నన్నింట మకుటమై కీర్తిగనిన
యట్టి సద్గ్రంథమా ''గీత'' నమితభక్తి
వరల నాంధ్రీకరించితి సరళముగను
తెలుగు కవులందు నీకీర్తి స్థిరత వెలయు.

# సదభిప్రాయం

ప్రపంచములో వెలువడిన గ్రంథము లన్నిటిలోను, ఉత్కృష్టమైనది, ఉత్తమ ప్రబోధాత్మకమైన గ్రంథము "భగవద్గీత". దీనికి సాటియైన గ్రంథము ఏ భాషలోను, ఏ మతంలోను లేదనిన అతిశయోక్తి కాదు.

మానవులు తమ దైనందిన చర్యలలో ఏ మార్గాన్ని అనుసరించితే, సుఖము, శాంతి లభించగలదో అట్టి సులభ సూత్రములను బోధించునది "భగవద్గీత"

వ్యాస విరచితమైన భగవద్గీతను, ఎందరో పండితులు అనేక భాషలలో అనువదించి యున్నారు.

భగవద్గీతలో నిగూఢమైన భావములను, పండితులేగాక, సామాన్యులు కూడ చదివి, వాటిని గ్రహించి ఆచరించినప్పుడు రచయిత కృత కృత్యుడౌను.

పై చెప్పిన ఆశయము నెఱవేరవలెనన్న సదుద్దేశంతో సంస్కృతములో నున్న శ్లోకములను, కఠిన పదముల సమాస సమూహములతో గాక సామాన్య చదువరులు చదివిన తడవుగనే అర్థమును గ్రహించుట కనుగుణ్యమైన పదజాలములతో ముచ్చటగా తెనుగు భాషలో అనువదించిన మన్మిత్రులు విద్వాన్ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారి కృషి అక్షరమై చిరస్మరణీయమై వెలుగొందగలదు.

ఒక గ్రంథమును వేరొక భాషలో అనువదించడం అనుకొన్నంత సులభం కాదు. అనువాదకుడు స్వతంత్రించి వ్రాయడానికి వలనుపడదు. మూల గ్రంథములోని పదార్థమునకు లోపం రానీయక భావమును యథాతథంగా ప్రతిఫలింప జేయవలెను. అందులోను వచన గ్రంథము గాక ఛందోబద్ధమైన కవిత్వంలో అనువదించడం కష్టతరమైనది.

అయినను ఇట్టి మహత్తరమైన కృషిలో విద్వాన్ ఈ. వి. సుబ్రహ్మణ్యంగారు కృతకృత్యులైనారు.

శ్లోకములను తెనిగించి, తాత్పర్యమును వ్రాయుటయేగాక విశిష్ఠతను వలయుచోట్ల వ్రాసి తాను తెనిగించిన గ్రంథమునకొక ప్రత్యేక విశేషతను కల్పించినారు. సాంఖ్యయోగములో వీరు స్పష్టీకరించిన విశేషార్థములు వీరి విశిష్టతకు ప్రతీక.

విశ్వమానవ కళ్యాణమునకై వ్యాసవిరచిత భగవద్గీతను పండిత పామర జనరంజకముగా తెనిగించిన రచయిత ప్రశంసనీయుడు, సార్థకజన్ముడు. ఈ గ్రంథము ప్రజలయెడ విశేషాదరణ పొందడం తథ్యం.

తే.గీ. తేనె తీపా, మీదు తెనుగు తేటగీత
అందు తీపా చెప్పంగరాదజునికైన,
గీత ననువదించిన మీదు కీర్తిబడసె
ధన్యత ఈ.వి. సుబ్రహ్మణ్య పుణ్య చరిత !

ఇట్లు,
భవత్ శ్రేయోభిలాషి,
కాట్నె చంద్రశేఖరం, B.Sc., B.L.,

# మొదటి భాగము
# 9 అధ్యాయములు


| | | పేజి నెం. |
|---|---|---|
| | వరాహపురాణాంతర్గత శ్రీ మద్భగవద్గీతా మాహాత్మ్యము .. | 3 - 11 |
| 1. | అర్జున విషాదయోగము .. | 12 - 29 |
| 2. | సాంఖ్యయోగము .. | 30 - 59 |
| 3. | కర్మయోగము .. | 60 - 79 |
| 4. | జ్ఞానయోగము .. | 80 - 96 |
| 5. | కర్మ సన్న్యాసయోగము .. | 98 - 111 |
| 6. | ఆత్మ సంయమ యోగము .. | 112 - 131 |
| 7. | విజ్ఞానయోగము .. | 132 - 145 |
| 8. | అక్షరపరబ్రహ్మ యోగము .. | 146 - 159 |
| 9. | రాజవిద్యా రాజగుహ్య యోగము .. | 160 - 175 |

శ్రీరామ !

# వరాహ పురాణాంతర్గత
# శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము

*ధరోవాచ :-*

**శ్లో. భగవన్ పరమేశాన భక్తి రవ్యభిచారిణీ ।**
**ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥ 1**

*అవని ప్రారబ్ధ కర్మంబు ననుభవించు*
*నరున కేవిధి దగ మహేశ్వరునియందుc*
*బరగ నిల్చు నచంచల భక్తి స్వామి !*
*అనుచు భూదేవి శ్రీవిష్ణు నడిగె నంత.*

**తాత్పర్యము :-** ఒకానొకపరి భూదేవి విష్ణుమూర్తిని జూచి "నిగ్రహానుగ్రహ సమర్థుడవైన ఓ పరమేశ్వరా ! ప్రారబ్ధకర్మము ననుభవించుచున్నవారికి నిలుకడగల భక్తి యెట్లు కలుగును ?" అని ప్రశ్నింపగా-

*విష్ణు రువాచ :-*

**శ్లో. ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరత స్సదా ।**
**స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥ 2**

*విష్ణు డనియె గీతాభ్యాస వినుత చిత్త -*
*మున సదా ప్రవర్తించు సత్పురుషుc డుర్వి !*
*అనుభవించుచు నుండినం బ్రాప్తకర్మ*
*అందు లిప్తుండు గాడు తా నొందు ముక్తి.*

**తాత్పర్యము :-** అప్పుడు విష్ణువు భూదేవితో ఇట్లని సెలవిచ్చెను. ప్రారబ్ధ కర్మమును అనుభవించుచున్నవాడైనను గీతను నిత్య పారాయణము

చేయుచుండు వాడు ముక్తుడై సుఖించును. కర్మములతో ఇక అతనికి ఎటువంటి బంధము ఉండదు.

**శ్లో. మహాపాపాది పాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।**
**క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళ మంభసా ॥ 3**

*ధరణియందు గీతాధ్యాన పరత నొప్పు*
*వారి కెంతటి ఘోర పాపంబులైన*
*కొంచె మేనియు నంటఁబో వంచితముగ*
*తామరాకుపై నీరమ్ము తనరి నట్లు.*

**తాత్పర్యము :–** గీతాధ్యానము వలన తామర ఆకున నీరు అంటనట్లు మహా పాపాదికములు కొంచెమైనను అంటబోవు.

**శ్లో. గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।**
**తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥ 4**

*ఒనరఁగా భగవద్గీత యుండు నెచట*
*ఎచట నియమ నిష్ఠలఁ బఠియింపఁ బడునొ*
*వెలయు నచట ప్రయాగాది విమల తీర్థ*
*చయము లన్నియు వసుధ ! నిశ్చయము గాగ.*

**తాత్పర్యము :–** శ్రీమద్భగవద్గీత గ్రంథము ఉండు చోటునను, పారాయణము చేయు చోటునను ప్రయాగాది పవిత్ర స్థలములు తప్పక ఉన్నట్లే సుమా !

**శ్లో. సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।**
**గోపాల గోపికా వాపి నారదోద్ధవ పార్షదైః ।**
**సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥ 5**

*ఎలమి నెచ్చట గీత పఠింపఁబడునొ*
*సకల దేవతల్ ఋషులు ప్రశస్త మునులు*
*పన్నగులు నారదోద్ధవ భక్తవరులు*
*మఱియు గోపాల గోపికామణులు నచట*
*శీఘ్రముగ వచ్చి సాయమ్ము సేతు రెలమి.*

**తాత్పర్యము :-** గీతా గ్రంథ పారాయణ ముండుచోట దేవతలు, ఋషులు, యోగులు, సర్పములు, గోపాలురు, గోపికలు, నారదుఁడు, ఉద్ధవుఁడు, విష్ణువుయొక్క ద్వారపాలురు - వీరందఱును గూడ శీఘ్రముగా వచ్చి సహాయము చేయుదురు.

**శ్లో. యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్ ।**
**తత్రాహం నిశ్చితం పృథ్వి! నివసామి సదైవ హి ॥ 6**

*ఎచట గీతా విచారణం బెన్ని జరుగు,*
*పఠన బోధన శ్రవణ మేర్పడఁగ నుండు*
*నచట నే నెల్లవేళలయందుఁ బృథ్వి!*
*తప్పక వసింతు నుశ్శ్రీయ ధనము లిత్తు.*

**తాత్పర్యము :-** ఓ భూదేవీ ! ఈ భగవద్గీతలోని పరమార్థమును గుఱించి ఎచ్చట చర్చలు జరుగుచుండునో, ఎచ్చట దీనిని చదువుచు, చదివించుచు, వినుచు నుందురో అచ్చట నేను ఎల్లవేళల ఉందును. ఇది ముమ్మాటికిని నిజము సుమా !

**శ్లో. గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।**
**గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీ ల్లోకా న్పాలయా మ్యహమ్ ॥ 7**

*ఆశ్రయము నాకు గీతయే యగును సుమ్ము*
*అరయ నుత్తమంబౌ గృహం బదియె నాకు*
*అమర గీతార్థ సుజ్ఞాన మాశ్రయించి*
*మూడు లోకంబు లేలుచున్నాఁడ నేను.*

**తాత్పర్యము :-** నేను గీతనే ఆశ్రయించియుందును. ఇదియే నాకు ఉత్తమమైన ఇల్లు. ఇట్టి గీతలో పేర్కొనబడిన జ్ఞానము నవలంభించియే నేను ముల్లోకములను పాలించుచున్నాను.

**శ్లో. గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః ।**
**అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా ॥ 8**

*వసుధ ! గీతయే నాయొక్క పరమ విద్య*
*అదియె బ్రహ్మ స్వరూప మయ్యదియె చూడ*
*నర్ధమాత్రాస్వరూపమ్ము నక్షరమ్ము*
*నిత్యమును ననిర్వాచ్యమ్ము స్తుత్య మగును.*

**తాత్పర్యము :-** అర్ధమాత్రారూపము, అక్షరము, బ్రహ్మస్వరూపము, నిత్యము నయిన గీతాశాస్త్రము ఉత్తమ మయిన బ్రహ్మవిద్య అనుటలో సందేహము లేదు.

**శ్లో. చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్ ।**
**వేదత్రయీ పరానంద తత్త్వార్థజ్ఞాన మంజసా ॥ 9**

*సచ్చిదానంద రూపు డుజ్జ్వలుడు కృష్ణు*
*డర్జునునకు దగన్ దీని నలర జెప్పె*
*అరయ వేదత్రయీ సారమగుచు తత్త్వ*
*వినుత విజ్ఞానదము గీత వినుము ధరణి !*

**తాత్పర్యము :-** ఓ ధరణీదేవీ ! ఇట్టి గీతాశాస్త్రమును సచ్చిదానంద స్వరూపుడైన శ్రీకృష్ణ భగవానుడు అర్జుననకు ఉపదేశించెను. ఇది ఋగ్, యజుస్, సామ - అను మూడు వేదముల స్వరూపము; రూపుదాల్చిన పరమానందము. అంతే కాక తత్త్వార్థజ్ఞానమును బోధించుటలో సమర్థమైనది సుమా !

**శ్లో. యోఽష్టాదశ జపే న్నిత్యం నరో నిశ్చలమానసః ।**
**జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ ॥ 10**

*అరయగా పదునెనిమి దధ్యాయములను*
*ప్రతిదినము నిశ్చలాత్మ జపం బొనర్చు*
*నతని కగు జ్ఞాన సంసిద్ధి యవనియందు*
*పరమ పదమును బొందు తప్పకను దాన.*

**తాత్పర్యము :-** నిలుకడగల మనస్సుతో నిత్యమును ఇందులోని 18 అధ్యాయములను పారాయణము చేయువాడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడై తిరిగి జన్మలేనట్టి పరమపదమును చేరుకొనును.

**విశేషము :-** మంత్రమే జప మనంబడును. కావున మంత్రమువలె విశ్వాసము గలిగి గీతను పఠించవలెను.

**శ్లో. పాఠేఽసమర్థ స్సంపూర్ణే తదర్థం పాఠ మాచరేత్ ।**
**తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః ॥ 11**

*పూర్తిగా గీతఁ బఠియింపఁ బూనలేని*
*శక్తిహీనుఁడు దీనిలో సగము యేని*
*నిత్యముఁ బఠింపఁ గలిగిన నిశ్చయముగఁ*
*బొందఁ గలుగును గోదానపుణ్య మవని.*

**తాత్పర్యము :-** ఒకవేళ ఈ గీతలన్నియు పారాయణము చేయుటకు శక్తి లేనిచో సగము మాత్రము చదువుకొన్నను సరే; గోదాన మిచ్చిన పుణ్యమును తప్పక పొందుదురు.

**విశేషము :-** 84 లక్షల జీవరాశులలో అన్ని విధములైన అపవిత్రములను పవిత్రము చేయు శక్తి ఒక్క గోసంబంధ పదార్థములకే యున్నది. అందుకే కృష్ణపరమాత్మ గోవుల మధ్యనే జీవించెను. గోవు ధర్మస్వరూపము. గోసంపద ఉన్న చోటనే ధర్మము అధికముగా ఉండును. ఆవుపేడ-యమున; పంచితము-నర్మద; పాలు-గంగ. ఉభయముఖ-అనగా పాలు త్రాగు దూడ గల గోప్రదానము శ్రేష్ఠము. గోసంపద ఉన్నచోటనే ధర్మము అధికముగా ఉండును.

**శ్లో. త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్ ।**
**షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ ॥ 12**

*మూట నొక పాలు పఠియింప పుడమియందు*
*కలుగఁ గలదు గంగాస్నానఫలము మిగుల*
*జగతిలోన షడంశంబుఁ జదివిరేని*
*సోమయాగ ఫలం బబ్బు సుందరముగ.*

**తాత్పర్యము :-** అదియు చదువుకొన వీలు లేకున్నచో ఇందులో 3వ భాగము అనగా 6 అధ్యాయములు మాత్రము చదువువారు గంగాపుణ్యస్నాన ఫలమును, 6వభాగము చదువువారు అనగా 3 అధ్యాయములు మాత్రము చదివినవారు సోమయాగ ఫలమును పొందుదురు.

శ్లో. ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః ।
రుద్రలోక మవాప్నోతి గణో భూత్వా వసే చ్చిరమ్ ॥ 13

*అరయఁగ నొక యధ్యాయమే యనుదినంబు*
*భక్తితోడుతఁ జదివినవాఁడు మేల్మి*
*రుద్రలోకంబుఁ బొంది యా రుద్రగణము*
*లందు నొకఁడౌచుఁ జిరకాల మలరుచుండు.*

**తాత్పర్యము :-** అట్లుకాకున్న కనీసము నిత్యము ఒకే ఒక అధ్యాయమును భక్తితో చదువువాడు రుద్ర లోకమునకు పోయినవాడై చాలకాలము అచ్చటనే ప్రమథగణములతో కూడి అచ్చటనే యుండును.

శ్లో. అధ్యాయ శ్లోక పాదం వా నిత్యం యః పఠతే నరః ।
స యాతి నరతాం యావ న్మనుకాలం వసుంధరే ॥ 14

*నరల నధ్యాయమున శ్లోక పాదమైన*
*నిత్యముఁ బఠించు నరుఁ డుర్వి నిశ్చయముగ*
*ఒక్క మన్వంతరముఁ గీర్తి యుప్పతిల్ల*
*మనుజుఁడై పుట్టి జీవించు మాన్యుఁ డగుచు.*

**తాత్పర్యము :-** ఓ భూదేవీ ! అట్లును పఠింపలేకున్నచో కనీసము ఏదైనను ఒక అధ్యాయములో 4వ భాగమును పారాయణము గావించినట్లైన మన్వంతరాంతమువరకు గూడ మనుష్యుడై యుండును సుమా !

శ్లో. గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ ।
ద్వౌ త్రీ నేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠే న్నరః ॥ 15

చంద్రలోక మవాప్నోతి వర్షాణా మయుతం ధ్రువమ్ ।
గీతాపాఠ సమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్ ॥ 16

*గీతయందలి శ్లోకాలఁ బ్రీతితోడ*
*పదియుగా నేడుగాని భావ్యముగ నైదుఁ*
*గాని నాలుగు మూఁడు రెండైన లేక*
*శ్లోక మొకటైన తుద కర్ధశ్లోకమైన.*

*చదివిన యతండు నివసించు చంద్రలోక*
*మందు పదివేల వర్షంబు లదియుఁ గాక*
*మరణ మొందిన తదుపరి మనుజ జన్మ*
*నెలమిఁ బొందును గీతఁ బఠించువాఁడు.*

**తాత్పర్యము :-** అదియును వీలుగాకున్నచో పది లేక ఏడు లేక అయిదు లేక నాలుగు లేక మూడు లేక రెండు శ్లోకములుగాని, అదియును కష్టమైన ఒక్కటిగాని, అటులను వీలుగాని పక్షమున అర్ధ శ్లోకమును గాని నిత్య పారాయణము చేయువాడు చంద్ర లోకమును చేరుకొన్నవాడై అచట 10 వేల ఏండ్లుండును. పారాయణము చేయుచు మృతి నొందినవాఁడు మరల మానవుడై జన్మించును.

**శ్లో. గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తి ముత్తమామ్ ।**
**గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ ॥ 17**

*మనుజుఁడై పుట్టి గీత నేమరకఁ జదువు*
*నట్టివానికి దొరకు మేలైన ముక్తి*
*మరణ మొందెడు వేళ నుచ్చరను గీత-*
*గీత యని యుచ్చరింప సద్గతులు గల్గు.*

**తాత్పర్యము :-** మరు జన్మయందును గీతాశాస్త్రమును పారాయణము చేసి మోక్షము నందును. వేయేల? మరణ సమయమున గీతాస్మరణ చేసిన యెడల సద్గతి గల్గును.

**శ్లో. గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।**
**వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే ॥ 18**

*అవని నెంతయుఁ బ్రీతి గీతార్థములను*
*వినిన యాతఁడు వైకుంఠమున వసించి*
*శ్రీమహావిష్ణువుం గూడి శ్రేయ మొలక*
*కాలముం బుచ్చు సంతోష గౌరవముల.*

**తాత్పర్యము:-**మహాపాపాత్ముడైనను గీతలోని అర్థమును గ్రహించుటలో ఆసక్తి గలవాఁడు వైకుంఠమునకు బోయి విష్ణుమూర్తితో ఆనందించుచుండును.

శ్లో. గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।
జీవన్ముక్త స్స విజ్ఞేయో దేహాన్తే పరమం పదమ్ ॥ 19

*భువి ననేక కర్మలఁ జేయు పురుషుఁడైన*
*దినము గీతార్థ భావన మనెడువాఁడు*
*పొందును దగ జీవన్ముక్తి బొసఁగ మఱియు*
*పరమపదమును దేహముఁ దొరగినంత.*

**తాత్పర్యము :-** ప్రతిదినము నిత్య నైమిత్తిక కర్మలను చేసికొని గీతార్థమును ధ్యానించినవాఁడు జీవన్ముక్తుడు. పరమపదమును జేరుకొనును.

శ్లో. గీతా మాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।
నిర్ధూతకల్మషా లోకే గతాస్తే పరమం పదమ్ ॥ 20

*అవని వరభక్తితో గీత నాశ్రయించి*
*జనక భూపాలకాది రాజర్షివరులు*
*కల్మషము లెల్ల బాసి సంకటముఁ దొలఁగి*
*పరమపదదివ్యసంపదల్ వడసి రెలమి.*

**తాత్పర్యము :-** జనకుఁడు మొదలైన మహారాజులు చాలమంది ఈ గీతను ఆశ్రయించుకొనియే లోకములో పాపరహితులని పేరుపొంది, తుదకు మోక్ష పదవి నలంకరించిరి.

శ్లో. గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్ ।
వృథా పాఠో భవే త్తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥ 21

ఏతన్మాహాత్మ్య సంయుక్తం గీతాభ్యాసం కరోతి యః ।
స తత్ఫల మవాప్నోతి దుర్లభాం గతి మాప్నుయాత్ ॥ 22

*గీతఁ బఠియించి దాని విఖ్యాత మహిమ*
*చదువ కుండిన నది వృథా శ్రమయె యగును*
*భవ్య మాహాత్మ్యయుత గీత పఠనఁ జేసి*
*దుర్లభం బైన మోక్ష మొందును నరుండు.*

* గీతాయాతాః పరంపదమ్ - పాఠాంతరము

**తాత్పర్యము :-** ఓ భూదేవీ ! ఇటువంటి పవిత్ర గీతాశాస్త్రమును పారాయణము చేసి మాహాత్మ్యమును చదువనివానికి పారాయణము వ్యర్థమై శ్రమయే మిగులును. ఈ మాహాత్మ్యముతోగూడ గీతను చదివినవాఁడు తగిన ఫలమును బొందుటయే కాక దుర్లభమైన మోక్షమునుగూడ పొందును.

**శ్లో. మాహాత్మ్య మేత ద్గీతాయా మయా ప్రోక్తం సనాతనమ్ ।**
**గీతాన్తే చ పఠే ద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ ॥ 23**

*గీతయొక్క మాహాత్మ్యమ్ము ఖ్యాతి గలది*
*వర సనాతనమైన దీ వసుధయందు;*
*గీత పఠియించి మాహాత్మ్య మాతతముగ*
*చదివి నటువంటివారు నిశ్చయము గాగ*
*చెప్పఁబడినట్టి ఫలములు శ్రేయ మొలుక*
*పొందగలరు; సందియము లే దిందు నిజము.*

**తాత్పర్యము :-** ఓ భూదేవీ ! ప్రాచీనమగునట్టి ఈ గీతామాహాత్మ్యమును నేను నీకు చెప్పితిని గదా ! ఈ ప్రకారముగా గీతాశ్లోకములను పారాయణము చేసి పిమ్మట ఈ మాహాత్మ్యమును చదివినచో చెప్పిన ఫలమును తప్పక పొందుదు రనుటలో ఎట్టి సందేహము లేదు.

ఇది శ్రీవరాహ పురాణమందలి శ్రీ గీతామాహాత్మ్యము
సర్వము సమాప్తము.

'ఓం తత్ సత్'



**శ్లో॥ హృషీకేశం తదా వాక్య మిద మాహ మహీపతే ।**

*అర్జున ఉవాచ :-*

**సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ! ॥**

**(1-21)**

శంఖధ్వానాలు చేయబడిన పిమ్మట రెండు బలములనుండి బాణ వర్షము ప్రారంభము కాబోవుచుండగా కపిధ్వజుడైన అర్జునుడు 'ఓ కృష్ణా ! దుష్టబుద్ధియైన దుర్యోధనునకు ఎవరెవరు సహాయులై వచ్చియున్నారో చూడగోరుచున్నాను. నా రథమును ఉభయసేనల మధ్య నిలుపుము. నేను ఎవరెవరితో యుద్ధము చేయవలసియున్నదో గమనింపవలెను.' అని పురమాయించెను.

ఓం

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం ప్రథమోఽధ్యాయః

## అర్జున విషాదయోగము

*తే.గీ. కౌరవాన్వయ గంభీర కాననమున*
*నతిభయావహ మారుతమైనవాఁడు*
*నృపుఁడు ధృతరాష్ట్రుఁ డతిభీతి నిండుకొనగ*
*సంజయుని జూచి యడుగంగ సాగె నిట్లు.*

**తాత్పర్యము :-** కురు పాండవులు ఘోర సంగ్రామానికి సంసిద్ధులై యున్న సమయములో, కౌరవ వంశ మనబడు భీకరారణ్యమునకు ఝంఝా మారుతమువంటి వాడైన ధృతరాష్ట్రుఁడు సంజయుని జూచి ఈ విధముగా అడుగసాగెను.

**విశేషార్థము :-** ధృతరాష్ట్రునిలో నిగూఢముగా దాగియున్న పుత్ర వ్యామోహము ఆ పుత్రశతముపాలిట ఝంఝామారుతమైనదని చిత్రించుట మనోజ్ఞము. ఈ పద్య లక్ష్యము ధృతరాష్ట్రుని గూర్చి వివరించుటయే.

*ధృతరాష్ట్ర ఉవాచ :-*

**శ్లో. ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కి మకుర్వత సంజయ ॥** 1

*తే.గీ. పరమపావనమైన యీ భరతభూమి*
*ధర్మ సుక్షేత్రమై కీర్తి దనరు నట్టి*
*క్షాత్రవోత్తేజ సత్కురుక్షేత్రమందు*
*వీర పూజార్హులౌ నా కుమారవరులు*
*పాండవులుఁ జేసి రేమి నిష్పక్షపాత !*

**తాత్పర్యము :-** ధృతరాష్ట్రుడు సంజయుని వలన కురుక్షేత్రమున జరిగిన యుద్ధ విశేషములను తెలిసికొనగోరి "సంజయా ! 'కురుక్షేత్రము' 'ధర్మక్షేత్రమ'ని ప్రసిద్ధినందినది గదా ! అచ్చట యుద్ధమునకు సిద్ధమై యున్న నా వారును, పాండవులును ఏమి చేసిరో వివరింపుము."

**విశేషార్థము :-** కురుక్షేత్రము దేహము. సద్గుణములు పాండవులు, దుర్గుణములు కౌరవులు. మంచి చెడుల పోరాటమే సంగ్రామము. మరొక విశేషము మొదటి పాదం 'ధర్మక్షేత్ర-కురుక్షేత్ర' తిరుగవేసి 'క్షేత్రే క్షేత్రే ధర్మం కురు' ప్రతిదేహములోను అనగా జన్మలోను ధర్మమునే ఆచరింపుమని అర్థము.

*సంజయ ఉవాచ :-*

**శ్లో. దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।**
**ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్ ॥** 2

*తే.గీ. అనిన సంజయుం డనియె నా యవనిపతికి*
*రాజ ! గంభీర వ్యూహ సద్రాజిత మగు*
*పాండవానీకమును గాంచి పలికె నిట్లు*
*గురునితోడ దుర్యోధన కువలయపతి.*

**తాత్పర్యము :-** సంజయుడు భారత యుద్ధ విశేషములను ధృతరాష్ట్రునకు ఇట్లని చెప్పుచున్నాడు.

ఓ రాజా ! దుర్యోధనుడు వ్యూహముగా తీర్చబడి ప్రకాశించుచున్న పాండవ బలమును చూచి, ద్రోణాచార్యుని సమీపించి ఆయనతో ఈ రీతిగా చెప్పెను.

**విశేషార్థము :-** సంజయుడు - రాగద్వేషరహితుడు; సత్యసంధుడు. ఇతని మాటలు విశ్వసింపదగినవి. ఇది మొదలుకొని దుర్యోధనుడు ద్రోణునితో పలుకబోవు మాటలవలన ఆతని శీలము తెలియును.

**శ్లో. పశ్యైతాం పాణ్డుపుత్రాణా మాచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥** 3

*తే.గీ.* *చూడఁగాఁ దగు నాచార్య ! చోద్యముగను*
*పాండుపుత్రుల గంభీర బలము నెల్ల*
*శేముషీ శక్తితో తమ శిష్యుడైన*
*ద్రుపద పుత్రుండు వ్యూహాలతో నమర్చె.*

**తాత్పర్యము :-** గురువర్యా ! మీ శిష్యుఁడు మఱియు 'మేధావి'యని పేరుపొందిన ద్రుపద పుత్రుఁడు ధృష్టద్యుమ్నుఁడు వ్యూహాముగా తీర్చబడిన పాండవ సైన్యమునకు ముందు నిలబడియున్నాడు. ఒక్కసారి అటువైపు చూడుము.

**విశేషార్థము :-** ద్రోణునకు ద్రుపదునిపై నున్న కోపాన్ని రగులుకొల్పుట ఇచ్చట గమనించదగినది.

**శ్లో. అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమా యుధి ।**
**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥** 4

*తే.గీ.* *ఇట్టి సైన్యంబు లోపల జెట్టి మగలు*
*బలిమి విలుకాండ్రు భీమార్జునుల సమాను*
*లగు విరాటుఁడు యుయుధానుఁ డధిక తేజ !*
*ఆ మహారథి ద్రుపదుండు నలరు - మఱియు*
*బ్రాహ్మణోత్తమ ! వినఁదగు వారి వినుము.*

**తాత్పర్యము :-** వీరులు, గొప్ప విలుకాండ్రు, యుద్ధములో భీమార్జునుల వంటి సాత్యకి, విరాటుడు, మహారథి ద్రుపదుఁడు మొదలైన రాజశ్రేష్ఠులు పాండవ సైన్యములో ఉన్నారు.

**శ్లో. ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజ శ్చ వీర్యవాన్ ।**
**పురుజి త్కుంతిభోజ శ్చ శైబ్య శ్చ నరపుంగవః॥** 5

**యుధామన్యు శ్చ విక్రాంత ఉత్తమౌజా శ్చ వీర్యవాన్ ।**
**సౌభద్రో ద్రౌపదేయా శ్చ సర్వ ఏవ మహారథాః ॥** 6

*తే.గీ. పుడమి నెన్నఁగ ధృష్ట కేతుఁడును చేకి-*
*తానుఁడు పురుజిత్తును కాశిధరణిపతియు*
*మఱియు కుంతిభోజుఁడు యుధామన్యు డుత్త*
*మౌజు డభిమన్యుడును శైబ్యు డదియుఁ గాక*
*ద్రౌపది కుమారులును మహారథికు లరయ.*

**తాత్పర్యము :-** అవక్ర పరాక్రమవంతుడైన కాశిరాజు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు, పురుజిత్తు, ధీరుడైన చేకితానుఁడు, ధృష్టకేతువు, కుంతిభోజుఁడు గూడ పాండవ సైన్యములో ఉన్నారు.

**శ్లో. అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తా న్బ్రవీమి తే ॥ 7**
**భవాన్ భీష్మ శ్చ కర్ణ శ్చ కృప శ్చ సమితింజయః ।**
**అశ్వత్థామా వికర్ణ శ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ 8**
**అన్యే చ బహవ శ్శూరా మదర్థే త్యక్తజీవితాః ।**
**నానాశస్త్రప్రహరణా స్సర్వే యుద్ధవిశారదాః ॥ 9**

*తే.గీ. వెలయ మీరును భీష్ముడు విజయ శీలు*
*రైన కర్ణ కృపాచార్యు లధిక బలులు*
*కురుకుమార వికర్ణులు కురువరేణ్య !*
*తనర భూరిశ్రవుండు నుత్తములు ఘనులు*
*స్వామి భక్తి పరాయణుల్ చతురమతులు*
*వివిధ శస్త్రాస్త్ర కోవిదుల్ విజయవరులు*
*ప్రాణముల లెక్క సేయని పరమశ్రేష్ఠ*
*నాయకులు మన బలగమ్మునందుఁ గలరు.*

**తాత్పర్యము :-** బ్రాహ్మణోత్తమా ! ఇక నా పక్షమున పేరు గడించిన సేనా నాయకులను, నా వారిలో ముఖ్యులను గురించి చెప్పుచున్నాను. వినుడు. అనేకములైనయుద్ధములలో విజయలక్ష్మిని వరించిన మీరును, భీష్మాచార్యుడు, కర్ణుఁడు, కృపాచార్యుఁడు, అశ్వత్థామ, వికర్ణుఁడు, భూరిశ్రవుఁడు ఉన్నారు. ఇంకను ఎందరో నా పక్షమున ఉన్నారు. వీరందరు నాకొఱకు ప్రాణముల నైనను విడువగలరు. వివిధములైన శస్త్ర ప్రయోగములో నేర్పు గలవారు గలరు. అంతేకాక అన్నిరకముల యుద్ధములను చేయగలరు.

**శ్లో. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 10**

*తే.గీ. భీష్మరక్షితమౌ మన వీరబల మ -*
*పారమైనది గాన నీ పరిమిత మగు*
*వాయు పుత్రాభిరక్షిత బలము లేమి*
*లెక్క మన కింక ? ముక్కలు ముక్కలె గద !*

**తాత్పర్యము :-** భీష్మునిచే రక్షింపబడుచున్న మన సైన్యము అపరిమిత మైనదని తోచుచున్నది. ఇక పాండవుల సైన్యము భీముడు రక్షించుచుండగా అది చాల తక్కువ అని నాకు తోచుచున్నది.

**శ్లో. అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః ।**
**భీష్మ మేవాభిరక్షన్తు భవన్త స్సర్వ ఏవ హి ॥ 11**

*తే.గీ. నియమితమ్మగు మార్గాల నిలచియుండి*
*వంతు లట్టుల నెల్లరు భద్రముగను*
*భీష్మనాయకు రక్షింప వేడుకొందు*
*జయ మువాసిని కీర్తి లక్ష్మియును నొసగ.*

**తాత్పర్యము :-** (దుర్యోధనుడు ద్రోణునితో మాటలాడి తన సేన నంతటిని ఉద్దేశించి ఈ విధముగా ప్రకటించుచున్నాడు) మీ రందఱు మీకు నియమింపబడిన స్థానములందు నిలచినవారై అన్ని విధముల భీష్ముని రక్షించుచుందురు గాక !

**శ్లో. తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।**
**సింహనాదం వినద్యోచ్చై శ్శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12**

*వచనం :- అనిన వెంటనే*

*తే.గీ. కదన రంగార్థమౌ నిట్టి పదను పలుకు*
*లౌలుకు దుర్యోధనునకు మే న్పులకరింప*
*కౌరవాన్వయ వృద్ధ సింగమ్ము సింహ -*
*నాద మొనరించి శంఖమ్ము నూది యూదె.*

**తాత్పర్యము :-** దుర్యోధనుని మాటలు విని ఆతనికి సంతోషము గలుగు నట్లుగ కురుకులవృద్ధుడు, పరాక్రమవంతుడు నైన భీష్ముడు సింహనాదము చేసి సైన్యము మొత్తమును హెచ్చరించుచు శంఖమును పూరించెను.

**శ్లో. తత శ్శంఖా శ్చ భేర్య శ్చ పణవానకగోముఖాః ।**
**సహసై వాభ్యహన్యంత స శబ్ద స్తుములోఽభవత్ ॥ 13**

*తే.గీ. వెంటనే మ్రోగె మిగిలిన విజయశంఖ*
*పణవ గోముఖ భేరీ శుభానకములు*
*దిగ్దిగంతాల సంకుల దీప్తి మెఱయ*
*సైన్య సింధువు మిన్నంటి చెలగి పొంగ.*

**తాత్పర్యము :-** ఆపైన శంఖములు, పణవములు (తుడుములు), గోముఖములు మఱియు ఇటువంటి యుద్ధవాద్యా లన్నియు ఒక్క పర్యాయము మ్రోగింపబడినవి. ఆ ధ్వని దిశలయం దంతట వ్యాపించినది.

**శ్లో. తత శ్శ్వేతై ర్హయై ర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**
**మాధవః పాండవ శ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14**

*తే.గీ. తెల్ల గుఱ్ఱాల బూన్చిన దివ్య రథము*
*నందు నొప్పిన మాధవు డర్జునుడును*
*దివ్య శంఖమ్ము లూది సందీప్తి మెఱయ*
*పాండవానీకమునకు సంబరము లిడిరి.*

**తాత్పర్యము :-** ఆపై తెల్లని గుఱ్ఱాలను పూన్చిన రథముపై కూర్చుని యున్న కృష్ణార్జును లిరువురును దివ్య శంఖములను పూరించిరి. ఆ ధ్వనికి దిక్కు లన్నియు అదరసాగినవి.

**శ్లో. పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15**

*తే.గీ. పాంచజన్యంబు నా భగవంతు డూదె*
*తనర విజయుండు దేవదత్తమ్ము నూదె*
*పౌండ్రమను భవ్యశంఖమ్ము బట్టి యూదె*
*భీకరమ్మగు రీతి నా భీము డెలమి.*

**తాత్పర్యము :-** శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని, అర్జునుఁడు దేవదత్తాన్ని పూరించిరి. అరివీర భయంకరుఁడైన భీముఁడు 'పౌండ్ర'మని పిలువబడు శంఖమును పూరించెను.

**శ్లో. అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।**
**నకుల స్సహదేవ శ్చ సుఘోషమణిపుష్పకౌ ॥ 16**

*తే.గీ. నిరుపమానమ్ముగా యుధిష్ఠిర విభుండు*
*విజయవరుఁ డూదియె ననంత విజయ మంత*
*నకులుఁ డూదె సుఘోషమ్ము నాల్గు దిశలఁ*
*దిరుగ మణిపుష్పకము సహదేవుఁ డూదె.*

**తాత్పర్యము :-** ధర్మరాజు 'అనంత విజయము'నే శంఖమును, నకులుఁడు 'సుఘోషము'ను, సహదేవుఁడు దివ్యమైన 'మణిపుష్పకము'ను ధ్వనింపఁ జేసిరి.

**శ్లో. కాశ్య శ్చ పరమేష్వాస శ్శిఖండీ చ మహారథః ।**
**ధృష్టద్యుమ్నో విరాట శ్చ సాత్యకి శ్చాపరాజితః ॥ 17**
**ద్రుపదో ద్రౌపదేయా శ్చ సర్వశః పృథివీపతే ।**
**సౌభద్ర శ్చ మహాబాహు శ్శంఖాన్ దధ్ముః పృథ క్పృథక్ ॥ 18**

*తే.గీ. అతి ధనుర్ధరుఁడగు కాశి యవనిపతియు*
*అనుపమాన మహారథుఁడగు శిఖండి*
*తనర మఱియు ధృష్టద్యుమ్నుఁడును విరాట -*
*నృపతి, జయశీలి సాత్యకి, నిపుణు గప్పు -*
*నిప్పు ద్రుపదుఁడు, సంగర నిపుణులైన*
*ద్రౌపదేయులు, నిరుపమ దోర్బలుండు*
*వీర సౌభద్రుఁడును వోలి వారి వారి*
*శంఖముల నూదినారు ప్రశస్త సరణి.*

**తాత్పర్యము :-** విలువిద్యలో పేరు మోసిన కాశిరాజు, వీరుడైన శిఖండి, ద్రుపద పుత్రుఁడు ధృష్టద్యుమ్నుఁడు, విరాటుఁడు, సాత్యకి, ద్రుపదుఁడు, ఉప పాండవులు, అభిమన్యుడు - వీరందరు వారి వారి శంఖములను పూరించిరి.

శ్లో. స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
వభ శ్చ పృథివీం చైవ తుములో౽వ్యనునాదయన్ ॥ 19

తే.గీ. ఆక్షయం బయి భూమ్యంతరిక్షములను
దిక్కు దిక్కులు దూసి ప్రతిధ్వనించె
ధార్తరాష్ట్రుల హృదయ విదారకముగ
సంకుల మ్మయి యా శంఖ శబ్దరాశి.

**తాత్పర్యము :-** ఆ శంఖాల నినాదాలు భూనభో౽ంతరాల నాక్రమించి, దిక్కులన్నింట ప్రతిధ్వనించి, కౌరవుల హృదయాలను బ్రద్దలు చేయునంత భయంకరమై యుండెను.

శ్లో. అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధను రుద్యమ్య పాండవః ॥ 20

హృషీకేశం తదా వాక్య మిద మాహ మహీపతే ।

అర్జున ఉవాచ :-

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మే౽చ్యుత ! ॥ 21

యావ దేతాన్ నిరీక్షే౽హం యోద్ధుకామా నవస్థితాన్ ।
కై ర్మయా సహ యోద్ధవ్య మస్మిన్ రణసముద్యమే ॥ 22

తే.గీ. అంత శస్త్రాహవము సల్పునట్టి వేళ
యుద్ధ సన్నద్ధులై నిల్చియున్న యట్టి
ధార్తరాష్ట్రాదులం గాంచి తనదు దివ్య
ధనువు నెక్కిడి కృష్ణుని గని కిరీటి
ఎవ రెవరి నెదిర్చి రణమ్ము నిపుడు నేను
చేయవలయునో - సంసిద్ధచిత్తు లగుచు
వచ్చి నిలచిన వార లెవ్వార లనుచు
గానవలె నేను నచ్యుత ! కాన నుభయ
బలములకు మధ్య దగ తేరు నిలుపు మిపుడు.

**తాత్పర్యము :-** శంఖధ్వానాలు చేయబడిన పిమ్మట రెండు బలములనుండి బాణ వర్షము ప్రారంభము కాబోవుచుండగా కపిధ్వజుడైన అర్జునుడు విల్లెక్కుపెట్టి 'ఓ కృష్ణా ! దుష్టబుద్ధియైన దుర్యోధనునకు ఎవరెవరు

సహాయులై వచ్చిరో చూడఁగోరుచున్నాను. నా రథమును ఉభయ సేనల మధ్య నిలుపుము. నేను ఎవరెవరితో యుద్ధము చేయవలసి యున్నదో గమనించవలెను' అని పురమాయించెను.

**శ్లో. యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।**
**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23**

*తే.గీ. దుష్ట దుర్యోధనునకు నెంతో ముదంబు*
*గలుగ నాజి సాయపడు వక్కర చెలంగ*
*దిక్కు లేనట్టి చావు కేతెంచి యిచట*
*వరుస నిలిచిన వారి నే నరయవలయు*
*అని కిరీటి వచించిన యంతలోన.*

**తాత్పర్యము :-** నాతో యుద్ధము చేయుటకు ఎవ్వరు వచ్చియున్నారో, ఇంకను ఎవరెవరు దుర్యోధనుని సహాయార్థము వచ్చియున్నారో చూడవలెను.

*సంజయ ఉవాచ :-*

**శ్లో. ఏవ ముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ! ।**
**సేనయో రుభయో ర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24**

**భీష్మ ద్రోణ ప్రముఖత స్సర్వేషాం చ మహీక్షితామ్ ।**
**ఉవాచ పార్థ ! పశ్యైతాన్ సమవేతాన్ కురూ నితి ॥ 25**

**తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।**
**ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా ॥**
**శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయో రుభయో రపి ।**

*తే.గీ. ఉభయ సేనల మధ్య రథోత్తమంబు*
*నిలిపి యా పార్థసారథి పలికె - చూడు*
*మర్జునా కౌరవుల సైన్య మనుచు - నంత*
*భీష్మ లాదిగ గల యుద్ధవీర వరుల*
*తండ్రులను గురువులను తాతలను మేన -*
*మామలను మామలను తగ మనుమ లెల్ల*
*సోదరులను కొడుకులను సుహృదులైన*
*యట్టి వారిని మిత్రుల నరసె నరుఁడు.*

**తాత్పర్యము :-** అర్జునుని మాటలు విన్న పిమ్మట శ్రీకృష్ణుఁడు ఉభయ సేనల మధ్య, భీష్మద్రోణుల యెదుట, సమస్త భూపాలుర సమక్షమున దివ్య రథాన్ని నిలిపి కౌరవ సేనలను చూడు మని అర్జునునితోఁ జెప్పెను. అప్పుడు రథముపైనుండి ఉభయసేనలందున్న తాతలను, తండ్రులను, మేనమామలను, మామలను, గురువులను, సహోదరులను, పుత్రపౌత్రులను, మిత్రులను అర్జునుఁడు చూచెను.

**శ్లో. తాన్ సమీక్ష్య స కౌంతేయ స్సర్వాన్ బంధూ నవస్థితాన్ । 27**

*తే.గీ. బంధువర్గమ్ము నతికృపావరతఁ గాంచి*
*కదనరంగమ్ము నందు నిక్కముగ నింక*
*నింద యొక్కట మడియుదురే యటంచు*
*వింత వగఁ గూరి పలికె గోవిందుఁ జూచి.*

**తాత్పర్యము :-** యుద్ధరంగమున బంధుజనులందఱను పరికించి అర్జునుఁడు విచారముతో క్రుంగిపోవుచు కృష్ణునితో ఇట్లు పలికెను.

**శ్లో. కృపయా పరయావిష్టో విషీద న్నిద మబ్రవీత్ ॥**

*అర్జున ఉవాచ :-*

**దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28**
**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథు శ్చ శరీరే మే రోమహర్ష శ్చ జాయతే ॥ 29**

*తే.గీ. ఏమి చెప్పుదునో కృష్ణ ! యింద యిచట*
*సమర కాంక్షితు లయ్యును స్వజను లగుటఁ*
*గాంచుచుండంగ నా మేను కంప మొంది*
*జలదరించెడి - నవయవ సముదయమ్ము*
*శిథిల మయ్యెడి, నాలుక చెమ్ము లారె.*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! యుద్ధము చేయుటకై ఇచట చేరిన బంధువుల నందఱను చూచుచున్న నా శరీరావయవములు శిథిలము లగుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరము వణకుచున్నది. పులకలు కలుగుచున్నవి.

శ్లో. గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30

*తే.గీ. కరము జారెడి నా చేతి గాండివమ్ము*
*మంట లెత్తెడి నా మేన, మనసులోన*
*భ్రాంతి నటియించుచున్నది రథము పైన*
*నిలువలేకుంటి, మెయి స్వేద జలము నిండె.*

**తాత్పర్యము :-** గాండీవము నా చేతినుండి జారుచున్నది. శరీర మంతట తాపము హెచ్చినది. నా మనను భ్రాంతితో చలించుచున్నది. రథముపై నిలబడుటకైనను నాకు శక్తి లేకున్నది. దేహ మంతయు చెమటలు కారుచున్నవి.

శ్లో. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ! ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 31

*తే.గీ. అమితముగఁ గాంతు నపశకునములు నేడు*
*బంధుజనులను జంపి యే పరమ పుణ్య*
*సముదయంబును గొందు కేశవ ! రణాన*
*కుదుపఁ జాలను నెత్తుటి కూడు నేను.*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! నాకు అన్నియు అశుభ సూచనలే కనిపించుచున్నవి. ఈ యుద్ధములో ఇంతమంది బంధువులను వధించి నేను ఏ విధముగా శుభమును పొందగలను ?

**విశేషార్థము :-** *"దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ !"* అందురు. ఏకముగా బంధువులను చంపినట్లైన ఇక ఇహ పర సుఖాలను అనుభవించుట యనునది జరుగునట్టి పనేనా ?

శ్లో. న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిన్నో రాజ్యేన గోవింద కిం భోగై ర్జీవితేన వా ॥ 32

*తే.గీ. సమర విజయమ్ము సామ్రాజ్య సౌఖ్యచయము*
*భోగ భాగ్యాలు నేఁ గోరఁబోవ నింక*
*గెలుపు లవి యేల ? రాజ్యమ్ము గీజ్య మేల ?*
*జీవితము నేల ? నను పాపి జేయ నేల ?*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! నేను విజయమును, రాజ్య సుఖములను కోరుకొనుట లేదు. యుద్ధములో నా స్వజనులందరు మరణించిన పిమ్మట ఇక నాకీ రాజ్య భోగము లెందుకు? ఆపై నేను బ్రతికి మాత్రము లాభమేమి?

**శ్లో. యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగా స్సుఖాని చ ।**
**త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ ॥ 33**

*తే.గీ. విజయమును బొంది యే బంధు వితతి భోగ*
*భాగ్య చయములు రెట్టింప బ్రాల్పడితిమొ*
*వార లెల్లఱు నీ రణ ప్రాంగణమున*
*ప్రాణధనములు విడి నిలబడిరి నేడు.*

**తాత్పర్యము :-** కృష్ణా ! ఈ రాజ్య భోగములు, సుఖములు ఎవరికై కోరుచున్నామో వారే ఈ యుద్ధ భూమికి వచ్చియున్నారు. ధన ప్రాణములను త్యజించుటకును వారు సంసిద్ధులైయున్నారు.

**శ్లో. ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః ।**
**మాతులా శ్వశురాః పౌత్రా స్స్యాలా స్సంబంధిన స్తథా ॥ 34**

*గురుగణమ్మును పితరులు కొడుకు లింక*
*తాతలును మేనమామలు నాతతముగ*
*శ్వశుర వర్గమ్ము, పౌత్ర, సంబంధి జనులు*
*బావలును గారె ? వీరల పరులు గలరె ?*

**తాత్పర్యము :-** యుద్ధానికై కాచుకొన్న వారందఱు గురువులు, తాతలు, తండ్రులు, కుమారులు, మనుమలు, మామలు, మేనమామలు, బావమఱదులు - వీరందఱును బంధువులే !

**శ్లో. ఏతా న్న హన్తు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిమ్ను మహీకృతే ॥ 35**

*తే.గీ. మట్టి కాశించి వీరల మట్టు గలుప*
*నిచ్ఛగింపను - త్రిభువనా ల్వచ్చుగాక*
*యాన పడబోను, నన్ను వీరంద ఱొకట*
*హత్య యొనరింప సమకట్టిరేని గాని.*

**తాత్పర్యము :-** ఓ గోవిందా ! వారికి వారై నిష్కారణముగా నన్ను చంపుటకై వచ్చినను సరే, నేను మాత్రము వారిని చంపదలచను మామా ! అట్టున్న వారిని రాజ్య లోభముతో ఏ రీతిగా చంపగలవాడను ?

**శ్లో. నిహత్య ధార్తరాష్ట్రా న్నః కా ప్రీతి స్స్యా జ్జనార్దన।**
**పాప మేవాఽశ్రయే దస్మాన్ హత్వైతా నాతతాయినః ॥** 36

*తే.గీ. ధార్తరాష్ట్రుల జంపిన దానివలన*
*మనకు గలిగెడి సంప్రీతి మాత్ర మేమి ?*
*ఆతతాయుల వీరల హత్య జేసి*
*పాప మొడిగట్టుకొనుట సంభావ్య మగునె ?*

**తాత్పర్యము :-** కృష్ణా ! దుర్యోధనాదులైన స్వజనులను చంపినదానివలన కలుగబోవు సుఖ మేమియు లేదు. వీరు ఆతతాయులు; అయినను వీరిని చంపుటవలన మనకు పాపమే కలుగును.

ఆతతాయులు

**విశేషార్థము :-** అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః।
క్షేత్రదారాపహర్తా చ షడేతే హ్యాతతాయినః ॥
దుర్యోధనాదులు పై ఆఱు దుర్మార్గాలను ఆచరించినవారే.

**శ్లో. తస్మా న్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రా న్స్వబాంధవాన్।**
**స్వజనం హి కథం హత్వా సుఖిన స్స్యామ మాధవ ॥** 37

*తే.గీ. తెలియ దగు నిట్టి కారణములు దలంచి*
*బంధుతతితోడ జంపుట పాడిగాదు*
*ధార్తరాష్ట్రుల - చంపిన దానివలన*
*కలుగ గల వేమి మనకు సౌఖ్యములు కృష్ణ !*

**తాత్పర్యము :-** కావున ఓ కృష్ణా ! చుట్టములతో గూడిన దుర్యోధనాదులను జంపుట మనకు తగదు. స్వజనులను చంపి సుఖము లే విధముగా పొందగలము?

**శ్లో. యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః ।**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38**

**కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుమ్ ।**
**కులక్షయ కృతం దోషం ప్రపశ్యద్భిః జనార్దన ॥ 39**

*తే.గీ. రాజ్యలోభాంధతను ధృతరాష్ట్రసూతి*
*సుహృద నాశమ్ము పాపమ్ముఁ జూడలేక*
*అన్వయక్షయకారకుఁ డౌచు నుండ*
*కుల వినాశన కృత దోషములు దెలిసిన*
*వారు మే మాట నిట్టి పాపమ్ము నుండి*
*ఎటుల విరమింపఁ గలమొ నే నెఱుగకుంటి.*

**తాత్పర్యము :-** రాజ్యలోభముతోఁ గూడిన వారైన కారణముగా దుర్యోధనాదులు కులక్షయము వలన గలుగు దోషమునుగాని, మిత్రద్రోహమువలన గలిగెడి పాతకమును గాని తెలిసికొనఁజాలకున్నారు.

**శ్లో. కులక్షయే ప్రణశ్యంతి కులధర్మా స్సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవత్యుత ॥ 40**

*తే.గీ. వంశ నాశనమునఁ జేసి వరలుచున్న*
*యాతతమ్మగు విమల సనాతనార్య*
*సత్కులాచార సరణి నాశనముఁ జెంది*
*వరగఁ గులముల ధర్మలోపములు బెరుగు.*

**తాత్పర్యము :-** ఓ జనార్దనా ! కులనాశము కలిగినందువలన వచ్చు పాపమును తెలిసికొనిన పిమ్మట కూడ మనము ఈ పాపకార్యమునుండి ఎందుకు వెనుదిరుగరాదో తెలుపుము.

**విశేషార్థము :-** ఎట్టి పాపమున కైనను ప్రాయశ్చిత్తము కలదు గాని, కులక్షయానికి మాత్రము లేనే లేదు. అందువలన ఈ యుద్ధము మహా పాతకముతో కూడినది. కులక్షయమువలన కులాచార సరణి నశించి అధర్మము వ్యాపించును.

**శ్లో. అధర్మాభిభవా త్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః ।**
**స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥ 41**

*తే.గీ. ధర్మ లోపము కలిగిన దానివలన*
*చెదుదు రరయంగ ధర కులస్త్రీలు నిజము*
*స్త్రీలు చెడిరేని వార్ష్ణేయ ! సిగ్గుచేటు*
*కలుగ గలదయ్య వర్ణ సంకరము మిగుల.*

**తాత్పర్యము :-** కులము అధర్మముపాలయిన కులస్త్రీలు చెడు మార్గములలో నడచుకొందురు. అందువలన లోకములో 'వర్ణ సంకర'మనబడు పాపము ప్రబలిపోవును.

**శ్లో. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।**
**పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః ॥ 42**

*తే.గీ. కులము సంకరమైన తత్కుల విఘాత*
*కులకు నరకమ్ము గలుగు నిక్కువము గాఁగ;*
*వరలు పిండోదకముల లోపమ్మువలన*
*వారి పితరు లధోగతి పాలగుదురు.*

**తాత్పర్యము :-** వర్ణసంకర దోషమువలన వంశమునకు, వంశనాశనము చేసినవారికి నరకము కలుగును. పిండ, పితృతర్పణములు లోపించుటవలన పితరులందఱు పితృ లోకమునుండి పతితులై పోవుదురు.

**విశేషార్థము :-** యుద్ధమువలన వర్ణసంకరము కలుగుటయే కాక ఉత్తమ లోకముచేరిన పితరులు గూడ పతితులై పోవుదురు.

**శ్లో. దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।**
**ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43**

*తే.గీ. కులము నాశన మొనరించు కుత్సితాళి*
*ధర నొనర్చిన వర్ణసంకరము వలన*
*శాశ్వతముగాఁగ వరలెడి జాతి ధర్మ*
*కుల పరంపర ధర్మాలు కూలి పోవు.*

**తాత్పర్యము :-** కృష్ణా ! ఈ యుద్ధమువలన వంశాలు నశించును. వర్ణసంకరముతోఁ బాటు గొప్ప కీడు కలుగును. తరతరాలనుండి వచ్చుచున్న జాతి ధర్మము, కుల ధర్మములన్నియు నశించిపోవును.

**శ్లో. ఉత్పన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।**
**నరకే నియతం వాసో భవ తీత్యనుశుశ్రుమ ॥ 44**

*తే.గీ. అరయ కులధర్మములను పోకార్చి నట్టి*
*నీచ మానవులకు నెల్ల నిశ్చయముగ*
*శాశ్వతముగాఁగ నరక వాసమ్ము గలుగు -*
*నని జనార్దన ! ధర్మజ్ఞు లనగ వినమె.*

**తాత్పర్యము :-** ఈ విధముగ కులక్షయము, వర్ణసంకరము కలుగుట వలన ధర్మమునకు హాని సంభవించును. యుద్ధము అనర్థదాయక మగును. ఈ పాప మొనర్చిన వారు తాము మాత్రమే కాక తమ పితృదేవతలనుగూడ నరకమునందు పడునట్లు చేయుదురు.

**శ్లో. అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।**
**యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజన ముద్యతాః ॥ 45**

*తే.గీ. అవనియందున రాజ్య సుఖాభిలాష*
*స్వజనమును జంప మనము పాల్పడిన యపుడె*
*అమితమైనట్టి పాపకార్యాచరణకు*
*నడుముఁ గట్టినవార మైనార మకట !*

**తాత్పర్యము :-** కృష్ణా ! రాజ్య సుఖ లాభాలను ఆశించి మనము బంధువులను చంపి 'కులక్షయ'మనే మహాపాపమునకు ఒడిగట్టుకొను చున్నాము. అయ్యో! ఎంత కష్టము !

**విశేషార్థము :-** యుక్తాయుక్తాలను విస్మరించి బంధువధకు పూనుకొని నందుకు అర్జునుఁడు చాల విచారించుచు మిక్కిలి వ్యాకుల పడుచున్నాడు.

**శ్లో. యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః ।**
**ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46**

తే.గీ. అప్రతీకారగుణ మొప్ప నఖిల శస్త్ర
వితతి విడనాడినట్టి నన్ విమతు లగుచు
శస్త్రధరులైన ధార్తరాష్ట్ర ప్రశస్తు
లంత మొందించినను మేలె యగును నాకు.

**తాత్పర్యము :-** శస్త్రము విడిచిపెట్టి యుద్ధ విముఖుఁడనైన నన్ను కౌరవులు చంపుటకు వచ్చినను అది నాకు మేలుగానే తలచెదను.

**విశేషార్థము :-** తాను కులక్షయాదులకు కారకుఁడు కారాదని అర్జునుని అభిప్రాయము.

సంజయ ఉవాచ :-

శ్లో. ఏవ ముక్త్వార్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ 47

తే.గీ. అని వచించుచు నర్జును డధిక శోక
చలిత మానస పద్ముఁడై నిలువలేక
శరయుతమ్మైన చాపమ్ము జారవిడిచి
సమరతలమున రథముపై చతికిలఁబడె.

**తాత్పర్యము :-** పై విధముగా శ్రీకృష్ణపరమాత్మతో పలికి రథమునందు చతికిలబడి శోకసంతప్త చిత్తముతో అర్జునుఁడు ధనుర్బాణాలను విడిచిపెట్టెను.

(సంజయుఁడు ఈ విషయములన్నిటిని ధృతరాష్ట్రునితో జెప్పెను.)

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు

## అర్జున విషాదయోగంబను

ఒకటవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయ న్త్యాపో న శోషయతి మారుతః ॥ (2-23)

ఆత్మను శస్త్రములు ఖండింపలేవు. అగ్ని దహింపను లేదు. గాలి యెండింపను లేదు. జలములు తడుపను లేవు.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం ద్వితీయోఽధ్యాయః

## సాంఖ్యయోగము

*సంజయ ఉవాచ :-*

**శ్లో. తం తథా కృపయావిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।**
**విషీదన్త మిదం వాక్య మువాచ మధుసూదనః ॥** 1

*తే.గీ. నిండు కృపతోడ, నశ్రువుల్ నిండినట్టి*
*కన్నుగవతోడ మిగుల సంకటముఁ జెందు*
*చుండు నర్జును మధుసూదనుండు గాంచి*
*పలికె నీ రీతి తత్త్వభావమ్ము లొలుక.*

**తాత్పర్యము :-** సంజయుఁడు ధృతరాష్ట్రునికి భారతయుద్ధమును గుఱించి ఇట్లు వర్ణించి చెప్పుచున్నాడు. కన్నుల కన్నీరు కారుచుండ కరుణా పూర్ణమైన చిత్తముతో పరితపించుచున్న అర్జునుని జూచి శ్రీకృష్ణు డిట్లు పలికెను.

**విశేషార్థము :-** సంజయుఁడు దివ్యచక్షువుతో తాను చూచిన అర్జునుని పరిస్థితిని ధృతరాష్ట్రునకు వివరించుచున్నాడు.

*శ్రీభగవా నువాచ :-*

**శ్లో. కుత స్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥** 2

*తే.గీ. కశ్మలమ్మైన యపకీర్తికరము నైన*
*భవ్యమౌనట్టి స్వర్గ సంప్రాప్తి జెఱచు*
*పామర జనార్హమౌ నిట్టి పాడు గుణము*
*ఏల గలిగెను నీ కిప్పు డిచట విజయ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నీ కీ సమయములో అజ్ఞానులకు మాత్రమే కలుగు నటువంటి మఱియు స్వర్గమును దూరముచేసి, అపకీర్తి కలిగించునట్టి హృదయ దౌర్బల్యము ఎందువలన కలిగినదో చెప్పుము.

**శ్లో. క్లైబ్యం మా స్మ గమః పార్థ నైత త్త్వ య్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥** 3

*తే.గీ. మగతనము గోలి సేసెడి వగ పిదేల ?*
*మహి పరంతపు డప్ కీర్తి మట్టి గలుపు*
*వరమ క్షుద్రమౌ హృదయ దౌర్బల్య మేల ?*
*లెమ్ము నిలు మన్న కృష్ణు ముఖమ్ముఁ జూచి*
*పలికె నీ రీతి నప్పు డా ఫల్గునుండు.*

**తాత్పర్యము :-** శత్రువులను తపింపజేయు ఓ అర్జునా ! ఈ హృదయ దౌర్బల్యము చాల నీచమైనది. ఇది అజ్ఞానులకు కలుగును గాని నీకు గాదు. ఈ దౌర్బల్యమును విడిచిపెట్టి యుద్ధమునకు సిద్ధమై లెమ్ము.

*అర్జున ఉవాచ :-*

**శ్లో. కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥** 4

*తే.గీ. వినుత పూజార్హుఁడైన యా భీష్మవిభుని*
*ప్రణుతు నాచార్యు ద్రోణు నే పగిది నేను*
*కదన భూమిని బాణ సంఘాతములను*
*నొవ్వఁ జేయుదు నెదిరింతు నుడువు కృష్ణ !*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! భీష్మ ద్రోణులు నాకు పూజనీయులు గదా! మఱి యుద్ధములో వారిని బాణములతో ఎట్లు తపింపఁజేయగలను ? నా కిది ధర్మ మగునా ?

**శ్లో. గురూ నహత్వా హి మహానుభావాన్,**
**శ్రేయో భోక్తుం భైక్ష్యమ పీహ లోకే ।**
**హత్వార్థ కామాంస్తు గురూ నిహైవ,**
**భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥** 5

తే.గీ. *ధరణిని మహానుభావు లుత్తముల గురుల*
*నర్థ కామాభిలాషచే హత మొనర్చి*
*రక్త సిక్తాన్నభోగ సంప్రాప్తి వడయు*
*కంటె భిక్షాన్న మైన మేల్గాదె చెపుమ !*

**తాత్పర్యము** :- అర్థ, కామములకొఱకు గురు హత్యచేసి, రక్తసిక్తమైన ఆ అన్నమును తినుటకంటె - మహానుభావులను, గురువులను చంపకుండా ఈ భూమిపై బిచ్చమెత్తుకొని బ్రతుకుట మేలు గదా అని తలచుచున్నాను.

**శ్లో. న చైత ద్విద్మః కతర న్నో గరీయో,**
**యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామ,**
**స్తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥** 6

తే.గీ. *ఎవరి వధియించి జీవింప నిచ్ఛ గొనమొ*
*వార లా ధార్తరాష్ట్రులే వరల మనకు*
*ముందు నిలిచిరి - విజయమ్ము పాండువారు*
*మనమొ వారలొ యెఱుగము - మనకు నిపుడు*
*అనుసరింపంగ దగు శ్రేష్ఠమైన యట్టి*
*మార్గ మది యేది ? బోధింపుమా ముకుంద !*

**తాత్పర్యము** :- మనము యుద్ధముచేయుటకు నిశ్చయించినను విజయము మనకే కలుగునో, వారికే కలుగునో చెప్పలేము. ఎవరిని వధించి బ్రతికి యుండలేమో ఆ దుర్యోధనాదు లదిగో మన యెదుటనే ఉన్నారు.

**విశేషార్థము** :- అనుమానాస్పదమైన విజయముకొఱకై తన వారిని చంపదగదని అర్జునుడు విచారించుచున్నాడు.

**శ్లో. కార్పణ్య దోషోపహతస్వభావః,**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి**
**తన్మే శిష్య స్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** 7

*తే.గీ. అరయ కార్పణ్య దోషోపహతుఁడ నగుట*
*స్వ స్వభావమ్ము చెడె; ధర్మ సద్విచార*
*ఫణితి చేతమ్ము మూఢ భావమ్ముఁ జెందె*
*శిష్యుఁడను నీకు శరణంచుఁ జేరినాఁడ*
*శ్రేయ మగునది దెల్పి శాసించు నన్ను.*

**తాత్పర్యము :-** నా హృదయము కరుణా భావముచేత దుర్బలమైనది. ధర్మమేదో, అధర్మమేదో తెలియని స్థితి కలిగినది. నాకేది శుభమో నీవే నిర్ణయించి చెప్పవలెను సుమా !

నేను నీకు శిష్యుఁడనై శరణు చొచ్చితిని. నన్ను ఆదేశింపుము.

**శ్లో. న హి ప్రపశ్యామి మమాపనద్యా,**
**ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।**
**అవాప్య భూమా వసపత్న మృద్ధం**
**రాజ్యం సురాణా మపి చాఽధిపత్యమ్ ॥** 8

*తే.గీ. ఇందు నిష్కంటకమును సమృద్ధమైన*
*రాజ్య భోగమ్ముఁగాని విభ్రాజమాన*
*అమర రాజ్యాధిపత్య భాగ్యమ్ముఁ గాని*
*దొరకినను నాదు నింద్రియ సరణి నేర్చు*
*దుఃఖము తొలంగునని నాకు తోచలేదు.*

**తాత్పర్యము :-** హే మాధవా ! నాకు శత్రువులే లేని సార్వభౌమత్వమే లభించినను, ఇంద్రపదవియే లభ్యమైనను నా మనస్సును దహించుచున్న ఈ చింతను తొలగించునట్టి ఉపాయము తోచుట లేదు.

*సంజయ ఉవాచ :-*

**శ్లో. ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।**
**న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥** 9

*తే.గీ. విజయుఁడగు గుడాకేశుఁ డీ విధముగాఁగ*
*పరగ నా హృషీకేశుతోఁ బలికి - మరియు*
*వెలయ ననిఁ జేయ నేను గోవింద ! యనుచు*
*కదల కుండెను పార్థుఁ డక్కజము గాఁగ.*

**తాత్పర్యము :-** సంజయుడు అర్జునుని దృఢనిశ్చయమును తెలియ జేయుచున్నాడు. ఈ విధముగా పలికి అర్జునుఁడు గోవిందునితో-నేనింక యుద్ధము చేయను-అని తన దృఢ నిశ్చయమును తెలిపి పలుకక మిన్నకుండెను.

**శ్లో. త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత ।**
**సేనయో రుభయో ర్మధ్యే విషీదన్త మిదం వచః ॥** 10

*తే.గీ. అరయగా నిట్లు నుభయ సైన్యముల నడుమ*
*వ్యసనముం జెందు శ్వేతవాహనుని జూచి*
*భరత భూపాల ! దరహాస విరులు గురియ*
*పలికె నా హృషీకేశుఁ డేర్పడఁగ నిట్లు.*

**తాత్పర్యము :-** సంజయుఁడు శ్రీకృష్ణుని పలుకులను ధృతరాష్ట్రునికి ఇట్లు తెలియఁజేయుచున్నాడు. యుద్ధభూమిలో ఉభయ సేనా మధ్యమునకు వచ్చిన తరువాత అర్జునుఁడు ఇట్లు దుఃఖించుట కాంచిన కృష్ణుఁడు ఎగతాళి గా చిరునవ్వు నవ్వి అర్జునునితో ఇట్లు పలికెను.

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః ॥** 11

*తే.గీ. ధరణి దుఃఖింపగాఁ బడఁ దగని వారి*
*కొఱకు దుఃఖించి యీ రీతి ప్రాజ్ఞునట్లు*
*పలుకుచున్నావు - చచ్చినవారిఁ గూర్చి*
*గాని బ్రతికియున్నట్టి యెవ్వాని గూర్చి*
*గాని పండితవరులు దుఃఖమును గొనరు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నీవు చింతించగూడని వారినిగూర్చి చింతించుచున్నావు. పండితులవలె శ్రుతి స్మృతులను ఉట్టంకించుచున్నావు. సరే; పండితులైనవారు. చనిపోయినవారికొఱకు విచారింపరు, పైగా బ్రతికినవారికొఱకు చింతించరు.

**విశేషార్థము :-** ఈ శ్లోకము భగవద్గీతకంతకు బీజప్రాయమని పెద్దలు చెప్పుదురు. గీతా శాస్త్రమంతయు ఈ శ్లోకములో ఇమిడియున్నది. ఆత్మ

నిత్యమైనది. కావున దాని స్థితిగతులను గూర్చి పండితులు విచారింపరు. వారు సమదర్శులు గదా !

**శ్లో. న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।**
**న చైవ న భవిష్యామ స్సర్వే వయ మతః పరమ్ ॥ 12**

*తే.గీ. నేను నుంటిని మఱియును నీవు నుంటి*
*వీ జనాధిపులును మున్ను నెన్ననుండి*
*రింత యిది యేల మన మెల్ల నింక మీద*
*లేక పోవుదు మను మాటలేదు విజయ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నేను ఎప్పుడును లేకుండ ఉండలేదు. అట్లే నీవు, ఈ రాజులు కూడ. ఈ రాజులు, మన మందరము లేకుండుట ఎప్పుడును ఉండబోదు సుమా !

**విశేషార్థము :-** ఆత్మ చావు లేనిది; అది నిత్యము. కావున అర్జునుఁడు, భీష్మద్రోణాదుల కొఱకు విలపించుట తగదని చెప్పుచున్నాడు.

**శ్లో. దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి ॥ 13**

*తే.గీ. దేహి కీ దేహమందు నే తీరుగాగ*
*బాల్యదశయును యౌవన వార్ధకములు*
*వరయఁ గలుగునో యటులె దేహాంతరమును*
*గలుగు నని యెంచి ధీరుఁడు కలతపడడు.*

**తాత్పర్యము :-** దేహమును ధరించిన ఆత్మ ఈ స్థూల దేహములో బాల్య, యౌవన, కౌమార-మనెడి మూడు దశలను పొందినట్లుగానే మఱియొక దేహమును చేరుకొనును. ధీరులైనవారు దీనికై వగవరు; మోహములో మునిగిపోరు.

**శ్లో. మాత్రాస్పర్శా స్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినో, ఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14**

*తే.గీ. వరల శబ్దాది విషయ సంబంధములను*
*కలుగు శీతోష్ణ సుఖదుఃఖములును మనకు*
*వచ్చుచును పోవునట్టి వీ వసుధలోన*
*స్థిరము గావని తెలిసి కౌంతేయ వాని*
*నోర్చుకొనుటయె ప్రాజ్ఞత యోయి విజయ !*

**తాత్పర్యము :–** చెవి మొదలైన ఇంద్రియములు శబ్దము మొదలగువాని సంబంధము వలన శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వాలు కలుగుచున్నవి. ఆ ద్వందాలు సంయోగ వియోగములతోఁ గూడినట్టివి. అవి అనిత్యము. కనుక వాటిని సహించి భరించుట నేర్చుకొనుము.

**శ్లో. యం హి న వ్యథయం త్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమ దుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15**

*తే.గీ. భువిని సుఖదుఃఖముల సమంబులుగ నెంచు*
*ధీర పురుషుని దరికి నేతేరఁబోవు*
*బాధ లెవియును; వాఁడె కైవల్య సుఖము*
*పొంద నర్హుండగున్ పార్థ ! పురుష వృషభ !*

**తాత్పర్యము :–** పురుషశ్రేష్ఠ ఓ అర్జునా ! ఇటువంటి సుఖదుఃఖములను సమముగా భావించి ఏ పురుషుఁడు బాధపడకుండనుండునో అటువంటి ధీరుఁడే మోక్షపదవికి తగినవాఁడగును.

**శ్లో. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయో రపి దృష్టోఽన్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16**

*తే.గీ. అరయఁగా శరీరం బనిత్యమ్ము సుమ్ము*
*ఆత్మ నిత్యమ్ము రెంటి యాథార్థ్యములను*
*జగతిలోపల తత్త్వదర్శనులు మిగుల*
*తెలిసి మనుచుందు రోయి కుంతీ సుపుత్ర !*

**తాత్పర్యము :–** అనిత్యములయిన దేహాదులు నశించునట్టివి. నిత్యమైన ఆత్మకు నాశము లేదు. తత్త్వము తెలిసినవారు ఈ రెండు విషయములను చక్కగా గుర్తించగలరు.

**విశేషార్థము :-** సత్-అసత్ ఈ రెండింటియొక్క తత్త్వము ఇందులో వివరింపబడినది. దేహి నిత్యసత్యం - దేహాదులు మిథ్య (దేహి = దేహము గలవాఁడు = జీవుఁడు.)

**శ్లో. అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్ ।**
**వినాశ మవ్యయ స్యాస్య న కశ్చిత్కర్తు మర్హతి ॥** 17

*తే.గీ. వెలయ జగమునందెల్ల వ్యాపించియుండు*
*నది నశింపని దని నీవు మది నెఱుఁగుము*
*శాశ్వతంబగు దాని నాశం బొనర్ప*
*నర్హుఁడగు వాఁడు లేడు బొమ్మరసి చూడ.*

**తాత్పర్యము :-** మన కంటికి కనపడు ఈ జగ మంతయు ఒక్క దానిచే వ్యాపింపబడియున్నది. అదొక్కటే నాశములేనిది. అట్టి నాశము లేనిది; నిత్యము-అయినదానికి నాశము తలపెట్టుటకు ఎవ్వరును సమర్థులుగారు.

**విశేషార్థము :-** జీవుని స్వరూపము ఇందు పేర్కొనబడినది.

**శ్లో. అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తా శ్శరీరిణః ।**
**అనాశినోఽ ప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ! ॥** 18

*తే.గీ. అప్రమేయము నవినాశి యరయ నిత్య*
*మైనదగు నాత్మ ధరియించునట్టి దేహ*
*సముదయ లెన్నఁగా నశాశ్వతము లౌట*
*లెమ్ము కదనం బొనర్ప లే లెమ్ము విజయ !*

**తాత్పర్యము :-** అర్జునా ! ఏ ప్రమాణముచేత ఆలోచించినను ఆత్మ నిత్యమైనట్టిది మఱియు నాశము లేనట్టిది. ఆ ఆత్మ ధరించు శరీరములు మాత్రము నశించునట్టివి. కావున నీవు లేచి యుద్ధము చేయుటకు పూనుకొనుము.

**శ్లో. య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥** 19

*తే.గీ. ఆత్మ హాత మౌను మఱియును హాత మొనర్పు*
*ననుచుఁ దలఁచుచు పలుకుచున్నట్టి వార*
*లిఱువురును తెలియని వారలే వచింప*
*హాతము కా దాత్మహాతము చేయంగఁ బోదు.*

**తాత్పర్యము :-** ఇటువంటి ఆత్మకు 'నశించు'నని అట్లే 'నశింపబడు'నని తలచునట్టి ఇఱువురును అజ్ఞానములో నున్నవారే యగుదురు. ఆత్మకు చావులేదు. అది చంపబడదు.

**శ్లో. న జాయతే మ్రియతే వా కదాచి,**
**న్నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్య శ్శాశ్వతోఽయం**
**పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ 20**

*తే.గీ. జనన మరణాలు లేనిద్రై జగతి వెలిగి*
*లేకయుండిన దనునది లేకయుండి*
*శాశ్వత మనాది నిత్యమ్ము సదమలమ్ము*
*నైన యీ యాత్మ దేహమ్ము హాతము నైన*
*హాతము కాబోదు; లెమ్ము వీరాగ్రగణ్య !*

**తాత్పర్యము :-** ఆత్మ నిత్యము - సత్యము - అనాది. కాన దానికి పుట్టుట, గిట్టుట అనునవి లేవు. అది ఇదివఱకు లేదు; ఇక క్రొత్తగా ఉండబోదు కూడ. కావున దేహము నశించినను ఆత్మకు చావు లేదు.

**శ్లో. వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కథం ఘాతయతి హన్తి కమ్ ॥ 21**

*తే.గీ. అవ్యయంబును నవినాశి యగుచు నొప్పి*
*నిత్యమై జన్మలేనిద్రై నెగడు నాత్మ*
*యని గ్రహించిన వాఁడెట్లు హాత మొనర్పు*
*హాతము కాఁబడు నెట్లు మేలరసి చూడ.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ఈ ఆత్మ జన్మ, క్షయ, నాశము-లేనిదని తెలిసినవాడు ఎవరిచేతనైన తాను వధింపబడుట కాని, ఎవరినైన తాను వధించుటగాని ఎట్లు జరుగును ?

**శ్లో. వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥22**

*తే.గీ. జీర్ణ వస్త్రాల విడనాడ జేసి నరుఁడు*
*నూతనం బగు వస్త్రాలచేతఁ దనరు*
*నట్లుగా దేహి జీర్ణదేహాలు విడిచి*
*క్రొత్త దేహాలఁ బొందునో కుంతితనయ !*

**తాత్పర్యము :–** నరుఁడు చినిగిన వస్త్రాలను వదలివేసి క్రొత్త బట్టలను ధరించినట్లు ఆత్మ శిథిలమైన ఈ దేహమును వదలి నూతన శరీరాలను ధరించును.

**శ్లో. నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయ న్త్యాపో న శోషయతి మారుతః ॥ 23**

*తే.గీ. ఆయుధాళికి ఖండింప నలవి గాదు*
*అనలునకుఁ గూడ గాల్పంగ నలవి గాదు*
*నీరములు గూడ తడుపంగ నేరఁబోవు*
*ఆత్మ నెండింప మారుతుఁడైన తగదు.*

**తాత్పర్యము :–** ఇట్టి ఆత్మను శస్త్రములు ఖండింపలేవు. అగ్ని దహింపను లేదు. గాలి యెండింపను లేదు. జలములు తడుపను లేవు.

**శ్లో. అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ ।**
**నిత్య స్సర్వగత స్థాణు రచలోఽయం సనాతనః ॥ 24**

*తే.గీ. నిత్యమును సర్వగతమును నిశ్చలమును*
*అచలము సనాతనంబును నైన యాత్మ*
*నఱుకఁబడ దెండ దరయంగ నానఁ బోదు*
*అగ్నిచే దహింపం బడదయ్య పార్థ !*

**తాత్పర్యము :–** ఆత్మ నానదు, కాలదు, ఎండదు, నఱుకబడదు, అంతట వ్యాపించియుండును. నాశము లేనిది, అచంచలమైనది, అనాది, ఎప్పుడును ఒకే విధముగా నుండును.

**శ్లో. అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే ।**
**తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25**

*తే.గీ. చక్షురాదుల్లకైన గోచరము గాక*
*తనర కర్మేంద్రియముల కర్థమ్ముగాక*
*మనసునకుఁ గూడ కానుపించనిది యైన*
*ఆత్మతత్త్వమ్ము నెఱిఁగి దుఃఖాళి విడుము.*

**తాత్పర్యము :-** అర్జునా ! జ్ఞానేంద్రియములకుగాని, కర్మేంద్రియములకు గాని కనబడదు. మనసుకు చిక్కదు-అని శ్రుతులలో ఆత్మనుగూర్చి చెప్పబడియున్నది. ఇదంతయు తెలిసికూడ నీవు ఇటువంటి దుఃఖమును విడిచిపెట్టకుండుట న్యాయము కాదు.

**శ్లో. అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।**
**తథాఽపి త్వం మహాబాహో నైనం శోచితు మర్హసి ॥ 26**

*తే.గీ. నిత్యమును బుట్టు, గిట్టును నిత్య మనుచు*
*ఆత్మనుంగూర్చి నెమ్మదియందు నీవు*
*భావనము జేసితేని యీ పగిదిఁగూడ*
*వగపుఁగాన నీకు తగదయ్య పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ఈ ఆత్మకు చావు పుట్టుకలు నిత్యముగా గలవని నీవు నమ్మినప్పటికిని విచారింపవలదు. పుట్టుచు-చచ్చుచునుండు దేహమునే ఆత్మగా తలచినను విచారము తగదు.

**శ్లో. జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ 27**

*తే.గీ. పుట్టిన యతండు మరణంబుఁ బొంది తీరు*
*మరణ మొందిన యాతండు మరలఁ బుట్టు*
*ధర నవశ్యము గలుగు నీ నరణి గాంచి*
*వగపుఁ గాన నీకు తగ దయ్య పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** అర్జునా ! పుట్టినవాఁడు చచ్చితీరును. అట్లు చచ్చినవాఁడు మరల పుట్టును. చావు, పుట్టుకలను నీవు నమ్మియున్నావు గదా ! అవి

తప్పింపరాని విషయమని తెలిసికూడ వానికై ఇంతగా విచారించుట తగదు సుమా !

**శ్లో. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ! ।**
**అవ్యక్తనిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ॥** 28

*తే.గీ. ఆది నవ్యక్తమైనట్టి దౌచునుండి*
*వ్యక్తమైనట్టి మధ్యమం బౌచు వెలిగి*
*అరయ నవ్యక్త నిధనమైనట్టి దైన*
*ఈ శరీరముంగూర్చి నీ కేల చింత ?*

**తాత్పర్యము :-** అర్జునా ! ఈ ప్రాణులు మధ్యలో మాత్రమే అగపడును. వీనికి 'ఆది' యేమో, 'అంత్య' మేమో తెలియదు. ఈ ప్రాణులస్థితి ఇటువంటిదని తెలిసికూడ దీనికై ఇంతగా విచారించుట తగదు.

**శ్లో. ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి శ్రుత్వా ప్యేవం వేద న చైవ కశ్చిత్ ॥**

*తే.గీ. అద్భుతం బని యొకఁ డాత్మ నరసి వినును*
*అద్భుతం బంచు నొక్కఁ డీయాత్మఁ బల్కు*
*అద్భుతం బంచు మరియొక్కఁ డాత్మఁ జూచు*
*ఆత్మతత్త్వమ్ము నొక్కండు నరయ లేదు.*

**తాత్పర్యము :-** ఈ ఆత్మనుగూర్చి పలువురు పలు విధములుగా చెప్పుచున్నారు. కొందఱు దీనిని ఆశ్చర్యకరముగా చూచుదురు, మఱికొందఱు అబ్బురపడి విందురు. మరి కొందఱు వింతగా చెప్పుచుందురు. కాని, వాస్తవముగా ఎవ్వరు ఆత్మ స్వరూపమును గూర్చి ఎఱిగినవారు లేరు.

**శ్లో. దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ! ।**
**తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥** 30

*తే.గీ. జగతి వెలుగొందు నీ దేహ సముదయమున*
*వరలుచుండెడి యాత్మ యవధ్య మగును*
*నిత్యమును నౌను; -కాన యనిత్యమైన*
*ప్రాణులను గూర్చి వగవంగ వలదు విజయ !*

**తాత్పర్యము :–** ఓ పార్థా ! దేహము లన్నియు నశించినను ఆత్మ మాత్రము నాశనము లేనిదై శాశ్వతముగా నుండును. అస్థిరములైన ఈ దేహములను గురించి నీవు విచారించుట తగదు.

**శ్లో. స్వధర్మ మపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31**

*తే.గీ. అవనిలోన స్వధర్మమ్ము నరసిచూడ*
*తల్లడిల్లంగ మది నీకు తగదు పార్థ !*
*క్షత్రియున కెన్న ధర్మ సంగరము కంటె*
*ధరణిలోపల శ్రేయఃపథమ్ము గలదె ?*

**తాత్పర్యము :–** అర్జునా ! మరియొక కారణముచేత కూడ నీవు విచారించుట తగదు. నీవు క్షత్రియోచితమైన స్వధర్మమును కొంచెము ఆలోచించవలెను. స్వధర్మమైన ధర్మయుద్ధము చేయుటకంటె మరియొక శ్రేయోమార్గము క్షత్రియునికి లేదు సుమా !

**శ్లో. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ ! లభన్తే యుద్ధ మీదృశమ్ ॥ 32**

*తే.గీ. తెఱచిన ద్వారముల నొప్పు దివ్యలోక*
*మప్రయత్నముగా లభ్యమైన యుద్ధ*
*మది లభించిన రాజులే యధిక ధన్యు*
*లర్జునా ! ధర్మ సూక్ష్మమ్ము నరయు మెలమి.*

**తాత్పర్యము :–** ఓ పార్థా ! ఈ లోకములో ఏ మహారాజులకు తలచని విధముగా అయాచితముగా యుద్ధము చేయు అవకాశము కలుగునో, అట్టివారి భాగ్యమే భాగ్యము. అప్రయత్నముగా లభించిన యుద్ధము తెఱచి యుంచినట్టి స్వర్గద్వారము సుమా !

**శ్లో. అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తత స్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33**

తే.గీ. క్షత్రియోచిత ధర్మ సంగరము దీని
నలుషగా నిచ్ఛగింపంగ జాల వేని
స్వకుల ధర్మమ్ము సత్కీర్తి జారవిడిచి
పాపముల నెల్లఁ బొందంగ వలసి వచ్చు.

**తాత్పర్యము :-** ఈ యుద్ధము నీకు ధర్మ సమ్మత మైనది. మఱియు నీవు చేయఁదగినది. నీ వీ యుద్ధమును చేయక పోయిన యెడల నీవు నీ స్వధర్మమును నిర్వర్తించనివాఁడ వగుదువు. నీకు అపకీర్తి కలుగును. అదియును గాక నిన్ను పాపము చుట్టుకొనును.

**శ్లో. అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్ ।**
**సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34**

తే.గీ. ప్రజలు చిరకాలమును భూమి వదలనట్టి
అపయశమ్మును నీ తల కంటగట్టి
పలు విధమ్ముల చెప్పుకోగలరు పార్థ !
మరణమే మేలు దుర్యశోభరము కంటె.

**తాత్పర్యము :-** యుద్ధము చేయక మానివేసితి వనెడి అపకీర్తి శాశ్వతముగా నిలిచి పోవును. అందఱును నిన్నుగూర్చి హేళనగా మాట్లాడుకొందురు. గౌరవముగా బ్రతికినవానికి అపకీర్తిని మించిన మరణము వేరే లేదు.

**విశేషార్థము :-** అపయశో యద్యస్తి కిం మృత్యునా ? -భర్తృహరి.

**శ్లో. భయా ద్రణా దుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35**

తే.గీ. పేర్మితోడుత నిన్ గౌరవించునట్టి
అతిరథ మహారథులును నిన్నవహసించి
పిరికి యనియును సంగర భీతుఁ డనియు
చులకన యొనర్చి మాట్లాడఁ గలరు విజయ !

**తాత్పర్యము :-** అర్జునా ! మహారథులందఱు ఇప్పుడు నిన్నుగూర్చి గొప్పగా చెప్పుకొనుచున్నారు. నీ పిరికితనమును గ్రహించినట్లైన వారే నిన్ను యుద్ధమునకు వెఱచి పారిపోయిన పిరికిపంద వసి ఎంతో చులకనగా చూతురు.

**శ్లో. అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యన్తి తవాహితాః ।**
**నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36**

*తే.గీ. ఇదియ యదను నని నీ శత్రులెల్ల రకట*
*నీదు సామర్థ్యముల నెల్ల నింద్రజేసి*
*పలుకుదు రసహ్యమైనట్టి పలుకు లెల్ల*
*ఇంతకంటెను దుఃఖ మింకేమి వలయు.*

**తాత్పర్యము :-** నీ శత్రువులు నీ పరాక్రమమును రకరకములుగా దూషించి అనరాని మాటలనుచుండగా, వానిని వినుటకంటెను వేరొక దుఃఖ విషయము కలదా ?

**శ్లో. హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।**
**తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ ! యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37**

*తే.గీ. వీరమరణంబు గలిగిన వినుతి గలుగు*
*స్వర్గము లభించు; - విజయమ్ము ప్రాప్తమైన*
*అవనియందున రాజ్య సౌఖ్యములు గలుగు*
*కాన కౌంతేయ ! లెమ్ము సంగరము సేయ.*

**తాత్పర్యము :-** యుద్ధములో మరణించినచో నీవు వీర స్వర్గమును అలంకరించుదువు. లేక యుద్ధమునందు జయించిన యెడల రాజ్యభోగములు లభించును. ఎట్లైనను మేలే. కావున నిలుకడగా యుద్ధము చేయుము.

**శ్లో. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥ 38**

*తే.గీ. జయము నపజయమును కష్ట సౌఖ్యములును*
*లాభనష్టాలు సమము లెల్లపుడు ననుచు*
*నరసి యుద్ధ మ్మొనర్ప నాయత్తపడుము*
*పాపములు నిన్నుఁ జేర వో పార్థివేంద్ర !*

**తాత్పర్యము** :- సుఖదు:ఖములను, జయాపజయములను, లాభ నష్టములను లెక్క చేయక సమబుద్ధితో యుద్ధమున కుపక్రమించుము, నీ కే పాపము కలుగదు సుమా !

**శ్లో. ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ ! కర్మబన్ధం ప్రహాస్యసి ॥ 39**

*తే.గీ. ఆత్మనుం గూర్చి గ్రహియింపనైన యట్టి*
*సాంఖ్య మిది చెప్పినాడ నో సవ్యసాచి !*
*కర్మబంధాల దొలగింప గలుగు బుద్ధి*
*వినుము తెలిపెద నీ యోగమునను నీకు.*

**తాత్పర్యము** :- అర్జునా ! ఇంతవఱకు ఆత్మను గూర్చి తెలిసికొనుటకు సాధనమైన సాంఖ్యయోగమును నీకు బోధించితిని. ఇక కర్మబంధమును తొలగించుకొనుటకు సాధనమైన యోగమును తెలియజెప్పెదను వినుము.

**శ్లో. నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40**

*తే.గీ. లేదు ప్రారంభ నాశమ్ము, లేదు దోష*
*గణన నిష్కామ కర్మయోగమున దీన*
*స్వల్పమైనట్టి ధర్మానుసరణమైన*
*వరగ రక్షించు సంసార భయమునుండి.*

**తాత్పర్యము** :- ఇటువంటి యోగమువలన సంప్రాప్తించు కర్మ మెప్పుడును చెడదు. దీనివలన అపచారము కలుగదు. దీనిని కొంచెము ఆచరించినను సరే. 'పుట్టుక' అనబడెడి గొప్ప భయమునుండి కాపాడ బడుదురు.

**శ్లో. వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునన్దన ।**
**బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41**

తే.గీ. ఇందు నీ యనుష్ఠానము నందు పార్థ !
నిశ్చయాత్మక బుద్ధియే నిలుచు నొకట
ధర ననిశ్చిత బుద్ధుల దనరు వారి
చిత్తములు బహుభంగుల జెలగుచుండు.

**తాత్పర్యము :-** అర్జునా ! నిశ్చయము కల్గిన బుద్ధి ఒక్కటిగా ప్రకాశించుచుండును. నిశ్చయము లేని బుద్ధులు అనేక శాఖోపశాఖలుగా ఉండును.

**శ్లో. యా మిమాం పుష్పితాం వాచం ప్రవద న్త్యవిపశ్చితః ।**
**వేదవాదరతాః పార్థ ! నాన్య దస్తీతి వాదినః ॥ 42**

**శ్లో. కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।**
**క్రియావిశేష బహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43**

**శ్లో. భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే ॥ 44**

తే.గీ. వేద వాక్యార్థ వాద సంప్రీతు లగుచు
స్వర్గ సౌఖ్యాలకంటె ప్రశస్తమైన
దేదియును లేదటంచు బోధించు చెపుడు
వసుధ కామాభిలాషల వదల లేక

జన్మ కర్మఫలంబు లొసంగునట్టి
భోగ భాగ్యాల సంప్రాప్తమును గురించి
బహు విధంబుల దెలిపెడి వ్యర్థ జనుల
కుసుమ పేశలమైన పల్కులను వినుచు
అపహృతంబైన చేతస్కు లగుచు నుండు
అజ్ఞులగు భోగుల మనస్సులందు విజయ !
కలుగదు సమాధి నిశ్చయ కలిత బుద్ధి.

**తాత్పర్యము :-** ఓ పార్థా ! సమాధి నిశ్చయమైన బుద్ధి కలుగుట సులభము కాదు. మూర్ఖులు పువ్వులవంటి మెత్తని మాటలతో వేదములలోని అర్థమును వివరించుచు స్వర్గమును మించిన సుఖము లేదని చెప్పి భార్య,

బిడ్డలు, ధనము, వీనిపట్ల కోరికలు గలవారై కర్మ కాండలను పెంచినవారై జనులనందఱిని జన్మ కర్మలలోకి లాగి భోగలాలసులను చేయుచున్నారు. ఆ మెత్తని మాటలకు మోసపోయినచో ఇటువంటి భోగ పరాయణులకు సమాధి నిశ్చయ మనునది ఎట్లు కలుగగలదు ?

**శ్లో. త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥** 45

*తే.గీ. వేదములు దెల్పు త్రైగుణ్య విషయ వాంఛ*
*వదలి సుఖదుఃఖములు లేనివాడ వగుచు*
*యోగ సుక్షేమముల వాంఛ లొప్ప విడిచి*
*సత్త్వగుణ యుక్తి నాత్మ విజ్ఞాని వగుము.*

**తాత్పర్యము :-** అర్జునా ! వేదములు త్రిగుణపరులకొఱకు ప్రవచింపబడినవి. నీవు త్రిగుణాతీతుఁడవు. ద్వంద్వాతీతుఁడవు. యోగక్షేమముల మాట విడిచిపెట్టుము. ఎల్లవేళల సత్త్వగుణముతోనుండి పరబ్రహ్మమును తెలిసికొనుము.

**శ్లో. యావా నర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।**
**తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥** 46

*తే.గీ. సదమల జలాభిపూర్ణ ప్రసన్న జీవ*
*నదులు గలుగంగ స్నానపానముల కొఱకు*
*బావు లవి యేల ? అటులనే బ్రహ్మనిష్ఠ*
*పరలు జ్ఞానికి వేదాలవలన నేమి ?*

**తాత్పర్యము :-** నీరు అధికముగా లభించుచుండగా 'బావి'తో పని యేముండును ? అట్లే బ్రహ్మమును తెలిసిన బ్రాహ్మణునకు వేదములు గూడ అంత మాత్రమే సహాయపడును.

**శ్లో. కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సఙ్గోఽస్త్వకర్మణి ॥** 47

*తే.గీ. కర్మమును జేయుటకె యధికారి వీవు*
*కర్మ ఫలముల కధికారి గావు సుమ్ము*
*కర్మ ఫల కారణుండును గాక నీవు*
*కర్మములు జేయ నాసక్తి గలిగియుండు.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! కర్మను చేయుటకు మాత్రమే నీకు అధికారము గలదు. ఫలము మీద నీకెట్టి అధికారమును లేదు. కనుక నీవు ఎటువంటి కర్మనుగాని ఫలమును గాని ఆశించి ఏ కార్యమును చేయకుము. అట్లని చేయవలసిన కర్మను వదలిపెట్టకుము.

**శ్లో. యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ ! ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48**

*తే.గీ. ప్రాప్త మప్రాప్తముల సమభావమున్న*
*వరల నదె యోగ మంచు( జెప్పంగ( బడును*
*కాన నీవును సమబుద్ధి( గలిగి పార్థ !*
*కర్మఫలరక్తి వీడి యోగమున నుండి*
*కర్మలను జేయు మయ్య యీ కర్మభూమి.*

**తాత్పర్యము :-** అర్జునా ! సిద్ధి పొందినను, పొందకపోయినను సమబుద్ధితో చూచుచు యోగబుద్ధితో (పరమాత్మ భావనతో) కర్మల నాచరించవలెను. జయాపజయములు జరుగుట, జరుగకపోవుట అను సమయములలో సమాన మగు బుద్ధిని కలిగియుండుటయే 'యోగము'.

**శ్లో. దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ ! ।**
**బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49**

*తే.గీ. ఎపుడు ఫలకాంక్ష వదలరు కృపణమతులు*
*కామ్యకర్మము దైన్యము గాన నాత్మ*
*నెమ్మి నిష్కామ కర్మయోగమ్ము నందు*
*నిశ్చలంబుగ బుద్ధిని నిలుపు మయ్య !*

**తాత్పర్యము :-** ఓ ధనంజయా ! ఫలమును గోరి కర్మము నాచరించుట బుద్ధి యోగమునకు దూర మగుటయే సుమా ! అది చాల నికృష్టము.

దూషింపఁదగినది. అటువంటి కామ్యకర్మలు చేసినవారు మిక్కిలి దీనస్థితిలో కుమిలిపోవుదురు. కావున ఇటువంటి బుద్ధియోగమును నీవు ఆశ్రయించుము.

**శ్లో. బుద్ధియుక్తో జహా తీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50**

*తే.గీ. ఆత్మసంశుద్ధి గలిగిన యట్టివాఁడు*
*పాపపుణ్యాలు రెంటినీ వసుధలోనె*
*వదలు; కర్మంబులందు గొప్పదగు యోగ*
*మనఘ ! యత్నింపు యోగసాధనకు నీవు.*

**తాత్పర్యము :-** బుద్ధియోగము చేపట్టినవాఁడు పాపపుణ్యములను రెండింటిని వదలియుండును. కావున నీవు బుద్ధి యోగమును ఆచరించుటకు పూనుకొనుము. అదియే తెలివిగలవారు చేయుపని సుమా !

**శ్లో. కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।**
**జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛ న్త్యనామయమ్ ॥ 51**

*తే.గీ. ఇల మనీషులు బుద్ధియుక్తులు వచింప*
*కర్మ ఫలములు వీడి నిష్కామకర్మ*
*తనరఁజేయుచు జన్మబంధాలఁ ద్రుంచి*
*పొందుదు రనామయంబైన పుణ్యపదము.*

**తాత్పర్యము :-** ఇటువంటి బుద్ధియోగమును అనుసరించు బుద్ధిమంతులందఱు కర్మ ఫలమును వదలి, జన్మబంధమునుండి విముక్తి పొంది ఎటువంటి దుఃఖము లేని స్థానమును చేరుకొని ప్రకాశించుచుందురు.

**శ్లో. యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।**
**తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52**

*తే.గీ. మహిని నీ బుద్ధిమోహ కల్మషము నెపుడు*
*విడువఁ గలుగునో యప్పుడు విన్నయట్టి*
*వినగఁ దగినట్టి యర్థాల వింతయైన*
*వినుత వైరాగ్య మబ్బునో విజయ ! నీకు.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! నీ 'బుద్ధి మోహము'ను కలుషమును ఎప్పుడు దాట గలుగునో అప్పుడు అంతవఱకు విన్న విషయముల పట్ల కూడ ఆశ్చర్యకరముగా వైరాగ్యభావము ఏర్పడును.

**శ్లో. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53**

*తే.గీ. అర్థవాదము కర్మకాండాది శ్రుతుల*
*చలన మొందిన నీ బుద్ధి చలన ముడిగి*
*తగ సమాధిని నిశ్చలతన్ వహించు*
*నెపుడు - యోగ సంసిద్ధి నీ కపుడు గల్గు.*

**తాత్పర్యము :-** నీ బుద్ధి చపలత్వము, వేద శాస్త్రోపదేశములు వినుటవలన నిలుకడగలిగినదై ఎప్పుడు సమాధిస్థితిని పొందునో అప్పుడే నీవు యోగ సిద్ధిని పొందగలవు.

*అర్జున ఉవాచ :-*

**శ్లో. స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ! ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ 54**

*తే.గీ. అని వచించిన కృష్ణుని గని కిరీటి*
*వరలఁగ సమాధి నిష్ఠలోఁ బరగుచుండు*
*లలిత సద్బ్రహ్మ విజ్ఞాని లక్షణం బ*
*దెట్టిది ? ముకుంద ! యుపదేశ మేమి యొసఁగు*
*ఆచరణ మెట్టి ? దే రీతి నతఁడు మెలఁగు ?*

**తాత్పర్యము :-** స్థిత ప్రజ్ఞత్వమును గూర్చి చెప్పినదానిని గుర్తించి అర్జునుఁడు కృష్ణునితో "ఓ మాధవా ! సమాధిస్థితిలో స్థితప్రజ్ఞుని తెలిసికొనగల గుర్తులేవి ? అతడు కూర్చుండు తీరు ఎట్లుండును ? దేనిని గుఱించి దేనిని పొందును".

**విశేషార్థము :-** యోగఫలము సిద్ధించుటకు స్థితప్రజ్ఞ ముఖ్యమైనదని గుర్తించిన అర్జునుఁడు ఇట్లు ప్రశ్నించుచున్నాడు.

ఎట్టివారినైనను గుర్తించుటకు మాట తీరు, ముఖ కవళికలు, చేష్టలు మున్నగునవి ముఖ్యమైనవను విషయమును శ్రీ కృష్ణుఁ డిచ్చట తెలియ జేయుచున్నాఁడు.

*శ్రీభగవా నువాచ :-*

**శ్లో. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥** 55

*తే.గీ. అనిన నరుఁజూచి మాధవుఁ డనియె పార్థ !*
*మనమునందలి సకల కామముల నరుఁడు*
*విడువఁ గలిగిన యప్పుడే వెలయు నాత్మ*
*యందె యాత్మచే మోదంబునందుచుండి*
*సుస్థిత ప్రజ్ఞుఁ డనఁబడు చూవె భువిని.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! తన మనస్సులోని కామముల (కోరికల) నన్నిటిని విడిచిపెట్టి ఎవఁడు ఆత్మస్వరూపములోనే సంతుష్టిచెందునో అతఁడే స్థితప్రజ్ఞుఁడు.

**విశేషార్థము :-** భార్య, బిడ్డలు, ధనము-ఇత్యాదులు సకల కామములు.

**శ్లో. దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీ ర్మని రుచ్యతే ॥** 56

*తే.గీ. దుఃఖముల బాధ, సుఖములందునను వాంఛ*
*క్రోధ భయ రాగములకు లోకువయునైన*
*గుణము, లేనట్టి మౌని నిక్కువము గాఁగ*
*సుస్థిత ప్రజ్ఞుఁ డనఁబడు చూవె భువిని.*

**తాత్పర్యము :-** సుఖములకు పొంగిపోవుట, దుఃఖములకు క్రుంగిపోవుట ఈ రెండు లేనివానిని మఱియు ప్రేమ, భయము, క్రోధమువంటి భావములు లేనివానిని స్థితప్రజ్ఞుఁడని యందురు.

**శ్లో. య స్సర్వ త్రానభిస్నేహ స్తత్త త్ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** 57

*తే.గీ. పొంద గలుగు శుభాశుభంబులను గాంచి*
*ఒనర నానందమును ద్వేష మొందకుండ*
*అన్నిట తటస్థభావుడై యలరు నతడె*
*సుస్థితప్రజ్ఞ డనబడు జూవె భువిని.*

**తాత్పర్యము :-** అర్జునా ! అన్నింటిలోను తటస్థముగా నుండుచు ఎవడు శుభాశుభములు సంభవించునప్పుడు క్రమముగా సుఖదుఃఖములకు లోనుగాకుండ నుండునో అట్టివానినే స్థితప్రజ్ఞు డందురు.

**శ్లో. యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।**
**ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58**

*తే.గీ. విషయములనుండి యవయవ వితతి కూర్మ*
*మమర తనలోనికి నిముడ్చునట్లు గాగ*
*ఇంద్రియ వితానమున్ నిగ్రహించు నతడు*
*సుస్థితప్రజ్ఞ డనబడు జూవె భువిని.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! తాబేలు తన అవయవములను ముడుచుకొను రీతిగా ఎవ్వడు తన ఇంద్రియములను విషయములనుండి వెనుకకు మఱలింప గలడో అతని ప్రజ్ఞ స్థిరమైనదని యందురు.

**శ్లో. విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59**

*తే.గీ. ఇల నిరాహారుడైన దేహికిని విషయ*
*వితతి విడు, గాని వాంఛలు వీడగలవె*
*అలర పరమాత్మదర్శన మందినంత*
*విషయ వాంఛలు తుదముట్ట వీడిపోవు.*

**తాత్పర్యము :-** ఇంద్రియములకు విషయసుఖము ఆహారము (చెవికి శబ్దమువలె). అటువంటి విషయములకు దూరముగా ఉండినయెడల ఇంద్రియములు నిలుకడగలిగి యుండును. కాని వాంఛ మాత్రము పూర్తిగా నశింపదు. అయినను ఆత్మజ్ఞానముచే పరబ్రహ్మమును తెలిసికొన్నదే తడవు విషయ వాంఛలు నశించును.

**విశేషార్థము :-** నిరాహారమనగా ఉపవాసము కాదు. విషయసుఖములకు దూరముగా నుండుట. (కన్ను-చక్కని దృశ్యాలు సినిమా) వగైరా చూడకుండుట 'పరం' అనగా ఉత్కృష్టమైన 'ఆత్మ' అని అర్థము.

**శ్లో. యతతో హ్యపి కౌన్తేయ ! పురుషస్య విపశ్చితః ।**
**ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥** 60

*తే.గీ. యతన మొనరించు పండితుండైన వాని*
*మనసునుం గూడ హరియించు - నొవర మిగుల*
*క్షోభలను పుట్టనిల్లుగాఁ జూడ నొప్పు*
*ఇంద్రియంబులు విజయ ! మహేంద్రతనయ !*

**తాత్పర్యము :-** ఓ పాండుపుత్రా ! బ్రహ్మజ్ఞానముకొఱకు యత్నించువాడైనను ఎంతటి పండితుడైనను వాని మనసును ఇంద్రియములు తమ వశము చేసికొనును. ఇంద్రియములు మిక్కిలి బలీయములు సుమా !

**విశేషార్థము :-** ఇందు ఇంద్రియముల దుష్టస్వభావము వివరింపబడినది. 'ప్రమాథీని' అను మాటవలన ఇంద్రియములు సుడిగుండములవంటివి అని భావము.

**శ్లో. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** 61

*తే.గీ. పరగ సకలేంద్రియంబుల వశ మొనర్చి*
*మనసు నాయందె యోగి చక్కనగ నిల్పి*
*వరలవలె; నింద్రియంబు లెవ్వనికి వశమొ*
*సుస్థిత ప్రజ్ఞు డనఁబడుఁ జూవె యతఁడు.*

**తాత్పర్యము :-** 'యోగి' అనువాఁడు ఇంద్రియములను నిగ్రహించుకొని మనస్సును నాయందే నిలిపియుంచవలెను. ఇంద్రియము లన్నియు ఎవని వశములో ఉండునో అతడినే స్థితప్రజ్ఞుఁ డందురు.

**శ్లో. ధ్యాయతో విషయాన్ పుంసః సఙ్గ స్తేషూపజాయతే ।**
**సఙ్గాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥** 62

*విషయములఁ గూర్చి మిగుల భావించుచుండ*
*వానియందున నాసక్తి వదలకుండు*
*వెలయ నాసక్తి కోరికల్ కలుగఁజేయు*
*కోరికలు క్రోధమూలముల్ కువలయమునఁ.*

**తాత్పర్యము :–** పురుషుఁడు తనలో లౌకిక సుఖముల(విషయాల)ను గూర్చి తలంచినట్లైన ఆవిషయములపట్ల ఆసక్తి కలుగును. దానివలన దానిని పొందితీరవలెననెడి కోరిక, దానితోపాటు క్రోధము ఏర్పడును.

**శ్లో. క్రోధా ద్భవతి సమ్మోహః సమ్మోహా త్స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥** 63

*తే.గీ. క్రోధము వివేకమున్ చెడఁగొట్టు; దాన*
*గలుగును మతిభ్రమము; దానివలన బుద్ధి*
*నాశమై పోవునో యర్జునా ! గ్రహించు*
*బుద్ధి నశియింప నశియించు పురుషుఁ డవని.*

**తాత్పర్యము :–** క్రోధమువలన అవివేకము, దానివలన స్మృతిభంగము, ఆపై ఏది చేయవచ్చును, ఏది చేయకూడ దనెడి విచక్షణ జ్ఞానము – అందుపై బుద్ధి అన్నియు నశించి, చివరకు మానవుఁడు తానే నశించిపోవును.

**విశేషార్థము :–** విషయలోలత్వము, ఇంద్రియచాపల్యము సర్వానర్థాలకు మూలమని అంతరార్థము.

**శ్లో. రాగద్వేష వియుక్తైస్తు విషయా విన్ద్రియై శ్చరన్ ।**
**ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥** 64

*తే.గీ. ఒనరఁగా మనోనిగ్రహంబును వహించి*
*రాగ విద్వేష మార్గ విభాజ మయిన*
*ఇంద్రియంబులఁ దనర సుఖించు యోగి*
*నిర్మలుండై మనశ్శాంతి నెగడు విజయ !*

**తాత్పర్యము :–** ఓ అర్జునా ! మనస్సు స్వాధీనము చేసికొని, రాగ ద్వేషాతీతముగా ఇంద్రియ నిగ్రహముతో లౌకిక కార్యములపట్ల (విషయముల పట్ల) మెలగుచున్నను సరే నిర్మలుఁడై మనఃస్థైర్యమును పొందగల్గుచున్నాడు.

**శ్లో. ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65**

*తే.గీ. నిర్మలంబైన చిత్తంబు నెగడు యతికి*
*సకల దుఃఖమ్ము లొకటిగా సమసిపోవు;*
*చిత్తనైర్మల్యునకు బుద్ధి శీఘ్రగతిని*
*సుస్థిరత నొంది వెలుఁగొందుచుండు విజయ !*

**తాత్పర్యము** :- నిర్మలమైన మనస్సు గలవానికి అన్ని దుఃఖములు ఒక్కసారిగా అంతరించిపోవును. అటువంటి ప్రసన్న ఆత్మగల యతికి త్వరలో స్థిరమైన బుద్ధి కలుగును.

**శ్లో. నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చాభావయతః శాన్తి రశాన్తస్య కుతః సుఖమ్ ॥ 66**

*తే.గీ. వర మనో నిగ్రహము లేనివాని బుద్ధి*
*నిర్మలత గాదు; దాన మానిత విశుద్ధ*
*బ్రహ్మభావన గలుగ దవ్వాని కాత్మ*
*శాంతి లభియింపఁగాఁ బోదు సవ్యసాచి !*
*శాంత మది లేక సౌఖ్య మెచ్చటను లేదు.*

**తాత్పర్యము** :- ఇంద్రియములను నిగ్రహింపలేక పోయినచో బుద్ధి కుదుటపడదు. బుద్ధికి నిలుకడలేకున్న భక్తి యేర్పడదు. నిశ్చల భక్తి లేకున్న శాంతి యుండదు. శాంతి లేకున్న సుఖము కలుగుట సున్న సుమా !

**విశేషార్థము** :- ఇంద్రియ నిగ్రహ మెంత ముఖ్యమో దానివలన అన్నియు సుసాధ్యము లని విశేషార్థము. ఈ విషయమునే త్యాగరాజు *'శాంతము లేక సౌఖ్యము లేదు'* - అను కీర్తనలో వ్రాసినాడు.

**శ్లో. ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివామ్భసి ॥ 67**

*తే.గీ. విషయ సుఖముల కోరిక విడువ నట్టి*
*ఇంద్రియములను గూడి తా స్వేచ్ఛ నగుచు*
*మనసు చరియించె నేని యమ్మనుజు ప్రజ్ఞ*
*వాత హతి నావ మునిగిన పగిదిఁ జెడును.*

**తాత్పర్యము :-** విషయలోలుఁడు స్వేచ్ఛగా ఇంద్రియముల వెంట తన మనసును పోనిచ్చును. అందుచేత నీళ్ళపై గాలిచే దెబ్బతినిపోవు నావ వలె మానవుని ప్రజ్ఞ కూడ నశించిపోవును.

**శ్లో. తస్మా ద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।**
**ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68**

*తే.గీ. విషయ సుఖముల నాసక్తి విడిచిపెట్టి*
*ఎల్ల విధముల నెవ్వాని యింద్రియములు*
*నిగ్రహ ప్రతిష్ఠ శక్తితో నెగడు - నట్టి*
*బ్రహ్మ నిష్ఠుని ప్రజ్ఞ నిర్మలము, స్థిరము*

**తాత్పర్యము :-** కావున, ఓ అర్జునా ! ఇంద్రియములను విషయ వాంఛలనుండి నేర్పుతో చక్కగా నిగ్రహించగలుగు ప్రజ్ఞనే 'స్థితప్రజ్ఞ'గా పేర్కొందురు సుమా!

**శ్లో. యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69**

*తే.గీ. సకల భూతంబులకు నిశానమయ మెద్ది*
*అందు మేల్కొను జాగ్రత్త యగుచు యోగి*
*ప్రాణు లెందున జాగ్రత్తపరు లగుదురో*
*యోగి దానిని రాతిరిగాఁగ నెంచు.*

**తాత్పర్యము :-** స్థితప్రజ్ఞుఁడు ఇతర ప్రాణులకు రాత్రియైన సమయములో మేల్కొనియుండును. ప్రాణులకు పగటివేళ మాత్రము ఇతనికి రాత్రివంటిది.

**విశేషార్థము :-** సాధారణముగా లోకములోని ప్రాణులు విషయ సుఖము లనబడెడి అజ్ఞానము (రాత్రి)లో మునిగిపోయినచో, సంయమనశక్తి గల మౌని మాత్రము వాటికి దూరముగా బ్రహ్మచింతనలో ఉండును. ఇచట బ్రహ్మ చింతనము పగలు వంటిది.

**శ్లో. ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్ ।**
**తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తి మాప్నోతి న కామకామీ ॥**

*తే.గీ. జగతి బ్రవహించు నదులలో జలము లన్ని*
*నిండి సుస్థిరతన్ వెల్గుచుండు జలధి*
*నెటుల జొచ్చునో; యట్టులే యెల్ల కోర్కె*
*లరయఁగా బ్రహ్మనిష్ఠునియందుఁ జొచ్చి*
*అణగి సుఖశాంతు లిచ్చు కామాత్మ కీడదు.*

**తాత్పర్యము :-** మేర తప్పని (హద్దుమీరని) సముద్రములో ఎన్ని నదులనుండి జలములు వచ్చి చేరినను సముద్రము చలింపదు. అట్లే ఏ పురుషుని మనస్సులో కోర్కె లన్నియు నశించునో ఆ మహాపురుషుడే శాంత స్వరూపుడై ముక్తిని పొందును. కాని కోర్కెలు గలవాఁడు గాదు.

**శ్లో. విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిస్పృహః ।**
**నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి ॥** 71

*తే.గీ. సకల వాంఛల విడనాడి సర్వవిషయ*
*ములను నిస్పృహ భావమ్ము వెలయఁ బొంది*
*భువి నహంకార మమకారములను వీడ*
*గలుగు పురుషుండె శాంతి సౌఖ్యములు బొందు.*

**తాత్పర్యము :-** సమస్త వాంఛలను, అహంకార మమకారాలను విడిచి అన్నింటిలోను తటస్థభావముతో సంచరించువాఁడు శాంతిని పొందగలుగును.

**శ్లో. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ ! నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాఽస్యా మన్తకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥** 72

*తే.గీ. నెమ్మి నీ స్థితినే బ్రహ్మనిష్ఠ యంద్రు*
*మోహ మది బొంద డీ స్థితిఁ బొందె నేని*
*అంత్యదశయందు నీ నిష్ఠ యమరె నేని*
*బ్రహ్మనిర్వాణ పదమును బడయు పార్థ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! కర్మఫల సన్న్యాసముతో కూడిన ఇటువంటి స్థితినే 'బ్రహ్మనిష్ఠ'గా పేర్కొందురు. ఇట్టివారికి మోహ మనునది కలుగదు. కనీసము ప్రాణము పోవు సమయమునందైనను ఇట్టి స్థితిని పొందగలిగిన 'బ్రహ్మనిర్వాణము' లభించును సుమా !

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
సాంఖ్యయోగంబను
రెండవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ।
యథోల్బేనావృతో గర్భ స్తథా తేనేద మావృతమ్ ॥

(3-38)

అర్జునా ! పొగ నిప్పును గప్పినట్లుగా, మలినము అద్దమును క్రమ్మినట్లుగా, మావి గర్భములో నున్న శిశువును క్రమ్మినట్లుగా కామము జ్ఞానమును కప్పివేయును.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం తృతీయోఽధ్యాయః

## కర్మయోగము

*అర్జున ఉవాచ :-*

**శ్లో. జ్యాయసీ చేత్కర్మణ స్తే మతా బుద్ధి ర్జనార్దన ।**
**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥** 1

*తే.గీ. అనిన శ్రీకృష్ణుతోడ నిట్లనె కిరీటి*
*కర్మయోగంబు కంటె నో కమలనయన !*
*జ్ఞానయోగంబు మేలౌట సత్యమైన*
*ఘోరమగు యుద్ధకర్మ( బాల్గొను మటంచు*
*నన్ను నియమింతు వేలయ్య నళిననాభ !*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! కర్మ జ్ఞానములలో జ్ఞానమే గొప్పదని యంటివి కదా! మఱి నన్నెందులకు యుద్ధము చేయుమనుచున్నావు.

**విశేషార్థము :-** ఈ ప్రశ్న ఆధారముగా తక్కిన 16 అధ్యాయములు సమాధానముగా విపులముగా వివరింపబడినవి.

**శ్లో. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయ సీవ మే ।**
**త దేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥** 2

*తే.గీ. మిశ్రభావార్థములు వోలె మించు వాక్య*
*ములను నా బుద్ధి కలవరంబును వహింప*
*జేసెదవు - దేన శ్రేయంబు( జెందనగునొ*
*దాని వివరింపుమనె, పాండుతనయు( డంత.*

**తాత్పర్యము:**-సంశయముతోఁ గూడిన సందిగ్ధ వాక్యములతో నన్నేల బాధింతువు ? ఓ కృష్ణా ! నిశ్చయమైనదియు నాకు శ్రేయస్సును కలిగించునదియు నయిన ఒక్క వాక్యమును పల్కుము.

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥** 3

*తే.గీ. పార్థునిం గాంచి కృష్ణుండు పలికె నిట్లు*
*అర్జునా ! సృష్టి నాదియం దరసిచూడ*
*నీ జగంబున సాంఖ్యయోగీశ్వరులకు*
*జ్ఞానయోగంబు; మఱియుఁ బ్రశస్త యోగి*
*వరులకున్ కర్మయోగంబుఁ బరగ రెండు*
*నిష్ఠలు వచించినాడను నేను వినుము.*

**తాత్పర్యము :**- ఓ అర్జునా ! ముందు నేను రెండు విధములైన బ్రహ్మనిష్ఠను తెలియఁ జెప్పితిని. అవియే సాంఖ్యులకు జ్ఞానము; యోగులకు కర్మ.

**విశేషార్థము :**-కర్మకంటెను జ్ఞానము శ్రేష్ఠమని అర్జునుఁడు గ్రహించినను జ్ఞాన కర్మాధికారములో నుండు గుణదోషాలను గూర్చి ఈ మూడవ అధ్యాయములో బోధించుచున్నాడు.

**శ్లో. న కర్మణా మనారమ్భా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।**
**న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥** 4

*తే.గీ. పుణ్య కర్మలఁ జేయకపోవు దాన*
*భువిని నిష్కామ కర్మలఁ బొందఁ దగిన*
*ఫలముఁ బొందఁడు నరుఁడు; కేవలము తనువు*
*సన్న్యసించిన మాత్రాన జ్ఞానసిద్ధిఁ*
*బడయఁ జాలఁడు తెలియు మో పార్థ ! నీవు.*

**తాత్పర్యము :**-కర్మలు చేయకపోవుటచేత జీవునకు కర్మ శూన్యత్వము కలుగదు. అట్లని కర్మములను వదలిన కారణముచేత సిద్ధియు కలుగబోదు.

**విశేషార్థము** :–చిత్తశుద్ధిలేని కర్మ సన్న్యాసమువలన ప్రయోజనము లేదని భావము.

**శ్లో. న హి కశ్చిత్క్షణ మపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః ॥ 5**

*తే.గీ. ఎవరు నెప్పుడు క్షణకాల మేని కర్మ*
*నాచరింపక యుండ రీ యవని; జనులు*
*పుట్టినప్పుడె తమతోడఁ బుట్టినట్టి*
*గుణములకు వశ్యులై కర్మఁ గొందు రకట.*

**తాత్పర్యము** :– అన్ని ప్రాణులుఁ గూడ ప్రకృతికి వశులై ఒక్క క్షణము కూడ ఊరకుండక కర్మలను చేయుచునేయుండును.

**విశేషార్థము** :– 'ప్రకృతి' అనగా జన్మకు కారణమైన పూర్వమునుండి సంపాదింపఁబడిన గుణకర్మలు.

**శ్లో. కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇన్ద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6**

*తే.గీ. మూర్ఖులగు వార లింద్రియంబుల నణంచి*
*ఇంద్రియ సుఖాల మనసునందే స్మరించి*
*కపటవర్తనులై మనుగడను గడప*
*సాగుచుందురు నిష్ఫల జన్మ లగుచు.*

**తాత్పర్యము** :– నిజముగా విషయవాంఛలు నశించకపోయినను ఆడంబరముకొఱకు కర్మలను త్యజించినవానివలె అభినయించుచు చిత్తములో మాత్రము ఇంద్రియచాపల్యము గలిగిన వానిని కపట సన్న్యాసియని చెప్పవలెను. అటువంటి పాపాచారముకంటె కర్మలు చేయుటయే మేలుగా కనిపించు చున్నది.

**శ్లో. యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।**
**కర్మేన్ద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7**

తే.గీ. అలర జ్ఞానేంద్రియంబుల నణచిపెట్టి
జగతి కర్మేంద్రియముల నిష్కామ్ముఁ డగుచు
కర్మముల నాచరించు సద్గుణుఁడె శ్రేష్ఠుఁ
డనఁగఁ బరగును శ్వేతవాహన ! నిజమ్ము.

**తాత్పర్యము :-** అర్జునా ! మనస్సులో జ్ఞానేంద్రియములను నిగ్రహించి, ఆసక్తిని విడిచిపెట్టి, కర్మేంద్రియములతో కర్మయోగమును అనుసరించువానిని ఉత్తమునిగా భావించవలెను.

**శ్లో. నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।**
**శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥** 8

తే.గీ. నియతమైనట్టి కర్మల నిష్ఠతోడ
నాచరింపుము, నీవట్టి వాచరింప
కునికి జీవిత యాత్ర సాగుట భరమ్ము
కర్మయోగమ్ము సారమ్ము మర్మ మిదియె.

**తాత్పర్యము :-** నిత్య నైమిత్తిక కర్మలు చేయుచుండవలెను. కర్మలను మానుటకంటె ఆచరించుటయే ఉత్తమము. కర్మలను మానినట్లయిన శరీరయాత్ర కూడ సాగదు.

**విశేషార్థము :-** వర్ణాశ్రమ ధర్మములే నియత కర్మలు. వీటివలన మనస్సు ఇహాము నుండి పరమునకు మరలి 'చిత్తశుద్ధి' కలుగును. ఆపై జ్ఞానాధికారము. ఇదియే కర్మయోగ రహస్యము.

**శ్లో. యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః ।**
**తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసఙ్గ స్సమాచర ॥** 9

తే.గీ. రక్తి యజ్ఞార్థ కర్మాచరణము కంటె
అన్యమగు కామ్య కర్మంబులందు జగము
మునిఁగె; యజ్ఞార్థ కర్మంబులను మఱువక
ఫలముఁ గోరక కర్మంబు సలుపు మీవు.

**తాత్పర్యము :-** అర్జునా ! ఈశ్వరార్పణ భావముతో చేయు కర్మవలన బాధ కలుగదు. ఇతర భావముతో చేసినట్లయిన బంధము కల్గును. కాబట్టి ఫలాభిలాష వదలి కర్మను ఆచరించుము.

శ్లో. సహయజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్ ॥ 10

*తే.గీ. ప్రజల సృజియించి వారితోఁ బాటు యజ్ఞ*
*విధుల సృష్టించి - ప్రజలు వివేకు లగుచు*
*యజ్ఞము లొనర్చి యభివృద్ధినొందుఁ డిద్ది*
*ఇష్ట కామ్యార్థ సిద్ధియై యెసఁగు ననుచు*
*వరల సృష్ట్యాదిలో ప్రజాపతి వచించె.*

**తాత్పర్యము :-** సృష్టి ప్రారంభించుటకు మునుపు బ్రహ్మ ప్రజలను యజ్ఞములతోఁ బాటు సృజించెను. "మీరు యజ్ఞముఁ జేయుచు అభివృద్ధి జెందుడు. అవే మీ కోరికలను తీర్చగలవు" అని ఉద్బోధించెను.

శ్లో. దేవా న్భావయ తానేన తే దేవా భావయన్తు వః ।
పరస్పరం భావయన్తః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

*తే.గీ. యజ్ఞములవల్ల దేవత లాత్మతృప్తి*
*నంది మిమ్ముల సంతృప్తి నొందఁ జేతు*
*రటుల నన్యోఽన్య సంతృప్తు లంది మిగుల*
*శ్రేయములు బొంది వరలుఁడీ చెలువు మీర.*

**తాత్పర్యము :-** ఈ యజ్ఞములుచేసి మీరు ఇంద్రాది దేవతలను తృప్తిపరచుడు. వారు మీ కోరికలను ఫలింపఁజేయుదురు. ఈ విధముగా మీరు పరస్పరము వృద్ధినందుచు ఉత్తమమైన శుభములను పొందగలరు సుమా!

**విశేషార్థము :-** యజ్ఞములచే దేవతలను తృప్తి పొందించుటవలన వారు మానవులకు వర్షాది రూపములైన కోర్కెలను తీర్చగలరు.

శ్లో. ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥ 12

*తే.గీ. యజ్ఞ యాగాల పూజల నంది, మీకు*
*నిష్ట భోగాలు నొసఁగుదు రెపుడు సురలు*
*వారొసంగిన వానిని వారి కిడక*
*అనుభవించు కృతఘ్నుఁడే యవని దొంగ.*

**తాత్పర్యము :-** యజ్ఞములలో మీచే గౌరవమునందుకొనిన దేవతలు మీకు ఇష్ట భోగాలను (భార్య, బిడ్డలు మొ॥వి) ఇత్తురు. ఇట్లే దేవతలవలన పొందిన సంపదలను వారికి సమర్పించకుండ అనుభవించువారు దొంగలే సుమా !

**శ్లో. యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।**
**భుఞ్జతే తే త్వఘం పాపా యే పచ న్త్యాత్మకారణాత్ ॥** 13

*తే.గీ. యజ్ఞములు సేసి మిగిలిన స్వల్పమౌ ప్ర*
*సాదమె భుజించు సుజనుండు సర్వపాప*
*చయ విముక్తిని బొం-దట్లు చేయకుండ*
*తనకొఱకె వండుకొని తిను ధరణిఁ బాపి.*

**తాత్పర్యము :-**యజ్ఞములు నిర్వహించి వానిలో మిగిలిన యజ్ఞశేషమును భుజించు మానవులు సమస్త పాపమునుండి విముక్తి జెందుచున్నారు. దేవతల ప్రీతికొఱకు కాక కేవలము తమ పొట్టకొఱకే వండుకొనువారు పాపమునే భుజించుచున్నారు.

**శ్లో. అన్నా ద్భవన్తి భూతాని పర్జన్యా దన్నసంభవః ।**
**యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥** 14

*తే.గీ. ప్రాణికోటులు నన్నంబువలనఁ బుట్టు*
*అన్నములుఁ బుట్టు వానచే మిన్నగాను*
*వాన గలుగును మేఘంబువలన మిగుల*
*మేఘములుఁ బుట్టు యజ్ఞముల్ మేల్మి సేయ*
*కర్మవలననె యజ్ఞముల్ గలుగుచుండు.*

**తాత్పర్యము :-** ప్రాణులన్నియు అన్నమువలన జన్మించుచున్నవి. ఆ అన్నము వర్షమువలన కలుగుచున్నది. ఆ వర్షము యజ్ఞమువలన వచ్చుచున్నది. ఇక యజ్ఞములు కర్మలవలన కలుగుచున్నవి.

**శ్లో. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।**
**తస్మా త్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥** 15

తే.గీ. కర్మము జనింప బ్రహ్మంబు కారణంబు
బ్రహ్మ మది పుట్టె పరమాత్మవలన గాన
సర్వగతమైన బ్రహ్మమ్ము శాశ్వతముగ
యజ్ఞమున నుంచబడె నంచు నరయవలయు.

**తాత్పర్యము :-** కర్మము వేదమువలన పుట్టినది కాగా వేదము అక్షర రూప పరమాత్మ వలన పుట్టుచున్నది. కాబట్టి సర్వ కారణమైన పరమాత్మ సర్వవ్యాపకమై ఎల్ల వేళల యజ్ఞములో స్థిరముగా ఉండును. (బ్రహ్మము = వేదము)

**శ్లో. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।**
**అఘాయు రిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16**

తే.గీ. ఇహమునం దిట్లుగాఁ బ్రవర్తింప బడిన
జగతి చక్రము నెవఁ డనుసరణ సేయఁ
డతఁడు పాపాత్ముఁడై విషయాభిలాష
వ్యర్థజీవితయాత్రలోఁ బడి కృశించు.

**తాత్పర్యము :-** ఓ పార్థా ! పైన చెప్పినట్లుగా ఈశ్వరునిచే త్రిప్పబడుచున్న ఈ జగచ్చక్రమును ఈ లోకములో ప్రతి ఒక్కరు అనుసరించవలెను. అటుల కానివాని జీవితము పాపము కూడుకొన్న దగును. విషయలోలుఁ డైన వాని జన్మ వ్యర్థము.

**విశేషార్థము :-** శ్రుతి స్మృతులందు చెప్పినట్లు నియమిత కర్మలను తప్పక ఆచరింపవలయును.

**శ్లో. యస్త్వాత్మరతి రేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సన్తుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ 17**

తే.గీ. ఆత్మలోననె యానందమందు నెవఁడు
ఆత్మయందుననే తృప్తినందు నెవఁడు
ఆత్మలోఁ దానె సంతోషమందు నెవఁడు
వాని కిలఁ జేయఁ దగినది కానరాదు.

**తాత్పర్యము :-** ఆత్మజ్ఞాన సంపద గల్గినవానికి ఆత్మయందే ప్రీతి, ఆత్మయందే సంతుష్టి, ఆత్మయందే తృప్తి కలిగియుండుటతో ఇక వానికి చేయవలసిన పను లనునవి ఉండవు.

**విశేషార్థము :-** ఆత్మజ్ఞానికి యజ్ఞములతో, కర్మలతో నెట్టి అవసరమును లేదని భావము.

**శ్లో. నైవ తస్య కృతే నార్థో నాకృతేనేహ కశ్చన।**
**న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః ॥ 18**

*తే.గీ. పరలగ నిటు లాత్మానంద భరితు డయిన*
*బ్రహ్మవేత్తకు కర్మాచరణము నొకటె,*
*ఆచరింపమి నొక్కటె యగు ఫలమ్మ*
*ఆశ్రయింపంగ దగిన భూతాళి లేవు.*

**తాత్పర్యము :-** బ్రహ్మనిష్ఠునికి ఈ భూమిలో పొందవలసిన ప్రయోజనము లేదు. కాబట్టి ప్రయోజనములకు సాధనములైన కర్మలతో అతనికి పనిలేదు. అతడు దేనినిగాని ఆస్థ(కోరిక లేక ఇష్టము)తో ఆచరింపడు, ఆశ్రయింపడు. కావున ఇహలోక ప్రయోజనములతో అతనికి పనిలేదు.

**శ్లో. తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19**

*తే.గీ. కావున ఫలాభిలాషల గడకు నెట్టి*
*నీదు విధ్యుక్త కర్మంబు నెఱపు మెపుడు*
*ఫలము గోరక కర్మంబు సలుపు నట్టి*
*పురుషునకు మోక్ష మవలీల దొరకు పార్థ!*

**తాత్పర్యము :-** ఫలాపేక్ష లేకుండ కర్మను ఆచరించువాడే మోక్షమును పొందును. కావున నీవుకూడ ఫలమును ఆశించకుండ నియమిత కర్మలను నిర్వర్తింపుము.

**విశేషార్థము :-** 'పర మాప్నోతి' అనగా ఉత్కృష్టమైన పురుషార్థమును (మోక్షమును) పొందునని భావము.

**శ్లో. కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ 20**

*తే.గీ. జనకుఁ డాదిగఁ గల యట్టి చక్రవర్తు*
*లవని నిష్కామ కర్మల నాచరించి*
*మోక్షఫల మంది - రీవును మోద మలర*
*జనులు సన్మార్గు లగుటకు సలుపు కర్మ.*

**తాత్పర్యము** :-జనకుఁడు మొదలైనవారు కర్మయోగము పాటించియే సిద్ధిని బొందిరి. అట్లే నీవుకూడ కర్మను ఆచరించి మోక్షమును పొందుము. లోకముకొఱకైనను నీవు కర్మను ఆచరించవలెను.

**శ్లో. య ద్యదాచరతి శ్రేష్ఠ స్త త్త దేవేతరో జనః ।**
**స య త్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే ॥ 21**

*తే.గీ. శ్రేష్ఠ లగువార లేయే విశిష్ట కర్మ*
*లాచరింతురో వానినే యన్యజనులు*
*నాచరింతురు - వారి కెయ్యది ప్రమాణ*
*మదియె వీరికిం గూడ నౌ నన్ని విధుల.*

**తాత్పర్యము** :- లోకములో ఉత్తముఁడైనవాఁడు దేనిని ఆచరించునో ఇతరులు కూడ దానిని ఆచరింతురు. అంతేకాక ఉత్తముఁడు దేనిని ప్రమాణముగా స్వీకరించునో ఇతరులుగూడ దానినే ప్రమాణముగా తీసికొని దానినే ధర్మముగా ఆచరింతురు.

**విశేషార్థము** :- లోకముకొఱకైన కర్మలను ఆచరించవలెననుటకు కారణము ఇచ్చట వివరింపబడినది.

**శ్లో. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
**నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22**

*తే.గీ. మూఁడు లోకాలలోను నే బొందనట్టి*
*పొందఁ దగినట్టిదియు లేదు పురుషవర్య !*
*చేయఁ దగినది గూడ లేదోయి నాకు*
*కాని నిష్కామకర్మ నే మానలేను.*

**తాత్పర్యము:**-అర్జునా ! మూడు లోకములలోను నేను చేయదగినది లేదు. పొందదగినది లేదు. అలాగే నేను పొందలేనిది గూడ లేదు. నేను కర్మలను చేయుచునేయున్నాను.

**శ్లో. యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతన్ద్రితః ।**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23**

*తే.గీ. సర్వకాలంబు లందును జాగ్రత గాని*
*స్వల్పమైనను పొరబాటు సలుపకుండ*
*కర్మ సేయంగవలె నేను - కాద యేని*
*నను నుదాహరణంబుగా నరులు గొంద్రు.*

**తాత్పర్యము :**-ఓ పార్థా ! నే నెప్పుడైనను పనిచేయుట మానుకొన్నాడ ననుకొన్నచో ఇక ఈ లోకములో మిగిలినవారందఱు అన్ని విధముల నన్నే అనుసరింతురు. అంటే పనిచేయుట మానివేయుదురు. నా మార్గమునే వారును అనుసరింతురు.

**శ్లో. ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చే దహమ్ ।**
**సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24**

*తే.గీ. కర్మచేయక కాలమేన్ గడపి తేని*
*చెదుదు రెంతయు లోకులు కడకు వర్ణ*
*సంకరంబును నగు పార్థ ! జనులు చెడగ*
*గారణంబును నేనౌదు ఖండితముగ.*

**తాత్పర్యము :**- నేను కర్మలను మానివేసినచో లోకములో అందఱు మానివేయుదురు. తన్మూలముగా వర్ణసంకరము కలుగును. దానికి కారకుడిని నేనే అగుదును. అట్లే జననమునకు గూడ నేనే కారకుడిని అగుదును.

**విశేషార్థము :**-స్వధర్మమును సక్రమముగ నిర్వహించలేక పోవుటవలన వర్ణ సంకరము కలుగును. కావున ధర్మమును ఆచరించి తీరవలెనని శ్రీ కృష్ణుడు పలుకుచున్నాడు.

**శ్లో. సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।**
**కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షు ర్లోకసఙ్గ్రహమ్ ॥** 25

*తే.గీ. ప్రీతి నజ్ఞాని ప్రతిఫలాపేక్ష గలిగి*
*కర్మ లొనరించు - నా రీతి గాక జ్ఞాని*
*ప్రీతిమై నెప్డు ప్రతిఫలాపేక్ష విడిచి*
*జగతి సుఖియింప గర్మలు సలుపవలయు.*

**తాత్పర్యము :-** అర్జునా ! ఈ లోకములో అజ్ఞానియైనవాఁడు కర్మఫలాసక్తి గల్గి కర్మలను ఆచరించును. అట్లుకాక బ్రహ్మజ్ఞానియైనవాడు ప్రజల మేలుకోరి ఎటువంటి ప్రతిఫలము కోరకుండ కర్మల నాచరించవలెను.

**శ్లో. న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసఙ్గినామ్ ।**
**జోషయే త్సర్వకర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్ ॥** 26

*తే.గీ. ప్రతిఫలాపేక్ష కర్మాభిరతులు నైన*
*అజ్ఞులకు బుద్ధి చెఱుపక అవని వారు*
*సకల సత్కర్మ లాచరించంగ నెపుడు*
*మార్గదర్శకుఁడై జ్ఞాని మనగవలయు.*

**తాత్పర్యము:-** పండితుడైనవాఁడు నిగ్రహముతో సర్వకర్మలను తాను చేయుచు, పామరుల నందఱిని కర్మలు చేయుటకు ప్రేరేపించవలెను. అంతేకాని శ్రద్ధగా కర్మల నాచరించు అజ్ఞానులకు కర్మలయెడ భేదభావమును కల్గించకుండ వారిని ప్రేరేపించు తీరులోనే కర్మల నాచరించవలెను.

**శ్లో. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥** 27

*తే.గీ. అవనిలో నహంకార మూఢాత్మ నరుఁడు*
*ప్రకృతి గుణములఁ జేయఁగాఁ బడెడు సకల*
*కర్మలను జేసినట్టి సద్ఘనుఁడు నేనె*
*యని దలంచును శ్వేతవాహన ! సతమ్ము.*

**తాత్పర్యము:-** ఓ అర్జునా ! ప్రకృతివశముతో త్రిగుణముల మాయశక్తిచే అన్ని విధము లయిన కర్మలు చేయబడుచున్నవి. అహంకారముతోఁ గూడుకొనిన అజ్ఞాని అన్ని కార్యములకు తానే కర్తనని అనుకొనుచుండును.

**విశేషార్థము :-** 'ప్రకృతి' అనగా సత్త్వ రజ స్తమో గుణములు మఱియు దేహేంద్రియ మనోబుద్ధులని భావము. అజ్ఞాని-వీటినే ఆత్మగా భావించును.

**శ్లో. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే ॥** 28

*తే.గీ. తత్త్వవిదుఁడైన యట్టి విద్వాంసుఁ డెలమి*
*చెలఁగి గుణకర్మ విభజనఁ జేసి చూచి*
*గుణములవి స్వస్వభావమౌ గుణము లంచు*
*వెలయ వర్తించు నని మేల్మిఁ దెలిసికొనును.*

**తాత్పర్యము :-** సకల కార్యములు కూడ ప్రకృతి వశముతోనే సాగుచున్నవనెడి తత్త్వమును బాగుగా గ్రహించినవాఁడు గుణ, కర్మలను గూర్చి బాగుగా తెలిసికొన్నవాఁడు కాబట్టి, ఇంద్రియములు విషయ సుఖములలో తగుల్కొనునని జాగ్రత్తపడుచుండును. అయితే ఆత్మకు మాత్రము ఆ విధముగా బంధము ఉండదు. కాబట్టి ఇంద్రియాసక్తులను విడిచి వర్తించుచుండును.

**శ్లో. ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జన్తే గుణకర్మసు ।**
**తా నకృత్స్నవిదో మన్దా న్కృత్స్నవి న్న విచాలయేత్ ॥** 29

*తే.గీ. ప్రకృతి గుణముల మూఢులై వరలు ప్రజలు*
*విషయ సుఖముల యందె సంప్రీతు లౌదు*
*రట్టి యజ్ఞుల మందాత్ము లైన వారి*
*హృదయముల పాడుచేయరా దెపుడు బుధులు.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ప్రకృతియొక్క మాయాశక్తివలన మోహములో తగుల్కొనినవారు ఇంద్రియ సంబంధ కర్మలలోనే ఆసక్తి చూపుచుందురు. కర్మఫలాసక్తితోనైన కర్మల నాచరించుచుందురు. అటువంటి అజ్ఞానులకు భేదబుద్ధి కలిగే విధముగా ఆత్మజ్ఞానులు సత్కార్మలను మానరాదు.

శ్లో. మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

తే.గీ. వరలగ వివేక హృదయ భావంబుతోడ
అన్ని కర్మలు నాకె కృష్ణార్పణ మని
వదలి, యాశలు మమతలు వదలి, తాప
సమితిఁ బోఁద్రోలి యుద్ధమ్ము సలుపు మీవు.

**తాత్పర్యము** :- ఓ పార్థా ! అనాత్మలకంటె ఆత్మ గొప్పదనెడి జ్ఞానము కల్గి, అన్ని పనులను నాకు సమర్పించి, ఆశను, మమకారమును విడిచిపెట్టుటతోఁ బాటు తాపమును దూరము చేసికొని యుద్ధమునకు సిద్ధము కమ్ము.

శ్లో. యే మే మత మిదం నిత్య మనుతిష్ఠన్తి మానవాః ।
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః ॥ 31

తే.గీ. ఈ నిజంబును మానవు లెవరు దెలిసి
శ్రద్ధతోడ నసూయల జారవిడిచి
ఎల్లవేళల మేల్మి వర్తింతు రట్టి
వారలకు కర్మబంధముల్ వదలిపోవు.

**తాత్పర్యము** :- నేను చెప్పిన ఈ పద్ధతిని ఎవ్వరు శ్రద్ధాభక్తులతో, అసూయా రహితముగా ఎల్ల వేళల కర్మల నాచరించుచుందురో అటువంటి వారు కర్మబంధములనుండి విముక్తి బొందుదురు.

శ్లో. యే త్వేత దభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్ ।
సర్వజ్ఞానవిమూఢాం స్తాన్ విద్ధి నష్టా నచేతసః ॥ 32

తే.గీ. నేను జెప్పిన నిజము మన్నించి యెవరు
అనుసరింపరో వారు మూఢాత్ము లెంతొ
నష్టమతులు వివేక శూన్యతఁ జరించు
వెఱ్ఱివారని తెలియు మో విజయ ! నీవు.

**తాత్పర్యము** :-నేను తెలియజేసిన ఈ విషయమును అసూయాపరులై ఎవ్వరు శ్రద్ధతో ఆచరింపరో అటువంటివారందఱు అజ్ఞానులని, వివేక హీనులని, నష్టజాతకులని తెలిసికొనుము.

**విశేషార్థము :-** ఫలాసక్తి మాని ఈశ్వరార్పణ భావముతో ఎవరి వర్ణాశ్రమ ధర్మములను వారు ఆచరించి తీరవలెనని భావము.

**శ్లో. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతే ర్జ్ఞానవా నపి ।**
**ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33**

*తే.గీ. ప్రాణు లన్నియు జన్మాంతర ప్రయుక్త*
*స్వ స్వభావంబులం బొంద జాలి యుంట*
*ప్రాజ్ఞుడైనను తన స్వభావమున కైన*
*పద్ధతినె వెల్గు నిగ్రహ ఫలిత మేమి ?*

**తాత్పర్యము :-** జ్ఞానులు తమ ప్రకృతినిబట్టి నడచుకొందురు. ప్రాణు లన్నియు అట్లే నడచుకొను నప్పుడు ఇక ఇంద్రియ నిగ్రహము ఎందుకని ప్రశ్నించవద్దు.

**విశేషార్థము :-** జ్ఞానులు పూర్వకర్మజన్మల పరిపాకమును బట్టి దేహేంద్రియ మనోబుద్ధులతో వర్తింతురు.

**శ్లో. ఇన్ద్రియ స్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయో ర్న వశ మాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥ 34**

*తే.గీ. ఇంద్రియ విషయములయందు నెంచిచూడ*
*రాగమును ద్వేషమును రెండు ప్రబలుచుండు*
*వశము గారాదు వాని కెవ్వడును పార్థ !*
*పురుషునకు దీర్ఘశత్రువుల్ పొసగ నివియె.*

**తాత్పర్యము :-** ఇంద్రియములనుబట్టి విషయము, వాటివలన రాగద్వేషములు ఏర్పడుచుండును. కావున పురుషులు వాటికి లోబడి పోగూడదు. రాగద్వేషాలకు లోనైనవానికి అవి రెండే విరోధు లగుచున్నవి.

**విశేషార్థము :-** బంధములకు దూరముగా నుండవలెననిన రాగ ద్వేషములను విడిచిపెట్టవలెను.

**శ్లో. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35**

*తే.గీ. భవ్యముగ నాచరింపంగ బడిన గాని*
*శ్రేయమే గాదు పరధర్మ మోయి విజయ !*
*న్యూనమైనన్ స్వధర్మమే యుత్తమమ్ము*
*ధరణి పరధర్మ మది భయంకరము కరము.*

**తాత్పర్యము :-** పరధర్మమును బాగుగా ఆచరించుటకంటెను స్వధర్మమును కొన్ని లోపములతో నయినను ఆచరించుట మంచిది. ఇట్లు తన ధర్మమును ఆచరించుటలో మరణమే సంభవించినను మంచిదే కాని పరధర్మమును ఆచరించుటలో భయము తప్ప మరింకేమియు లేదు సుమా!

**విశేషార్థము :-** ఇంద్రియ నిగ్రహము అలవఱచుకొనవలెనని స్వధర్మాచరణమే ముఖ్య మని సారాంశము.

అర్జున ఉవాచ :-

**శ్లో. అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలా దివ నియోజితః ॥ 36**

*తే.గీ. అనిన గృష్ణుని గాంచి యిట్లనె గిరీటి*
*ఇష్ట మనునది లేకయే యేల జనుడు*
*పాపములు సేయు నిలను గోపాల ! యన్య*
*ప్రేరితుని యట్లు - అనిన గోవిందు డనియె.*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! ఈ లోకములో ఒకానొకడు తన కిష్టము లేకపోయినను సరే బలవంతముగా ఏదైన ఒక పనిని చేయు సేవకునివలె పురుషుడు పాపము చేయుటకు ప్రేరేపింపబడుచున్నాడు. ఏ కారణమువలన నిట్లు జరుగుచున్నదో తెలియజేయుము.

**విశేషార్థము :-** అర్జునుడు తన ప్రవృత్తికి మూలకారణమును గ్రహించవలెనని ఈ ప్రశ్న వేయుచున్నాడు. తన కిష్టము ఏ మాత్రము లేకున్నను సేవకుడు ఒక పని చేయుచున్నాడు. అట్లే పురుషుడును దీనికి కారణము కనుగొనవలెనని అర్జునుని ఆత్రుత.

శ్రీ భగవా నువాచ :-

శ్లో. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥ 37

తే.గీ. తగ రజోగుణ బల సముద్భవము నైన
కామ మది కారణము పాప కారణమ్ము
భువి మహాశనమును క్రోధమూల మద్ది
మోక్షకామికి వైరియౌ భూవరేణ్య !

**విశేషార్థము :-** అర్జునా ! మోక్షమార్గమునకు శత్రువేదో తెలిసికొనుము. 'కామమే' ఆ ముఖ్యమైన శత్రువు. రజోగుణ ప్రధానములైన కామము, క్రోధము, అధికతృష్ణ - ఈ మూఁడు పాపమునకు మూలకారణములు. మోక్షమును పొందుటలో ముఖ్యమైన ఆటంకములు.

శ్లో. ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ ।
యథోల్బేనావృతో గర్భ స్తథా తేనేద మావృతమ్ ॥ 38

తే.గీ. వహ్నిధూమముచే గప్పఁబడిన యట్లు
అద్ద మది మలిన సంపర్కమైన యట్లు
శిశువు మాయచే గప్పఁగాఁ జెలఁగి నట్లు
జ్ఞాన మది గప్పఁ బడు కామశక్తిచేత.

**తాత్పర్యము :-** అర్జునా ! పొగ నిప్పును గప్పినట్లుగా, మలినము అద్దమును క్రమ్మినట్లుగా, మాయ గర్భములో నున్న శిశువును క్రమ్మినట్లుగా కామము జ్ఞానమును కప్పివేయును.

**విశేషార్థము :-** ఈ పై ఉదాహరణములను యత్నము, ప్రయత్నము, దైవ యత్నములతో పరిహరించుకొనవలెను. యత్నముతో పొగను దూరము చేయవచ్చు. ప్రయత్నముతో అద్దముపై మలినమును తొలగించవచ్చు. ఇక మావి తొలగుట గర్భము భూపతనము చెందుట మాత్రము దైవయత్నము. కాబట్టి దైవస్తుతి విస్మరించక చేయుచుండవలెను అని అంతరార్థము.

శ్లో. ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ ! దుష్పూరే ణానలేన చ ॥ 39

*తే.గీ. ఎంత యత్నంబుఁ జేయఁ బూరింపఁ బడక*
*ఇల మహాశనువలెఁ దృప్తి నెపుడుఁ గొనక*
*కామరూపముఁ గొని సర్వకాలములను*
*జ్ఞానికిని వైరియౌ కామశక్తి విజయ !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ఈ కామమునకు తృప్తి అనునది లేదు. సహజముగా ఇది జ్ఞానులకు శత్రువు. అగ్నితో సమాన మైనది. జ్ఞానుల జ్ఞానమును ఈ కామము కప్పివేయును.

**శ్లో. ఇన్ద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే ।**
**ఏతై ర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥ 40**

*తే.గీ. ఇంద్రియంబులు బుద్ధియు నెన్న మనసు*
*జగతిలోఁ దన కెంతొ యాశ్రయము లౌట*
*కామ మింద్రియములచేతఁ గప్పి జ్ఞాన*
*తేజమును మోహపరచు నెంతేని నరుని.*

**తాత్పర్యము :-** ఈ కామమునకు ఆశ్రయముగా ఉండునవి మనస్సు, బుద్ధి, ఇంద్రియములు. కాబట్టి కామము వీటి సహాయముతో జ్ఞానమును కప్పివేసి పలు రకములుగా మోహములో ముంచివేయును.

**శ్లో. తస్మా త్త్వ మిన్ద్రియా ణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥ 41**

*తే.గీ. కావునన్ శ్వేతవాహనా ! ధీ విశాల !*
*ఇంద్రియంబుల ధృతి నిగ్రహించి మొదట*
*జ్ఞాన విజ్ఞానములను ధ్వంసమ్ము చేయు*
*పాపమూలమౌ కామమున్ వదలవలయు.*

**తాత్పర్యము :-** కావున ఓ అర్జునా ! ఇంద్రియములను జయించి, జ్ఞాన విజ్ఞానములను నశింపజేయు పాపస్వరూపమైన ఇటువంటి కామమును నీవు మొదటనే అతి ప్రయత్నముతో రూపుమాపవలెను.

**విశేషార్థము :-** కామమును మించిన ప్రబల శత్రువు మరొకటి లేదని పై నాల్గు శ్లోకములలోని సారాంశము. క్రోధమునకుఁ గూడ మూలకారణము కామమే. ఇంద్రియ నిగ్రహమే ఈ కామమును జయించు ఏకైక సాధనమని పరమాత్మ తెలియఁజేయుచున్నాడు.

**శ్లో. ఇన్ద్రియాణి పరాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42**

*తే.గీ. దేహమునకంటె శ్రేష్ఠ మింద్రియము లౌను*
*ఇంద్రియముల కంటెను శ్రేష్ఠ మెపుడు మనసు*
*మనసు కంటెను శ్రేష్ఠమై తనరు బుద్ధి*
*బుద్ధికంటెను శ్రేష్ఠమై పొలుచు నాత్మ.*

**తాత్పర్యము :-** ఇంద్రియములు కర్మాచరణకు ముఖ్యసాధనములు. వాటికంటె మనస్సు, అంతకంటె బుద్ధి, దానికంటె ఆత్మ శ్రేష్ఠమైనదని ఆత్మ తత్త్వమును గుర్తించినవారు చెప్పుచుందురు.

**శ్లో. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43**

*తే.గీ. బుద్ధికంటెను నాత్మయే పొసఁగ శ్రేష్ఠ*
*మని గ్రహించుచు నాత్మచే నాత్మ నోర్చి*
*వర దురాసద కామరూపంబు నైన*
*కామమన్ శత్రువున్ జంపఁ గడఁగు పార్థ !*

**తాత్పర్యము :-** అర్జునా ! బుద్ధికంటె శ్రేష్ఠమైన పరమాత్మను తెలిసికొని ఆత్మచేతనే ఆత్మను నిగ్రహించుకొనుచు, జయింపరానిదైన కామ మనెడి అంతశ్శత్రువును జయింపుము.

**విశేషార్థము :-** ఆత్మ జ్ఞానముఁ బొంది ఇంద్రియమును, మనస్సును, బుద్ధిని స్వాధీనము చేసికొనవలెను.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
**కర్మయోగంబను**
మూఁడవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

(4-8)

ఓ పార్థా ! మంచివారిని కాపాడుటకు, పాపాత్ములను చంపుటకు, ధర్మమును స్థాపించుటకు నేను ప్రతియుగములోనూ జన్మించు చుందును.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం చతుర్థోఽధ్యాయః

## జ్ఞానయోగము

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాకవేఽబ్రవీత్ ॥** 1

*తే.గీ. అనుపమానము నిష్కామ మైనదియును*
*అవ్యయము నౌచు నొప్పు నీ యతి విశిష్ట*
*కర్మయోగము దీని నే కర్మసాక్షి*
*కొనరఁ జెప్పితి నాతఁడు మనువునకును*
*మనువు నిక్ష్వాకునకుఁ జెప్పె వినుము పార్థ !*

**తాత్పర్యము :-** ఎప్పటికిని నశింపని నిత్యమైనదైన ఈ యోగమును నేను సూర్యునకు మొదట చెప్పితిని. ఆపై ఆతడు దానిని మనువునకు, మనువు ఇక్ష్వాకునకు చెప్పెను.

**శ్లో. ఏవం పరమ్పరాప్రాప్త మిమం రాజర్షయో విదుః ।**
**స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప ॥** 2

*తే.గీ. ఇట్లుగ పరంపరగ ననుష్ఠింపఁ బడిన*
*కర్మయోగము దీనిని ఘనతరముగ*
*నెఱిఁగినారలు రాజర్షులెల్లరైన*
*నిది నశించెను కాల మెంతేని గడవ.*

**తాత్పర్యము :-**అర్జునా ! ఇట్లు పరంపరా ప్రాప్తమైన ఈ యోగమును రాజర్షులు తెలిసికొన్నారు. దినములు గడచుకొలది ఈ యోగము లోకములో నశించిపోయినది.

**శ్లో. స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ 3**

*తే.గీ. అతి పురాతన ముత్తమ మైన దిద్ది*
*కడు రహస్యము నైనను ఘన సఖుఁడవు*
*భక్తుఁడవు నాకు నీ వౌట పరమప్రీతిఁ*
*జెప్పితిని నీకు వివరించి శ్రేయ మొలుక.*

**తాత్పర్యము :-** సర్వ రహస్యములలోను ఉత్తమమైన దానిని, మిక్కిలి ప్రాచీనమైన దానిని నా భక్తుడవు, స్నేహితుడవు నైన నీకు ఇప్పుడు ప్రీతితో ఉపదేశించుచున్నాను.

*అర్జున ఉవాచ :-*

**శ్లో. అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।**
**కథ మేత ద్విజానీయాం త్వ మాదౌ ప్రోక్తవా నితి ॥ 4**

*తే.గీ. అనిన నర్జును డిట్లనె; - నచ్యుతా ! త్వ*
*దీయ జన్మముకంటె నెంతేని పూర్వ*
*మైన యది సూర్యుజన్మ యట్లగుటవలన*
*ఎటులఁ దెలిపితి వతని కంచెఱుఁగ నైతి.*

**తాత్పర్యము :-** అర్జునుఁడు ఈ పరంపర విషయమై సందేహము కలుగుటతో శ్రీ కృష్ణునితో ఇట్లు పలుకుచున్నాడు. "ఓ కృష్ణా ! నీవేమో ఈ కాలములో పుట్టితివి. వివస్వంతుఁడు పూర్వ కాలములో పుట్టెను. 'ఈ యోగమును నేను వివస్వంతునకు చెప్పితిని' - అనెడి నీ మాట నాకు సందేహము కలిగించుచున్నది. నాకు వివరముగా తెలియఁజేయవలెను సుమా!"

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తా న్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ॥ 5**

*తే.గీ. అనిన భగవానుఁ డనియె నర్జునున కిట్లు*
*నాకు నీకును గడచె జన్మంబు లెన్నొ*
*వాని నన్నిటి నెఱుఁగుదు నేను - కాని*
*నీ వెఱుంగవు జగతిలో నిజము పార్థ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నీవును నేనును అనేక జన్మముల నెత్తితిమి. అవన్నియు నాకు బాగుగా జ్ఞాపక మున్నవి. అయినను నీవు మాత్రము గుర్తుంచుకొనజాలవు. ఇదే మనిద్దరికిని గల భేదము సుమా !

**శ్లో. అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్ ।**
**ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా ॥ 6**

*తే.గీ. జనన మరణంబులున్ లేక జగతిలోని*
*సర్వప్రాణుల కరయ నీశ్వరుఁడనైన*
*నాత్మ మాయచే నా సొంతమైన ప్రకృతి*
*నాశ్రయించియె జన్మంబు లందుచుండు.*

**తాత్పర్యము :-** పుట్టుక, నాశనము అనునవి లేనివాడిని నేను. సకల ప్రాణులకు అధిపతిని. నా ఆత్మ స్వరూపము ఎప్పుడును మారకపోయినను నా అధీనములోని మాయవలననే నేను జన్మించుచుందును.

**శ్లో. యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహమ్ ॥ 7**

*తే.గీ. ఎప్పు డెప్పు డధర్మంబు లుప్పతిలుచు*
*ఇలను ధర్మంబునకు హాని గలుగఁజేయు*
*అప్పు డప్పుడు నను నేను తప్పకుండ*
*వరగఁ సృష్టించుకొందు నో పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** భరతవంశములో పవిత్రుఁడవైన ఓ అర్జునా ! ఎప్పుడెప్పుడు ధర్మమునకు హాని కలిగి, అధర్మము విచ్చల విడిగ తలెత్తు చుండునో అప్పుడప్పుడు నన్ను నేను సృష్టించుకొని అవతరించుచుందును.

**శ్లో. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8**

*తే.గీ. సాధుజన రక్షణము మేల్మి నలుపుటకును*
*తేర్చి దుష్టుల నెల్ల మర్దించుటకును*
*ధర్మ సంస్థాపనార్థమె తప్పకుండ*
*యుగయుగమునందు జన్మింతు నుర్వియందు.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! మంచివారిని కాపాడుటకు, పాపాత్ములను చంపుటకు, ధర్మమును స్థాపించుటకు నేను ప్రతియుగములోనూ జన్మించు చుందును.

**శ్లో. జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వత: ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥** 9

*తే.గీ. మహిని నా దివ్య జన్మ కర్మముల నిట్లు*
*సార్థకంబుగ దెలియంగ జాలు నెవడు*
*అతడు దేహమున్ విడిచిన యంత నన్నె*
*పొందగల్గును మఱి జన్మ పొంద డికను.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నాయొక్క దివ్యమైన జన్మకర్మల రహస్యమును నిశ్చయముగా ఎవ్వడు తెలిసికొనునో వాడు తన దేహమును వీడి మరల జన్మము లేకుండ నన్నే పొందగలడు సుమా !

**శ్లో. వీతరాగభయక్రోధా మన్మయా మా ముపాశ్రితా: ।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతా: ॥** 10

*తే.గీ. జ్ఞాన మనియెడు వర తపశ్శక్తిచేత*
*ఆత్మ పరిశుద్ధి జెంది నన్నాశ్రయించి*
*రాగ భయ క్రోధములను దూరముగ ద్రోచి*
*పలువు రొందిరి నా స్వరూపమును విజయ !*

**తాత్పర్యము :-** కోపము, భయము, రాగము అనునవి లేక జ్ఞాన తపస్సుచే శుద్ధులైన చాలమంది నాలో లీనమై నా స్వరూపమునే పొందిరి.

**శ్లో. యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యా: పార్థ సర్వశ: ॥** 11

*తే.గీ. ఎవ్వ రే రీతిగాగ నన్నెంచి కొలుతు*
*రరయగా వారి నట్లె నే నాదరింతు*
*నా యనుగ్రహ మొందిన నరులు సతము*
*ననుసరింతురు నా మార్గమునె కిరీటి !*

**తాత్పర్యము :-** ఎవరెవరు ఏ ఏ విధముగా నన్ను సేవింతురో ఆ విధముగానే వారికి తగిన ఫలితముల నందింతును. ఓ అర్జునా ! ఎట్లైనను సరే, అందఱు అన్ని విధముల నా మార్గమునే అనుసరింతురు.

**శ్లో. కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా ॥** 12

*తే.గీ. కర్మములయొక్క ఫలితముం గాంక్షసేయు*
*మనుజు లిలలోన దేవతలను భజింత్రు*
*కర్మఫలములు మనుజ లోకమ్మునందు*
*వెంట వెంటనే గలిగెదు వీరవర్య !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! మానవలోకములో కర్మఫలము శీఘ్రముగానే కలుగును. కర్మఫలమును కోరువారు ఈ లోకములో దేవతలను అధికముగా సేవించుచుందురు.

**శ్లో. చాతు ర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥** 13

*తే.గీ. ధరణిలో గుణకర్మ భేదముల బట్టి*
*బ్రాహ్మణ క్షత్ర వైశ్య శూద్ర యనెడి వర్ణ*
*ములను నాల్గింటి సృష్టించి సలలితముగ*
*అవ్యయుండు నకర్తనై యలరుచుంద్రు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! గుణకర్మల భేదములనుబట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లనబడు నాలుగు వర్ణములను నేను సృష్టించితిని. వాటికి నేనే కర్తనైనను కర్తను కాని వానినిగా, అవ్యయునిగా నన్ను తెలిసికొమ్ము.

**శ్లో. న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥** 14

*తే.గీ. నన్ను కర్మము లంటవు నాకు నెపుడు*
*కర్మ ఫలములం దిచ్ఛలు గలుగ వనుచు*
*నన్నెఱింగిన వాని నెన్నడును భువిని*
*కర్మముల వంటఁబోవు నిక్కంబు విజయ !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! మంచివారిని కాపాడుటకు, పాపాత్ములను చంపుటకు, ధర్మమును స్థాపించుటకు నేను ప్రతియుగములోనూ జన్మించుచుందును.

**శ్లో. జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥** 9

*తే.గీ. మహిని నా దివ్య జన్మ కర్మముల నిట్లు*
*సార్థకంబుగఁ దెలియంగఁ జాలు నెవఁడు*
*అతఁడు దేహమున్ విడిచిన యంత నన్నె*
*పొందఁగల్గును మఱి జన్మ పొందఁ డికను.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నాయొక్క దివ్యమైన జన్మకర్మల రహస్యమును నిశ్చయముగా ఎవ్వఁడు తెలిసికొనునో వాఁడు తన దేహమును వీడి మరల జన్మము లేకుండ నన్నే పొందఁగలఁడు సుమా !

**శ్లో. వీతరాగభయక్రోధా మన్మయా మా ముపాశ్రితాః ।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతాః ॥** 10

*తే.గీ. జ్ఞాన మనియెడు వర తపశ్శక్తిచేత*
*ఆత్మ పరిశుద్ధిఁ జెంది నన్నాశ్రయించి*
*రాగ భయ క్రోధములను దూరముగఁ ద్రోచి*
*పలువు రొందిరి నా స్వరూపమును విజయ !*

**తాత్పర్యము :-** కోపము, భయము, రాగము అనునవి లేక జ్ఞాన తపస్సుచే శుద్ధులైన చాలమంది నాలో లీనమై నా స్వరూపమునే పొందిరి.

**శ్లో. యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥** 11

*తే.గీ. ఎవ్వ రే రీతిగాఁగ నన్నెంచి కొలుతు*
*రరయఁగా వారి నట్లె నే నాదరింతు*
*నా యనుగ్రహ మొందిన నరులు సతము*
*ననుసరింతురు నా మార్గమునె కిరీటి !*

**తాత్పర్యము :-** ఎవరెవరు ఏ ఏ విధముగా నన్ను సేవింతురో ఆ విధముగానే వారికి తగిన ఫలితముల నందింతును. ఓ అర్జునా ! ఎట్లైనను సరే, అందఱు అన్ని విధముల నా మార్గమునే అనుసరింతురు.

**శ్లో. కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా ॥ 12**

*తే.గీ. కర్మములయొక్క ఫలితముం గాంక్షసేయు*
*మనుజు లిలలోన దేవతలను భజింత్రు*
*కర్మఫలములు మనుజ లోకమ్మునందు*
*వెంట వెంటనే గలిగెడు వీరవర్య !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! మానవలోకములో కర్మఫలము శీఘ్రముగానే కలుగును. కర్మఫలమును కోరువారు ఈ లోకములో దేవతలను అధికముగా సేవించుచుందురు.

**శ్లో. చాతు ర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥ 13**

*తే.గీ. ధరణిలో గుణకర్మ భేదముల బట్టి*
*బ్రాహ్మణ క్షత్ర వైశ్య శూద్ర యనెడి వర్ణ*
*ములను నాల్గింటి సృష్టించి నలలితముగ*
*అవ్యయుండు నకర్తనై యలరుచుండు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! గుణకర్మల భేదములనుబట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లనఁబడు నాలుగు వర్ణములను నేను సృష్టించితిని. వాటికి నేనే కర్తనైనను కర్తను కాని వానినిగా, అవ్యయునిగా నన్ను తెలిసికొమ్ము.

**శ్లో. న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥ 14**

*తే.గీ. నన్ను కర్మము లంటవు నాకు నెపుడు*
*కర్మ ఫలములం దిచ్ఛలు గలుగ వనుచు*
*నన్నెఱింగిన వాని నెన్నఁడును భువిని*
*కర్మముల వంటఁబోవు నిక్కంబు విజయ !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ఫలమును కోరి కర్మలను చేయకపోవుటతో ఆ కర్మలు నన్ను అంటలేవు. నా శక్తి ఇట్టిదని తెలిసికొని మనస్సులో ధ్యానించెడి వారిని గూడ కర్మములు బంధింపలేవు సుమా !

**శ్లో. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వై రపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మా త్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 15**

*తే.గీ. పరముముక్షులు పూర్వీకు లరసి యిట్లు*
*కర్మములు జేసియుండి రుత్కృష్టము గాఁగ*
*ఆ విధంబుగ పూర్వీకు లాచరించి*
*నట్టి నిష్కామ కర్మ మీ వాచరింపు.*

**తాత్పర్యము :-** ముముక్షువులైన పూర్వీకులు సైతము ఈ కర్మలు తమను బంధింప వనెడి విషయమును గ్రహించి కర్మలు చేయుచు వచ్చిరి. ('కర్మ' అనిన పని అని అర్థము సుమా !) కాబట్టి వారికి పూర్వులు, నీకు పూర్వులు చేసిన కర్మలనే నీవును చేయుము.

**శ్లో. కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 16**

*తే.గీ. కర్మ మెట్టిది మఱియు నకర్మ మెట్టి*
*దని గ్రహింపఁగ ప్రాజ్ఞులకైనఁ గాని*
*యలవి కాలేదు జ్ఞానదాయకము దీని*
*నలరఁ జెప్పెద కర్మ రహస్య మేను.*

**తాత్పర్యము :-** ఏది కర్మ, ఏది అకర్మ అని తెలిసికొనుటలో బుద్ధిమంతులు గూడ మోహములో పడుచున్నారు. ఆ భేదము తెలిసికొనుటతో అశుభము తొలఁగిపోవును. కాబట్టి నీకు దానిని సవిస్తరముగా తెలియఁజేయుచున్నాను.

**శ్లో. కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17**

*తే.గీ. కర్మతత్త్వము మఱియు నకర్మతత్త్వ*
*మరయఁగ వికర్మతత్త్వ మత్యంత కఠిన*
*మగుటచే దీని యాథార్థ్యమౌ స్వరూప*
*మెలమి నెట్టైన నెఱుఁగంగవలయు పార్థ !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! కర్మల గతి అంతు చిక్కనిది సుమా ! కాబట్టి ముందుగా 'కర్మ' అనగా నేమి ? విపరీత కర్మ (వికర్మ) అనగా నేమి? అసలు కర్మలే చేయక పోవుట (అకర్మ) అనగా ఏమి ? - స్పష్టముగా తెలిసికొనవలసియున్నది.

**శ్లో. కర్మణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥ 18**

*తే.గీ. కర్మమున నకర్మభావముం గనెడు వాఁడు*
*మఱి యకర్మమునందుఁ గర్మమును గాంచు*
*మానవుఁడె బుద్ధిమంతుఁ డిమ్మహిని, వాఁడె*
*భవ్య కర్మాభిరతుఁడును పరమయోగి.*

**తాత్పర్యము :-** 'కర్మ'లో అకర్మను, 'అకర్మ'లో కర్మను ఎవరు చూడగల్గుదురో వారే మానవులందఱిలోను జ్ఞానులు. వారే యోగముతోఁ గూడినవారు. సర్వ కర్మలు చేయువారును అయియుందురు.

**శ్లో. యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం త మాహుః పండితం బుధాః ॥ 19**

*తే.గీ. ఎవని కర్మలు ప్రతిఫలాపేక్ష లేక*
*వరలు నవ్వాని బుధులెల్ల పండితుఁ డని*
*భువిని జ్ఞానాగ్ని దగ్ధ కర్ముండు ననియు*
*పల్కుదురు మేల్మి శుభగాత్ర ! పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** ఎవ్వరు తాము చేయు ప్రతిపనిని ఫలాపేక్ష నాశింపక చేయుదురో అటువంటివారే జ్ఞాన మనెడి అగ్నిచే కర్మలను దగ్ధము చేసినవారవుదురు. అటువంటి వారినే 'పండితు'లని పెద్ద లందురు.

**శ్లో. త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః ॥** 20

*తే.గీ. ప్రతిఫలాపేక్షలేక నెవ్వాఁడు ధరణి*
*నిత్య సంతృప్త మానసనియతితోడ*
*వెలయుచు నిరాశ్రయోద్భూత కలితబుద్ధి*
*కర్మ లొనరించు వాని నకర్ముఁడంద్రు.*

**తాత్పర్యము :-** కర్మఫలముపై ఆసక్తి వదలి ఎల్లవేళల తృప్తి కలిగి, ఎట్టి పరిస్థితిలోను కర్మ ఫలమును ఆశ్రయించక కర్మలను చేయువానిని 'అకర్ముని'గా భావించవలెను.

**శ్లో. నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥** 21

*తే.గీ. ఆశలను వీడి మది నిగ్రహము ఘటించి*
*వస్తు సంపాద నేచ్ఛల వదలిపెట్టి*
*ధరణిలో దేహధారణకొఱకె కర్మ*
*చేయు వానిని పాపముల్ చేర వెపుడు.*

**తాత్పర్యము :-** కర్మఫలాపేక్షను విడిచి, మనస్సు స్వాధీనము చేసికొని అన్నిటిలోను మమకారమును విడిచి ఎవ్వఁడు కర్మేంద్రియములకు సంబంధించిన పనులు మాత్రమే చేయుచుండునో అటువంటివానికి చేసిన పాపము అంటదు.

**విశేషార్థము :-** కర్మేంద్రియములు :- వాక్కు, చేయి, పాదము, గుహ్యేంద్రియములు.

**శ్లో. యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధా వసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥** 22

*తే.గీ. అప్రయత్నముగా ప్రాప్తమైన దాన*
*దృప్తివడి ద్వంద్వ మత్సరాతీతుఁ డగుచు*
*ప్రాప్త మప్రాప్తముల సమభావ మొంది*
*యలరు వానికి కర్మములంటఁ బోవు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! తనకు లభించిన దానితో సంతృప్తి చెందువానికి, ద్వంద్వాలకు అతీతుడైనవానికి, మాత్సర్యము లేనివానికి, కర్మలు ఫలించినను, ఫలింపక పోయినను సమముగా భావించువానికి వాడు చేసిన కర్మలు అతనిని ఏ మాత్రము బంధింపవు సుమా !

**శ్లో. గతసఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23**

*తే.గీ. దేనియందును నాసక్తి లేనివాని,*
*బంధముల నెల్ల వదలినవాని, జ్ఞాన*
*చిత్తుని, పవిత్ర యజ్ఞ సుశ్రీకలితుని*
*సకల కర్మలు - నశియించు సవ్యసాచి !*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! సంగాన్ని (కర్మఫలముతో) వదలి, రాగద్వేషాలు వీడి, తన మనస్సును జ్ఞానములో సుస్థిరము చేసి, కేవలము యజ్ఞముకొఱకు మాత్రము కర్మ చేయువాని కర్మలు సమగ్రముగా సిద్ధించును. స్వర్గముకంటె కూడ గొప్పదైన మోక్షము అతనికి లభ్య మగును.

**శ్లో. బ్రహ్మార్పణం బ్రహ్మ హవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥ 24**

*తే.గీ. బ్రహ్మ సుజ్ఞాని బ్రహ్మాగ్ని భక్తి మీర*
*వేల్చిన హవిస్సు బ్రహ్మమై వెలయు నద్ది*
*బ్రహ్మమునకే సమర్పింపఁబడు, సకలము*
*బ్రహ్మమయ మని పొందును బ్రహ్మ మతఁడు.*

**తాత్పర్యము :-** 'అర్పించుట' అను క్రియ బ్రహ్మము; అర్పింపబడు ద్రవ్యము బ్రహ్మము, బ్రహ్మాగ్నిలో బ్రహ్మచే హోమము చేయబడునది బ్రహ్మము. ఈ రీతిగా కర్మమంతయు బ్రహ్మమయము అను దృఢ బుద్ధి గలవారు మాత్రము బ్రహ్మమునే పొందుదురు.

**శ్లో. దైవ మేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥ 25**

*తే.గీ.* *అరయగా దేవతార్చనే యజ్ఞ మనుచు*
*వెలయఁ గొందఱు యోగులు పలుకుచుంద్రు*
*అవని జీవాత్మఁ బరమాత్మ మనెడు నగ్ని*
*నాహుతి యొనర్చి కొందఱు యజ్ఞ మంద్రు.*

**తాత్పర్యము :-** కొందఱు దేవతార్చననే యజ్ఞముగా భావింతురు. మఱి కొందఱు బ్రహ్మాగ్నిలో యజ్ఞములచేతనే ఆత్మను వ్రేల్చుచుందురు.

**శ్లో. శ్రోత్రాదీనీన్ద్రియా ణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీ న్విషయా నన్య ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి ॥** 26

*తే.గీ.* *వెలయ శ్రోత్రేంద్రియములన్ హవిస్సు లెలమి*
*వేల్చెదరు కొంద ఱెన్న సద్వినుత సంయ*
*మాగ్నులను నింక శబ్దాదులను హవిస్సు*
*లలర వేల్తురి కొందఱు నింద్రియాగ్నులందు.*

**తాత్పర్యము :-** కొందఱు 'చెవి' మొదలైన ఇంద్రియాలను నిగ్రహ మనెడి అగ్నిలో వ్రేల్చుచుండ, మరికొందఱు ఇంద్రియ రూపమైన అగ్నిహోత్రములో 'శబ్దము' మొదలగు విషయములను హోమము చేయుచున్నారు.

**విశేషార్థము :-**చెవి-శబ్దం; కన్ను-రూపం; చర్మం-స్పర్శ; నాలుక-రుచి; ముక్కు-వాసన. ఇందు శబ్దాదులనబడెడి పంచ తన్మాత్రలను చెవి మొదలైన ఇంద్రియాలలో హోమము చేయుట అని విశేషము చెప్పబడినది.

**శ్లో. సర్వాణీన్ద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।**
**ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥** 27

*తే.గీ.* *జ్ఞానదీపిత నిగ్రహాశక్తి యనెడు*
*దివ్యయోగాగ్నిలోన నింద్రియ విశిష్ట*
*ప్రాణకర్మల నన్నిటిఁ బరమ నిష్ఠ*
*వేల్చెదరు కొంద ఱుర్వి శోభిత యశస్వి !*

**తాత్పర్యము :-** మఱి కొందఱు ప్రాణములయొక్క, ఇంద్రియముల యొక్క కర్మముల నన్నింటిని జ్ఞానముచే ప్రజ్వలింపఁబడిన 'ఆత్మనిగ్రహము' అను యోగాగ్నిలో హోమము చేయుచున్నారు.

**శ్లో. ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాఽపరే ।**
**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥ 28**

*తే.గీ. ద్రవ్యయజ్ఞముఁ గొందఱు, దనర యోగ*
*యజ్ఞముం గొందఱును తపోయజ్ఞ మరయఁ*
*గొంద ఱధ్యయన విశిష్టగుణ సుయజ్ఞ*
*మవని గొందఱు వ్రతయజ్ఞ మాచరింత్రు.*

**తాత్పర్యము :-** సంయమనములో కొందఱు ద్రవ్య యజ్ఞమును, కొందఱు యోగయజ్ఞమును, ఇంకొందఱు స్వాధ్యాయరూప యజ్ఞమును, మఱి కొందఱు జ్ఞాన యజ్ఞమును ఆచరించుచున్నారు.

**శ్లో. అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥ 29**

*తే.గీ. ఘనతరముగఁ బ్రాణాపాన గతుల నణచి*
*ప్రాణము నపాన మందు, నపాన మొనర*
*ప్రాణమందును వేల్తు రుర్వరను గొంద*
*ఱరయ బుధులు ప్రాణాయామపరులు మేల్మి.*

**తాత్పర్యము :-** కొందఱేమో ప్రాణాయామమును ఆచరించుటలో తత్పరులై ప్రాణ, అపానవాయువు అధోగతులను నిరోధించుచుందురు. మఱి కొందఱు ప్రాణవాయువును అపానమునందు, అపానమును ప్రాణమునందు హోమము చేయుదురు.

**శ్లో. అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।**
**సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ॥ 30**

*తే.గీ. అవని గొందఱు నియమితాహారు లగుచు*
*ప్రాణముల వేల్చుచుందురు ప్రాణములను*
*యజ్ఞ విధు లెల్ల నెఱిఁగిన యట్టి వీర*
*లందఱును కల్మష విముక్తు లౌదు రనఘ !*

**తాత్పర్యము :-** కొందఱు ఆహార నియమములో నేర్పుతో ప్రాణములను ప్రాణములలో వేల్చుచున్నారు. వీరందఱు యజ్ఞములను గూర్చి తెలిసి యజ్ఞకార్యమువలన అన్ని పాపములనుండి విముక్తు లగుచున్నారు.

**శ్లో. యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్ ।**
**నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ 31**

*తే.గీ. యజ్ఞశేష మమృత మొందినట్టివాఁడు*
*శాశ్వత బ్రహ్మ పదవి నిశ్చయముఁ బొందు*
*యజ్ఞ మొకటైనఁ జేయని యతని కెన్న*
*ఇహ సుఖమె సున్న పర సుఖం బెట్లు కలుగు.*

**తాత్పర్యము :-** యజ్ఞము చేయగా మిగిలిన ఆహారమును భుజించెడివారు సనాతనమైన బ్రహ్మ పదవిని చేరుకొందురు. ఓ కౌరవశ్రేష్ఠా ! యజ్ఞము చేయనివారికి ఈ లోకములోనే సుఖము లేదనగా ఇక పరలోకము ఎక్కడుండునో చెప్పుము.

**శ్లో. ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజాన్ విద్ధి తాన్ సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32**

*తే.గీ. వేదములయందు నీ రీతి విస్తరింపఁ*
*బడియె బహువిధ యజ్ఞముల్, వసుధ నవ్వి*
*కర్మ సంజాతము లటన్న మర్మ మెఱుఁగ*
*కర్మ బంధ విముక్తి నిక్కముగఁ గల్గు.*

**తాత్పర్యము :-** ఈ రకముగా అనేకములైన యజ్ఞములు బ్రహ్మ ముఖమునుండి వేదములద్వారా వెలువడినవి. అవన్నియును కర్మరూపములే. ఈ సత్యమును నీవు గ్రహించినట్లైన విముక్తుడ వగుదువు సుమా !

**శ్లో. శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాన్ జ్ఞానయజ్ఞః పరన్తప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** 33

*తే.గీ. ద్రవ్యయజ్ఞమ్ముకంటెను ధరణియందు*
*జ్ఞానయజ్ఞమ్మె శ్రేష్ఠమ్ము సన్నుతమ్ము*
*సర్వకర్మంబులున్ ఫల సహితముగను*
*జ్ఞాన మందె సమాప్తమౌ సవ్యసాచి !*

**తాత్పర్యము :**–ఓ పార్థా ! బాగుగా ఆలోచించి చూచిన ద్రవ్యముతోఁ గూడిన యజ్ఞముకంటె జ్ఞానయజ్ఞమే సర్వ విధముల శ్రేష్ఠము. ఎందుల కనెదవా? సర్వ కర్మల ఫలాలకు, అన్ని యజ్ఞాలకు జ్ఞానమే పర్యవసాన మగుచున్నది సుమా !

**శ్లో. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥** 34

*తే.గీ. తత్త్వవిదులైన జ్ఞానభాస్కరులఁ జేరి*
*వినయమున నమస్కారమ్ము లొనరఁ జేసి*
*తగిన సమయానఁ దగు ప్రశ్నఁ దనరవేసి*
*సలిపి గురుసేవ జ్ఞానతేజమ్ముఁ గనుము.*

**తాత్పర్యము :**–ఓ పాండు పుత్రా ! అటువంటి జ్ఞానమును తత్త్వజ్ఞానుల చెంత చేరి సాష్టాంగ నమస్కారముచేత, ప్రశ్నలచేత, శుశ్రూషచేత (సేవచేత) వారు ఉపదేశించు విషయములను తెలిసికొమ్ము.

**శ్లో. యద్ జ్ఞాత్వా న పున ర్మోహ మేవం యాస్యసి పాణ్డవ ।**
**యేన భూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి ॥** 35

*తే.గీ. ఇట్టి జ్ఞాన విశేషంబు నెఱిఁగి నంత*
*పుట్టు దిటువంటి మోహ మేప్రొద్దు, సకల*
*ప్రాణికోటుల నీలోనె పరలఁ గాంతు*
*వంత నాలోనఁ గాంతు వీ వలర పార్థ !*

**తాత్పర్యము** :- ఓ అర్జునా ! అట్టి జ్ఞానమును నీవు పొందిన పిమ్మట నీకు ఇటువంటి మోహము ఎన్నటికిని కలుగదు. అన్ని భూతములను నీలో నీవు చూడగలవు. అట్లే నాలోపల గూడ భూతాలను (ప్రాణికోటిని) చూడగలవు సుమా !

**శ్లో. అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి ॥** 36

*తే.గీ. పాపు లందఱిలోఁ బెను పాపివైన*
*జింత పనిలేదు పుడమి రవ్వంతయైన*
*జ్ఞాన మను నావ సాయాన సకల పాప*
*జలధు లవలీల దాఁటఁగాఁ గలవు విజయ !*

**తాత్పర్యము** :- పాపాత్ములందఱిలోను పాపాత్ముఁడే అయినను, జ్ఞానమను తెప్పచే సర్వపాపసముద్రమును నీవు దాటివేయగలవు.

**శ్లో. యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసా త్కురుతేఽర్జున ।**
**జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసా త్కురుతే తథా ॥** 37

*తే.గీ. ప్రజ్వలించెడు నగ్ని యే పగిది సమిధ*
*జాలమును భస్మ మొనరింపఁ జాలు నట్లు*
*జ్ఞానమను నగ్ని కర్మలన్ సమిధతతిని*
*భస్మ మొనరించుచున్న దో పాండుపుత్ర !*

**తాత్పర్యము** :- ఓ అర్జునా ! బాగుగా మండుచున్న 'అగ్ని' కఱ్ఱలను భస్మము చేయునట్లు జ్ఞానాగ్ని సర్వ కర్మలను భస్మము చేయును. అనగా కర్మ బంధములను నశింపజేయును.

**శ్లో. న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే ।**
**తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విన్దతి ॥** 38

*తే.గీ.* *జ్ఞానమునకు సమాన మెచ్చటను లేదు*
*దానికంటెఁ బవిత్ర మీ ధరణి లేదు*
*అట్టి జ్ఞానము యోగ సిద్ధాత్ముఁ డెంతొ*
*తనరఁ బొందును తనయందు తనకు తానె.*

**తాత్పర్యము :–** ఈ జ్ఞానముతో సమానమైనది, దీనివలె పవిత్రమైనది ఈ లోకములో మరొకటి లేదు. యోగసిద్ధిని పొందినవారు కాలక్రమముగా తమలో జ్ఞానమును సంపాదించుకొందురు.

**శ్లో. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధిగచ్ఛతి ॥ 39**

*తే.గీ.* *జ్ఞాన సంపాదనము నందు శ్రద్ధ మఱియు*
*నియమనిష్ఠలు నింద్రియ నిగ్రహంబు*
*జగతి నొప్పిన బ్రహ్మ సుజ్ఞాన మబ్బు*
*సద్యశోత్కృష్ట దివ్య ప్రశాంతి గల్గు.*

**తాత్పర్యము :–** జ్ఞాన మనునది సంయమనముచేత, శ్రద్ధచేత, తత్పరముచేత సిద్ధించును. జ్ఞానమును పొందఁగల్గినవానికి సర్వ శ్రేష్ఠమైన శాంతి అతిత్వరలోనే లభించును.

**శ్లో. అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ 40**

*తే.గీ.* *జ్ఞానహీనుఁడు శ్రద్ధా విహీనుఁ డెపుడు*
*సంశయాత్ముఁడు భువి వినాశమును బొందు*
*సంశయాత్మున కిహ లోక సౌఖ్య మొకటె -*
*గాదు పరలోక సౌఖ్యమున్ లేదు పార్థ !*

**తాత్పర్యము :–** జ్ఞానము, శ్రద్ధ లేక ఎల్లప్పుడు అనుమానించుచుండు వానికి వినాశము తప్పదు. అట్లు అనుమానించెడివానికి ఈ లోకమును లేదు; పరలోకమును లేదు. పోనిమ్ము, 'శాంతి' అందుమా; అదియును లేదు.

**శ్లో. యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।**
**ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనంజయ ! 41**

*తే.గీ. పుడమి యోగముచేతను విడువఁ బడిన*
*కర్మఫలములు గలవాని, గణ్యమైన*
*జ్ఞాన సంఛిన్న సంశయ సన్నుతాత్ము*
*నాత్మనిష్ఠుని కర్మము లంటఁ బోవు.*

**తాత్పర్యము :-** ఓ ధనంజయా ! యోగముచే సర్వకర్మలను విడిచినవానిని, జ్ఞానముతో అన్ని అనుమానములు తీర్చుకొనినవానిని, ఆత్మజ్ఞానము కలవానిని కర్మలు బంధింపలేవు సుమా !

**శ్లో. తస్మా దజ్ఞానసమ్భూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ।**
**ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత ! ॥ 42**

*తే.గీ. కావునఁ గిరీటి ! యజ్ఞాన కారణాన*
*అరయ నీ మదిఁ బుట్టిన యట్టి యిట్టి*
*సంశయంబును జ్ఞానాసి నరగఁ ద్రుంచి*
*లెమ్ము నిష్కామకర్మయుద్ధ మ్మొనర్ప.*

**తాత్పర్యము :-** ఓ భారతా ! యోగమును ఆశ్రయించి కర్మబంధాలను వదలుకొని నీ హృదయములోనున్న అనుమానమును జ్ఞానమనెడి ఖడ్గముతో నఱికివేసి యోగమును ఆశ్రయించుము. యుద్ధము చేయుటకు లెమ్ము.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు

## జ్ఞానయోగంబను

నాల్గవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తి మృచ్ఛతి ॥
(5-29)

యజ్ఞములకు, తాపసులకు భోక్తయైన నన్ను, సమస్త లోకములకు ప్రభువైన నన్ను, సమస్త ప్రాణులకు మేలు చేయువాఁడ నైన నన్ను తెలిసికొని పరమాత్మ స్వరూపముగా ఎవఁడు ధ్యానించునో వాఁడు శాంతి రూపమైన ముక్తిని పొందుచున్నాఁడు.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం పంచమోఽధ్యాయః

## కర్మ సన్న్యాసయోగము

*అర్జున ఉవాచ :-*

**శ్లో. సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి ।**
**యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥** 1

*తే.గీ. అనిన భగవాను జూచి యిట్లనె గిరీటి*
*కర్మ సన్న్యాస మొకసారి, కర్మయోగ*
*మరయ నొక సారి శ్రేష్ఠమం చనెద వీవు*
*శ్రేష్ఠ మేదియొ యొక దాని జెప్పు మనఘ !*

**తాత్పర్యము :-** ఓ పుణ్యాత్మా ! ఒక పర్యాయము కర్మములను విడిచిపెట్టుమని చెప్పుచున్నావు, మరొకమారు కర్మలను చేయు మనుచున్నావు. ఈ రెంటిలో నాకేది శ్రేయోదాయకమో, శ్రేష్ఠమో నీవే తెలుపుము.

**విశేషార్థము :-** ఇదివఱకు శ్రీకృష్ణపరమాత్మ పలికిన మాటలను విని అర్జునుఁడు సందేహముతో నిట్లు ప్రశ్నించెను.

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. సన్న్యాసః కర్మయోగ శ్చ నిశ్శ్రేయసకరా వుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే ॥** 2

*తే.గీ. అనిన యర్జును గని యిట్టులనె మురారి*
*కర్మ సన్న్యాస మెట్టిదో కర్మయోగ*
*మవని నట్టిదె మోక్షసంప్రాప్తికొఱకు*
*కాని శ్రేష్ఠమ్ము కర్మయోగమ్మె సుమ్ము.*

**తాత్పర్యము :-** అర్జునా ! అన్ని కర్మలను విడిచిపెట్టుట, చేయవలసిన కర్మలను తప్పక చేయుట, ఈ రెండుకూడ జ్ఞానము నిచ్చి, మోక్షమును కలిగించు సాధనములే. అయినను ఈ రెంటిలో జ్ఞానములేని కర్మ సన్న్యాసము కంటె కర్మానుష్ఠానమే శ్రేష్ఠము.

**విశేషార్థము :-**కర్మసన్న్యాసము జ్ఞానయోగమునకు మూలము. చిత్తశుద్ధి జ్ఞానమును కలుగఁజేయును. చిత్తశుద్ధి కలుగుటకు కర్మల నాచరించుట ముఖ్యము.

**శ్లో. జ్ఞేయ స్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।**
**నిర్ద్వన్ద్వో హి మహాబాహో సుఖం బన్ధా త్ప్రముచ్యతే ॥ 3**

*తే.గీ. ధరణి సుఖదుఃఖములు వీడి పరగువాఁడు*
*రాగమును ద్వేషమున్ వీడి ప్రబలువాఁడు*
*నిత్య సన్న్యాసియగు, నట్టి నిర్మలుండు*
*సులభముగ బంధముక్తుఁడై వెల్గు విజయ !*

**తాత్పర్యము :-** ఎవరు సుఖమును కోరక, దుఃఖమును ద్వేషింపక ఉందురో అట్టి కర్మయోగిని 'నిత్య సన్న్యాసి' అని గుర్తించవలెను. రాగద్వేషాది ద్వంద్వాలను విడిచిన కర్మయోగియొక్క బంధములు సులభముగా విడిపోవును.

**శ్లో. సాంఖ్యయోగౌ పృథ గ్బాలాః ప్రవదన్తి న పండితాః ।**
**ఏక మప్యాస్థితః సమ్య గుభయో ర్విన్దతే ఫలమ్ ॥ 4**

*తే.గీ. కర్మ సన్న్యాస కర్మయోగమ్ములకును*
*ఫలము లవి వేరు వేరని పలుకుచుంద్రు*
*మూర్ఖులగువారు, కాని సద్బుద్ధి నొకటి*
*దేని గొనినను ఫల మొండె మనుజవర్య !*

**తాత్పర్యము :-** అవివేకులు కర్మ సన్న్యాసమును, కర్మయోగమును రెండును ఒకదాని కొకటి విరుద్ధములుగాఁ దలంతురు. కాని, ఆత్మజ్ఞానులు ఈ రెండింటి ఫలము ఒక్కటే అని తెలిసికొనఁగలరు. ఏ ఒక్కదాని నైనను సరే ఆచరించిన రెండింటి ఫలమును శుభములను పొందఁగలరని సారాంశము.

**విశేషార్థము :**-పరస్పర విరుద్ధములుగాఁ గన్పించుచున్న కర్మ సన్న్యాసము, కర్మ యోగము ఈ రెండును మోక్షసోపానములే. అట్లే మోక్షమునకు సాంఖ్యము, యోగము కూడ సోపానములే.

**శ్లో. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5**

*తే.గీ. సాంఖ్యయోగుల కెట్లు మోక్షంబు గలుగు*
*కలుగు నా రీతి నిష్కామ కర్మయోగు*
*లకును, నవి రెండు నొక్క ఫలంబె యొసఁగు*
*నని గ్రహించినవాఁడె యథార్థదర్శి.*

**తాత్పర్యము :**-కర్మ సన్న్యాసమువలన ఎటువంటి మోక్షము కలుగునో నిత్యనైమిత్తిక కర్మాచరణమువలనగూడ అట్టి మోక్షము కలుగును. సాంఖ్య-కర్మ యోగములను సమముగా భావించువాఁడు శాస్త్రమును బాగుగా తెలిసినవాఁడు సుమా !

**శ్లో. సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః ।**
**యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥ 6**

*తే.గీ. అరయ సన్న్యాసయోగ మత్యంత కష్ట*
*మవనిలో నెన్న, కర్మయోగాచరణము*
*సేయ కుండిన, మనన సాశీల్యపరుఁడు*
*వడివడిగఁ బొందు బ్రహ్మ సత్పదవి పార్థ !*

**తాత్పర్యము :**-కర్మలను సన్న్యసించినను పారమార్థిక సన్న్యాసమువలన మోక్షమును పొందుట చాల కష్టము. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయుచు, ఈశ్వర స్వరూపమును ధ్యానించు జిజ్ఞాసువు త్వరగా మోక్షమును పొందును. కాబట్టి జ్ఞాన రహితమైన కర్మ సన్న్యాసముకంటె కర్మయోగమే శ్రేష్ఠమని సారాంశము.

**శ్లో. యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వ న్నపి న లిప్యతే ॥ 7**

*తే.గీ. అలరగ విశుద్ధుడై విజితాత్ముఁ డగుచు*
*వెలయ సర్వేంద్రియంబుల గెలిచి, సకల*
*ప్రాణములు తనవంటివన్ భావమునను*
*బరగు యోగీంద్రుఁ గర్మముల్ పట్టఁ బోవు.*

**తాత్పర్యము :-** యోగము ద్వారా చిత్తశుద్ధి సాధించినవాఁడు, దేహేంద్రియ మనోబుద్ధులను జయించినవాఁడు, సర్వభూతములను తన ఆత్మగా భావించినవాఁడు లోకధర్మార్థము కర్మలను ఆచరించినను కర్మ బంధములు అతనిని ఏమియుఁ జేయలేవు.

**శ్లో. నైవ కించిత్కరో మీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్ర న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి ।**
**ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్ ॥ 9**

*తే.గీ. సన్నుత విశిష్టవిదుఁడు నిష్కామయోగి*
*వినుచుఁ గనుచును తాకుచుఁ దినుచు మఱియు*
*శ్వాస విడుచుచు నడచుచు వాసనలను*
*పీల్చుకొనుచునుఁ బలుకుచుఁ బేర్మి నిదుర*
*వోవుచును కనుల్ దెఱచుచు మూయుచుండి*
*నిత్యకృత్యంబు లోలి నన్నియు నొనర్చి,*
*ఇంద్రియంబులు తమ పను లెల్ల వరుసఁ*
*జేయుచున్నవి నే నిందుఁ జేయుటను న*
*దించు కేనియు లేదని యెంచుచుండు.*

**తాత్పర్యము :-** చిత్తమును వశము చేసికొని ఆత్మజ్ఞాని తాను వినుచున్నను, తినుచున్నను, చూచుచున్నను, కనులుమూసినను, నిద్రించినను, తాకుచున్నను, శ్వాసించుచున్నను ఇవన్నియుఁగూడ విషయ సుఖములలో తగుల్కొనిన ఇంద్రియముల ధర్మములే అని తాను ఎంతమాత్రము చేయుటలేదని తలచును.

**శ్లో. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సఙ్గం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్ర మివామ్భసా ॥** 10

*తే.గీ. సకల కర్మంబు లెవ్వ బ్రహ్మార్పణ మని*
*ఫలమునం దాశ విడిచి యెవ్వాఁడు సేయు*
*వాఁడు పాపంబుచే నంటఁ బడడు మేల్మి*
*తామరాకుపై నీరమ్ము తరలి నట్లు.*

**తాత్పర్యము :-** కర్మల నన్నిటిని ఈశ్వరప్రీతిగాఁ జేయుచున్నా ననెడి భావముతో మోక్ష ఫలమును గూడ వదలివేయువానిని పాపములు అంటవు. తామరాకుపై నీరు అంటనట్లుగా ఈ కర్మయోగిని పాపములు అంటవు.

**శ్లో. కాయేన మనసా బుద్ధ్యా కేవలై రిన్ద్రియై రపి ।**
**యోగినః కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాఽఽత్మశుద్ధయే ॥** 11

*తే.గీ. ఆత్మ సంశుద్ధిఁ గోరిన యట్టి యోగి*
*ఫలమునం దాశ మమతలుఁ దొలఁగఁ బెట్టి*
*త్రికరణ విశుద్ధిఁ గర్మముల్ తేజరిలఁగ*
*ఈశ్వరార్పణ మని సేతు రెపుడు విజయ !*

**తాత్పర్యము :-** కర్మఫలము పట్ల ఆశను విడిచి చిత్తశుద్ధి సాధించుట కొఱకు మనో బుద్ధీంద్రియాలచే శ్రుతిస్మృతులు పేర్కొనిన ధర్మమును అనుసరింపఁజేయుదురు.

**విశేషార్థము :-**కర్మయోగమువలన చిత్తశుద్ధి, ఆపై మోక్షము లభించిన సాంఖ్య యోగమువలన సాక్షాత్తుగా, నేరుగా మోక్షమును పొందవచ్చును. కర్మయోగము Indirect way, సాంఖ్యము Direct way అని సారాంశము.

**శ్లో. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥** 12

*తే.గీ. కర్మఫలములయం దాశ కడకు నెట్టి*
*నిష్ఠతోడుత యోగి శాంతిని గడించు*
*కర్మఫలములయం దాశఁ గలిగినట్టి*
*నరుఁడు వెతఁ బొందు కర్మబంధములఁ దగిలి.*

**తాత్పర్యము :-** యోగి, తాను చేయు కర్మఫలమును లెక్కించకుండ అన్ని కర్మలను ఈశ్వరార్పణ భావముతోఁ జేయుటతో చిత్తశుద్ధిని మోక్షమును పొందును. యోగమును ఆచరింపనివాఁడు కర్మఫలాసక్తి గలిగి కోరికలచేత కట్టుపడును.

**శ్లో. సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥** **13**

*తే.గీ. స్థిరముగ విజితేంద్రియుఁడైన దేహి సకల*
*కర్మల త్యజించి తాఁ జేయకన్ మఱొకరి*
*చేతఁ జేయింప కేదియుఁ జెందు సుఖము*
*తగ నవద్వారపుర మను తనువునందు.*

**తాత్పర్యము :-** జితేంద్రియుడైన ఆత్మజ్ఞాని జ్ఞాననిష్ఠ ప్రభావముతో అన్ని కర్మలను విడచి సన్న్యాసియై తా నే కర్మమును చేయక, చేయింపకుండ నవద్వారపురమైన దేహములో సాక్షిగా నుండును.

**విశేషార్థము :-** స్థితప్రజ్ఞుని స్వరూప స్వభావములు ఇక్కడనుండి చక్కగా వివరింపబడినవి.

**శ్లో. న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥** **14**

*తే.గీ. ప్రభుఁడు సృష్టింప బోఁడీ ప్రపంచమందు*
*కర్తృ కర్మలు మఱియును కర్మఫలము*
*ప్రకృతియొక్క సంబంధమువలన పార్థ !*
*పూర్వజన్మ సంస్కార సంభూతము లివి.*

**తాత్పర్యము :-** ఈశ్వర స్వరూపమైన ఆత్మ ఏదైనను ఒక పనిని చేయుటగాని, చేయించుటగాని చేయదు. ఈ లోక వ్యవహారము లన్నియు మాయా రూపమైన ప్రకృతి జరిపించుచున్నది. కర్మలకు, కర్మఫలములకును కారణ మగుచున్నది.

**విశేషార్థము :-** 'ప్రకృతి' అనగా అవిద్య, అజ్ఞానము, మాయ.

**శ్లో. నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥** 15

*తే.గీ. ఎవని పాపంబు పుణ్యంబు నీశ్వరుండు*
*స్వీకరింపంగఁ బో డద్ది వెఱ్ఱి తలఁపు*
*జగతియందున జ్ఞాన మజ్ఞాన శక్తి*
*గప్పఁ బడియుంట జీవు లీ గతి భ్రమింత్రు.*

**తాత్పర్యము :–**ఆత్మభావమును పొందిన సన్న్యాసి ఈశ్వర స్వరూపుఁడు. ఆ కారణమువలన పాపపుణ్యము లనునవేవియు అతడిని అంటవు. జ్ఞానము అజ్ఞానముతోఁ గప్పబడుటవలన మోహభావముతో లౌకిక వ్యాపారములు తాను చేయుచున్నానని భ్రాంతిఁ జెందుట జరుగుచుండును.

**విశేషార్థము :–**ఇచట ఆత్మస్వరూప మనగా నిర్వికారజ్ఞాన స్వరూపమని అర్థము. అజ్ఞానమువలన అంతయు తానే చేయుచున్నా ననుకొనుచున్నాడని భావము.

**శ్లో. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః ।**
**తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥** 16

*తే.గీ. జ్ఞానమును గప్పినట్టి యజ్ఞాన తతిని*
*సన్నుతంబైన యాత్మ సుజ్ఞాన శక్తి*
*పారఁద్రోలఁగ, నా జ్ఞానభాస్కరుండు*
*వెలయ బ్రహ్మస్వరూప ముజ్జ్వలతఁ జూపు.*

**తాత్పర్యము :–** జ్ఞానమును గప్పియున్న అజ్ఞాన మంతయు పూర్తిగా నశించిపోయి, జ్ఞానము సూర్యునివలె ప్రకాశించి శుద్ధమైన బ్రహ్మస్వరూపమును ప్రకాశింపఁజేయును.

**విశేషార్థము :–** అజ్ఞాన మనఁగా 'కామము', 'కోరిక' - అని అర్థము. అటువంటి 'కామ' స్వరూపమును తెలిసికొనుటయే జ్ఞానము.

**శ్లో. తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః ।**
**గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥** 17

*తే.గీ. అట్టి బ్రహ్మ స్వరూపంబునందె నరుఁడు*
*మనసు నిల్పి తదాశ్రయ మొనరఁ బొంది*
*జ్ఞాన నిర్ధూత కల్మషచయుఁడు నగుచుఁ*
*గన పునర్జన్మ లేని మోక్షమును బొందు.*

**తాత్పర్యము :–** పరబ్రహ్మ స్వరూపమును తెలిసికొనిన జ్ఞానులు ఆ స్వరూపమునే నిష్ఠతో సేవించుచు ఆతనిమీదే దృష్టిని నిలిపి, తమ జ్ఞానముచే పాపాల నన్నిటిని పోగొట్టుకొన్నవారై జన్మరహితమైన ముక్తిని పొందుదురు.

**శ్లో. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః ॥** 18

*తే.గీ. వేద విద్యా వినయశీల విప్రునందు*
*గోవునందునుఁ గరియందు కుక్కయందు*
*నరయఁ గుక్కను దిను నీచునందు నెపుడు*
*సరగ సమదర్శి యగువాఁడె పండితుండు.*

**తాత్పర్యము :–** పండితులైనవారు ఉత్తములైన బ్రాహ్మణులయందు, గోవులయందు, ఏనుగులయందు, శునకములయందు, వాని మాంసమును వండి తిను నీచులయందును సమదృష్టిని ప్రకటించుచుందురు.

**విశేషార్థము :–** ఈ శ్లోకములో పండిత లక్షణములు వివరింపఁబడినవి. మోక్ష సాధన కారణములలో బ్రాహ్మణాదులు ఉత్తమ ఉపాధులు (శరీరములు), గోవు మొదలైనవి మధ్యమములు. ఇక వరాహాదులు నికృష్టములు. అయినప్పటికి అన్నిటిపట్లను సమ భావనమే పండిత లక్షణము.

**శ్లో. ఇహైవ తై ర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః ॥** 19

*తే.గీ.* *ఎల్ల ప్రాణుల సమముగా నెంచువాఁడు*
*దుఃఖ సంసార బంధముల్ తొలఁగి మనును*
*బ్రహ్మ మది దోషరహితమ్ము సమముఁ గాన*
*నతఁడు బ్రహ్మము నందె నిత్యముగ నుండు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! సమానమైన భావముతో అన్ని ప్రాణులలోను బ్రహ్మ స్వరూపమును చూడఁగల్గినవారు నిశ్చలమైన భావముతో జన్మ బంధములను జయించి, ముక్తిని పొందఁగల్గుచున్నారు. అటువంటివారు ఈ జన్మలోనే 'జీవన్ముక్తి'ని పొందుదురు.

**శ్లో. న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య నో ద్విజే త్ప్రాప్య చాప్రియమ్ ।**
**స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవి ద్బ్రహ్మణి స్థితః ॥** 20

*తే.గీ.* *వెలయ బ్రహ్మంబునన్ స్థితి గలుగువాఁడు*
*ప్రబలు స్థిరబుద్ధిఁ గొని మోహరహితుఁ డగుచు*
*ప్రియముఁ గలిగిన మోద, మప్రియము గలుగ*
*జగతి దుఃఖంబుఁ గొనడు సుజ్ఞాని యగుచు.*

**తాత్పర్యము :-** బ్రహ్మజ్ఞాన సంపన్నులై స్థిరమైన బుద్ధితో నెటువంటి మోహమును బొందక బ్రహ్మములోనే బుద్ధి నిల్పుకొని సర్వకర్మ సన్న్యాసమును పొందినవారు ప్రియము గల్గినను సంతోషింపరు; అప్రియము గల్గినను దుఃఖింపరు.

**శ్లో. బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విన్ద త్యాత్మని యత్సుఖమ్ ।**
**స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే ॥** 21

*తే.గీ.* *బాహ్య విషయాల నాసక్తి వదలి నట్టి*
*మనుజుఁ డే రీతి మది సుఖ మనుభవించు*
*అవ్విధిని బ్రహ్మయోగయుక్తాత్ముఁ డవని*
*నక్షయం బగు సుఖముల నందు విజయ !*

**తాత్పర్యము :-** ఇంద్రియ సుఖములపట్ల ఆసక్తి లేనట్టివాఁడు ఆత్మ స్వరూపమును తెలిసి ఆనందమును పొందుచున్నాఁడు. అటువంటి బ్రహ్మనిష్ఠలో నున్నవాఁడు ఆత్మ సుఖమును శాశ్వతముగా బొందుచున్నాడు.

**శ్లో.** **యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యన్తవన్తః కౌన్తేయ న తేషు రమతే బుధః ॥** 22

*తే.గీ.* *ఉర్వి విషయేంద్రియాల సంయోగమునను*
*కలుగు సుఖజాల మాద్యంతములను గలవి*
*అన్ని దుఃఖములకు మూల మౌటవలన*
*ప్రాజ్ఞు డగువాఁడు వాని గోరంగఁ బోడు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ఇంద్రియ సుఖములన్ని ఉత్పత్తి-వినాశములు గల్గినట్టివి. కాబట్టి దుఃఖ కారకములు. పండితుఁడు అటువంటి భోగములపట్ల ఎంత మాత్రము కూడ ప్రీతిఁ జెందదు.

**శ్లో.** **శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥** 23

*తే.గీ.* *తనువు వీడక మున్నె యీ ధరణియందు*
*కామక్రోధజ మైన వేగము నెవండు*
*అడపఁ గల్గునో వాఁడె మేలైన యోగి*
*శాశ్వత సుఖంబు లొందంగ జాలు నతఁడు.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! ఏ నరుఁడు తన దేహమును వీడుటకు ముందే కామ క్రోధాదులవలన పుట్టునట్టి ఆవేశమును నిగ్రహింపఁగలుగునో, ఆతఁడు జీవించియుండఁగనే ఇంద్రియ నిగ్రహ ప్రభావమువలన బ్రహ్మ భావమును పొంది సుఖింపఁగలుగుచున్నాఁడు.

**శ్లో.** **యోఽన్తఃసుఖోఽన్తరారామ స్తథాన్త ర్జ్యోతి రేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥** 24

*తే.గీ. ఆత్మయందె సుఖించుచు నాత్మలోనె*
*యలర రమియించుచును నంతరాత్మయందె*
*వర ప్రకాశమ్ముఁ గలిగిన పరమయోగి*
*బ్రహ్మమయుఁడొందు బ్రహ్మనిర్వాణపదవి.*

**తాత్పర్యము :-** ఎటువంటి జ్ఞానయోగి తన ఆత్మలోనే సుఖమును అనుభవించుచు, తన ఆత్మలోనే క్రీడించుచు, ఆ విధముగా తన అంతరాత్మయే ప్రకాశమని గుర్తించినవాఁడగునో అట్టి ఆత్మజ్ఞాని జీవించియుండగనే బ్రహ్మజ్ఞానమును పొందినవాఁడై మోక్షపదవిని చేరుకొనుచున్నాఁడు.

**శ్లో. లభన్తే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః ।**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25**

*తే.గీ. సర్వభూతాల హితు లయి సంశయాళి*
*తొలఁగ, పాపమ్ము నశియించి సలలితముగ*
*నాత్మ నిగ్రహపరులైన యట్టి ఋషులు*
*పడయుదురు బ్రహ్మ నిర్వాణపదవి పార్థ !*

**తాత్పర్యము :-** పాపముల నన్నిటిని నశింపఁజేసికొని, అనుమానము లన్నియు నివృత్తి చేసికొని, ఇంద్రియ నిగ్రహమును సాధించి, అన్ని ప్రాణులపట్ల ప్రీతిఁ గల్గిన జ్ఞానులు మోక్షమును పొందుదురు.

**శ్లో. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26**

*తే.గీ. కామమును క్రోధమును వీడి గణ్యముగను*
*మనసు నిగ్రహ మొనరించి వినుతమైన*
*ఆత్మ సుజ్ఞాన మొందిన యతివరులను*
*పరగ నంతట బ్రహ్మ నిర్వాణ మబ్బు.*

**తాత్పర్యము :-** ఎవరు కామ క్రోధములను జయించి, ఇంద్రియ నిగ్రహమును అలవరచుకొని ఆత్మస్వరూపమును తెలిసికొనఁగలుగుదురో అట్టివారికి దేహము ఉన్నప్పుడును, లేనప్పుడును మోక్షము లభించును.

శ్లో. స్పర్శాన్ కృత్వా బహి ర్బాహ్యాం శ్చక్షుశ్చై వాన్తరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యన్తరచారిణౌ ॥ 27

యతేంద్రియ మనోబుద్ధి ర్మని ర్మోక్ష పరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో య స్సదా ముక్త ఏవ సః ॥ 28

*తే.గీ. బాహ్య విషయేచ్ఛ లెపుడును బయటనెట్టి*
*దృష్టి భ్రూమధ్య మందె సందీప్తి నిలిపి*
*భవ్యముగ నెప్డు నాసికాభ్యంతరముల*
*వరలుచుండు ప్రాణాపాన వాయువులను*
*సమముగ నొనర్చి, బుద్ధీంద్రియములు మనసుఁ*
*దన వశముఁ జేసికొనియు, క్రోధమును భయము*
*నాశయును వీడి మనెడు మోక్షార్థి నిత్య*
*ముక్తు డెన్నంగ గాండీవ భూషితాంగ !*

**తాత్పర్యము :-** ఇంద్రియ సుఖములకు దూరముగానుండి చూపును కనుబొమలకు మధ్యగా ఏకాంతముగా నిలిపి, ముక్కునందు చలించు ప్రాణవాయువును అపానవాయువుతో సమముగా నియమించి, మనస్సును, బుద్ధిని, ఇంద్రియములను నిగ్రహించుకొని, కామక్రోధములను జయించి, మోక్షమందే ధ్యానము గలిగినవాడైన యోగి ఎల్లప్పుడు మోక్షమును పొందినవాడే యగుచున్నాడు.

శ్లో. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తి మృచ్ఛతి ॥ 29

*తే.గీ. తపము యజ్ఞంబులకును భోక్తనుగ నన్ను*
*అఖిలలోక మహేశ్వరుం డనఁగ నన్ను*
*జీవకోటికి హితుఁ డంచుఁ జేరి నన్ను*
*కొలుచువానికి మోక్షంబు గలుగు విజయ !*

**తాత్పర్యము :-** యజ్ఞములకు, తాపసులకు భోక్తయైన నన్ను, సమస్త లోకములకు ప్రభువైన నన్ను, సమస్త ప్రాణులకు మేలు చేయువాఁడ నైన నన్ను తెలిసికొని పరమాత్మ స్వరూపముగా ఎవఁడు ధ్యానించునో వాఁడు శాంతి రూపమైన ముక్తిని పొందుచున్నాఁడు.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు

**కర్మ సన్న్యాసయోగంబను**

ఐదవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. యోగీ యుఞ్జీత సతత మాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥

(6-10)

'యోగి' ఎల్లప్పుడు ఏకాంతములో నున్నవాడై సర్వసంగ పరిత్యాగముఁ జేసి, ఆశలను వదలిపెట్టి, మనస్సును స్వాధీనము చేసికొని, బంధములన్నిటిని త్రెంచుకొని, ఆత్మను పరమాత్మలో లగ్నము చేసికొని యుండవలెను.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం షష్ఠోఽధ్యాయః

## ఆత్మ సంయమ యోగము

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్ని ర్న చాక్రియః ॥** 1

*తే.గీ. ఫలమునం దాశ విడి కర్మ సలుపు నెవఁడు*
*వాఁడె సన్న్యాసి యోగియు వాఁడె విజయ !*
*అగ్నికార్యముల్ కర్మము లన్ని విడుచు*
*నరుఁడు యోగియుఁ గాడు సన్న్యాసి గాడు.*

**తాత్పర్యము :-** కర్మ ఫలమును కోరక కర్మల నాచరించు యోగి స్వర్గమును త్యజించిన సన్న్యాసితో సమానుఁడుగా చెప్పఁబడును. అగ్ని కార్యమును వదలినంత మాత్రమున సన్న్యాసి కాజాలఁడు. దానిని విడువకున్న ఫలమును ఆశించక కర్మల నాచరించువాఁడే సన్న్యాసి. అతఁడే యోగి.

**విశేషార్థము :-** కర్మయోగి చిత్తశుద్ధిని, దానివలన జ్ఞానమును, దాని మూలకముగా మోక్షమును పొందునని చెప్పఁబడుచున్నది.

**శ్లో. యం సన్న్యాస మితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాణ్డవ ! ।**
**న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥** 2

*తే.గీ. ధరణి సన్న్యాస మనుచు నెద్దాని నండ్రు*
*దానినే యోగమం చెంచ నగును పార్థ !*
*కూర్మి సంకల్పరహిత సద్గుణము లేని*
*వాఁడు యోగి యటంచుఁ జెప్పంగఁ దగఁడు.*

**తాత్పర్యము :–** ఓ అర్జునా ! పండితులు 'సన్న్యాస మని' చెప్పెదుదానికి, 'కర్మయోగమ'నెడు దానికి కూడా ఎటువంటి భేదము లేదు. 'ఫలముమీద మనసున్న యెడల నతఁడు 'కర్మయోగి' కాడు. అట్లని ఫలమును వలదని కర్మను విడువరాదు సుమా !

**శ్లో. ఆరురుక్షో ర్మునే ర్యోగం కర్మ కారణ ముచ్యతే ।**
**యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే ॥** 3

*తే.గీ. ఎలమి సద్యోగసిద్ధి వాంఛించు మునికి*
*సాధనము కర్మమే యౌను, జగతి యోగ*
*సిద్ధిఁ బొందిన మునికి విశిష్టమైన*
*సాధనం బది శమమెయౌ సవ్యసాచి !*

**తాత్పర్యము :–** జ్ఞానమును పొందవలెనని కోరుకొనువారికి కర్మాను ష్ఠానము సాధనముగాఁ జెప్పబడినది. నిష్కామ కర్మలవలన జ్ఞానమును పొందినమీదట యోగమును అధిష్ఠించినవారు మోక్షమును పొందుటకు శమమే సాధనము. 'శమ'మనగా సర్వ కర్మసన్న్యాసము.

**శ్లో. యదా హి నేన్ద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥** 4

*తే.గీ. ఇంద్రియ సుఖంబులందున నిచ్ఛ వదలి*
*కర్మములయందు నాసక్తి కడకు నెట్టి*
*సకల సంకల్పములు వీడి సన్నుతముగ*
*నలరు నతని యోగారూఢుఁ డంద్రు బుధులు.*

**తాత్పర్యము :–** ఎవ్వరు ఇహ-పర ఫలములను ఆశించి కర్మలు చేయవలె నను సంకల్పమును విడిచి శబ్దాది విషయములపట్ల, నిత్యనైమిత్తిక కర్మలపట్ల ఆసక్తి వదలి వేయుదురో అట్టివారు యోగారూఢులని, సర్వ కర్మ సన్న్యాసులని చెప్పఁబడుదురు.

శ్లో. **ఉద్ధరే దాత్మనాఽఽత్మానం నాత్మాన మవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధు రాత్మైవ రిపు రాత్మనః ॥** 5

*తే.గీ. తన్ను తా నుద్ధరించుకోఁదగును గాని*
*తన్ను తా నెప్డు చెఱుపుకోఁ దగదు వినుము*
*బంధువగు నాత్మ సద్బుద్ధి వరలు గుణికి*
*బుద్ధిహీనున కాత్మయే బద్ధవైరి.*

**తాత్పర్యము** :-ఓ అర్జునా ! ప్రతి జీవి తన్ను తాను ఉద్ధరించుకొనవలెను గాని క్రింద పడఁద్రోసికొనరాదు. తనకు తానే బంధువు, తనకు తానే శత్రువు. అటువంటి ఆత్మజ్ఞానముతో బ్రతుకవలయును సుమా !

**విశేషార్థము** :- మనుజుఁడు బాగుపడుటకు, చెడిపోవుటకు కారణము తానే. హితులు కాని, శత్రువులుగాని, వేరెవరో అనుకొనరాదు. తనకు తానే బంధువు, అలాగే తనకు తానే శత్రువు.

శ్లో. **బన్ధు రాత్మాఽఽత్మన స్తస్య యేనాత్మై వాత్మనా జితః ।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్ ॥** 6

*తే.గీ. ఆత్మ నాత్మచే గెలిచిన యట్టివాని*
*కాత్మయే బంధు వౌచు మే లరయుచుండు*
*ఆత్మను జయింపగా లేని యట్టివాని*
*కాత్మయె విరోధి యౌచు కీళ్ళరయుచుండు.*

**తాత్పర్యము** :-ఓ పార్థా ! ఇంద్రియములను జయించుటకు తోడ్పడు ఆత్మయే మనుజునకు బంధువు. ఇంద్రియ నిగ్రహమునకు తోడ్పడని ఆత్మయే శత్రువని మనము గ్రహించవలెను.

శ్లో. **జితాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః ।**
**శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥*** 7

* మానాపమానయోః (పాఠాంతరము)

*తే.గీ. ఆత్మను జయించి శాంత చిత్తాఢ్యుడైన*
*వాని మనసున పరమాత్మ వరలుచుండు*
*పొసగ నతనికి సుఖదుఃఖములును మఱియు*
*మాన మవమానములును సమాన మౌను.*

**తాత్పర్యము :-** మనసును గెల్చినవాడు ఇంద్రియములను వశము చేసికొని, నిర్మలమైన అంతఃకరణముతో పరమాత్మభావముతో, శీతోష్ణములను, సుఖదుఃఖములను, మానావమానములను సమానముగా భావించుచు చిన్మాత్ర సుఖమును పొందుచుండును.

**శ్లో. జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః ।**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః ॥ 8**

*తే.గీ. జ్ఞాన విజ్ఞాన సంతృప్తి సన్నుతు డయి*
*ద్వంద్వములచేత చలన మొందకను నెపుడు*
*మట్టియును రాయి బంగారు మహి సమాన*
*మని తలంచినవాడె మేలైన యోగి.*

**తాత్పర్యము :-** శాస్త్రజ్ఞానముచేతను, విశేషమైన అనుభవజ్ఞానము వలనను, తృప్తి జెందిన అంతఃకరణముతో, ఇంద్రియ నిగ్రహముతో మట్టిబెడ్డ, ఱాయి, బంగారము ఈ మూడింటిలోను సమానభావమును గలిగి మనో వికారములు లేకుండ ఉన్నవానిని 'సన్న్యాసి' అని అందురు.

**శ్లో. సుహృ న్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్యబన్ధుషు ।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే ॥ 9**

*తే.గీ. సహృదయులయందు మిత్రుల శత్రులందు*
*తగ నుదాసీన ద్వేష్య మధ్యస్థులందు*
*బంధుగులయందు సాధులు పాపులందు*
*సమ మనస్కుడె యుత్కృష్ట సద్గుణుండు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! స్నేహితులపట్ల-శత్రువులపట్ల ఉదాసీనభావమును వహించిన వారియందు, మధ్యస్థులయెడల, సాధువుల

యందు, పాపులయెడల( గూడ సమానమైన బుద్ధిగలిగినవా(డే 'యోగి'యని చెప్ప(బడును.

**శ్లో. యోగీ యుఞ్జీత సతత మాత్మానం రహసి స్థితః ।**
**ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥ 10**

*తే.గీ. చిత్తమును నింద్రియాళిని చెలగి గెలిచి*
*పరులయందుండి యణువైన బడయకుండ*
*ఆత్మ పరమాత్మలోన లయం బొనర్చి*
*సతత మేకాంతమున నుండసాగు యోగి.*

**తాత్పర్యము :**-'యోగి' ఎల్లప్పుడు ఏకాంతములో నున్నవాడై సర్వసంగ పరిత్యాగము( జేసి, ఆశలను వదలిపెట్టి, మనస్సును స్వాధీనము చేసికొని, బంధములన్నిటిని త్రెంచుకొని, ఆత్మను పరమాత్మలో లగ్నము చేసికొని యుండవలెను.

**శ్లో. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః ।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్* ॥ 11**

**తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేన్ద్రియ క్రియః ।**
**ఉపవిశ్యాసనే యుఞ్జ్యా ద్యోగమాత్మవిశుద్ధయే ॥ 12**

*తే.గీ. మిగుల యెత్తును పల్లమున్ మెందుగాక*
*సదమలంబై పవిత్రమౌ స్థలమునందు*
*వస్త్రమజినము మఱియు దర్భాసనంబు*
*వరుసగ నమర్చి యొకదానిపైన నొకటి*

*దానిపై( గూరుచుండి చిత్తంబు నిలిపి*
*ఇంద్రియంబుల శాసించి యెలమి నాత్మ-*
*శుద్ధికొఱ కయి పాండవ శూరవర్య !*
*భవ్యముగ యోగ మభ్యసింపంగవలయు.*

* చైలాజినకుశోత్తరమ్ (పాఠాంతరము)

**తాత్పర్యము :-** ఎత్తు పల్లములు లేని శుభ్రమైన స్థలములో స్థిరముగా దర్భలు, నార బట్టలు, చర్మము వీటితో ఏర్పాటు చేయఁబడిన ఆసనముమీఁదఁ గూర్చుండి ఏకాగ్రమయిన మనస్సుతో నింద్రియములను జయించి చిత్తశుద్ధి, జ్ఞానముఁ గలుగుటకు యోగమును అభ్యసించవలెను.

**శ్లో. సమం కాయశిరో గ్రీవం ధారయ న్నచలం స్థిరః ।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశ శ్చానవలోకయన్ ॥ 13**

**ప్రశాన్తాత్మా విగతభీ ర్బ్రహ్మచారివ్రతే స్థితః ।**
**మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14**

*తే.గీ. దేహము శిరంబు కంఠంబుఁ దేజరిల్లఁగ*
*సమముగ నచంచలంబుగా నలిపి నిలిపి*
*దిశలయందునఁ జూపులు ద్రిప్పకుండ*
*నరల భ్రూమధ్యమందె సుస్థిరత నునిచి*

*వెలయ శాంతాత్ముఁడై గత భీతుఁ డగుచు*
*బ్రహ్మచర్య వ్రతంబును వదలకుండ*
*మనసును జయించి నాయందె మనసు నిలిపి*
*నన్నె గతి యని యోగి తా నెన్నవలయు.*

**తాత్పర్యము :-** అట్లు అభ్యసించునప్పుడు శరీరము, శిరస్సు, కంఠ ప్రదేశము-ఈ మూఁడును సమముగా స్థిరముగా నుండునట్లు నిలిపి, దృష్టిని చెదరకుండ సూటిగా ముక్కుకొనపై నిలకడగా నుంచవలెను. భయమును విడిచిపెట్టి, శాంత స్వభావముతో, బ్రహ్మచర్య వ్రతమును ఆచరించుచు మనస్సును భగవంతునియందే నిల్పి పరమాత్మ సాక్షాత్కారానికై యత్నించవలెను.

**శ్లో. యుఞ్జ న్నేవం సదాఽఽత్మానం యోగీ నియత మానసః ।**
**శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి ॥ 15**

తే.గీ. తగ మనోనిగ్రహుం డౌచుఁ దనరు యోగి
మనసు నాయందు నునిచి సంబరముతోడ
యోగమున నభ్యసించెడి యోగివరుఁడు
పరమ నిర్వాణపదమును బడయు పార్థ !

**తాత్పర్యము :-** పైన వివరించిన విధముగా శ్రమకు ఓర్చుకొని తన అంతఃకరణమును పరమాత్మయందే లగ్నముచేసి ఎల్ల వేళల ధ్యాన నిష్ఠయందున్నవాఁడు శాంతిని, దాని మూలముగా మోక్షపదవిని పొందును.

**శ్లో. నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్త మనశ్నతః ।**
**న చాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 16**

తే.గీ. అమిత భోజనునకు నిరాహారునకును
అధిక నిద్రాభిలాషున కరయ నిద్ర
బొత్తిగా లేనివానికి బొలుపు మీర
కలుగ దిల యోగ సంసిద్ధి ఖండితముగ.

**తాత్పర్యము :-**ఓ అర్జునా ! ఈ యోగమును పొందునట్టి స్థితి మిక్కిలి తిండిపోతునకుఁ గాని, పస్తులుండువానికిఁ గాని, ఎల్ల వేళల మేలుకొనియుండు వానికిఁ గాని లభింపదు.

**శ్లో. యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 17**

తే.గీ. అరయ నుర్వి నాహార విహారములను
కర్మముల వర్తనులను జాగరణ నిద్ర
లందునను నుచితత్వంబు నొంద మెలఁగు
యోగులకుఁ గల్గు సుఖదమౌ యోగసిద్ధి.

**తాత్పర్యము :-** యోగము లభించుట యంత సులభమైన విషయము గాదు. నియమముతోఁ గూడిన ఆహారవిహార నియమములు గల్గినవారికి అట్లే నియమముతోఁ గూడిన నిద్ర, మెలకువ గలవారికి మాత్రమే యోగము సిద్ధించును. ఈ యోగము లభించిన దాని మూలముగా లభించు ధ్యానమువలన దుఃఖము సమసిపోవును.

**విశేషార్థము :-** 16, 17 శ్లోకములలో యోగాభ్యాసకులకు కొన్ని ముఖ్య సూచనలు చెప్పఁబడినవి. రోగ నివారణకు ఔషధ సేవవలె మనోరుగ్మతకు యోగానుష్ఠానము ముఖ్యమైన ఔషధము.

**శ్లో. యదా వినియతం చిత్త మాత్మన్యేవావతిష్ఠతే ।**
**నిస్స్పృహ స్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18**

*తే.గీ. నియతముగ మది నాత్మలో నిలిపి సతము*
*ఎవఁడు వర్తించునో వాఁడు భువిని సకల*
*వాంఛలందు నపేక్షలు వదలి యోగ*
*సిద్ధిఁ బొందు నటంచు వచింత్రు బుధులు.*

**తాత్పర్యము :-** చిత్తమును వశము చేసికొని, లగ్నమైన మనస్సును పరబ్రహ్మ ధ్యానములో వినియోగించుచు బాహ్య చింతలను విరిచి ఆత్మ స్వరూపము వైపునకు దృష్టి మరలించి కోరిక లన్నింటిని దూరము చేసికొని నిష్ఠగా ధ్యానము చేయువానినే 'యోగి' అని అందురు.

**విశేషార్థము :-** నిష్ఠయొక్క ఫలము లభించుటకు అనుకూలమైన సమయము ఇక్కడ సూచింపఁబడినది.

**శ్లో. యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా ।**
**యోగినో యతచిత్తస్య యుఞ్జతో యోగ మాత్మనః ॥ 19**

*తే.గీ. నియత చిత్తంబుతో యోగనిష్ఠఁ దగుచు*
*నలరుచుండెడు యోగి శుద్ధాత్మ - గాలి*
*లేని చోటను నెపుడు చలింపకుండ*
*వెలుగు దీపంబునకు సాటి వీరవర్య !*

**తాత్పర్యము :-** ఈ విధముగా చిత్తమును బ్రహ్మలో చేర్చి యోగాభ్యాసముఁ జేసెడి యోగియొక్క ఆత్మ నిశ్చలముగా నుండును. గాలి లేనిచోట దీపముఁ బెట్టిన అది చలించదు. అట్లే యోగి ఆత్మకూడ నిశ్చలముగా నుండును.

శ్లో. యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్ర చైవాత్మనాఽఽత్మానం పశ్య న్నాత్మని తుష్యతి ॥ **20**

సుఖ మాత్యన్తికం యత్తద్బుద్ధి గ్రాహ్య మతీన్ద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థిత శ్చలతి తత్త్వత: ॥ **21**

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తత: ।
యస్మిన్ స్థితో న దు:ఖేన గురుణాఽపి విచాల్యతే ॥ **22**

తం విద్యా ద్దు:ఖ సంయోగవియోగం యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా ॥ **23**

*తే.గీ. చిత్త మెచ్చట దృఢయోగ సేవచేత*
*నలర నిగ్రహ మిల పరమాత్మయందు*
*తగ రమించునొ, యెచట శుద్ధాత్మను పర*
*మాత్మ దర్శన మయి మోద మందు యోగి*
*ఎలమి తుది మొదలును లేక యింద్రియముల*
*చేతఁ గాక నిర్మల బుద్ధిచేతఁ దెలియఁ*
*దగినదియు నయినట్టి మోదమును యోగి*
*యెచట ననుభవించునొ, మఱి యెచట మేల్మి*
*స్వానుభవమును విడి చలింపక వెలుంగు,*
*దేనిఁ బొందిన తరువాత దీనికంటె*
*యధిక మైనది లే దని యాత్మ నెంచు,*
*దేనియందుండి దు:ఖ మందేని చలన*
*మొందకుండునొ, దు:ఖ సంబంధ దూర*
*మైన దానిని యోగమం చరయవలయు*
*ఎఱుగవలె దాని విషయరాహిత్య బుద్ధి.*

**తాత్పర్యము :-** చిత్తము యోగానుష్ఠానముచే నిరోధింపఁబడి ఏ ఉపశమనమును పొందునో, ఎటువంటి ఆత్మానందమును పొందునో ఇంద్రియాతీతమైన సుఖమును బుద్ధిచే నెప్పుడు పొందునో అప్పుడు యోగి తన అభ్యాసముచే యోగసిద్ధిని పొందును. ఇంచుకైన చలింపకుండ యోగి దు:ఖరహితమైన దృఢమైన యోగమును పొందును.

**విశేషార్థము :-** దుఃఖమును దూరము చేసికొనుటయే ఈ యోగాభ్యాస ఫలమని సారాంశము.

**శ్లో. సంకల్పప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః ।**
**మన సైవేన్ద్రియగ్రామం వినియమ్య సమన్తతః ॥ 24**
**శనైః శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతిగృహీతయా ।**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించి దపి చింతయేత్ ॥ 25**

*తే.గీ. వసుధ సంకల్ప ప్రభవమౌ వాంఛ లెల్ల*
*వదలి మనసుచే విషయ సంబంధములను*
*దగులు కొనకుండ యింద్రియ తతి మరల్చి*
*విమత దృఢబుద్ధి నాత్మలో మనసు నిలిపి*
*పొందవలె మెల్ల మెల్ల నాత్మోన్నతిఁ దగ*
*నాత్మ తత్త్వంబుకంటె నన్యమునుగూర్చి*
*చింతనము సేయకుండ విశిష్ట మతిని*
*సతముఁ గ్రీడించువాఁడె నిశ్చలుఁడు యోగి.*

**తాత్పర్యము :-** కోరికలన్నింటిని వదలిపెట్టి, ఇంద్రియములన్నింటిని మెల్ల మెల్లగా నిగ్రహించి, అనుమానములను దీనావస్థలను విడచి యోగమును అభ్యసించుటకు పూనుకొనవలెను. ధైర్యమును అవలంభించి, చింతలను తొలగించుకొని, మెల్ల మెల్లగా మనస్సును ఆత్మ వశము చేసి, దానిని ఆత్మ స్వరూపమును తెలిసికొనెడి విషయములోనే లగ్నముచేసి, ఇతర చింతలు మాని ప్రశాంతముగా నుండవలెను.

**శ్లో. యతో యతో నిశ్చరతి మన శ్చంచల మస్థిరమ్ ।**
**తత స్తతో నియమ్యైత దాత్మ న్యేవ వశం నయేత్ ॥ 26**

*తే.గీ. అస్థిరము చంచలం బైన యట్టి మనసు*
*ఎందు నెందుఁ జరించునో యెఱిఁగి యెఱిఁగి*
*అందు నందుండి మరలించి యాత్మయందె*
*నిలుపవలె పార్థ ! యోగమ్ము సలుపువాఁడు.*

**తాత్పర్యము :**–'మనస్సు' అనునది మిక్కిలి చంచల స్వభావము( గలది. అటువంటి దానిని అది చరించెడి వివిధ విషయములనుండి మరల్చి స్వాధీనము లోనికి( దెచ్చికొని స్థిరచిత్తముతో యోగాభ్యాసము( జేయవలెను.

**శ్లో. ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖ ముత్తమమ్ ।**
**ఉపైతి శాంతరజసం బ్రహ్మభూత మకల్మషమ్ ॥ 27**

*తే.గీ. పాప రహితు(డు బ్రహ్మస్వరూపు( డెంతొ*
*మహి రజోగుణ వర్జిత మాన్యమతు(డు*
*శాంతచిత్తుడు నగు యోగి సమ్మత మగు*
*బ్రహ్మ సుఖముల నిహ మందె పడయ( గలడు.*

**తాత్పర్యము :**–పాపములనుండి తొల(గి, రజోగుణమును విడచి, శాంత స్వభావముతో బ్రహ్మను కనుగొనుటలో ఆత్మను లగ్న మొనర్చి యోగాభ్యాసము చేయువాడైన యోగికి ఉత్తమమైన సుఖము తనంతట తానే లభించును.

**శ్లో. యుఞ్జ న్నేవం సదాఽఽత్మానం యోగీ విగతకల్మషః ।**
**సుఖేన బ్రహ్మసంస్పర్శ మత్యన్తం సుఖ మశ్నుతే ॥ 28**

*తే.గీ. ఆత్మలో నిట్లు మనసు తానైక పరచి*
*విగత కల్మషుడై యోగి సుగమముగను*
*పడయు బ్రహ్మమభవ రూప పరమ సుఖము*
*దివ్య శస్త్రాస్త్రతేజ ! కౌంతేయ ! వినుము.*

**తాత్పర్యము :**– పై విధముగా తన మనస్సును తన స్వాధీనములో నుంచుకొని, పాపము లన్నిటిని వదలి, పరమాత్మను చూచుచున్న యోగి సులభముగా మిక్కిలి సుఖమును పొందుచుండును.

**విశేషార్థము :**– యోగఫలము ఇందులో వివరింప(బడినది.

**శ్లో. సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29**

*తే.గీ.* *సృష్టిలోని చరాచర జీవరాశు*
*లన్నిటను మేల్మి సమదృష్టి గొన్న యోగి*
*అన్నిప్రాణులు తనయందు నున్నయట్లు*
*అన్నిభూతాలఁ దా నున్నయట్లు గాంచు.*

**తాత్పర్యము :-** అన్నిటిలోను సమభావముతో వర్తించు యోగి సర్వ ప్రాణులలోను తనను చూడఁగలఁడు. అట్లే తనలోనే అన్ని ప్రాణులను జూచును. ఆత్మను పరమాత్మయందు లగ్నము చేసెడి యోగి అన్ని భూతములలోను పరమాత్మ స్వరూపమును చూడఁగలఁడు.

**శ్లో. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30**

*తే.గీ.* *ఎవఁడు నే నుందు టెందును నెఱిఁగిచూచు*
*సర్వము నెవందు నాలో నెసంగఁ జూచు*
*వాని కవలీలఁ గన్పింతు నేను, నాకు*
*వాఁడు నవలీలఁ గన్పించు పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** అన్ని భూతములలోను పరమాత్మ స్వరూపమును పరమాత్మలో సర్వమును చూడఁగల్గిన యోగి పరమాత్మ సాక్షాత్కారమును పొందును. పరమాత్మకూడ ఆ యోగిని చూచుచుండును. అట్టి యోగియే పరమాత్మ స్వరూపమును పొందునని భావము.

**విశేషార్థము :-** జీవునికి ఈశ్వరునికి భేదము లేదని ఇక్కడ తెలుపఁబడినది.

**శ్లో. సర్వభూతస్థితం యో మాం భజ త్యేకత్వ మాస్థితః ।**
**సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31**

*తే.గీ.* *సకలభూత స్థితుం డౌచు జగతి నొప్పు*
*నన్ను నేకత్వ సంస్థితి నున్నయట్లు*
*తెలిసి భజియించు యోగి యే తీరుగాఁగ*
*వరలుచున్నను నాయందె వరలుచుండు.*

**తాత్పర్యము :-** సర్వభూతములలోని పరమాత్మను ఒక్కనిగా ధ్యానము చేసెడి యోగి ఎన్ని విధములుగా ప్రవర్తించినను పరమాత్మనే పొందును. అనగా ముక్తిని పొందును.

**శ్లో. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున !।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32**

*తే.గీ. ఇలను సుఖదుఃఖ తతి తన కెట్లొ యట్లె*
*ఎల్ల భూతంబులకు నంచు నెంచువాఁడు*
*ఉత్తముఁడె గాదు వాఁడు సర్వోత్తముండు*
*ఎన్న యోగులలోన యోగీశ్వరుండు.*

**తాత్పర్యము :-** ఎవఁడు సర్వ ప్రాణులను తనతోఁబాటు సమానముగాఁ జూచునో అనఁగా తన సుఖమువంటిదే ఇతరుల సుఖము, తన దుఃఖము వంటిదే ఇతరుల దుఃఖము- అని ఇతర ప్రాణులకు హింస కలుగకుండ వర్తించునో అట్టి బ్రహ్మనిష్ఠుఁడు శ్రేష్ఠమైన 'యోగి'యని గ్రహించవలెను.

**విశేషార్థము :-** ఇట్టి లక్షణములు స్థితప్రజ్ఞులైన వారి కుండును.

*అర్జున ఉవాచ :-*

**శ్లో. యోఽయం యోగ స్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన !।**
**ఏత స్యాహం న పశ్యామి చంచలత్వా త్స్థితిం స్థిరామ్ ॥ 33**

*తే.గీ. అనిన మధుసూదనునిఁ జూచి యర్జునుండు*
*స్థిరతరం బైన మనసుచేఁ దెలియఁ దగిన*
*యోగమును గూర్చి తెలిపితి వో మహాత్మ !*
*చంచలాత్ముఁడ నెఱుగంగఁ జాల మఱియు.*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! నీ వేమో యోగము నంతటిని నేర్పుతో నిదర్శన పూర్వకముగాఁ జెప్పితివి. నా మనసు చంచలమైయుండుటవలన నేను దాని నిజ స్వరూపమును గ్రహింపలేకపోతిని.

**శ్లో. చంచలం హి మనః కృష్ణ ! ప్రమాథి బలవ ద్దృఢమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్ ॥ 34**

*తే.గీ. చంచలము నిగ్రహాతీత శక్తియుతము*
*అతి ప్రమాదమై దేహేంద్రియముల మిగుల*
*క్షోభ బెట్టెడు నెపుడును జూడ మనసు*
*గాలివలెఁ గట్ట శక్యంబుగాని దనఘ !*

**తాత్పర్యము :-** ఓ కృష్ణా ! ఈ మనసు మిక్కిలి చంచల మయినది. శరీరమును ఇంద్రియములను వికారము చెందించి ప్రమాదములకు దారితీయించు నట్టిది. నిగ్రహింప వీలు కానిది. గాలిని బంధించుట ఎంత కష్టమో మనసును నిగ్రహించుట కూడ అంతే కష్టముగాఁ దోచుచున్నది.

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌన్తేయ ! వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 35**

*తే.గీ. అనిన యర్జును గని కృష్ణుఁ డనియె, పార్థ !*
*నిగ్రహింపంగవలను కానిదియు మిగుల*
*చంచలమునగు మనసు ప్రశాంతిఁ బొందు*
*వరలు వైరాగ్యమునను నభ్యాసమునను.*

**తాత్పర్యము :-** ఓ పార్థా ! నీ వనినట్లు మనస్సు మిక్కిలి చంచలమైనది. దానిని నిగ్రహించుటకూడ కష్టమే. ఇందులో సందేహము లేదు. కాని నిత్యము అభ్యాసము చేయుటవలన, వైరాగ్యభావానుష్ఠానముచేత మనస్సును స్వాధీనము చేసికొన వీలవును సుమా !

**శ్లో. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।**
**వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః ॥ 36**

*తే.గీ. వర మనోనిగ్రహము లేనివాఁడు భువిని*
*పొందఁజాలఁడు యోగ మెప్పుడును గాని*
*పటుతరాభ్యాస వైరాగ్య భావములను*
*పొందు నవలీల నీ యోగమును నిజమ్ము.*

**తాత్పర్యము :**—మనసును తన స్వాధీనములో నుంచుకొనినవానికి ఈ యోగము సులభముగా సాధ్య మగును. లేనివానికి దుర్లభ మగును.

*అర్జున ఉవాచ :-*

**శ్లో. అయతి శ్శ్రద్ధయోపేతో యోగా చ్చలిత మానసః ।**
**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ! గచ్ఛతి ॥ 37**

*తే.గీ. అనిన నర్జును డని జనార్దనుని జూచి*
*శ్రద్ధయుండియు నిగ్రహాశక్తి లేక*
*వగయు చపలుండు యోగంబు బడయకుండ*
*పొందు నే గతి దెలుపు ముకుంద ! నాకు.*

**తాత్పర్యము :**—ఓ కృష్ణా ! శ్రద్ధగలిగినప్పటికి యోగము ననుష్ఠించుటలో లోపము కలిగినయెడల యోగఫలమును పొందలేడు గదా ! ఇక యోగభ్రంశునికి ఎట్టి గతి గల్గునో చెప్పుము స్వామీ !

**శ్లో. కచ్చిన్నో భయవిభ్రష్ట శ్ఛిన్నాభ్ర మివ నశ్యతి ।**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥ 38**

*తే.గీ. మోక్షమార్గమౌ యోగంబు బొందలేక*
*అస్థిర మనస్కు డైన మూఢాత్ము డకట*
*ఇహపరంబులు రెండింటి నెన్న జెడుచు*
*ఛిన్న జలధర మట్లు నశించు గాదె.*

**తాత్పర్యము :**– ఓ కృష్ణా ! బ్రహ్మ మార్గము ననుసరింపలేక చలించినవాడై ఉభయ భ్రష్టుడయిపోయినవాడు చెడిపోడా ? ఆశ్రయములేక చిందర వందర అయిపోయిన మేఘమురీతి వాడు ఆశ్రయములేని వాడవును గదా !

**శ్లో. ఏత న్మే సంశయం కృష్ణ! ఛేత్తు మర్హ స్యశేషతః ।**
**త్వదన్యః సంశయ స్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥ 39**

*తే.గీ. జగతి నిశ్శేషముగ నాదు సంశయంబు*
*దీని దీర్పంగ నీవె యెంతేని దగుదు*
*వరయగా లేరు నీకంటె నర్హులైన*
*వార లెవ్వరు దగ యదువంశతిలక !*

**తాత్పర్యము** :-ఓ కృష్ణా ! ఈ నా సంశయము తీర్చుటకు నీ వొక్కఁడవే తగినవాఁడవు. నీకంటె ఇంకొకఁడెవ్వరును నా సందేహమును తీర్చఁగలిగిన వాఁడు లేడు.

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. పార్థ ! నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే ।**
**న హి కల్యాణకృ త్కశ్చి ద్దుర్గతిం తాత ! గచ్ఛతి ॥** 40

*తే.గీ. అనిన భగవంతుఁ డనె పార్థ ! యట్టి యోగ*
*భ్రష్టునకు నాశ మిహమునఁ బరమునందుఁ*
*గలుగఁగాఁ బోదు కల్యాణ కార్యతతుల*
*రక్తి గలవాని కెపుడు దుర్గతులు లేవు.*

**తాత్పర్యము** :- అర్జునుఁ డడిగిన సందేహమునకు శ్రీ కృష్ణుఁ డిట్లు సమాధానము చెప్పుచున్నాఁడు. అర్జునా ! యోగమును అభ్యసించుచు భ్రష్టుడైన వానికి ఈ లోకములోగాని, పరలోకములోగాని నాశనము లేదు. మంచిపనులు చేయు మానవుల కెప్పుడును దుర్గతి అనునది కలుగనే కలుగదు.

**శ్లో. ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః ।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥** 41

*తే.గీ. అరయఁగా యోగభ్రష్టుఁ డైనట్టివాఁడు*
*పుణ్యలోకమ్ముఁ బొంది సమ్మోదముగను*
*చాల కాలమ్ము నివసించి జగతిలోన*
*వర సదాచార సంపన్నపరుల యింట*
*జన్మముంగాంచి సుఖియించు సవ్యసాచి !*

**తాత్పర్యము :-**యోగ భ్రష్టుడైనవాఁడు చాల కాలము పుణ్య లోకములో నివసించి, ఆ పిమ్మట భూలోకములో పవిత్రులైన శ్రీమంతుల ఇండ్లలో పుట్టును.

**శ్లో. అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్ ।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ య దీదృశమ్ ॥ 42**

*తే.గీ. అటులఁ గాకున్న ధీమంతులైన యట్టి*
*యోగుల కులంబునందుఁ దా నుద్భవించు*
*ఇట్టి జన్మంబు లోకమం దెంచిచూడ*
*దుర్లభం బగు నర్జునా ! దుర్లభంబు.*

**తాత్పర్యము :-**అట్లు కాకపోయినచో బుద్ధిమంతులైన యోగి జనుల ఇంట పుట్టును. ఈ లోకములో శ్రీమంతుల ఇండ్లలో పుట్టుటకంటె ధీమంతులైన యోగుల ఇండ్లలో పుట్టట మిక్కిలి దుర్లభము.

**శ్లో. తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వ దైహికమ్ ।**
**యతతే చ తతో భూయ స్సంసిద్ధౌ కురునందన ॥ 43**

*తే.గీ. భవ్యయోగి కులంబునఁ బ్రభవ మంది*
*పూర్వజన్మ సంబంధమౌ బుద్ధిఁ బొంద*
*యోగ సంసిద్ధి కొఱకునై యుత్సహించి*
*మరల యత్నం బొనర్చు నిమ్మహి నతండు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! యోగుల కులములో పుట్టి పూర్వ జన్మస్మృతిఁ గలిగి, ఈ జన్మములో నయిన సిద్ధిని పొందఁగోరి ప్రయత్నము చేయును.

**శ్లో. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।**
**జిజ్ఞాసు రపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥ 44**

*తే.గీ. యోగభ్రష్టుఁడు కోరిక లుడుగ నట్టి*
*తన మనస్సును పూర్వ జన్మమునఁ దాను*
*భువి నొనర్చిన యభ్యాసమున మరల్చి*
*కర్మ ఫలకాంక్ష వీడి యోగం బొనర్చు.*

**తాత్పర్యము :-** ఆ యోగి పూర్వజన్మములో యోగమును అభ్యసించిన అలవాటువలన తన మనస్సును లొంగదీయుటకు ప్రయత్నించును. యోగసిద్ధి నందవలెనను కోరికతో కర్మఫలముల పట్ల కాంక్షను మానివేయును.

**శ్లో. ప్రయత్నా ద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।**
**అనేకజన్మసంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్ ॥ 45**

*తే.గీ. పట్టుదలతో ప్రయత్నతాపరుఁడు నగుచు*
*పాపరహితుండునై జన్మపావనుఁ డయి*
*జన్మ జన్మాంతరాభ్యాస శక్తి యోగ*
*సిద్ధిఁ గొని దివ్యమౌ మోక్షసిద్ధిఁ గాంచు.*

**తాత్పర్యము :-** అర్జునా ! ఆ యోగి ప్రయత్నముమీద ప్రయత్నములు చేసి పాపములనుండి విముక్తినిబొంది పవిత్రుడై జన్మములెత్తి యెత్తి చివరకు యోగసిద్ధిని బొంది మోక్షమును పొందును.

**శ్లో. తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।**
**కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ! ॥ 46**

*తే.గీ. తనర భువిలోన దాపసోత్తములకంటె*
*జ్ఞానులగు వారికంటెఁ బ్రశస్త భవ్య*
*కర్మగులకంటె నధికుఁడై క్రాలు యోగి*
*కాన నీవును యోగివి గమ్ము విజయ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! అట్టి యోగి తపస్సు చేసినవానికంటె గొప్పవాఁడు. పండితులందఱికంటె పండితుఁడు. కర్మ చేసెడి వారికంటె ఈ యోగియే మేలు. కావున నీవుకూడ యోగివి కమ్ము !

**విశేషార్థము :-** 'యోగి', 'సన్న్యాసి' - వీరి ప్రాముఖ్యము ఇందులో వివరింపఁబడినది.

**శ్లో. యోగినా మపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా ।**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ 47**

తే.గీ. శ్రద్ధతోడుత నన్ మనసార నెవఁడు
నమ్మి భజియించుచుండు నెన్నడును వాఁడె
యోగులందఱిలోన నే నత్యుత్తముఁ డని
తలతు మది నెంతొ నే సుభద్రామనోజ్ఞ !

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నన్ను నమ్మికొని, నాయందే మనసు నిలిపి తదేక నిష్ఠతో సేవించు యోగి అందఱిలోను ఉత్తముఁడని నేను తలంచుచున్నాను.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
**ఆత్మసంయమయోగంబను**
ఆఱవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।
యతతా మపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వత: ॥

(7-3)

వేయిమందిలో ఏ ఒక్కఁడో జ్ఞానమును పొందవలెనని ప్రయత్నించువాఁ డుండును. అట్లు ప్రయత్నించువారిలో నన్ను నిజముగాఁ దెలిసికొనువాఁడు ఒక్కఁడే యుండును.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం సప్తమోఽధ్యాయః

## విజ్ఞాన యోగము

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. మయ్యాసక్తమనాః పార్థ ! యోగం యుఞ్జ న్మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥** 1

*తే.గీ. మనసు నాయందె యునిచి సమ్మాన్యముగను*
*నమ్మి నన్నాశ్రయించి యోగ మ్మొనర్చి*
*భువి ససంశయముగను సంపూర్ణముగను*
*నను నెఱింగెడు విధమును వినుము పార్థ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! నీవు నీ మనస్సును నాయందేయుంచి, యోగమును అభ్యసించుచు, సకల గుణములతో నిండిన నన్ను అనుమాన రహితముగాఁ దెలిసికొనఁగలిగెడి జ్ఞానమును నీకు తెలుపుదును. వినుము.

**శ్లో. జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యా మ్య శేషతః ।**
**యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యద్జ్ఞాతవ్య మవశిష్యతే ॥** 2

*తే.గీ. దేని నెఱిఁగిన పిమ్మట దేని మరల*
*నెఱుగఁ దగినది లేకుండు నీ జగాన*
*దాని విజ్ఞాన సహిత సుజ్ఞాన మిపుడు*
*తెలిపెదను నీకు వినుము కుంతీసుపుత్ర !*

**తాత్పర్యము :-** నేను తెలిపిన జ్ఞానమును తెలిసికొనిన తరువాత ఈ లోకములో నీవు తెలిసికొనవలసినది ఏదియు నుండదు. అనుభవ జ్ఞానముతోఁ గూడిన జ్ఞానమును నీకు సంపూర్ణముగా తెలిపెదను సుమా !

**విశేషార్థము :**-అర్జునుని బుద్ధి ఇంత చెప్పినను లగ్నము కాకపోవుటతో శ్రీకృష్ణుఁడు దుర్లభమైన జ్ఞానమును తాను స్వయముగాఁ దెలిపెద ననుచున్నాఁడు.

**శ్లో. మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।**
**యతతా మపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః ॥ 3**

*తే.గీ. జ్ఞాన సంసిద్ధికొఱకు యత్నం బొనర్చు*
*మానవుఁడు వేయి కొక్కఁడే మనుజవర్య !*
*అందునను నన్ను నిజముగా నరసి తెలిసి*
*కొనెడు వాఁడొక్కఁడుండు నిక్కమునుగాఁగ.*

**తాత్పర్యము :**-వేయిమందిలో ఏ ఒక్కఁడో జ్ఞానమును పొందవలెనని ప్రయత్నించువాఁ డుండును. అట్లు ప్రయత్నించువారిలో నన్ను నిజముగాఁ దెలిసికొనువాఁడు ఒక్కఁడే యుండును.

**విశేషార్థము :**- అర్జునునికి శ్రద్ధ కుదురుటకు శ్రీకృష్ణుఁ డీ మాటలను చెప్పుచున్నాఁడు.

**శ్లో. భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥ 4**

*తే.గీ. నింగియును నేల గాలియు నిప్పు నీరు*
*బుద్ధి మనసు నహంకారమును ననంగ*
*అష్ట విధముల నా మాయ యలరుచుండు*
*భవ్య లక్షణయుత గాత్ర ! పాండుపుత్ర !*

**తాత్పర్యము :**-ఓ అర్జునా ! నేల, గాలి, ఆకాశము, నిప్పు, నీరు, మనసు, బుద్ధి, అహంకారము అను ఈ ఎనిమిదింటిలోను నా మాయాశక్తి అనగా ప్రకృతి శక్తి ప్రకటింపఁబడుచుండును.

**శ్లో. అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥ 5**

*తే.గీ. అష్టవిధ ప్రకృతి యిది నికృష్ట మరయ*
*జీవరూపమై యొప్పి విశిష్టముగను*
*జగమునంతను ధరియింపఁ జాలునట్టి*
*ప్రకృతి గల దొండు నా కీవు వరలఁ గనుము.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ఈ అష్టవిధ ప్రకృతి పైకి కనఁబడునది మాత్రమే. ఇదేమంత గొప్పది కాదు. కాని దీనికంటె భిన్నమైన ఉత్కృష్టమైన నా శ్రేష్ఠమైన శక్తి ఇంకొకటి ఉన్నది. అదే ఈ ప్రపంచము నంతటిని ధరించుచున్నది.

**శ్లో. ఏత ద్యోనీని భూతాని సర్వా ణీత్యుపధారయ ।**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయ స్తథా ॥ 6**

*తే.గీ. ప్రాణు లన్నియు నీ సూక్ష్మ ప్రకృతివలన*
*నే జనించును మఱియు లయించుచుండు*
*జగతి ప్రాణుల కెల్లను జనన మరణ*
*ములకు నేనె కారణ మని తెలియు మెలమి.*

**తాత్పర్యము :-** ఈ ప్రపంచములోని అన్ని భూతములకు నాయొక్క సృష్టి ప్రళయము లనఁబడెడి రెండు శక్తులే కారణము.

**విశేషార్థము :-** అన్ని ప్రాణులకు, చరాచర సృష్టికి ప్రకృతి యనఁబడు మాయాశక్తి కారణము. అది సృష్టి-లయము-లని రెండు విధములైన, ఆ రెండు శక్తులకుఁ గారణము పరబ్రహ్మమే తానని శ్రీకృష్ణుఁడు తెలుపుచున్నాఁడు.

**శ్లో. మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ ।**
**మయి సర్వ మిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7**

*తే.గీ. అరయ నాకంటె శ్రేష్ఠమైనట్టి దొకటి*
*యెద్దియును లేదు; జగముల నెల్ల మేల్మి*
*వరలు నాలోనఁ గూర్పంగఁ బడి యదెట్లు*
*రత్నరాసులు వెలయు సూత్రమున నట్లు.*

**తాత్పర్యము :-** ఓ ధనంజయా ! ఆలోచించి చూచిన నాకంటె శ్రేష్ఠమై ప్రకాశించు కారణ మేదీ లేదు. ఈ లోకములన్నికూడ దారములోఁ గూర్పఁబడిన రత్నముల విధముగా నాలోనే ఉన్నవి.

**విశేషార్థము :-** ఈ శ్లోకములోని ఉపమానము చాల గొప్పది. అన్ని ప్రాణులలోను తన ఉనికిని భగవంతుఁడు చాటుచున్నాఁడు.

**శ్లో. రసోఽహ మప్సు కౌన్తేయ ! ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8**

*తే.గీ. జలములందలి రుచి నేనె చంద్రసూర్యు*
*లందుఁగల కాంతి వేదములందు వెలయు*
*ప్రణవమును నేనె, గగనాన వరలు శబ్ద*
*చయము నేనె నరుల పౌరుషమును నేనె.*

**తాత్పర్యము :-** నీటిలో సారమైన రసమును నేను; ఆకాశములో శబ్దము నేను; సూర్య చంద్రులలోని జ్యోతిని నేను; వేదములలో ప్రణవమును నేను; పురుషులలో నేను పౌరుషరూపములో నున్నాను.

**శ్లో. పుణ్యో గన్ధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ 9**

*తే.గీ. ధరణియందలి పుణ్య గంధంబు నేనె*
*అగ్నియందలి తేజము నఖిలభూత*
*తతిని గల జీవనము నేనె తాపసాళి*
*భవ్యమౌ తపోజ్ఞానమున్ పార్థ నేనె.*

**తాత్పర్యము :-** భూమికిఁ గల గంధమును నేను. అగ్నిలోని తేజస్సును నేను. ప్రాణు లన్నింటిలోను జీవరూపములో నున్నది నేనే. తపస్సు చేసికొనెడి మునులలో తపోరూపముతో నున్నవాడిని నేనే.

**శ్లో. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ ! సనాతనమ్ ।**
**బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ॥ 10**

*తే.గీ. బుద్ధిమంతులయొక్క సద్బుద్ధి నేను*
*జగతి తేజస్సులందు తేజంబు నేను*
*సర్వభూతములకును శాశ్వతమ్మునైన*
*బీజమును నేనె తెలియు మో విజయ మేల్మి.*

**తాత్పర్యము :-** బుద్ధిమంతులలో నుండెడి బుద్ధిని నేనే. తేజస్సుతోఁ బ్రకాశించెడి వారిలోని తేజము నేనే. అన్నిటికి మూలకారణము నేనే. ఈ లోకములోని సమస్త ప్రాణులకు మిక్కిలి ప్రాచీనమే గాక శాశ్వతముగాఁ గూడ బీజస్వరూపమును నేనే అని తెలిసికొనుము.

**శ్లో. బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥** 11

*తే.గీ. కామ మనురాగమును లేని ఘన బలాఢ్యు*
*లందు నున్నట్టి బలము నే నౌదు, మఱియు*
*ధర్మమున కెన్నఁడున్ నిరోధమ్ముగాక*
*వరలు ప్రాణులఁగల కామ మరయ నేనె.*

**తాత్పర్యము :-** కామమును, అనురాగమును విడచినట్టి ఇంద్రియ నిగ్రహము గలవారిలో నుండెడి బలమును నేను. ధర్మమునకు విరుద్ధముగాఁ గాక ప్రాణులలో నుండెడి కామమును నేనే.

**విశేషార్థము :-** ఇచట 'ధర్మ విరుద్ధము కాని కామము' అంటే దేహధారణకు అవసరమైన అన్నపానాది విషయములకైన ఇచ్ఛ అని అర్థము.

**శ్లో. యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే ।**
**మత్త ఏవేతి తా న్విద్ధి న త్వహం తేషు తే మయి ॥** 12

*తే.గీ. సాత్త్వికము రాజసము తామసంబు లనెడు*
*భావములు గల్గె నవని నావలనఁ గాని*
*వానిలో నేను లేను నాలోన నవియు*
*లేవు లేవంచు నెఱుఁగుము నీవు పార్థ !*

**తాత్పర్యము :-** సాత్త్విక, రాజస, తామసము లనబడెడి మూఁడు గుణములుఁ గూడ నావలననే కలుగుచున్నవి. కాని ఆ భావములను నేను ఆశ్రయించుకొనుట లేదు. ఆ భావములకు నేను ఆధారమై యున్నాను. ఆ మూఁడును నాలోనే ఉన్నవి.

**శ్లో. త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పర మవ్యయమ్ ॥ 13**

*తే.గీ. ఈ విధముగ గుణత్రయ భావ మోహ*
*బంధమై యొప్పుచున్న ప్రపంచ మిద్ది*
*ఈ గుణత్రయమునకంటె నెపుడు పరముఁ*
*డవ్యయుఁడు నైన నన్నెంచ నలవి గాదు.*

**తాత్పర్యము :-** పైన చెప్పిన సత్త్వ రజస్తమోగుణములచే వ్యామోహములోఁ బడిన ఈ లోకస్థులు ఈ భావములకంటె విలక్షణుఁడనై ఎప్పుడు ఒక్కటిగానే ప్రకాశించు నన్ను తెలిసికొనఁజాలకున్నారు.

**విశేషార్థము :-** పరమాత్మనుండి ప్రకృతిమాయవలన పుట్టిన భూతములు త్రిగుణము లనఁబడెడి మోహమువలన స్వస్వరూపమును తెలిసికొన లేకున్నారని భావము.

**శ్లో. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే ॥ 14**

*తే.గీ. అరయ త్రిగుణాత్మకం బైన యట్టి నాదు*
*మాయ యది దైవ సంబంధ మహిత మగుట*
*దాఁట లే రెవ్వరైన చిత్తమున నన్నె*
*వదలకను గొల్చువారు దాటెదరు పార్థ !*

**తాత్పర్యము :-** దైవికమైన ఈ మాయ త్రిగుణాత్మకమై ఎవ్వరికిని దాట శక్యము కాకుండ ఉన్నది. ఎవ్వరు సర్వ ధర్మములను విడచి నాయందే ధ్యానముంచి కొలుచుచుందురో వారే ఈ మాయారూపమైన అజ్ఞానమును దాటఁగలరు.

**విశేషార్థము :-** సర్వ కర్మ సన్న్యాసపూర్వకమైన 'జ్ఞాన నిష్ఠ' మాత్రమే మోక్షమునకు సాధనమని తాత్పర్యము.

**శ్లో. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః ।**
**మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావ మాశ్రితాః ॥ 15**

*తే.గీ. అసురభావులు మూఢాత్ము లైనవారు*
*దుష్కృతులును నరాధముల్ దురితగుణులు*
*మాయచేతను జ్ఞానంబు మాయఁబడిన*
*వారు నన్నెప్డు పొందఁగా లేరు విజయ !*

**తాత్పర్యము :-** పాపములు చేసినవారు, వివేకములేనివారు, నీచులైన మనుష్యులు మఱియు 'మాయ' ఆవరించుటవలన జ్ఞానము నశించినవారు, అసుర భావమును ఆశ్రయించినవారు నన్ను పొందలేరు.

**విశేషార్థము :-** 'అసురభావము' అనగా హింస, అబద్ధములాడుట మొదలైన భావములు.

**శ్లో. చతుర్విధా భజన్తే మాం జనా స్సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16**

*తే.గీ. ఆర్తజనులను జిజ్ఞాసు లర్థకాము*
*లగణిత జ్ఞానులను నాల్గు తెగలవారు*
*సుకృతి జను లౌదు రెన్న నర్జున ! ధరిత్రి*
*వారు సేవింతు రెపుడు నన్ భక్తి మీర.*

**తాత్పర్యము :-** భారత శ్రేష్ఠా ! ఓ అర్జునా ! నన్ను కొలిచెడి పుణ్యవంతులు నాల్గు విధములుగా నుందురు. బాధలలోనివారు; బ్రహ్మతత్త్వాన్ని తెలిసికొనఁగోరువారు; ధనము, భార్య, బిడ్డలు - వీటిని కోరువారు; జ్ఞానులు అను నాల్గు విధములైనవారు నన్ను పూజించుచుందురు.

**శ్లో. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥ 17**

*తే.గీ. వీరిలో జ్ఞాని నాకెంతొ ప్రియుఁడు; నేను*
*జ్ఞానికిం బ్రియుఁ డౌదు నెంతో నరేంద్ర !*
*నిత్య సంబంధుఁడై నాకు నిష్ఠతోడ*
*నన్నె గొలిచెడు జ్ఞానియే మిన్న యగును.*

**తాత్పర్యము :-** పై నలుగురిలోను నిరంతరము ధ్యానము చేయువాఁడు, నిశ్చలమైన భక్తితో ప్రకాశించువాఁడు అయినట్టి 'జ్ఞాని' మిక్కిలి శ్రేష్ఠమైనవాఁడు. అట్టి జ్ఞానికి అన్నిటికంటె ఎక్కువ ప్రియమైనవాఁడను నేనే. నాకుఁగూడ ఆతఁడే మిక్కిలి యిష్టుఁడు.

**శ్లో. ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ ॥ 18**

*తే.గీ. వీర లందఱు శ్రేష్ఠులే పృథివిలోన*
*కాని నాయందె మనసు లగ్నం బొనర్చి*
*కనగ సర్వోత్తమం బైన గతిగ నన్నె*
*తలఁచు జ్ఞానికి నాకు భేదమ్ము లేదు.*

**తాత్పర్యము :-** నాల్గు విధములైన పుణ్యాత్ములును ఉత్కృష్టులే. అయినను వారిలో జ్ఞాని తన మనస్సును నాయందే నిల్పి నన్నే ఉత్తమమైన గతిగా నమ్ముచున్నాఁడు. కాబట్టి అతడు వారిలో శ్రేష్ఠుఁడు. అలాంటి జ్ఞాని నా స్వరూపమని చెప్పుట నా యభిమతము.

**విశేషార్థము :-** జ్ఞాని - ఉత్కృష్టుఁడు; జిజ్ఞాసువు - సామాన్య ఉత్కృష్టుఁడు; అర్థార్థి; ఆర్తుదు - సామాన్యులు. అందఱు భగవంతునిపట్ల విశ్వాసము కలవారే కాబట్టి సర్వవిధముల శ్రేష్ఠులే.

**శ్లో. బహూనాం జన్మనా మన్తే జ్ఞానవా న్మాం ప్రపద్యతే ।**
**వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః ॥ 19**

*తే.గీ. వసుధ బహుజన్మ సంస్కారబలమువలన*
*వాసుదేవమయంబు సర్వం బటంచు*
*తుదకు నన్నుఁ బొందు సుజ్ఞాని దుర్లభుండు*
*ధర్మరాజానుజా ! సుభద్రామనోజ్ఞ !*

**తాత్పర్యము :-** అర్జునా ! ఎన్నో జన్మముల నెత్తిన పిమ్మట 'జ్ఞాని' నన్ను చేరుకొనుచున్నాఁడు. పరమాత్మనైన నేనే సర్వమని నమ్మి వచ్చి నన్ను శరణుపొందు మహాత్ములు ఈ లోకములో దుర్లభముగా నుందురు.

**విశేషార్థము :-** జ్ఞాన మనునది అనేక జన్మలలోఁ జేయబడిన సత్కర్మల పరిపాకమువలన గలుగఁగలదని సారాంశము. ఈ జగ మంతయు పరమాత్మ స్వరూప మని తెలిసికొనఁగలుగుటయే ఆత్మ స్వరూపమును గ్రహించుట. అట్టివారు వేయిమందిలో ఒక్కరుందురు సుమా !

**శ్లో. కామైస్తైస్తై ర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్యదేవతాః ।**
**తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా ॥ 20**

*తే.గీ. స్వ స్వభావాలవలన సుజ్ఞాన మెడలి*
*తదనుగుణమైన వాంఛ లెంతయును దీర*
*అన్య దేవతలను గొల్తు రవని జనులు*
*నిత్యముం దగు నియమాళి నిష్ఠతోడ.*

**తాత్పర్యము :-** ఈ లోకములో మనుష్యులు వారి వారి పూర్వ జన్మములలోఁ జేసిన కర్మముల ఫలితముగా ఆయా స్వభావమునుబట్టి కోరికలు గలవారగుచుందురు. ఆయా కోరికలకుఁ దగినట్లుగా నియమముల నేర్పఱచుకొని ఆ జ్ఞానముచేత ఆవరింపఁబడినవారై పరమాత్మను గొలవకుండ ఇతర దేవతలను కొలుచుచున్నారు.

**శ్లో. యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయాఽర్చితు మిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధా మ్యహమ్ ॥ 21**

*తే.గీ. ఎవ్వఁడే కోర్కె నే దేవు నెలమి నిలను*
*భక్తి బూజింప నెంచు నవ్వాని కట్టి*
*శ్రద్ధయే యచలమ్ముగా సదమలముగ*
*నుండున ట్లొనరింతును పాండుపుత్ర !*

**తాత్పర్యము :-**ఈ లోకములోని మానవులు ఏయే దేవతలను ఏయే రూపములతో శ్రద్ధతో పూజించి ధ్యానము చేయుదురో వారికి ఆ దేవతల

పట్ల స్థిరమైన విశ్వాసమును కలుగునట్లు చేసి ఫలమును ఇచ్చుచుందును.

**విశేషార్థము** :-దేవత లందఱు పరమేశ్వరుని రూపములే. భక్తులు వివిధ రూపములలో పూజించి పొందఁగలిగెడి ఫలములన్నిఁటికి భగవంతుఁడే అధిష్ఠాన రూపము.

**శ్లో. స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే ।**
**లభతే చ తతః కామా న్మయైవ విహితాన్హి తాన్ ॥** 22

*తే.గీ. కోరుకొనినట్టి దేవునిం గూర్మితోడ*
*నిట్టచంచల భక్తి బూజించు భక్తు*
*డట్టి యారాధనముచేత నతఁడు బొందు*
*ఇష్టమగు కోర్కె లేను గల్గించినవియె.*

**తాత్పర్యము** :- భక్తులుగూడ అటువంటి విశ్వాసముతోనే తాము నమ్మిన దేవతనే భక్తి విశ్వాసములతోఁ గొలుతురు. పూజింపఁబడిన అదే దేవతా రూపముతో నేను గూడ వారి కోర్కె తీర్చుచుందును.

**విశేషార్థము** :-దేవతలకంతా మూలకారణము ప్రకృతి. వారికి స్త్రీ-పురుష విభేదము కేవలము కల్పితము మాత్రమే.

**శ్లో. అన్తవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్పమేధసామ్ ।**
**దేవా న్దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి ॥** 23

*తే.గీ. స్వల్పబుద్ధులై యన్యదేవతలఁ గొల్చు*
*వార లాదేవతలఁ బొంది స్వల్పఫలము*
*ననుభవింతురు, నా భక్తు లట్లు గాక*
*నన్ను బొంది గ్రహింతు రనంత ఫలము.*

**తాత్పర్యము** :- కోరికలు కలిగి, వాటిని తీర్చుకొనుటకు దేవతలను పూజించు స్వల్ప బుద్ధుల కర్మఫలములు శాశ్వతము కావు. దేవతలను పూజించువారు దేవలోకమును పొందుదురు. పరమేశ్వరుఁడనైన నన్ను ఆరాధించువారు నన్ను పొందుచున్నారు.

**శ్లో. అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యన్తే మా మబుద్ధయః ।
పరం భావ మజానన్తో మమావ్యయ మనుత్తమమ్ ॥ 24**

*తే.గీ. అల్ప బుద్ధులు శాశ్వతమైన యట్టి
పరమ శ్రేష్ఠమౌ నా స్వరూపమును మేల్మి
నరయఁ జాలక యవ్యక్తుడైన నన్ను
వ్యక్తునిగ నెంచుదు శ్వేతవాహన ! ధరిత్రి.*

**తాత్పర్యము :-** అవివేకులైనవారు అవ్యక్తమైనట్టి (వాక్కునకు, మనస్సునకు అందనట్టి) నిర్వికారమైనట్టి, ఉత్తమోత్తమ మైనదియు శ్రేష్ఠమున్నైన నా నిజరూపమును చూడఁజాలరు. వారు నన్ను వ్యక్తుడైనవానిగాఁ దలచు చుందురు.

**శ్లో. నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః ।
మూఢోఽయం నాభిజానాతి లోకో మా మజ మవ్యయమ్ ॥ 25**

*తే.గీ. యోగమాయా సమావృతి నొప్పుచున్న
నన్నుఁ గానరా రెల్లవా రెన్నటికిని
అవ్యయుఁడు జన్మరహితుండు నైన నన్ను
మూఢు లీ లోకు లెఱుఁగంగఁ బోరు పార్థ !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! యోగమాయ నన్ను కప్పియుండిన కారణమువలన ఈ లోకములో జనులు నన్ను స్పష్టముగాఁ దెలిసికొనఁజాలరు. మూఢులైన జనులు నాశనము లేనట్టి, జన్మము లేనట్టి నన్ను చూడఁజాలరు.

**శ్లో. వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥ 26**

*తే.గీ. ఉండినట్టియు ప్రస్తుత ముండునట్టి
పొనగ నిక నుండఁ బోయెడు భూతతతుల
నే నెఱుంగుదు - నన్నొక్కఁడేని యెఱుఁగఁ
జాలకున్నాఁడు భీమానుజా ! నరేంద్ర !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! సమస్త భూతములను గురించి జరిగిపోయినది, జరుగుచున్నది, ఇక జరుగఁబోవునది గూడ నేను ఎఱిగి యున్నాను. కాని ఏ ఒక్కరు నన్ను గూర్చి తెలిసికొనకుండయున్నారు.

**శ్లో. ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరంతప ॥ 27**

*తే.గీ. వసుధ జన్మించు నప్పుడే ప్రాణికోటి*
*కామమును క్రోధమను రెంటి కారణమున*
*సుఖము దుఃఖములను మాయఁ జొచ్చి మిగుల*
*పొందుచున్నది యజ్ఞానమును కిరీటి !*

**తాత్పర్యము :-**(ప్రస్తుత లోకస్థితి) అన్ని భూతములును జన్మించుట అవసరము, కామ క్రోధములచేఁ గలిగెడి శీతోష్ణాది సుఖదుఃఖములలోఁ దగుల్కొని పూర్తిగా మోహములోఁ బడిపోవుచున్నది ఈ ప్రపంచము.

**శ్లో. యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః ॥ 28**

*తే.గీ. పుణ్య కర్మలచే పాపములను బాసి*
*ద్వంద్వ మోహ వినిర్ముక్తి ధన్యులైన*
*పుణ్యపురుషులు జ్ఞానులు పుడమిలోన*
*నిష్ఠ భజియింత్రు నన్ను కుంతీ కుమార !*

**తాత్పర్యము :-**పుణ్యకర్మల నాచరించుటతో తమ తమ పాపములను బాపుకొన్న పుణ్యాత్ములు ద్వంద్వములనుండి, మోహమునుండి విముక్తులై నిశ్చల నిష్ఠతో నన్ను కొలుచుచుందురు.

**శ్లో. జరామరణమోక్షాయ మా మాశ్రిత్య యతన్తి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥ 29**

*తే.గీ.* *పుడమి నఖిల చరాచరములను నిండి*
*వెలుఁగు నాత్మయు సకల కర్మలును భవ్య*
*మౌ పరబ్రహ్మ రూపమం చరయువాఁడు*
*కొలుచు జనన మరణ విముక్తికై కోరి నన్ను.*

**తాత్పర్యము :-** ఎవరు జరామరణములనుండి విముక్తిని పొందఁగోరి నన్ను ఆశ్రయించి ప్రయత్నింతురో వారు, వేద ప్రసిద్ధమైన పరబ్రహ్మ రూపమును, ఆత్మతత్త్వమును, సమస్త కర్మల స్వరూపమును తెలిసికొందురు.

**శ్లో. సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదు ర్యుక్తచేతసః ॥ 30**

*తే.గీ.* *జ్ఞాన తేజోబలమ్మున సాధిభూత*
*సాధిదైవునిగా మఱి సాధియజ్ఞ*
*నిగను నన్నెఱింగినవార లగణితముగ*
*అంత్యదశలోను నన్ తెలియంగ గలరు.*

**తాత్పర్యము :-** ఎవ్వరు నన్ను అధిభూతునిగా, అధిదైవతునిగా, అధియజ్ఞునిగా-ఆత్మలో నెఱింగినవారై యుందురో అట్టివారు ప్రశాంత చిత్తముతో మరణ సమయములోఁగూడ నన్ను తెలిసికొనుచున్నారు.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
**విజ్ఞానయోగంబను**
ఏడవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'




శ్లో. ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజ న్దేహం స యాతి పరమాం గతిమ్ ॥

(8-13)

ఈ యోగాభ్యాసముతో 'ఓమ్' అను అక్షరమును ఉచ్చరించుచు ఎవఁడు శరీరమును విడుచునో అట్టివాఁడు పరమోత్కృష్టమైన స్థానమును పొందుచున్నాఁడు.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

# శ్రీమదాంధ్ర భగవద్గీత

## శ్రీమద్ భగవద్గీతాయాం అష్టమోఽధ్యాయః

## అక్షరపరబ్రహ్మ యోగము

*అర్జున ఉవాచ :-*

**శ్లో. కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।**
**అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే ॥** 1

*తే.గీ. అనిన పురుషోత్తముని జూచి యడిగె పార్థు*
*డేదియగు బ్రహ్మ, మధ్యాత్మ మేది, కర్మ*
*మేది, యధిభూత మధిదైవ మేది యేది ?*
*తెలియ జెప్పుము మదిని సందియము దొలగ.*

**తాత్పర్యము :-** ఏడవ అధ్యాయములోని విషయములు తనకు క్రొత్తవిగా నుండుటచేత అర్జునుడు కృష్ణుని ఇట్లు ప్రశ్నించుచున్నాడు. "ఓ కృష్ణా ! నీవు చెప్పిన ఆ పరబ్రహ్మ మేది ? 'అధ్యాత్మ' అంటే ఏమిటి ? 'అధిభూతము' అనుటలో మర్మ మేమి ? 'అధి దైవము' అని దేనినందురు ? 'కర్మ' అనగా ఏమిటి ? వీని నన్నిటిని నాకు స్పష్టముగా తెలియజేయుము".

**శ్లో. అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మి న్మధుసూదన ।**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥** 2

*తే.గీ. అరయ నధియజ్ఞు డెవడు దేహంబునందు*
*ఆత డెట్లుండు ? ప్రాణప్రయాణవేళ*
*చెలగ నియతాత్ము లగువారిచేత నీవు*
*ఎఱుగ బడుచుందు వెట్లు స్వామీ యటంచు.*

**తాత్పర్యము :-** ఓ మధుసూదనా ! ఈ దేహములో అధియజ్ఞు డెవరు? అట్టివానినిగా ఎవరిని గ్రహించవలెను ? అంత్యకాలములో ప్రశాంతచిత్తులైన వారు నిన్ను తెలిసికొందు రన్నావు గదా ! అదెట్లు ?

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. అక్షరం బ్రహ్మ పరమం స్వభావో౽ధ్యాత్మ ముచ్యతే ।**
**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥** 3

*తే.గీ. అనఘ మధుసూదనుం డిట్టు లనియె పార్థ !*
*పరమ మక్షర మైనదే బ్రహ్మ మగును*
*కనఁగ నధ్యాత్మ మన ప్రత్యగాత్మభావ*
*మగును, ప్రాణి సంభవ రక్షణార్థమైన*
*యజ్ఞ మది కర్మ మని చెప్పనగును వినుము.*

**తాత్పర్యము :-** అర్జునుని ప్రశ్న లన్నిటికి కృష్ణుడు సమాధానము చెప్పుచు పరబ్రహ్మము నాశనములేనిది. అది ఒక ఉత్కృష్టమైన సత్పదార్థము. ప్రతి దేహముతోను సంబంధించియుండెడి జీవభావము 'అధ్యాత్మ'మని చెప్పఁబడుచున్నది. నాలుగు రకములైన ప్రాణుల పుట్టుకను కలుగఁజేయు యజ్ఞమే కర్మమని చెప్పఁబడుచున్నది.

**శ్లో. అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।**
**అధియజ్ఞో౽హ మేవాత్ర దేహే దేహభృతాం వర ॥** 4

*తే.గీ. భువిని నశియించునది యధిభూత మగును*
*తనర పురుషుండె యధిదైవతమ్ము సుమ్ము*
*అలర నీ దేహమున నధియజ్ఞు డనఁగ*
*వరలునది నేనె వరగాత్ర ! పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** 'అధిభూతము' అనగా పుట్టుట-గిట్టుట అనెడి స్వభావముగల ప్రతి వస్తువు. 'పురుషుడు' అనగా అన్ని భూతములకు శక్తిని కలుగఁజేయు శక్తి. ఈ కన్పించు శరీరములో నుండుచు యజ్ఞములపట్ల అభిమానముఁ గల్గిన దేవతను, విష్ణువును నేనే.

**విశేషార్థము :-** 'దేహభృతాం వర !' అను సంబోధనము వలన 'ఓ అర్జునా ! నీవు దేహాభిమానముఁ గలవాఁడవు'. 'నీవే-నేను' అనుచున్నాఁడు కృష్ణుఁడు. తత్త్వమసి (తత్-త్వం-అసి)అనుదాని సారాంశ మిదే.

**శ్లో. అన్తకాలే చ మామేవ స్మర న్ముక్త్వా కళేబరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 5**

*తే.గీ. మరణ కాలంబునను నన్నె స్మరణఁ జేసి*
*తన శరీరంబు విడుచు నాతండు నాదు*
*భావమునె పొందు సందేహపడఁగ వలదు*
*దివ్య శస్త్రాస్త్రతేజ ! కుంతీసుపుత్ర !*

**తాత్పర్యము :-**మరణకాలములోఁగూడ నన్నే స్మరించుచు శరీరమును ఎవరు విడుతురో వారు నా భావమునే, నా స్వరూపమునే పొందుదురు. ఇందులో ఏ మాత్రమును సందేహము లేదు.

**విశేషార్థము :-** సర్వకాలములలోను పరమాత్మను ధ్యానించుచు అంత్యకాలములో గూడ అదే చింతనతో ఉన్నట్లైన మోక్షమును తప్పక పొందును అని అంతరార్థము.

**శ్లో. యం యంవాపి స్మరన్ భావం త్యజ త్యన్తే కళేబరమ్ ।**
**తం త మేవైతి కౌన్తేయ ! సదా తద్భావభావితః ॥ 6**

*తే.గీ. అంత్యదశయందు తన యంతరాత్మ నరుఁడు*
*ఏ విధంబయిన భావాల నిల స్మరించి*
*యసువులను వీడు దానినే యతఁడు పొందు*
*సంస్మరణఁచే గల్గు సంస్కారబలిమి.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! అంత్యకాలములో ఎవ్వ రే భావమును స్మరించుచు శరీరమును విడుతురో వారు ఆ భావమునే ఎప్పుడు మానక తలచుచుందురు. కాబట్టి దానినే తప్పక పొందుదురు.

**విశేషార్థము :-**జీవితకాల మంతయు అంతఃకరణము (మనస్సు) ఏ భావముతో సంస్కరింపఁబడియుండునో ఆ భావమే అంత్యకాలములోను

గలుగును. దేవతాభావము కాక ఇతర భావాలు ఉన్నట్లైన వానికి దగిన ఫలమే కలుగును.

**శ్లో. తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధి ర్మా మే వైష్య స్యసంశయః ॥ 7**

*తే.గీ. అందుచే సర్వకాలంబులందు నన్నె*
*స్మరణ సేయుము నీ బుద్ధి మనసు నెల్ల*
*యర్పణముసేసి నాయందె యాజి సలుపు*
*కడకు నను నీవు చేరంగ గలవు పార్థ !*

**తాత్పర్యము :-** కావున సర్వ కాలములలోను నీ బుద్ధిని, అంతఃకరణమును నాయందే యుంచినట్లైన నీవు నన్నే పొందుదువు. ఇందులో సందేహము లేదు. నీ మనసులో నన్నే స్మరించుచు యుద్ధము చేయుము. అర్జునా ! లెమ్ము, లే.

**శ్లో. అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్ ॥ 8**

*తే.గీ. తనరు నభ్యాసయోగ యుక్తంబునగుచు*
*నితర విషయాలలోఁ బ్రవర్తింప నట్టి*
*మనసుచే నిత్య చింతనా మాన్యు డగుచు*
*పరమ పురుషుడౌ దివ్యు దప్పకను బొందు.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ధ్యానయోగమును అభ్యాసము చేసి ఇంద్రియ సుఖముల పట్ల లగ్నముకాని చిత్తము (మనస్సు)తో పరమ పురుషుని ఎల్లవేళల ధ్యానించువాడు ఆ పరబ్రహ్మమునే పొందును. ఇది ముమ్మాటికిని సత్యము.

**శ్లో. కవిం పురాణ మనుశాసితార మణోరణీయాంస మనుస్మరే ద్యః ।**
**సర్వస్య ధాతార మచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 9**

*తే.గీ. ప్రాజ్ఞుని పురాణ పురుషు సర్వజ్ఞు జగతి*
*శాసకుండును సర్వ రక్షకుఁడునగుచు*
*చింతనల కందనట్టి ప్రసిద్ధు సూక్ష్మ*
*మహితు నాదిత్యవర్ణు తామస విదూరు*
*పరమ పురుషుని బొందు సంస్మరణ బలిమి.*

**తాత్పర్యము** :-ధ్యానయోగముతో పరమ పురుషునే ఎల్లవేళల ధ్యానించు జ్ఞాని - మరణ కాలములోఁగూడ తనకు లభించిన యోగ సమాధి నిష్ఠవలన అన్నియుఁ దెలిసినవానిని, శాశ్వతుఁడైనవానిని, లోకములనన్నిటిని శాసించెడి వానిని, అట్లే, కాపాడువానిని, అణువుకంటెను సూక్ష్మమైనవానిని సూర్య సమ తేజుని, తమోగుణ విదూరుని జేరుకొనును.

**శ్లో. ప్రయాణకాలే మనసాఽచలేన**
**భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।**
**భ్రువో ర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్యక్**
**స తం పరం పురుష ముపైతి దివ్యమ్ ॥** **10**

*తే.గీ. మరణవేళ నచంచల మనసుతోడ*
*భక్తితోడను మఱి యోగబలము తోడ*
*అప్రమత్తత భ్రుకుటి మధ్యంబునందు*
*ప్రాణవాయువు నిల్పి యప్పరమ పురుషు*
*స్మరణఁ జేసెడివాఁడు నిశ్చయము గాఁగ*
*భవ్యు సర్వోత్తమున్ పరాత్పరుని దివ్యు*
*నరయఁ బొందును శ్వేతవాహన ! కిరీటి !*

**తాత్పర్యము** :- అయినచో అర్జునా ! మరణ సమయములో జ్ఞానియైనవాఁడు అచంచలమైన మనస్సుతో, భక్తితో, యోగబలముతో, జాగ్రత్తవహించి కనుబొమల మధ్యలో (ఆ జ్ఞానచక్రములో) ప్రాణ వాయువును నిలిపి ఆ పరమ పురుషునే స్మరించువాఁడు నిశ్చయముగా సర్వోత్తముఁడైన ఆ పరాత్పరుని దివ్యుని జేరుకొనును.

**శ్లో. య దక్షరం వేదవిదో వదన్తి విశన్తి యద్యతయో వీతరాగాః ।**
**య దిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥**

*తే.గీ. అక్షరం బని దేని వేదాంతు లంద్రు*
*వీతరాగులు యతు లెందు వెలయఁ జొత్తు*
*రావర నెదిగోరి బ్రహ్మచర్యులు చరింత్రు*
*దాని సంగ్రహముగఁ దెల్పెదను గ్రహించు.*

**తాత్పర్యము :-** వేదవిదులు దేనిని 'నాశములేని పరబ్రహ్మము'ని పలుకుచున్నారో, వైరాగ్య సంపదతోఁ గూడిన యతీశ్వరులు దేనియందు ప్రవేశించుచున్నారో, దేనిని కోరి బ్రహ్మనిష్ఠను పూనుచున్నారో, అట్టి అక్షరమైన స్థానమును గూర్చి నీకు సంగ్రహముగాఁ దెల్పుచున్నాను.

**శ్లో. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।**
**మూర్ధ్న్యా ధాయాత్మనః ప్రాణ మాస్థితో యోగధారణామ్ ॥ 12**

*తే.గీ. తనర నింద్రియ తతి సంయమనముఁ జేసి*
*హృదయ కమలాన మనసును పదిల పరచి*
*ప్రాణమును బ్రహ్మ రంధ్రాన వరల నునిచి*
*యోగి యగువాఁడుఁ బొందు సర్వోత్తమ గతి.*

**తాత్పర్యము :-** అన్ని ఇంద్రియములను వశపఱచుకొని హృదయ కమలములో మనసును భద్రముగా నిలిపి, ప్రాణవాయువును సహస్రార చక్రములో నిలబెట్టి యోగమును అభ్యసించువారే నన్ను చేరుకొనఁగలరు.

**విశేషార్థము :-** చక్రములు ఆఱు కలవు. గుదస్థానములో-మూలాధారము; లింగ స్థానములో-స్వాధిష్ఠానము; నాభిస్థానములో-మణిపూరకము; హృదయ స్థానములో-అనాహతము; కంఠస్థానములో-విశుద్ధము; భ్రూమధ్యములో-ఆజ్ఞ అనబడెడి చక్రములు మానవ శరీరములో నున్నవి. గుదస్థానములో నిద్రాణమైయున్న కుండలినీ శక్తిని ఈ చక్రములద్వారా శిరస్సులోని సహస్రారమునకుఁ జేర్చుటయే యోగసిద్ధి.

శ్లో. ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజ న్దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13

*తే.గీ. ప్రథిత 'ఓం'కార మేకాక్షరమ్ము బ్రహ్మ*
*పదము సత ముచ్చరించుచు వరల నన్ను*
*మది స్మరించుచు దేహమున్ వదలువాఁడు*
*పొందు నుత్కృష్ట మగు మోక్షమును ధ్రువమ్ము.*

**తాత్పర్యము :-** ఈ యోగాభ్యాసముతో 'ఓమ్' అను అక్షరమును ఉచ్చరించుచు ఎవఁడు శరీరమును విడుచునో అట్టివాఁడు పరమోత్కృష్టమైన స్థానమును పొందుచున్నాఁడు.

శ్లో. అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ ! నిత్యయుక్తస్య యోగినః ॥ 14

*తే.గీ. పరఁగ ననన్యచిత్తుడై ప్రతిదినమ్ము*
*సతతమును నన్నె భక్తితో స్మరణసేయు*
*నిత్య యోగికి నేను సన్నిహితుఁ డౌదు*
*సులభ సాధ్యుండు నగుదు నో శూరవర్య !*

**తాత్పర్యము :-**అర్జునా ! ఎవఁడు ఏకాగ్రచిత్తముతో ఎడతెగకుండ నన్నే ధ్యానించునో, నిత్యము యోగాభ్యాసము చేయునో అతనికి నేను సులభముగా లభ్య మగుదును.

శ్లో మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।
నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥ 15

*తే.గీ. పొసగ నుత్తమం బైనట్టి ముక్తిపదముఁ*
*బొందిన మహాత్ము లలర నన్బొంది జగతి*
*సకల దుఃఖాలయము నశాశ్వతము నైన*
*జన్మమును బొంద బోరు నిశ్చయము పార్థ !*

**తాత్పర్యము :-** శ్రేష్ఠమైన యోగాభ్యాసముతో నన్ను చేరుకొనిన మహానుభావులు ఎన్నటికిని మఱల, ఈ లోకములో అస్థిరమై దుఃఖములకు

నిలయమైన జన్మను పొందరు. బ్రహ్మభావమును పొందినవారికి ఇక జన్మమే లేదని అర్థము.

**శ్లో.** **ఆబ్రహ్మ భువనా ల్లోకాః పున రావర్తినోఽర్జున।**
**మా ముపేత్య తు కౌన్తేయ ! పున ర్జన్మ న విద్యతే ॥** 16

*తే.గీ.* *అరయ నా బ్రహ్మభువనాదు లన్నిగూడ*
*కలుగఁ జేయు పునర్జన్మ ఖండితముగ*
*కాని నను బొంది రేని నిక్కముగ నెపుడుఁ*
*గలుగఁ బోదు పునర్జన్మ తెలియు మోయి !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! బ్రహ్మలోకములోఁగూడ ఇతరమైన ఏ లోకములను పొందినను సరే మరల జన్మ కలుగును. కాని, నన్ను పొందిన తరువాత ఇక పునర్జన్మ లేదని తెలిసికొనుము.

**విశేషార్థము :-** ఇతర లోకములకువలె 'బ్రహ్మలోకమునకు'ఁ గూడ పుట్టుట, నశించుట ఉన్నది. కాని, బ్రహ్మభావమును పొందినవారికి మాత్రము పునర్జన్మ అనునది లేదు.

**శ్లో.** **సహస్రయుగపర్యన్త మహర్య ద్బ్రహ్మణో విదుః।**
**రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః ॥** 17

*తే.గీ.* *యుగము లొక వేయి బ్రహ్మకు పగలుగాను*
*యుగ సహస్రమ్ము రాత్రిగా నొప్పు ననుచు*
*రేయి బవలును మేల్మి నెఱింగి నట్టి*
*ప్రాజ్ఞు లెఱిఁగింత్రు భువిలోన పాండుపుత్ర !*

**తాత్పర్యము :-** కాల సంఖ్యను వివరించు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు బ్రహ్మయొక్క పగలు వేయియుగముల పరిమాణముఁ గలదని, అట్లే బ్రహ్మయొక్క రాత్రిగూడ వేయియుగముల పరిమాణముఁ గలదని అందురు.

**శ్లో. అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవ న్త్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥** 18

*తే.గీ. జగతి వ్యక్తమౌ స్థావర జంగమములు
పగలు కాగానె యవ్యక్త ప్రకృతినుండి
ప్రభవ మొందును రాత్రి నా వ్యక్తరాశు
లన్ని యణఁగెడి నవ్యక్త మందె విజయ !*

**తాత్పర్యము :-** బ్రహ్మ గాఢ నిద్రనుండి మేల్కొనగానే సమస్తమైన ఈ స్థావర జంగమములు కనిపించుచున్నవి. ఆయన నిద్రకు ఉపక్రమించగానే ఈ స్థావర జంగమము లన్నియు లయించుచున్నవి.

**శ్లో. భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాగమేఽవశః పార్థ ! ప్రభవ త్యహరాగమే ॥** 19

*తే.గీ. భూతసముదాయ మది భువిన్ పుట్టి పుట్టి
లీన మగుచుండు రాత్రి రాగానె, మఱల
ప్రభవ మొందుచు నుండును పగలు రాగ
ప్రాణు లవి యెల్ల నస్వతంత్రమ్ము లగుట.*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ప్రాణు లన్నియు అస్వతంత్రములే. అందుచే పగలైనపుడు కనిపించుచు, రాత్రి సమయములో నశించును. పూర్వ కాలములోని ప్రాణికోటులే మరల మరల ప్రభవించుచు నశించుచుండును.

**శ్లో. పర స్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తా త్సనాతనః ।
య స్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥** 20

*తే.గీ. వ్యక్తమే గాని ప్రకృతి భావమునకంటె
శ్రేష్ఠ మవ్యక్త మొక్కటి వెలఁగు నద్ది
శాశ్వతబ్రహ్మ మగు వినాశ రహితమ్ము
అఖిల ప్రాణులు నశియించి నప్పటికిని.*

**తాత్పర్యము :-** సమస్తమైన స్థావర జంగమ ప్రకృతి సర్వనాశనమై పోవుచుండ ఏ మాత్రము నశింపక శాశ్వతముగా నుండఁగలుగునది కేవలము బ్రహ్మ మొక్కటే సుమా !

**శ్లో. అవ్యక్తోఽక్షర ఇత్యుక్త స్త మాహుః పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥ 21**

*తే.గీ. వ్యక్తపడనిది యక్షర మంద్రు దేని*
*పరమ గతియని యేది సంప్రాప్తమైన*
*ఇహ సుఖాలకు మరలి రా నిచ్చఁ గొనరొ*
*వరలు నాధామమే నాదు పరమ పదము.*

**తాత్పర్యము :-** బ్రహ్మవేత్తలు అక్షరమని, అవ్యక్తమని, పరమగతి యని దేనిని చెప్పుచున్నారో, దేనిని చేరుకొనిన ఇక తిరిగివచ్చుట యనునది లేదో ఆ అక్షరమైన పదవియే నాకు ఉత్కృష్టమైన స్థానము.

**శ్లో. పురుషః స పరః పార్థ ! భక్త్యా లభ్య స్త్వనన్యయా ।**
**యస్యాన్తఃస్థాని భూతాని యేన సర్వ మిదం తతమ్ ॥ 22**

*తే.గీ. ప్రాణు లన్నియు నెవని లోపలను నుండు*
*ఎవనిచేతను వ్యాపించి వెలఁగు జగము*
*అట్టి యుత్కృష్ట పురుషుం డనన్య భక్తి*
*వలననే లభ్యుఁ డిక దేనివలనఁ గాదు.*

**తాత్పర్యము :-** ప్రాణులన్నియు ఎవనిలోపల నివసించుచుండునో, ఎవఁడు సకల జగములోను వ్యాపించియున్నాఁడో, పరమశ్రేష్ఠుడైన ఆ పురుషుఁడు కేవలము అనన్యమైన భక్తికి మాత్రమే వశుఁ డగును.

**విశేషార్థము :-** పరమాత్మను పొందుటకు అనన్యభక్తియే సాధన మని ఈ శ్లోక సారాంశము.

**శ్లో. యత్ర కాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినః ।**
**ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ 23**

*తే.గీ. అలర నే కాలమందు దేహమును వీడి*
*జనన మందరు యోగు లీ జగతి, మఱియు*
*నెపుడు దేహమున్ వీడి యూ యుల జనింతు*
*రట్టి కాల విశేషంబు నరయ వినుము.*

**తాత్పర్యము :-** భరతవంశ శ్రేష్ఠుడవైన ఓ అర్జునా ! యోగమును అభ్యసించు యోగులు దేహమును విడచిన పిమ్మట ఎప్పుడు జన్మ మెత్తుదురో, ఎప్పుడు పునర్జన్మ యుండదో తెలియజేసెదను; వినుము.

**శ్లో. అగ్ని ర్జ్యోతి రహ శ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ 24**

*తే.గీ. అగ్నియున్ జ్యోతి ఉత్తరాయణము బగలు*
*శుక్లపక్షము నే పరిశుద్ధ మార్గ*
*మందు గలదొ యా మార్గమునందు జనిన*
*బ్రహ్మవిదులు పొందు గలరు బ్రహ్మపదము.*

**తాత్పర్యము :-** అగ్ని, ప్రకాశము, పగలు, శుక్లపక్షము, ఆఱు నెలలు గల ఉత్తరాయణము ఏ మార్గమందు గలదో, ఆ మార్గమందు దేహయాత్ర చాలించు బ్రహ్మవేత్తలు బ్రహ్మమునే పొంది మరల జన్మము నెత్తకుండ ఉందురు.

**విశేషార్థము :-** ప్రకాశ రూపమైన జ్ఞానమును ఆశ్రయించువారు బ్రహ్మమును తప్పక పొందగలరవి ఈ శ్లోక సారాంశము.

**శ్లో. ధూమో రాత్రి స్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాన్ద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ 25**

*తే.గీ. కనగ రాత్రియు కృష్ణపక్షమును దక్షి*
*ణాయనంబును ధూమంబు నరయ నెందు*
*గలవొ యా మార్గమున మృతి గనిన యోగి*
*చంద్ర సంబంధ తేజమ్ము జాల బొంది*
*మరల జనియించు పార్థ ! యుర్వరను నిజము.*

**తాత్పర్యము :-** పొగ, రాత్రి, కృష్ణపక్షము, ఆఱునెలలు గల దక్షిణాయనము ఏ మార్గమందు గలదో ఆ దిశగా దేహయాత్ర చాలించినట్టైన చంద్ర సంబంధమైన ప్రకాశమును పొంది తిరిగి జన్మించుచుందురు.

**విశేషార్థము :-** ఇచట ఉత్తరాయణ - దక్షిణాయనములకు వరుసగా జ్ఞాన - అజ్ఞానములని అర్థము చెప్పుకొనుటయే సమంజసము.

**శ్లో. శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।**
**ఏకయా యాత్యనావృత్తి మన్యయాఽఽవర్తతే పునః ॥ 26**

*తే.గీ. తనర శుక్లము కృష్ణము ననగ రెండు*
*మార్గములు గల వెన్న సమ్మతము లుర్వి*
*శుక్ల మది జన్మరాహిత్య సుకృత ఫలద*
*మెన్నఁ గృష్ణము మరుజన్మ నిచ్చు ధ్రువము.*

**తాత్పర్యము :-** ఈ శుక్ల కృష్ణ మార్గాలు రెండును జగత్తులో శాశ్వతముగా నుండునవిగాఁ దలంపఁబడుచున్నవి. శుక్లపక్ష మార్గమువలన జన్మ రాహిత్యము; కృష్ణపక్ష మార్గమువలన జన్మబంధముఁ గలుగుచున్నది.

**శ్లో. నైతే సృతీ పార్థ! జానన్ యోగీ ముహ్యతి కశ్చన ।**
**తస్మా త్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ! ॥ 27**

*తే.గీ. ఎనయ నీ రెండు మార్గాల నెఱిఁగి నట్టి*
*యోగి యెవఁడును మోహము నొందఁబోడు*
*కాన నర్జున ! తగ నెల్ల కాలములను*
*యోగ యుక్తుండవై నీవు నుందు మోయి !*

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! ఈ రెండు మార్గములను చక్కఁగా గ్రహించిన యోగి ఎవఁడును మోహమును పొందఁడు. కాబట్టి నీవు యోగమును అనుష్ఠించి ఎల్ల కాలములలోను నన్నే స్మరించుచుండుము.

శ్లో. వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వ మిదం విదిత్వా
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్ ॥ 28

*తే.గీ. ఈ యుభయ మార్గములను తానెఱిగి యోగి*
*జప తపాదుల దాన యజ్ఞముల వేద*
*పఠనముల వచ్చు సత్పుణ్యఫలము నెల్ల*
*దనరఁగా మించి బ్రహ్మపదమ్ముఁ బొందు.*

**తాత్పర్యము :-** యోగియైనవాఁడు ఈ అక్షర పరబ్రహ్మ జ్ఞానమును తెలిసికొని వేదాలలో, యజ్ఞాలలో, దానాలలో, తపస్సులలో ఏ పుణ్యఫలము చెప్పఁబడియున్నదో దాని నంతయు పొంది అనాదియైన సర్వోత్తమ స్థానమును పొందుచున్నాడు.

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
**అక్షర పరబ్రహ్మయోగంబను**
ఎనిమిదవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'



శ్లో. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥
(9-26)

భక్తు డెవరైనను సరే నిర్మలమైన చిత్తముతో పత్రమో, పుష్పమో, ఫలమో, నీరో భక్తితో సమర్పించిన యెడల నేను ప్రేమతో స్వీకరింతును.

భక్తిః కిం న కరో త్యహో వనచరో భక్తావతంసాయతే.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః
# శ్రీమదాంధ్ర భగవద్గీత
## శ్రీమద్ భగవద్గీతాయాం నవమోఽధ్యాయః
## రాజవిద్యా రాజగుహ్య యోగము

*శ్రీ భగవా నువాచ :-*

**శ్లో. ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే ।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్‌జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥** 1

*తే.గీ. దేని నెఱుఁగుటచేత కౌంతేయ ! దుఃఖ*
*బంధురమ్మైన సంసార బంధముక్తి*
*బొందఁగల వట్టి విజ్ఞాన పూజ్య గుహ్య*
*మైన జ్ఞానము విను మనూయావిదూర !*

**తాత్పర్యము :-** అసూయ ఏ మాత్రమును లేని ఓ అర్జునా ! అనుభవముతోఁగూడిన ఏ జ్ఞానమువలన అశుభరూపమైన ఈ సంసారమునుండి ముక్తిని పొందఁగలవో పరమ రహస్యమైన అట్టి జ్ఞానమును నీకు తెలుపుచున్నాను.

**శ్లో. రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్ ॥** 2

*తే.గీ. బ్రహ్మ సుజ్ఞాన మిది భవ్యరాజ విద్య*
*యతి రహస్యము శాశ్వత మవ్యయమ్ము*
*అనుపమానంబు నుత్తమ మతి పవిత్ర*
*మమల మరయ ప్రత్యక్షావగమము నుమ్ము !*

**తాత్పర్యము :-** ఈ జ్ఞానము విద్యలలో కెల్ల శ్రేష్ఠ మయినది. రహస్యములలో కెల్ల పరమ రహస్య మయినది. పాపాలను పోగొట్టుటలో

సమర్థమైనది. ఆచరించువారికి ప్రత్యక్షముగా తెలియఁదగినది. ధర్మవిరుద్ధము కానిది. నాశనము లేనిది. ఆచరించుటకు సులువైనది.

**శ్లో. అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరన్తప ! ।**
**అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని ॥ 3**

*తే.గీ. కాన నీ ధర్మమున శ్రద్ధలేనివారు*
*నన్ను పొందంగఁ జాలక ఖిన్నులగుచు*
*మరణ రూపక సంసార మార్గమందె*
*నిశ్చయంబుగ వర్తింత్రు నిజము పార్థ !*

**తాత్పర్యము :-** ఓ పరంతపా ! అటువంటి ధర్మముపట్ల శ్రద్ధలేనివారై, నాస్తికులైన పాపాత్ములు నన్ను పొందలేకుండ మృత్యువుతో కూడిన సంసార మార్గములో తుది మొదలు తెలియకుండ సంచరింతురు.

**విశేషార్థము :-** బ్రహ్మవిద్యయొక్క ప్రాశస్త్యము, గొప్పఁదనము ఇందు మనకు వివరింపఁబడినవి.

**శ్లో. మయా తత మిదం సర్వం జగ దవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తే ష్వవస్థితః ॥ 4**

*తే.గీ. అలరు నీ సర్వ జగము నవ్యక్తమూర్తి*
*నైన నాచేతనే వ్యాప్తి నంది వరలు;*
*అఖిల భూతములుండు నాయందె; కాని*
*నేను భూతములందుండఁ బోను పార్థ !*

**తాత్పర్యము :-** కంటికి కనఁబడునట్టి ఈ జగత్తంతయు అవాఙ్మానస గోచరమైన నాయొక్క పరమాత్మ భావముతో వ్యాపింపఁబడినది. అన్ని ప్రాణులు నాలోనే యున్నవి. నా ఆధారముగా అవి తమ తమ రూపములను పొందుచున్నవి. నేను వానియందుండెడివాఁడను గాను. సకల భూతములకు నేను ఆధార మగుటవలన నేను ఆ భూతములలో నుందునని తలంచుట వివేకము కాదు.

**శ్లో. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5**

*తే.గీ. భూతజాలము నాయందు పొదలుచుండు*
*వాని భరియించి పోషింతు నైన గాని*
*ఒనర నా యాత్మ వానియందుండ బోదు*
*ఐశ్వరం బైన నాయోగ మద్భుతంబు.*

**తాత్పర్యము :-** ప్రాణులన్ని నన్ను ఆధారముగాఁ గలిగి యున్నప్పటికి నాయందున్నవి కావు. నేను వాటిని భరించుచు రక్షించుచుఁ గూడ వానికి అంటకయే ఉందును. అత్యద్భుతమైన ఈ నా ప్రత్యేకతను బాగుగా గమనించి గ్రహించుము.

**శ్లో. యథాఽఽకాశ స్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥ 6**

*తే.గీ. అంతటను బర్వి వెలుఁగుచున్నట్టి వాయు*
*వాకసమునందు నిత్య మెట్లణఁగియుండు*
*ఆ విధంబుగ భూతంబు లణఁగి మణఁగి*
*యుండు నాయందె నన్నంటకుండ విజయ !*

**తాత్పర్యము :-** వాయువు ఏ విధముగా గొప్పదై, ఆకాశ మంతయు నిండినదై నప్పటికి ఆ ఆకాశమును అంటుకొనకుండయుండునో, అట్లే భూతములన్ని నాలో నున్నవి. కాని అవి నన్ను అంటవని ఈ ఉదాహరణముతోఁ దెలిసికొనుము అర్జునా !

**శ్లో. సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।**
**కల్పక్షయే పున స్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ॥ 7**

*తే.గీ. సకలప్రాణులు కల్పాంత సమయమందు*
*లీనమైయుండు నా మాయలోన, మరల*
*నలర సృష్టింతుఁ గల్పాదియందు వాని*
*నన్నిటిన్ నేనె శ్వేతవాహన ! కిరీటి !*

**తాత్పర్యము** :- ఓ పాండుపుత్రా ! ప్రాణులన్ని ప్రళయకాలము వచ్చినపుడు నాలో లీనమై పోవుచున్నవి. ఆ ప్రాణులను మరల సృష్ట్యారంభములో నేనే సృజించుచున్నాను.

**శ్లో. ప్రకృతిం స్వా మవష్టభ్య విసృజామి పునః పునః ।**
**భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్ ॥** 8

*తే.గీ. ప్రకృతి వశ మౌట నస్వతంత్రమ్ములైన*
*ప్రాణికోటిని నాదైన ప్రకృతివలన*
*వాని వాని కర్మంబులఁ బట్టి నేను*
*మరల మరల సృజింతు నుర్వరను పార్థ !*

**తాత్పర్యము** :- ఈ ప్రాణికోటి నంతయు నేను మాటిమాటికి సృష్టించుచున్నాను. ఇవన్ని తమ తమ స్వభావములతో మాయ (ప్రకృతి)కు వశమైపోయి అస్వతంత్రములై నట్టివి కావున నేను నా ప్రకృతిని వశము చేసికొని ఈ ప్రాణికోటిని మరల మరల సృష్టించుచున్నాను.

**శ్లో. న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ ! ।**
**ఉదాసీనవదాసీన మసక్తం తేషు కర్మసు ॥** 9

*తే.గీ. అట్లు సృజియించువాఁడ నేనైనఁ గాని*
*జగతి నా కర్మలం దనాసక్తు డనయి*
*తగ నుదాసీన భావానఁ దనరు నన్ను*
*తెలియ కర్మంబు లవ్వి బంధింప లేవు.*

**తాత్పర్యము** :-ఓ ధనంజయా ! అట్టి సృష్టి, స్థితి, లయ రూపములైన కర్మలలో నేను ఉదాసీన భావము వహించి, ఆసక్తిలేనివానివలె నుందును. అందువలన ఆ కర్మలు నన్ను పట్టి బంధింపలేవు.

**శ్లో. మయాఽధ్యక్షేణ ప్రకృతి స్సూయతే స చరాచరమ్ ।**
**హేతునాఽనేన కౌన్తేయ జగ ద్విపరివర్తతే ॥** 10

*తే.గీ. వెలఁగ సాక్షిమాత్రుఁడగు నాచేత ప్రకృతి*
*ఈ చరాచర జగమును సృష్టిచేయు*
*చున్న యది దాని వలననె జూడ వివిధ*
*రీతులఁ బ్రపంచంబు వర్తించు విజయ !*

**తాత్పర్యము** :-అన్నింటికి సాక్షిగా నుండెడి నిర్వికార రూపముఁ గలిగిన నాచేతనే ఈ చరాచర రూప సృష్టి యంతయుఁ గలుగుచున్నది. (నా వలననే ఈ లోక వ్యవహారము సాగుచున్నది.)

**శ్లో. అవజానన్తి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్ ।**
**పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥ 11**

*తే.గీ. సకల ప్రాణుల నియమింపఁ జాలు భవ్య*
*మయిన నాభావ మెఱుఁగలేనట్టి మూఢు*
*లిలను మానుష దేహముఁ దంచెంచి నన్ను*
*సరకు సేయక జీవింత్రు సవ్యసాచి !*

**తాత్పర్యము** :- పామరజనులు అఖిల ప్రాణులను నియమించు నా పరతత్త్వమును తెలిసికొనలేక నన్ను మానవమాత్రునిగా భావించి అవివేకముతో తిరస్కారభావమును వహించుచున్నారు.

**శ్లో. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12**

*తే.గీ. వ్యర్థ మయినట్టి యాశలు, వ్యర్థమైన*
*జ్ఞాన కర్మల మెలఁగంగ సాగు మూర్ఖు*
*లరయ నాసుర రాక్షస మైన మోహ*
*న ప్రకృతి నాశ్రయించి నన్నరయకుంద్రు.*

**తాత్పర్యము** :-మూఢులు రాక్షస సంబంధమైనట్టి వ్యామోహమును గలిగించు ప్రకృతిచేత నావరింపబడినవారై వారి కోరికలు, పనులు, తెలివి తేటలును వ్యర్థములై పోగా వివేకమును పోగొట్టుకొనుచున్నారు.

**శ్లో. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః ।**
**భజ న్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥** 13

*తే.గీ. కాని దైవస్వభావ సంకలితు లైన*
*స న్మహాత్ము లనన్య మనస్కులగుచు*
*అవ్యయుని గాగ, సకల భూతాధికార*
*ణునిగ నన్నెఱింగి భజింత్రు వినుతచరిత !*

**తాత్పర్యము** :-ఓ అర్జునా ! మహాత్ములైనవారు ఇతర చింతలను విడిచి దైవ స్వభావముతోఁ గూడినవారై, అఖిల భూతములకుఁగూడ కారణమైన, అవ్యయరూపుఁడనైన నన్ను ప్రీతితో భజించుచుందురు.

**శ్లో. సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥** 14

*తే.గీ. నిరత దృఢవ్రతులును ననవరత దీక్ష*
*నన్నుఁ జేరఁగ నెపుడు యత్నం బొనర్చి*
*నన్నె చిత్తంబునన్ నిల్పి నతుల నుతుల*
*నన్నుపాసింత్రు పార్థ ! సంతతము నర్మి.*

**తాత్పర్యము** :- యమ-నియమాదులతో ప్రయత్నము చేయువారు, స్థిరమైన నియమముఁ గలవారై ఎల్లవేళల నన్ను అనేక విధములుగా స్తుతించుచు, నమస్కరించుచు నన్నే ఉపాసించుచుందురు.

**శ్లో. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మా ముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥** 15

*తే.గీ. ద్వైత భావానఁ గొంద, అద్వైత భావ*
*మునను గొందఱు సర్వతోముఖుని నన్ను*
*సన్నుతింతురు జ్ఞాన యజ్ఞమ్ము చేతఁ*
*గొంద ఱిల నుపాసన సేయుచుంది రెలమి.*

**తాత్పర్యము :-** మఱికొంతమంది జ్ఞాన యజ్ఞమును అవలంభించినవారై అద్వైత భావముతోను, ఇంక కొందఱు 'జీవుడు వేఱు, దేవుడు వేఱు' అనెడి ద్వైత భావముతోను, ఇంకను కొందఱు రకరకములుగాను నన్ను ఉపాసించుచున్నారు.

**విశేషార్థము :-** ఈ భావములో జీవుల సంస్కారమునుబట్టి దైవోపాసన చేయుచుందు రనెడి సత్యము బోధపడుచున్నది.

**శ్లో. అహం క్రతు రహం యజ్ఞ స్స్వధాఽహ మహ మౌషధమ్ ।**
**మన్త్రోఽహ మహ మేవాజ్య మహ మగ్ని రహం హుతమ్ ॥　16**

*తే.గీ. క్రతువు యజ్ఞము నేనె మంత్రమును నేనె*
*ఔషధము నేనె స్వధయు నాజ్యమును నేనె*
*అగ్నియును నేనె హుతమును నౌదు నేనె*
*ప్రథిత గుణతేజ ! వర పాశుపతబలాఢ్య !*

**తాత్పర్యము :-** నేనే క్రతువును; యజ్ఞమును; పితృ దేవతలచే భుజింపబడెడి అన్నమును; అట్లే సర్వ ప్రాణులు భుజించెడి అన్నమును గూడ నేనే; మంత్రమును నేనే; నేయి నేనే; అగ్ని మఱియు అగ్నిహోత్రమును నేనే. అంతెందులకు-హవన కర్మమును నేనే.

**శ్లో. పితాఽహ మస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్ర మోంకార ఋక్సామ యజు రేవ చ ॥　17**

*తే.గీ. జగతి కరయఁగ జననియు జనకుఁ డేనె*
*ధాతయును నేనె మఱియును తాత నేనె*
*గణ్యము పవిత్రమైన ఓంకార మేనె*
*సామ ఋగ్యజుర్వేదత్రయమును నేనె.*

**తాత్పర్యము :-** ఈ జగత్తునకు నేనే తండ్రిని; తల్లిని; సంరక్షకుఁడను; తాతను. అంతే కాక లోకము లన్నియు తెలిసికొనఁదగినవాఁడను నేనే. ఓంకారమును నేనే. ఋక్, సామ, యజుర్వేద త్రయమును నేనే సుమా !

**విశేషార్థము :–** భగవంతుఁడే ఈ మాటలు అనెను గనుక ఆయనను నుతించుచు—

కం. "నీవే తల్లివి దండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుఁడౌ
నీవే గురుఁడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా !"

అని చెప్పుకొనెడి పద్యము భక్తులకు అనునిత్యము స్మరణీయమై ముక్తిప్రద మైనట్టిది.

శ్లో. గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్ ।
ప్రభవః ప్రలయ స్స్థానం నిధానం బీజ మవ్యయమ్ ॥ 18

*తే.గీ. గతియు భర్తయు ప్రభువు నిక్కముగ నేనె*
*సాక్షియు నివాస శరణ మీ జగతి కేనె*
*ప్రభవము నిధానమున్ మఱి ప్రళయ మేనె*
*అవ్యయం బైన బీజంబు నౌదు నేనె.*

**తాత్పర్యము :–**కర్మఫలప్రదాత, పోషకుఁడు, ప్రభువు, సాక్షి అన్నియు నేనె. ప్రాణులకు నివాసము, ఆర్తిలోనున్నవారికి శరణము నేనే. సృష్టి స్థితి లయ కారకుఁడను నేనే. అన్నిటికి మూలకారణ బీజరూపమును నేనే.

**విశేషార్థము :–**ఇందులో 'ఎవ్వనిచే జనించు జగము . . .' అను పోతన పద్యమును స్ఫురణకుఁ దెచ్చు భావము లున్నవి.

శ్లో. తపా మ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ ।
అమృతం చైవ మృత్యు శ్చ సదసచ్చాహ మర్జున ! ॥ 19

*తే.గీ. వర్షమును గురిపించెడివాఁడు నేనె*
*దాని నిలిపెడు వాఁడను నేనె మఱియు*
*తపనుఁ డను నేనె మరణామృతములు నేనె*
*యెంచి చూచిన సదసత్తు నేనె పార్థ !*

**తాత్పర్యము** :- నేను ఆదిత్య రూపములోఁ దపింపఁజేసి వర్షమును ఆకర్షించి విడచిపెట్టుచున్నాను. అమృత స్వరూపమును మృత్యు స్వరూపమును నేనే. కార్య స్వరూపమును, కారణ స్వరూపమును నేనే.

**శ్లో. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా**
**యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే।**
**తే పుణ్య మాసాద్య సురేన్ద్రలోక**
**మశ్నన్తి దివ్యా న్దివి దేవభోగాన్ ॥　　20**

*తే.గీ. వేదము లెఱింగి యజ్ఞనద్విధుల భక్తి*
*నన్ను పూజించి సోమపానమ్ముఁ జేసి*
*పాపములు బాసి స్వర్లోక ప్రాప్తి గోరు*
*పుణ్యజీవులు దేవేంద్రపురముఁ జేరి*
*దివ్య దేవతా భోగాలఁ దేలుచుంద్రు.*

**తాత్పర్యము** :- వేదార్థములను తెలిసినవారు సోమపానముఁజేసి పాపములను పోగొట్టుకొన్నవారై, యజ్ఞములుచేసి నన్ను పూజించి స్వర్గమును పొందఁగోరుచున్నారు. వారు పవిత్రమైన దేవలోకములో దేవత లనుభవించు సుఖముల ననుభవింతురు.

**శ్లో. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి।**
**ఏవం త్రయీ ధర్మ మనుప్రపన్నా**
**గతాగతం కామకామా లభన్తే ॥　　21**

*తే.గీ. ఇటుల స్వర్లోక సుఖము లెంతేని బొంది*
*పుణ్య సంచయములు దీర భువి జనింతు*
*కామ్య ఫలద సత్కర్మ సంకలితులైన*
*కామ కాముల రాకపోక లవి యిట్లె.*

**తాత్పర్యము** :-అర్జునా ! వారు పై విధముగా స్వర్గలోకములో గొప్పగా సుఖము లనుభవించి, తాము జేసిన పుణ్యము నశించిపోగా మఱల మానవ లోకములోఁ బుట్టుచున్నారు. కోరికలు కోరి వేద కర్మల నాచరించి నట్లయిన ఈ విధముగా రాకపోకలు గలిగిన సంసారమును పొందుదురు సుమా !

**శ్లో. అనన్యా శ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥ 22**

*తే.గీ. అన్య చింతలు మాని నన్నచల భక్తి*
*దమి నుపాసించు వారి యోగమును క్షేమ*
*మేనె వహియింతు నెల్లప్పు డిది నిజమ్ము*
*దివ్య శరచాపధర ! భవ్యతేజ ! విజయ !*

**తాత్పర్యము** :-ఏ యోగులు ఇతర చింతలు లేకుండ ఏకాగ్రచిత్తముతో నారాయణ స్వరూపుఁడనైన నన్ను స్వస్వరూపముగాఁ దలచుచు నుపాసింతురో అటువంటి నిత్యజ్ఞాన సంపన్నులైన వారి యోగక్షేమములను నేను తప్పక చూచుకొందును.

**విశేషార్థము** :- ఈ శ్లోకము గీతాహారములో మధ్యమమణి (డాలర్) వంటిది. భగవంతుని పూర్తిగా నమ్మినట్లైన మన కేది కావలెనో ఆయనే ఇచ్చును. అంతే కాకుండ అట్లు ఇచ్చినదానిని కాపాడును. మనము నిశ్చింతగాఁ నుండవచ్చును.

**శ్లో. యేఽప్యన్యదేవతా భక్తా యజన్తే శ్రద్ధయాఽన్వితాః ।**
**తేఽపి మా మేవ కౌన్తేయ ! యజ న్త్యవిధిపూర్వకమ్ ॥ 23**

*తే.గీ. వసుధ నాకంటె నితర దేవతల నెలమి*
*భక్తి శ్రద్ధలఁ గొలిచెడివారుఁ గూడ*
*అవని విధ్యుక్త మార్గాల నరయలేక*
*నన్నె నిత్యముఁ గొలుచుచున్నారు పార్థ !*

**తాత్పర్యము** :-ఓ అర్జునా ! నాకంటె ఇతర దేవతలను భక్తితో నెవరు పూజింతురో వారుకూడ నన్నే పూజించుచున్నారు. కాని వారి పూజ శాస్త్రోక్తము కాదు.

**శ్లో. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవ చ ।**
**న తు మా మభిజానన్తి తత్త్వేనాత శ్చ్యవన్తి తే ॥ 24**

*తే.గీ. వరల సర్వ యజ్ఞాలకున్ ప్రభుఁడ నేనె*
*భోక్తయును నేనె యను తత్త్వముం దెలియక*
*యజ్ఞ కర్మఫలంబుల యందు నుండి*
*జారిపడుచుంద్రు ధర పునర్జన్మ గతుల.*

**తాత్పర్యము :–** ఈ లోకములో అన్ని యజ్ఞములకు నేనే భోక్తను; మఱియు నేనే ప్రభువును అని ఎవరు తెలిసికొన లేకున్నారో వారు ఆ యజ్ఞఫలమైన 'పరమార్థము'నుండి దూర మగుచున్నారు సుమా !

**శ్లో. యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాన్తి పితృవ్రతాః ।**
**భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోఽపి మామ్ ॥ 25**

*తే.గీ. దేవవ్రతు లైనవారు తద్దేవతలను*
*పితృవ్రతు లయినవారు తత్పితృ పదమును*
*భూతవ్రతు లైనవారు తద్భూతములను*
*నన్నుఁ గొలిచెడివారలు నన్నె గాంత్రు.*

**తాత్పర్యము :–** దేవతలను గొలిచెడివారు దేవతలను, పితృదేవతలను పూజించెడివారు పితృలోకాలను, క్షుద్రదేవతారాధనాపరులు క్షుద్రదేవతలను చేరుకొందురు. ఆ విధముగనే నన్ను ధ్యానించువారు నన్నే చేరుకొందురు.

**శ్లో. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥ 26**

*తే.గీ. పత్రమైనను గాని పుష్పంబుఁ గాని*
*ఫలముఁ గాని యొకింత సజ్జలముఁ గాని*
*భక్తినెవఁ డిచ్చు నాకు నవ్వాని విమల*
*చిత్తమున్ జూచి దాని నే స్వీకరింతు.*

**తాత్పర్యము :–** భక్తు డెవ్వరైనను సరే నిర్మలమైన చిత్తముతో పత్రమో, పుష్పమో, ఫలమో, నీరో భక్తితో సమర్పించిన యెడల నేను ప్రేమతో స్వీకరింతును.

**విశేషార్థము :–** భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే.

**శ్లో. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌన్తేయ ! తత్కురుష్వ మదర్పణమ్ ॥** 27

*తే.గీ. దేని జేసిన దేనిని దినిన గాని*
*దేని వ్రేల్చిన మఱి దేని దాన మిడిన*
*దేనికి దపం బొనర్చిన దాని నెల్ల*
*నాకె యర్పింపుమో యర్జునా ! సతమ్ము.*

**తాత్పర్యము** :-అర్జునా ! నీ వే పనిని చేసినను, దేనిని భుజించినను, ఏ యజ్ఞము చేసినను, దానము చేసినను, ఏ వ్రత మాచరించినను దాని నంతయు నాకొఱకు అర్పించుటకే చేయుము.

**శ్లో. శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబన్ధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి ॥** 28

*తే.గీ. అలర సన్న్యాస యోగయుక్తాత్ముఁడైన*
*ధర శుభాశుభ కర్మబంధములనుండి*
*తప్పుకొనఁ బడఁగలవు పార్థా ! నిజముగ*
*నన్నుఁ బొందంగఁ గలవోయి నమ్ము నన్ను.*

**తాత్పర్యము** :-పై విధముగా సన్న్యాస యోగమును 'కర్మ సమర్పణ' భావముతో నాచరించుచు, పుణ్య పాపములు ఫలములుగాఁ గల కర్మ బంధములనుండి నీవు విడువఁబడఁగలవు. అట్లు విడువఁబడినవాఁడవై నన్ను చేరుకొనగలవు.

**శ్లో. సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥** 29

*తే.గీ. సర్వభూతంబులును నాకు సమమె యగును*
*ఇష్టుఁడును లేడు ద్వేషి నా కెవఁడు లేడు*
*నిండు భక్తిని నన్ గొల్చుచుండు వారి*
*యందు నే నుందు వారుందు రయ్య నాలో.*

**తాత్పర్యము :**–నేను సమస్త ప్రాణులలోను సమముగా నుందును. నాకు ఇష్టుఁ డనువాఁడు లేదు. అట్లే ద్వేషింపఁదగినవాఁడును లేదు. ఎవరు నన్ను భక్తితో సేవింతురో వారు నాయందును, నేను వారియందును ఉండు చుందుము.

**శ్లో. అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।**
**సాధు రేవ స మన్తవ్య స్సమ్య గ్వ్యవసితో హి సః ॥ 30**

*తే.గీ. అతిదురాచార యుక్తాత్ముఁ డైన గాని*
*ఇతరమును మాని నన్నే భజించునేని*
*అలర నాయందు దృఢచిత్తుఁ డగుట వలన*
*సాధుజనుఁ డగు నతఁడు నిశ్చయము విజయ !*

**తాత్పర్యము :**–ఎంతటి దురాచారపరుడైనను సరే మనసు మార్చుకొని పశ్చాత్తాప భావముతో చెక్కుచెదరని భక్తితో నెల్లవేళల నన్ను భజించినట్లైన వానిని సత్కర్మానుష్ఠానము చేయువానివలెనే పరిగణించవలెను సుమా !

**శ్లో. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాన్తిం నిగచ్ఛతి ।**
**కౌన్తేయ ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31**

*తే.గీ. అతఁడు త్వరితమ ధర్మాత్ముఁ డగు నిజముగ*
*శాశ్వతం బైన శాంతి నిశ్చయము బొందు*
*నిర్మలం బగు భక్తి నన్నే భజించు*
*నాదు భక్తుఁడు బొందఁడు నాశ మెపుఁడు.*

**తాత్పర్యము :**–పాపాత్ముడైనప్పటికిని నన్నాశ్రయించినవాఁడు శీఘ్రముగ ధర్మాత్ముఁడగుచున్నాఁడు. అటువంటి ధర్మబుద్ధితో శాశ్వత శాంతిని పొందు చున్నాఁడు. ఓ అర్జునా ! 'నా భక్తులు చెడరు' అని నీవు గ్రహింపుము.

**శ్లో. మాం హి పార్థ ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।**
**స్త్రియో వైశ్యా స్తథా శూద్రా స్తేఽపి యాన్తి పరాం గతిమ్ ॥ 32**

తే.గీ. జగతి నెంతటి పాపపు జన్మ నెత్తి
బ్రతుకువారైన స్త్రీలైన వైశ్యులైన
శూద్రులైనను శరణంబుఁ జొచ్చి నన్ను
పరమ సద్గతిఁ దప్పక పడయఁ గలరు.

**తాత్పర్యము :-** ఓ అర్జునా ! పాపపు జన్మముఁ గలిగి బ్రతుకువారైనను, స్త్రీలైనను, వైశ్యులైనను, అట్లే శూద్రులైనను గూడ నన్ను ఆశ్రయించి మోక్షమును పొందుచున్నారు.

**శ్లో. కిం పున ర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా ।**
**అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥** 33

తే.గీ. పరగ పుణ్యమతులగు సద్బ్రాహ్మణులును
భక్త రాజర్షులును గూడ పడయఁగలరు
పరమపద మని వేరె చెప్పంగ నేల ?
నన్నె గొలువు మశాశ్వత మెన్న జగము.

**తాత్పర్యము :-** ఇక పుణ్యాత్ములైన బ్రాహ్మణుల విషయములోను, భక్తులైన రాజర్షుల విషయములోను మఱల ఏమని చెప్పవలెను ? భగవదాశ్రయమువలన తప్పక ముక్తి నందుదురు. కాబట్టి అశాశ్వతమై, సుఖరహితమైన ఈ లోకమును పొందియున్న నీవు నన్నే భజింపుము.

**శ్లో. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మా మేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥** 34

తే.గీ. మనసు నాయందుఁ జేర్చి భక్తిని సతమ్ము
నన్నె భజియించు మ్రొక్కుము నన్నె యెపుడు
మత్పరాయణచిత్త సమ్మాన్యుఁడైన
ధ్రువముగా నీవు నన్నె పొందుదువు తుదిని.

**తాత్పర్యము :-** అర్జునా ! నాయందే మనసు లగ్నముచేసి నన్నే భజించుచు, నన్నే ఉద్దేశించి యాగము చేయుము. నన్ను గూర్చి నమస్కరించుచు చిత్తమును నాయందే నిలిపి నన్నే పరమగతిగా, శరణముగా జీవితమును సాగింపుము. చివరకు నన్నే పొందగలవు. ఇది నిజము-ముమ్మాటికి నిజము సుమా !

ఇది ఉపనిషత్ప్రతిపాదకంబును బ్రహ్మవిద్యయు
యోగశాస్త్రంబును శ్రీ కృష్ణార్జున సంవాదంబును నగు
శ్రీ మద్భగవద్గీతలందు
**రాజవిద్యా రాజగుహ్యయోగంబను**
తొమ్మిదవ అధ్యాయము సంపూర్ణము.

'ఓం తత్ సత్'

